సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50 | సంపుటి: 16 | సంచిక: 207

మంగళవారం 17-10-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'




ఒలింపిక్స్‌లో క్రికెట్

లాస్ ఏంజెలిస్–2028 విశ్వ క్రీడల్లో పునరాగమనం. ఐఓసీ ఆమోదం -14లో



సంకల్పమే సగం బలం

'60 ఏళ్ల అందాల' పోటీల్లో విజేత విజయ శారదారెడ్డిపై కథనం -13లో



ఆ కేసులో దోషులకు విముక్తి

2006 నాటి నిఠారి వరుస హత్యల కేసులో కిందికోర్టు దోషులుగా పేర్కొన్న ఇద్దరికి అలహాబాద్ హైకోర్టు విముక్తి కల్పించింది.

- వివరాలు 6లో



ఆ ఊపిరి ఆపలేం!

26 వారాల ఐదు రోజుల వయసున్న గర్భాన్ని తొలగించుకునేందుకు ఓ వివాహిత పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

- వివరాలు 6లో



రూ. 102 కోట్ల సొత్తు స్వాధీనం

కర్ణాటక, తెలంగాణ, ఏపీ సహా పలుచోట్ల సోదాల్లో ఇప్పటివరకు రూ.102 కోట్ల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఐటీశాఖ తెలిపింది.

- వివరాలు 6లో



చీలిక దిశగా జేడీ(ఎస్)?

మాజీ ప్రధాని దేవెగౌడ సారథ్యంలోని జనతాదళ్ (సెక్యులర్) చీలిక దిశగా సాగుతున్నట్లు కనిపిస్తోంది.

- వివరాలు 6లో

పైరవీల రాజ్యం మళ్లీ రావాలా?

కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలిపితేనే అందరం బాగుంటాం



- జనగామ, భువనగిరి ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్
- రైతులకు భూమిపై పూర్తి హక్కులు కల్పించేందుకు ధరణిని తెచ్చాం
- దాన్ని రద్దు చేసి అధికారులను నెత్తిన రుద్దుదామని కాంగ్రెస్ వాళ్లు చూస్తున్నారు
- పదేళ్ల అభివృద్ధిని ఆగం చేయడానికి మళ్లీ వస్తున్నారు
- అలాంటి ఆపద మొక్కులు మొక్కే వారిని నమ్మితే ఆగమవుతాం
- ఓటు మన తలరాతను మార్చుతుంది.. ఆలోచించి వేయాలని పిలుపు
- ఎన్నికల కోసం మేనిఫెస్టోలు తేలేదు.. చెప్పని పథకాలెన్నో అమలు చేశామని వెల్లడి
- జనగామ సభ వేదికగా గులాబీ గూటికి చేరిన మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

సాక్షి ప్రతినిధి, వరంగల్: రైతులకు తమ భూమిపై పూర్తి హక్కులు ఉండాలని ధరణిని తెచ్చామని.. రైతు వేలిముద్ర లేకుండా భూమి జోలికి ఎవరూ పోలేరని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. రైతుల కష్టాలు తెలుసు కాబట్టే రెవెన్యూ అధికారుల అధికారాలను ధరణితో రైతుల చేతికి అందించామని.. అలాంటి ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారని మండిపడ్డారు. ధరణిని రద్దు చేసి అధికారులను రైతుల నెత్తిన రుద్దుదామని, మళ్లీ పైరవీల రాజ్యం తేవాలనేది కాంగ్రెస్ ఉద్దేశమని ఆరోపించారు. అలాంటి కాంగ్రెస్ వాళ్లనే బంగాళాఖాతంలో కలిపితే అందరం బాగుంటామని వ్యాఖ్యానించారు. పదేళ్ల అభివృద్ధిని ఆగం చేయాలని చూసే వాళ్లకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ సోమవారం జనగామ, భువనగిరిలలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో ప్రసంగించారు. అందులో జనగామ సభలో కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''తెలంగాణ రాకముందు అరిగోసపడ్డాం. జనగామ ప్రాంతాన్ని చూసి కండ్లనీళ్లు పెట్టుకున్నా.. తెలంగాణలో చాలా ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉండేది. ఎక్కడికి వెళ్లి చూసినా వలసలు, ఎండిపోయిన పంటలు, ఇబ్బందులు చూస్తే దుఃఖం ఆగకపోయేది. నిలబడి, కలబడి అందరి ఆశీర్వాదం, మద్దతుతో తెచ్చుకున్న తెలంగాణలో.. చీకట్లో బాణం వేసినట్టు పనులు మొదలుపెట్టాం. మేధోమథనం చేసి పథకాలు తెచ్చాం. పదేళ్లలో దేశంలోనే

మిగతా 2వ పేజీలో ▶

మతం పేరిట విభేదాలు సృష్టించే కుట్ర

ఒకప్పుడు కుల, మత ఘర్షణలతో అట్టుడికిపోయే హైదరాబాద్‌లో గత పదేళ్లుగా ఎలాంటి మతకలహాలు లేవు. శాంతి సామరస్యాల రాష్ట్రంగా తెలంగాణ రూపుదిద్దుకుంది. రాష్ట్రంలో పరిస్థితులు బాగున్నందువల్లే భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. కానీ కొందరు వచ్చి మతం పేరిట విభేదాలు సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారు. ఓటంటే వజ్రాయుధం. ఓటు మన తలరాతను, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుంది. అబద్ధాలు చెప్పేవారిని నమ్మి అలవోకగా ఓటేస్తే పరిణామాలు వేరే తీరుగా ఉంటాయి. ఆలోచించి వేస్తేనే మంచి ఫలితాలు వస్తాయి.

'కారు' బేకార్

జమ్మికుంట, మహేశ్వరం సభల్లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ధ్వజం



- బీఆర్ఎస్‌కు రెండుసార్లు అవకాశమిచ్చినా అభివృద్ధి జరగలేదు
- కేసీఆర్ తన కుటుంబానికే అధిక ప్రాధాన్యమిచ్చారు
- దళితులు, నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చలేదని విమర్శ
- వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టీకరణ

సాక్షిప్రతినిధి, కరీంనగర్/ సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్రంలో కారు బేకార్ అయ్యిందని, ప్రజలు రెండుసార్లు అవకాశమిచ్చినా కేసీఆర్ తన కుటుంబానికే అధిక ప్రాధాన్యం ఇచ్చారు తప్ప.. ప్రజలు, నిరుద్యోగులు, దళితుల ఆకాంక్షలు నెరవేర్చలేదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. గత పదేళ్లలో తెలంగాణలో ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలా మారిందని ఆరోపించారు. కేసీఆర్ అవినీతిపై దేశవ్యాప్తంగా చర్చ నడుస్తోందని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని ఎత్తులు వేసినా వచ్చే ఎన్నికల్లో బీజేపీ చేతిలో చిత్తుకావాల్సిందేనన్నారు. బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. అధికారంలోకి వచ్చాక ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని హామీ ఇచ్చారు. సోమవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్‌లో 'జనగర్జన' పేరిట బీజేపీ నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు.

కేంద్ర పథకాలను కేసీఆర్ అమలు చేయట్లేదు

కేంద్ర పథకాలను కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేయడంలేదని రాజ్‌నాథ్ విమర్శించారు. పేదల కోసం ప్రవేశపెట్టిన 'ఆయుష్మాన్ భారత్', నిరుపేదల సొంతింటి కల నెరవేర్చే

మిగతా 5వ పేజీలో ▶

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను సాగనంపండి: కిషన్‌రెడ్డి



కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 'కుటుంబ, అవినీతి పా లన సాగిస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను సాగనంపి రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి..'అని విజ్ఞప్తి చేశారు. మహేశ్వరం నియోజకవర్గాన్ని మజ్లిస్ పార్టీ చేతిలో పెట్టేందుకు కేసీఆర్ సహకరిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఆపార్టీని కాంగ్రెస్ పెంచి పోషించిందని విమర్శించారు. మహేశ్వరంలో బీజేపీ జెండా ఎగరేయడం ఖాయమన్నారు.



సోదరుడు మార్టిన్ రెడ్డి, తండ్రి జీజే రెడ్డితో యూరి రెడ్డి (గళ్ల చొక్కా వ్యక్తి) (ఫైల్)

షేర్ల కోసం.. తుపాకీతో

రామోజీ బెదిరింపు

సంతకం పెడతావా లేదా అంటూ బరితెగింపు

- మార్గదర్శి సహ వ్యవస్థాపకుడు జీజే రెడ్డి వారసులపై దౌర్జన్యం
- ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాలతో వాటాల బదలాయింపు
- జీజే రెడ్డి షేర్లు శైలజా కిరణ్ పేరిట అక్రమంగా మార్పు
- రూ.1,59,69,600 మూలధన విలువైన 288 షేర్ల బదిలీ
- సీఐడీకి జీజే రెడ్డి కుమారుడు యూరి రెడ్డి ఫిర్యాదు
- ఏ–1గా రామోజీ, ఏ–2గా శైలజా కిరణ్‌లపై కేసు నమోదు

12 లో



Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

Eggs Retail Rate	Ex Farm Live Bird	119 kg	Dressed with Skin	204 kg
₹ 65 per dozen	Retail Live Bird	141 kg	Skin Less	233 kg

Issued in the interest of consumers

తొలి జాబితాకు తప్పని ఎదురుచూపులు



బీజేపీ ఆశావహుల్లో ఉత్కంఠ

- సీఈసీ సమావేశం వాయిదా పడటంతో నిరాశ
- ఏకాభిప్రాయం కుదిరిన, సింగిల్ క్యాండిడేట్ సీట్ల నేతలకూ దొరకని గ్రీన్‌సిగ్నల్
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు దూసుకుపోతుండటంపై కలవరం
- 'పారాచూట్'నేతలతో తమ సీట్లకు ముప్పు రావచ్చనే ఆందోళన

5 లో

ఆరని అసంతృప్తి

జ్వాలలు

- కాంగ్రెస్ తొలి జాబితాలో టికెట్లు రాని వారి ఆక్రోశం
- డబ్బులు తీసుకుని టికెట్లు ఇస్తున్నారంటూ గన్‌పార్క్ వద్ద నిరసన
- చార్మినార్, బహదూర్‌పుర, చాంద్రాయణగుట్ట టికెట్ల కోసం ముస్లిం నేతల పట్టు
- గాంధీభవన్ మెట్లపై ధర్నా... రేవంత్‌కు ఎంఐఎంపై పోటీ ఇష్టం లేదంటూ ప్లకార్డులు
- యాష్కీ నివాసంలో భేటీ అయిన షెట్కార్, రాజయ్య, బలరాం నాయక్
- అసంతృప్తులను బుజ్జగిస్తున్న మాణిక్‌రావ్ ఠాక్రే - 3లో

జంగ్ తెలంగాణ

ఉమెన్‌కు పవర్

పరిమితమే

ఉచితాలన్నీ.. అనుచితమేం కాదు

'సాక్షి' ఇంటర్వ్యూలో ఆర్థిక నిపుణుడు ప్రొఫెసర్ అందె సత్యం

ఓటు ప్లాట్‌ఫామ్‌పై

వందేభారత్

- వివరాలు 7,8 పేజీల్లో





క్లుప్తంగా...

బీఆర్‌ఎస్ మేనిఫెస్టోతో కాంగ్రెస్, బీజేపీకి గుబులు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోను చూసి కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో గుబులు మొదలైందని, ఆ పార్టీల మైండ్‌బ్లాంక్ అయిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ గ్యారంటీలు టిష్యూ పేపర్లని, అబద్ధాలు చెప్పడంలో బీజేపీ ఆరితేరిందని విమర్శించారు. తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసేలా తమ పార్టీ మేనిఫెస్టో ఉందని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కవిత పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చిత్తుకాగితంతో పోల్చడం పట్ల మండిపడ్డారు. 'అంశాలవారీగా మాట్లాడకుండా అమరవీరుల స్తూపం వద్దకు రండి. ప్రమాణం చేయండి అని సవాలు చేయడం రేవంత్‌రెడ్డి స్థాయికి తగదు. నిజంగా దమ్మూ ధైర్యం ఉంటే రాహుల్‌గాంధీని అమరజ్యోతి వద్ద అమరవీరులకు నివాళులర్పించమని చెప్పండి. అప్పుడన్నా కాంగ్రెస్ పార్టీ చేసిన పాపాలు ఏమన్నా తొలగిపోతాయో చూద్దాం' అని కవిత సవాలు చేశారు.

బీఆర్‌ఎస్‌కు ఆకుల లలిత రాజీనామా

20న రాహుల్ సమక్షంలో కాంగ్రెస్‌లోకి..!



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత సోమవారం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. ఈ మేరకు ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌కు రాజీనామా లేఖ రాశారు. బీఆర్‌ఎస్‌లో 'ఆత్మగౌరవం'లేదని, స్థానిక సంస్థల హక్కు అయిన 'స్వయంపాలన'లేకుండా చేశారని, ఎమ్మెల్యేలకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను బానిసలుగా చేశారని లేఖలో లలిత పేర్కొన్నారు. కాగా, ఈ నెల 20న రాహుల్ నిజామాబాద్ పర్యటనలో కాంగ్రెస్ పార్టీలో తిరిగి చేరనున్నట్లు తెలుస్తోంది. లలితకు నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ టికెట్ కేటాయిస్తామని కాంగ్రెస్ అధిష్టానం హామీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

కేటీఆర్ నామినేషన్‌కు ముఖరా (కె) గ్రామస్తుల విరాళం



ఇచ్చోడ: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నామినేషన్ దాఖలుకు ముఖరా (కె) గ్రామస్తులు రూ.లక్ష చెక్కు విరాళంగా అందజేశారు. ఈమేరకు సర్పంచ్ మీనాక్షి హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిసి చెక్కు అందజేశారు. గ్రామంలో ఆసరా పింఛన్‌దారులు వందమంది తలా రూ.వేయి చొప్పున జమచేసి ఆ మొత్తాన్ని సీఎం కేసీఆర్, కేటీఆర్ నామినేషన్ దాఖలుకు చెరో రూ.50 వేల చొప్పున అందజేసినట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు చిట్కుల్ సర్పంచ్ నీలం మధు రాజీనామా



జిన్నారం (పటాన్‌చెరు): బీఆర్‌ఎస్‌తో తన బంధం ముగిసిందని, పార్టీకు రాజీనామా చేస్తున్నానని ఎన్‌ఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు, చిటుకుల్ సర్పంచ్ నీలం మధు ప్రకటించారు. సోమవారం గుమ్మడిదల మండలంలోని కొత్తపల్లి గ్రామం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి పార్టీ కార్యక్రమాలు నిర్వహించానని తెలిపారు. 22 ఏళ్లుగా బీఆర్‌ఎస్‌తో అనుబంధంగా ఉండి అనేక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లానన్నారు. అధిష్టానం తన కష్టాన్ని గుర్తించలేదని మధు ఆవేదన చెందారు. దీంతో తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉండి ప్రజల మద్దతుతో ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తంచేశారు.



సోమవారం జనగామ, భువనగిరిలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు

జనగామ



భువనగిరి



పైరవీల రాజ్యం మళ్లీ రావాలా?

▶ మొదటి పేజీ తరువాయి

తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచింది. ఒకప్పుడు కరువున్న తెలంగాణలో ఇవాళ 2 నెలల పాటు వేలా ది లారీల్లో ధాన్యం తరలివెళ్తుంటే సంతోషమేస్తోంది.

ఎన్నికల కోసం మేనిఫెస్టోలు తేలేదు

తెలంగాణ ప్రజల గోస, బాధలను చూసినవాడిగా ఈ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే తపనతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. ఎన్నికల కోసం అబద్ధాల మేనిఫెస్టోలను తేవడం లేదు. మేనిఫెస్టోలో పేర్కొన్నవే కాకుండా చెప్పని అనేక పథకాలను ప్రజలకు అందుబాటులో తెచ్చాం. బీఆర్‌ఎస్ మళ్లీ గెలిస్తే.. 93లక్షల మందికి కేసీఆర్ బీమా అమలు చేస్తాం. రైతుబీమా తరహాలోనే ఎవరైనా చనిపోతే వారంలోనే రూ.5 లక్షల బీమా సొమ్ము అందుతుంది. స్వాతంత్య్రం వచ్చాక అత్యధిక కాలం ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన ప్రభుత్వాలు ఏనాడూ దళితులను పట్టించుకోలేదు. అందుకే దళితులతో కోసం దళితబంధు ప్రారంభించాం. కేసీఆర్ గొంతులో ప్రాణమున్నంత వరకు దళితబంధు సహా అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతాయి.

రోల్ మోడల్‌గా జనగామ

ఉద్యమ సమయంలో సిద్దిపేట నుంచి సూర్యాపేటకు వెళ్తూ బచ్చన్నపేటలో ఆగాను. ఆ ఊరిలో ఒక్క యువకుడు కూడా కనిపించలేదు. నా దగ్గరకు వచ్చిన వాళ్లను అడిగితే.. ఊరిలో యువకులంతా పొట్ట చేతబట్టుకొని వలస వెళ్లారని చెప్పారు. అలాంటి బచ్చన్నపేటలో ఇప్పుడు 365 రోజులు నీళ్లు ఉంటున్నాయి. జనగామ జిల్లాను అభివృద్ధిలో పథంలో రోల్‌మోడల్‌గా మారుస్తాం. మెడికల్ కళాశాల మంజూరుతో అనివార్యంగా నర్సింగ్, పారామెడికల్ కళాశాల కూడా వస్తాయి. మళ్లీ గెలిచిన నెలలోపే చేర్యాల రెవెన్యూ డివిజన్ ఇస్తా. నాడు చంద్రబాబు మోసపూరిత విధానాలతో దేవాదుల ప్రాజెక్టుకు పూజలు చేసి వదిలేశారు. మేం సమ్మక్క బ్యారేజీని 7.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించి ఉమ్మడి వరంగల్ జిల్లాకు అంకితం చేశాం.

ముత్తిరెడ్డిని నేనే వద్దన్నా..

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నాకు మంచి మిత్రుడు. కొన్ని అంశాల వల్ల పోటీచేసి సీటు పోగొట్టుకోవద్దని నేనే చెప్పి వద్దన్నాను. జనగామను అగ్రగామి నిలిపేందుకు మన ఇంట్లో మనిషిలా ఉండే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అభివృద్ధి దూతగా పంపాను. ఆయనను లక్ష మెజార్టీతో గెలిపించుకోవాలి..'' అని కేసీఆర్ పిలుపునిచ్చారు.



45 ఏళ్లు ఉండి అవమానాలకు గురయ్యా: పొన్నాల

కాంగ్రెస్ సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య సోమవారం జనగామ సభా వేదికపై గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. సీఎం కేసీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పొన్నాల మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో 45 ఏళ్లు ఉండి అవమానాలకు గురయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. జనగామ నియోజకవర్గ అభివృద్ధి కోసమే బీఆర్‌ఎస్‌లో చేరినట్టు చెప్పారు. జనగామ ప్రాంతంలో కేసీఆర్ ఏడు రిజర్వాయర్లు నిర్మించారన్నారు. ఇక్కడ పాడి పరిశ్రమ అభివృద్ధికి సహకరించాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈ సభలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, దేశపతి శ్రీనివాస్, మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, టి.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పొన్నాల లక్ష్మయ్యను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న కేసీఆర్. చిత్రంలో జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కరెంటు మాయం.. దళితబంధు ఆగం

కాంగ్రెస్ వస్తే రైతుల భూములకు ఎసరు: భువనగిరి సభలో కేసీఆర్

సాక్షి, యాదాద్రి: ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రాష్ట్రంలో కరెంటు మాయమవుతుందని.. దళిత బంధు ఆగమవుతుందని బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారు. అన్నీ పోయి మళ్లీ దళారుల రాజ్యం వస్తుందన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజాశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. సభలో కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''రైతులను పైరవీకారుల పాలుచేసిన కాంగ్రెస్ రాజ్యం మళ్లీ రావాలా?.. మళ్లీ అదే పాట పాడాలా? రైతు సోదరులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. రైతుల భూముల మీద రైతులకే హక్కులుండాలని ధరణి పోర్టల్‌ను తెచ్చాం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామంటున్నది. పొరపాటున అదే జరిగితే.. రైతులపై రాబందులు పడతారు. మళ్లీ కౌలు రైతులు, వీఆర్వోలు, మళ్లీ రికార్డుల కెక్కియ్యడం వంటి వాటితో రైతుల భూములన్నీ ఆగమైపోతయ్. అదే జరిగితే ఒకరి భూమి మరొకరి పేర్ల మీదకు వస్తుంది. మళ్లీ తహసీల్ ఆఫీసులు, కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉంటుంది.

మూడు గంటల కరెంటు చాలంటున్నరు

నేనూ రైతు బిడ్డనే.. వ్యవసాయం చేస్తా. ఒకప్పుడు కరెంటు లేదు, మంచినీళ్లు లేవు, సాగునీళ్లు లేవు. ఇవ్వాళ 24 గంటల కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. 24 గంటల కరెంటు ఎందుకు? మూడు గంటలు చాలు అని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. చాలా పెద్ద ప్రమాదం పొంచి ఉంది. దయచేసి ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. ఆలోచించి ఓటు వేయాలి..'' అని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రణాళికలో అన్ని వర్గాలకు ప్రాధాన్యం కల్పించామని చెప్పారు. ఈ సభలో కేసీఆర్ 12 నిమిషాలు మాత్రమే ప్రసంగించారు. మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత, చిరుమర్తి లింగయ్య తదితరులు సభలో పాల్గొన్నారు.



భువనగిరి సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో పైళ్ల శేఖర్‌రెడ్డి, మంత్రి జగదీశ్‌రెడ్డి

సభలో గుండెపోటుతో వ్యక్తి మృతి



భువనగిరి నియోజకవర్గంలోని భూదాన్ పోచంపల్లి మండలం జూలూరుకు చెందిన మెట్టు సత్తయ్య (55) బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కలసి ఈ సభకు వచ్చారు. ఈ క్రమంలో ఆకస్మికంగా కుప్పకూలిపోయారు. పక్కనే ఉన్న వారు గమనించి ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సత్తయ్య వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నారని, ఆయన భార్య ఇప్పటికే మృతిచెందారని, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారని స్థానికులు తెలిపారు.

మరో 29మందికి బీ ఫారాలు

రెండు రోజుల్లో 98 మంది అభ్యర్థులకు ఇచ్చిన బీఆర్‌ఎస్

- 3 చోట్ల ఇంకా కొలిక్కిరాని అభ్యర్థులు
- పార్టీని వీడిన పటాన్‌చెరు నేత నీలం మధు.. అదే బాటలో జగదీశ్వర్‌గౌడ్ దంపతులు
- బీఆర్‌ఎస్‌లో చేరనున్న జిట్టా బాలకృష్ణారెడ్డి?

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే బీఆర్‌ఎస్ అభ్యర్థులకు బీఫారాలు అందించే కార్యక్రమం సోమవారం కూడా కొనసాగింది. ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా మరో 29 మంది బీఫారాలు అందుకున్నారు. దీనితో మొత్తంగా బీఫారాలు తీసుకున్న అభ్యర్థుల సంఖ్య 98కి చేరింది. మరో 21 మందికి బీఫారాలు అందజేయాల్సి ఉంది. అయితే మూడు నియోజకవర్గాల్లో మాత్రం అభ్యర్థుల ఎంపిక ఇంకా కొలిక్కి రాలేదు. కేసీఆర్ అభ్యర్థుల జాబితా విడుదల సమయంలో నాలుగు సెగ్మెంట్లను పక్కనపెట్టగా, మైనంపల్లి పార్టీని వీడటంతో ఆ సీటు ఖాళీ అయింది. ఈ సీట్లకుగాను జనగామకు సంబంధించి పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఫారం అందుకున్నారు. మల్కాజిగిరిలో మర్రి రాజశేఖర్‌రెడ్డికి ఖరారు చేయడంతో ఆయన ప్రచారంలో నిమగ్నమయ్యారు. నర్సాపూర్, నాంపల్లి, గోషామహల్ స్థానాలపై స్పష్టత రాలేదు. నర్సాపూర్ టికెట్ కోసం సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి పోటీపడుతున్నారు. మదన్‌రెడ్డి ఇప్పటికే పలుమార్లు ప్రగతిభవన్‌కు వచ్చి తనకు టికెట్ ఇవ్వాలని కోరారు. సోమవారం అలా ప్రగతిభవన్‌కు వచ్చిన మదన్‌రెడ్డిని కేసీఆర్ హెలికాప్టర్‌లో వెంటబెట్టుకుని జనగామ సభకు తీసుకెళ్లడం గమనార్హం. అయితే నర్సాపూర్ టికెట్ ఎవరికనే స్పష్టత అయితే రాలేదు. ఇక నాంపల్లిలో ఆనంద్‌గౌడ్‌ను ప్రచారం చేసుకోవాల్సిందిగా కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. గోషామహల్‌పై ఎలాంటి సంకేతాలు అందడం లేదని ఆశావహులు చెప్తున్నారు.

నీలం మధు రాజీనామా.. కాంగ్రెస్‌లోకి జగదీశ్వర్‌గౌడ్

పటాన్‌చెరు టికెట్ ఆశించి భంగపడిన నీలం మధు ముదిరాజ్ సోమవారం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. 20 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న తన సేవలను గుర్తించనందునే పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిపారు. ఇక గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ జగదీశ్వర్‌గౌడ్, ఆయన భార్య పూజిత బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ జగదీశ్వర్‌గౌడ్‌కు శేరిలింగంపల్లి సీటు ఇస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. కాగా భువనగిరి నియోజకవర్గానికి చెందిన నేత జిట్టా బాలకృష్ణారెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్టు ఆయన అనుచరులు చెప్తున్నారు.

నవంబర్ 30న వేతనంతో కూడిన సెలవు

పోలింగ్ నేపథ్యంలో ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఎన్నికల పోలింగ్ జరగనున్న నవంబర్ 30న రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు వేతనంతో కూడిన సెలవును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ యాక్ట్–1881 కింద సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కార్యాలయాల్లో పోలింగ్/కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే సెలవులు

శాసనసభ ఎన్నికల్లో భాగంగా ఏదైనా ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల భవనాల్లో పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఆయా కార్యాలయాలు, సంస్థల ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవులను ప్రకటించే అధికారాన్ని స్థానిక జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. నవంబర్ 29న పోలింగ్‌కు ముందురోజు, 30న పోలింగ్ రోజు, డిసెంబర్ 3న కౌంటింగ్ రోజు అక్కడి ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు ప్రకటించాలని సూచించింది.

కేటీఆర్, కవితను బూటుకింద నలిపేస్తా : ఎంపీ అర్వింద్

కోరుట్ల: 'ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితను బూటు కింద నలిపేస్తా.. వారితో ఫుట్‌బాల్ ఆడతా..'అని నిజామాబాద్ ఎంపీ, బీజేపీ నాయకుడు ధర్మపురి అర్వింద్ అన్నారు. జగిత్యాల జిల్లా కోరుట్లలో సోమవారం జరిగిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంగా తన కుమారుడు కేటీఆర్‌ను చేస్తానని, లేకుంటే తనను చంపేస్తాడని కేసీఆర్ ప్రధాని మోదీని కలిసిన విషయమై కేటీఆర్ తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. 'తను సీఎం కావడానికి పీఎం అనుమతి ఎందుకు? తమ ఎమ్మెల్యేలు ఎన్నుకుంటే సరిపోతుందని కేటీఆర్ ఎద్దేవా చేస్తున్నాడని, ఒకసారి సీక్రెట్ బ్యాలెట్ పెట్టి చూడమనండి.. మొత్తం ఎమ్మెల్యేలు హరీశ్‌రావుకు ఓటు వేయడం ఖాయం. నిజానికి బీఆర్‌ఎస్‌లో కేసీఆర్ తరువాత సీఎం కావాల్సిన అర్హత ఈటల రాజేందర్‌కు ఒక్కనికే ఉండే. నా సర్వే లో అదే తేలింది.. అందుకే ఆయనను పక్కకు జరిపారు'అని తెలిపారు.

నేడు సిరిసిల్ల, సిద్దిపేటల్లో కేసీఆర్ సభలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సిరిసిల్లలో మంగళవారం ప్రజా ఆశీర్వాద సభను నిర్వహించనుంది. ఇది సీఎం కుమారుడు, మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడం గమనార్హం. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే బహిరంగ సభ కోసం మొదటి బైపాస్‌రోడ్డులో స్థలాన్ని సిద్ధం చేశారు. కేసీఆర్ హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో సిరిసిల్లకు చేరుకుని సభలో పాల్గొంటారు. తర్వాత సిద్దిపేటలో జరిగే సభకు వెళతారు.

ఇలాగైతే మద్యం షాపులు మూసేస్తాం!

56 షాపుల నగదును జప్తు చేశారు
సీఈఓకు మద్యం షాపుల డీలర్ల ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: మద్యం విక్రయాల ద్వారా వచ్చిన నగదును బ్యాంకుల్లో జమ చేసేందుకు తీసుకెళ్తుంటే పోలీసులు జప్తు చేసుకుంటున్నారని, ఇలా అయితే మద్యం దుకాణాలను మూసివేస్తామని మద్యం షాపుల యజమానులు హెచ్చరించారు. తెలంగాణ వైన్స్ డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్‌ను కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. అసోసియేషన్ ప్రతినిధి ప్రభాకర్ మాట్లాడుతూ...ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 56 మద్యం దుకాణాలకు సంబంధించిన డబ్బులను జప్తు చేశారని ఆరోపించారు. రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టి వ్యాపారం చేసే తమను పోలీసులు దొంగల్లాగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నౌకరీ నామా, వైన్‌షాప్ లైసెన్స్ చూపినా పట్టుకున్న నగదును మాత్రం చూపడం లేదన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్లు, ఆబ్కారీ శాఖ కమిషనర్‌కు సూచనలు జారీ చేస్తామని సీఈఓ హామీ ఇచ్చారని తెలిపారు.

నాడు నోటుకు ఓటు.. నేడు నోట్లకు సీట్లు

టికెట్లు అమ్ముకుంటున్న కాంగ్రెస్ నేతలు: మంత్రి హరీశ్‌రావు ధ్వజం



సాక్షి, సిద్దిపేట: 'టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నాడు నోటుకు ఓటు విషయంలో ప్రసిద్ధి అయితే.. నేడు కాంగ్రెస్ నోట్లకు సీట్లను అమ్ముకుంటోందని గాంధీ భవన్‌లో మాట్లాడుతున్నారు'అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఇలాంటి వాళ్లకు అధికారం అప్పగిస్తే రాష్ట్రాన్ని కూడా అమ్ముతారని ఆరోపించారు. సిద్దిపేటలో మంగళవారం సీఎం సభ జరగనున్న సందర్భంగా సోమవారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రకటన, బీఫారాల అందజేత, ప్రచారంలో ముందున్నాం రేపు సీట్లు గెలుపొందడంలో కూడా ముందే ఉంటామన్నారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోతో ప్రతిపక్షాల వ్యూహాలు ఎగిరిపోయాయని, ఏం మాట్లాడాలో తెలియని స్థితిలో వారు ఉన్నారని తెలిపారు. తమ మేనిఫెస్టోను బీఆర్‌ఎస్ కాపీ కొట్టిందని కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారు.. కానీ కాంగ్రెస్ పార్టీయే తమ పథకాలను కాపీ కొట్టిందని హరీశ్ ఆరోపించారు. రైతు బంధు, పెన్షన్లను ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని గుర్తు చేశారు. బీజేపీ నుంచి పోటీ చేసేందుకు నాయకులే లేరని మంత్రి ఎద్దేవా చేశారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతుండటంతో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నవ్వుల పాలవుతున్నారన్నారు.

కాపీ కొట్టింది.. కాంగ్రెస్, బీజేపీలే!

మేనిఫెస్టో అంటే మాకు మతగ్రంథం లాంటిది: మంత్రి కేటీఆర్

- మా మేనిఫెస్టో చూసి కాంగ్రెస్, బీజేపీలు దుప్పటి కప్పుకున్నాయి
- రైతుల రుణమాఫీ త్వరలోనే పూర్తవుతుంది
- మన ఎన్నికల ఫలితాల కోసం మహారాష్ట్ర వాళ్లు చూస్తున్నారు
- భవిష్యత్‌లో అన్ని నియోజకవర్గాల్లోనూ బీఆర్‌ఎస్ పార్టీ ఆఫీస్‌లు
- సిరిసిల్ల పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో ప్రసంగం



సిరిసిల్ల బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేశవరావు, కేటీఆర్, గంగుల కమలాకర్

సిరిసిల్ల: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలే సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను కాపీ కొట్టాయని మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు చెప్పారు. కాంగ్రెస్ కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలనే కొనసాగింపుగా మేనిఫెస్టోలో పెట్టిందని, నకల్ కొట్టేందుకు కూడా వాళ్లకు అఖల్ లేదన్నారు. బీఆర్‌ఎస్‌కు మేనిఫెస్టో అంటే.. ఖురాన్, బైబిల్, భగవద్గీత లాంటివన్నారు. హామీ ఇచ్చిన వాటిలో 90% పూర్తి చేసినట్లు స్పష్టం చేశారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యాలయ భవనాన్ని ఆయన పార్టీ సెక్రెటరీ జనరల్ కె.కేశవరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ మేనిఫెస్టో చూశాక కాంగ్రెస్, బీజేపీ నాయకులు దుప్పటి కప్పుకున్నారని ఎద్దేవా చేశారు. గతంలోనూ కాంగ్రెస్ రూ.2 లక్షల రుణమాఫీ ప్రకటించినా ప్రజలు నమ్మలేదని, సీఎం కేసీఆర్‌ను తిడితే ఓట్లు రావని పేర్కొన్నారు. ఆయన కంటే ఎక్కువగా, మరింత చిత్తశుద్ధితో తెలంగాణను ప్రేమిస్తేనే ఓట్లు వస్తాయని హితవు పలికారు. సిలిండర్‌ను, ప్రధాని మోదీని తలచుకుని బీజేపీ అభ్యర్థుల డిపాజిట్ గల్లంతు చేయాలని కోరారు.

బీమా పథకం ఎంతో తృప్తినిచ్చింది

రాష్ట్రంలో రైతుల రుణమాఫీ త్వరలోనే పూర్తవుతుందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. రూ.20 వేల కోట్లు రుణమాఫీకి అవసరం ఉండగా.. ఇప్పటికే రూ.13,300 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయని, మిగతా రూ.6,700 కోట్లు త్వరలోనే మాఫీ అవుతాయన్నారు. మహారాష్ట్ర నేతలు మన ఫలితాల కోసం ఆసక్తిగా చూస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్‌కు భారీ మెజార్టీ వస్తే.. చాలామంది ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. మేనిఫెస్టోలో ప్రకటించిన కేసీఆర్ బీమా పథకం ఎంతో తృప్తినిచ్చిందని, తెల్లకార్డుదారులైన 93 లక్షల కుటుంబాలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి ఎల్ఐసీ ద్వారా బీమా కల్పిస్తుందని తెలిపారు. భవిష్యత్‌లో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోనూ బీఆర్‌ఎస్ కార్యాలయాలను నిర్మిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.

మేనిఫెస్టోపై చర్చ జరగాలి: కేశవరావు

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, చర్చ జరిగేలా చూడాలని బీఆర్‌ఎస్ సెక్రటరీ జనరల్ కె.కేశవరావు చెప్పారు. సీఎం కేసీఆర్ అంకితభావంతో చిత్తశుద్ధితో పనిచేస్తారన్నారు. ఈ సమావేశంలో మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీఎస్‌టీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ మేనిఫెస్టో అద్భుతం: అసదుద్దీన్

ఆయన మూడోసారి సీఎం ఖాయం • కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే



సాక్షి, హైదరాబాద్: 'సీఎం కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టో అద్భుతం. ఆయన మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయం'అని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. సోమవారం ఆయన దారుస్సలాంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలు ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు మరింత లాభదాయకమన్నారు. తొమ్మిదేళ్ల పాటు అమలు చేసిన పథకాలతో ప్రజలకు భరోసా ఏర్పడిందని, ఈ మేనిఫెస్టోలో పేదలకు మరింత ప్రయోజనం చేకూర్చే అంశాలున్నాయని చెప్పారు. కేసీఆర్‌కు తమ పార్టీ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్.. దొందూ దొందే అన్నారు.

విభజన చారిత్రక తప్పిదం

భారత విభజన చారిత్రక తప్పిదమని, దురదృష్టవశాత్తు ఈ విభజన జరిగిందని అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆనాటి ఇస్లామిక్ పండితులు కూడా రెండు దేశాల సిద్ధాంతాన్ని వ్యతిరేకించారని ఆయన పేర్కొన్నారు. చరిత్రాత్మకంగా ఇది ఒకే దేశమని, దురదృష్టవశాత్తు విడిపోయిందని అన్నారు. కావాలంటే, దీనిపై చర్చ ఏర్పాటు చేస్తే దేశ విభజనకు బాధ్యులెవరో చెప్తానన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు, భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ రాసిన 'ఇండియా విన్స్ ఫ్రీడమ్'పుస్తకాన్ని చదవాలని, ఆయన అప్పటి కాంగ్రెస్ నాయకుల వద్దకు వెళ్లి విభజన ప్రతిపాదనను అంగీకరించవద్దని అభ్యర్థించినట్లు ఆ పుస్తకంలో వివరించారని ఒవైసీ పేర్కొన్నారు.

క్లుప్తంగా...

కాంగ్రెస్‌లోనే ఉంటారనే గ్యారంటీ ఉందా?

మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి



కొల్లాపూర్: 'పార్టీలోకి పటాపటా వచ్చి చేరుతున్నారు.. ప్యారాచూట్‌లా వచ్చేవారికి టికెట్లు ఇస్తున్నారు..ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకుంటే వచ్చే వాళ్లంతా మళ్లీ పార్టీలోనే ఉంటారనే గ్యారంటీ ఉందా..' అని మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ప్రశ్నించారు. గతంలో పార్టీ మారిన 12 మంది ఎమ్మెల్యేలపై హైకోర్టులో, సుప్రీంకోర్టులో వేసిన కేసులను వాపస్ తీసుకున్నారని, కోవర్టుల చేతుల్లోకి పార్టీ వెళ్లిందని విమర్శించారు. పార్టీకి ద్రోహం చేసిన వారి చేతుల్లో ఇప్పుడు మాలాంటి వాళ్ల భవిష్యత్ ఉంది అని ఆవేదన వ్యక్తం చేశారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు కోరిన సీట్లు ఇప్పించుకునే స్థాయికి ఎదిగారని, వీళ్లు ఇంత పెద్ద లీడర్లు ఎప్పుడయ్యారో అర్థం కావడం లేదని మండిపడ్డారు. వాళ్లు కాంగ్రెస్ పార్టీ మీద ప్రేమతో రాలేదని.. కర్ణాటకలో కాంగ్రెస్ గెలిచింది కాబట్టే వచ్చారని, లేకపోతే బీజేపీలో చేరేవారని ఆరోపించారు. పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీలతోపాటు ఈ గ్యారంటీని కూడా పరిగణనలోకి తీసుకోండి అని టీపీసీసీ నాయకత్వానికి సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే ఎన్నికల్లో తనతోపాటు కొల్లాపూర్‌లో చింతలపల్లి జగదీశ్వర్‌రావు స్వతంత్రులుగా బరిలో ఉంటామని చెప్పారు.

అది ప్రగతిభవన్ కాదు... బానిస భవన్

అహంకారంలో కేసీఆర్‌ను మించిన వాళ్లు లేరు: జూపల్లి



సాక్షి, హైదరాబాద్: అహంకారానికి మారుపేరు సీఎం కేసీఆర్ అని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ పాలనాకేంద్రం ప్రగతిభవన్ కాదని, బానిసభవన్ అని ఎద్దేవా చేశారు. ప్రగతిభవన్‌కు ఎవరు వెళ్లినా కలిసే అవకాశం లేదని, కానీ ఢిల్లీ వెళ్లిన కాంగ్రెస్‌నేతలు మాత్రం సోనియా, రాహుల్‌తోపాటు హైకమాండ్ నేతలను ఎవరినైనా కలిసే అవకాశం ఉందన్నారు. కేసీఆర్ అహంకారంతోనే ఇంతవరకూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయలేదని, తెలంగాణ అమరవీరుల కుటుంబాలను పరామర్శించలేదని, మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లినా ప్రగతిభవన్ గేట్లు తీయలేదని ధ్వజమెత్తారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీమంత్రి కొండ్రు పుష్పలీల, టీపీసీసీ అధికార ప్రతినిధులు రియాజ్, సామ రామ్మోహన్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో సమావేశంలో అహంకారం గురించి కేసీఆర్ మాట్లాడుతూ తన పేరును ప్రస్తావించడాన్ని తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్రం కోసం తాను మంత్రి పదవికి రాజీనామా చేశానని, అహంకారం ఉంటే అలా చేస్తానా అని జూపల్లి ప్రశ్నించారు.

తొలి జాబితాలో 53 మందిని ప్రకటించిన ధర్మసమాజ్ పార్టీ

సాక్షి, హైదరాబాద్: తొలి విడతలో 53 మంది అభ్యర్థులను ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) సోమవారం ప్రకటించింది. రెండో విడత ఈనెల 20న, 26న తుది జాబితాను ప్రకటిస్తామని సోమవారం ఓ ప్రకటనలో డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల దుష్ట వైఖరి, కుటిల రాజకీయాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్నారు.

'వైన్స్, బార్లలో 50 శాతం గౌడ్‌లకు కేటాయించాలి'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్రంలో వైన్స్, బార్లలో గౌడ్‌లకు 50 శాతం ఇచ్చేలా కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ డి.శ్రీధర్‌బాబుకు వినతిపత్రం సమర్పించింది. సోమవారం సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, కన్వీనర్ ఐలీ వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్‌లు మాట్లాడుతూ, కల్లు గీత వృత్తిదారులకు 50 శాతం వైన్స్‌లు ఇవ్వాలని, బార్లలో గౌడ్‌లకు సబ్సిడీతో కూడిన రిజర్వేషన్ కల్పించాలని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరును పెట్టాలని, సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం పేరు పెట్టాలని, హైదరాబాద్ యూనివర్సిటీకి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరు పెట్టాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.

ఆరని అసంతృప్తి జ్వాలలు

- ధర్నాలు.. దిష్టిబొమ్మల దహనాలు
- కాంగ్రెస్ తొలి జాబితాలో టికెట్లు రాని వారి ఆక్రోశం
- గన్‌పార్క్ వద్ద నిరసన
- చార్మినార్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పుర టికెట్ల కోసం ముస్లిం నేతల పట్టు
- యాష్కీ నివాసంలో భేటీ అయిన షెట్కార్, రాజయ్య, బలరాం నాయక్
- అసంతృప్తులను బుజ్జగిస్తున్న ఠాక్రే



గన్ పార్క్ వద్ద నిరసన తెలుపుతున్న అసంతృప్త నేతలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో టికెట్లు రాని అసంతృప్తుల ఆందోళనలు ఆగలేదు. తొలిజాబితా ప్రకంపనలు సోమవారం కూడా కొనసాగాయి. టికెట్లు ప్రకటించిన రోజున ఆదివారం హైదరాబాద్ వేదికగా గాంధీభవన్‌కు పరిమితమైన ఆందోళనలు రెండోరోజు గన్‌పార్కు వరకు పాకా యి. గద్వాల టికెట్ ఆశించిన ఉస్మానియా విద్యార్థి నాయకుడు కురువ విజయ్‌కుమార్ నేతృత్వంలో గన్‌పార్కు వద్ద నిరసన తెలిపారు. పార్టీ టికెట్లను అమ్ముకుంటున్నారంటూ నినాదాలు చేశారు. ఇక, పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట, బహదూర్‌పుర, చార్మినార్ స్థానాలను ముస్లిం నాయకులను కేటాయించాలని కోరుతూ వరుసగా రెండోరోజు స్థానిక నేతలు, కార్యకర్తలు గాంధీభవన్ మెట్లపై ధర్నా చేశారు. కాగా, పార్టీ నేతలపై ఆర్థిక ఆరోపణలు చేసిన కురవ విజయ్‌కుమార్, గాంధీభవన్ మెట్లపై ధర్నా చేసిన పాతబస్తీ నేత కలీమ్‌లను సస్పెండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది.

నాగం వాట్ నెక్స్ట్

ఇక, నాగర్‌కర్నూల్ టికెట్ ఆశించి భంగపడిన మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి స్థానిక కేడర్‌తో సమావేశమయ్యారు. మరోవైపు మాజీ ఎంపీలు మధుయాష్కీగౌడ్, బలరాం నాయక్, సురేశ్‌షెట్కార్, సిరిసిల్ల రాజయ్యలు మధుయాష్కీ నివాసంలో సమావేశమయ్యారు. పార్టీ విడుదల చేసిన తొలి జాబితాతో పాటు ఇంకా ఖరారు కాని టికెట్ల వ్యవహారంపై వీరు చర్చించినట్టు తెలుస్తోంది. మరోవైపు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్‌ఠాక్రే బుజ్జగింపుల కోసం రంగంలోకి దిగారు. సోమవారం గాంధీభవన్‌లోని వార్ రూంలో ఆయన చాలా సేపు అసంతృప్తులతో మంతనాలు జరిపారు. ఉప్పల్‌తో పాటు నగరంలోని పలు నియోజకవర్గాలకు చెందిన నాయకులు ఆయనతో భేటీ అయ్యారు. టికెట్ ఇవ్వకపోవడానికి గల కారణాలను వివరించిన ఠాక్రే ఆయా నేతల రాజకీయ భవిష్యత్తుపై హామీ ఇచ్చే ప్రయత్నం చేశారు.

ఆ ఇద్దరు నేతల సస్పెన్షన్...

ఇక, కురువ విజయ్‌కుమార్, కలీమ్‌లను సస్పెండ్ చేయా లని టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ నిర్ణయించింది. సోమవారం గాంధీభవన్‌లో సమావేశమైన కమిటీ టికెట్ రాలేదన్న ఆక్రోశంతో పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించి గాంధీభవన్ లో పార్టీ నాయకుల దిష్టిబొమ్మలను దగ్ధం చేయడం, ఫ్లెక్సీలను చించి వేయడం, నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఘటనలను సీరియస్‌గా పరిగణించింది. టికెట్ల విషయంలో పీసీసీ అధ్యక్షుడిని మాత్రమే బాధ్యుడిని చేయడం కక్షపూరిత చర్యగా భావించిన కమిటీ కురువ విజయ్ కుమార్ (గద్వాల), కలీమ్‌బాబా (బహదూర్‌పుర)లను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రేవంత్ టార్గెట్‌గా ఆందోళనలు..

కాగా, అటు గాంధీభవన్‌లో, ఇటు గన్‌పార్క్ వద్ద సోమవారం జరిగిన ఆందోళనల్లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కేంద్రబిందువు అయ్యారు. ఉస్మానియా విద్యార్థి నేత కురువ విజయ్‌కుమార్ పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. తనకు కేటాయించాల్సిన గద్వాల టికెట్‌ను రూ.10 కోట్ల నగదు, 5 ఎకరాల భూమికి అమ్ముకున్నాడని ఆరోపించారు. ఇప్పటివరకు పార్టీలో 65 టికెట్లను రూ.600 కోట్లకు అమ్మేశారని ఆరోపించారు. దీంతో పాటు గాంధీభవన్‌లో పాతబస్తీ నేతల ఆందోళనలోనూ రేవంత్‌ను విమర్శిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. 90 శాతం ముస్లిం ఓటు బ్యాంకు ఉండే స్థానాలను హిందువులకు కేటాయించడమేంటని, పాతబస్తీలో ఎంఐఎంపై గట్టిగా పోటీ చేయాలన్న ఆసక్తి రేవంత్‌కు లేదంటూ ప్లకార్డులు ప్రదర్శించడం చర్చనీయాంశమయింది. ఇక, నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత మళ్లీ కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారన్న వార్తల పట్ల స్థానిక డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు అదే జిల్లాకు చెందిన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు పార్టీలో చేరుతున్నారన్న వార్తలు కూడా స్థానిక నాయకత్వంలో అసంతృప్తిని రగిలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీనియర్లున్న తొలి జాబితా విడుదల తర్వాతే ఇంతటి అసంతృప్తి వ్యక్తమయితే ఇక రెండో జాబితా విడుదలయితే పరిస్థితి ఎలా ఉంటుందోనన్న చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

పాలేరు కోసం సీపీఎం.. మునుగోడు కోసం సీపీఐ

- ఆ రెండు సీట్లపై కమ్యూనిస్టుల పట్టు
- ఇంకా కొలిక్కి రాని కాంగ్రెస్, వామపక్షాల పొత్తు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీటు ఇవ్వకుంటే ప్రయోజనం లేదంటున్న సీపీఎం
- కాంగ్రెస్ అధిష్టానం కోర్టులో లెఫ్ట్ సీట్ల వ్యవహారం.. వేచిచూస్తున్న కామ్రేడ్లు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, వామపక్షాల పొత్తు వ్యవహారం ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ఆయా పార్టీల మధ్య రాజకీయ అవగాహన కుదిరినా, సీట్లపై ఇంకా అస్పష్టత కొనసాగుతూనే ఉంది. వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వాలు ఇప్పటికీ సీట్లపై కసరత్తు చేస్తూనే ఉన్నాయి. సీపీఐ, సీపీఎంలకు చెరి రెండేసి అసెంబ్లీ స్థానాలు, చెరో ఎమ్మెల్సీ ఇచ్చేలా అంగీకారం కుదిరింది. సీపీఐ కొత్తగూడెం, మునుగోడు కోరుతుండగా, సీపీఎం మాత్రం మిర్యాలగూడతో పాటు భద్రాచలం లేదా పాలేరు స్థానాలను ప్రతిపాదించింది. సీపీఐకి కొత్తగూడెం స్థానం ఇచ్చేందుకు అంగీకారం తెలిపిన కాంగ్రెస్, మునుగోడుకు బదులు చెన్నూరు స్థానాన్ని ఇస్తామని తేల్చి చెప్పింది. అయితే చెన్నూరు తమకు వద్దని, మునుగోడు ఇవ్వాల్సిందేనని సీపీఐ పట్టుబడుతోంది.

ఒకటి మీరడిగేది.. రెండు మేమిచ్చేది తీసుకోండి

కాంగ్రెస్ మాత్రం 'మీరడుగుతున్న రెండు స్థానాల్లో ఒకటి మీరు కోరుకున్న సీటు ఇస్తాం. మరోటి మేం ఇచ్చే సీటు తీసుకోవాలని'చెబుతోంది. దీంతో సీపీఐ కంగుతింది. ఇక సీపీఎం విషయంలో కూడా కాంగ్రెస్ పార్టీ ఇదే సూత్రాన్ని అమలు చేయనుంది. దీంతో కాంగ్రెస్ చెప్పిన ఏదో ఒక స్థానంలో పోటీ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మిర్యాలగూడ స్థానాన్ని సీపీఎంకు ఇచ్చేందుకు అంగీకరించిన కాంగ్రెస్, మరో స్థానం విషయంలో మాత్రం స్పష్టత ఇవ్వడంలేదు.

పాలేరు నుంచి పొంగులేటి?

పొంగులేటి, తుమ్మల ఇప్పుడు కాంగ్రెస్‌లో రాష్ట్రస్థాయిలో ప్రముఖులుగా ఉన్నారు. దీంతో పొంగులేటికి పాలేరు, తుమ్మలకు ఖమ్మం స్థానాలు ఇచ్చే యోచనలో కాంగ్రెస్ ఉంది. ఈ నేపథ్యంలో పాలేరు స్థానాన్ని సీపీఎంకు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఈ స్థానంలో సీపీఎం తరఫున ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అభ్యర్థిగా ఉండాలని భావిస్తున్నారు. ఆ స్థానం ఇవ్వకుంటే పొత్తుకు సీపీఎం అంగీకరించే పరిస్థితి కనిపించడం లేదు. విచిత్రమేంటంటే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీపీఎం కోరే సీట్లన్నీ కీలకమైనవే. గతంలో మధిర స్థానాన్ని కూడా సీపీఎం ప్రతిపాదించింది.

భద్రాచలం ఇచ్చినా బాగుండేదంటున్న సీపీఎం...

➤సీపీఎం మాత్రం పాలేరు లేదా భద్రాచలం కోరింది. అయితే భద్రాచలంలో తమ అభ్యర్థిని ఇప్పటికే కాంగ్రెస్ ప్రకటించింది. తమ సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని ఎలా ఇస్తామని కాంగ్రెస్ చెబుతోంది. దీంతో ఇప్పుడు పాలేరు స్థానంపై సీపీఎం పట్టుబడుతోంది. కానీ కాంగ్రెస్ పార్టీ దీనికి అంగీకరించే పరిస్థితులు కనిపించడంలేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో మూడు మాత్రమే జనరల్ స్థానాలు ఉండగా, మిగిలినవన్నీ రిజర్వుడు స్థానాలు. ఈ నేపథ్యంలో జనరల్ స్థానాల్లో కొత్తగూడెంను సీపీఐకి కాంగ్రెస్ కేటాయించింది. దీంతో కాంగ్రెస్ పార్టీకి మరో రెండు జనరల్ స్థానాలే మిగిలాయి. వాటిల్లో సీపీఎంకు పాలేరు ఇస్తే జనరల్ స్థానం ఖమ్మం ఒకటే మిగులుతుంది. కానీ ఆ జిల్లాలో కాంగ్రెస్‌కు కీలకమైన నేతలు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావులకు టికెట్ ఇవ్వాల్సి ఉంది.

ఆ స్థానంలో భట్టి విక్రమార్క అనేకసార్లు విజయం సాధించారు. ఇలా కాంగ్రెస్‌కు పట్టున్న స్థానాలను సీపీఎం కోరుతుండటంతో కాంగ్రెస్ పార్టీ చిక్కుల్లో పడింది. ఏదిఏమైనా ఇప్పుడు కాంగ్రెస్ అధిష్టానం కోర్టులో లెఫ్ట్ సీట్ల వ్యవహారం ఉంది. పొత్తు అంశం త్వరగా కొలిక్కి రావాలని కామ్రేడ్లు వేచి చూస్తున్నారు.

ఇలాంటి పాలకులు అవసరమా?

- వికారాబాద్ సభలో రేవంత్‌రెడ్డి
- ఉద్యోగాలు రాక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు
- ఉపాధి కల్పించడం చేతకాని ప్రభుత్వం వారిపై నిందలు వేస్తోంది
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీ స్కీంలపై సంతకాలు



ఎన్నెపల్లిలో మహిళలకు గ్యారంటీ పథకాలను వివరిస్తున్న రేవంత్‌రెడ్డి

వికారాబాద్: 'అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయే.. డిసెంబర్ 9న లాల్‌బహదూర్ స్టేడియంలో కాంగ్రెస్ సీఎం ప్రమాణం స్వీకారం చేయటం ఖాయం. ఆ రోజే ఆరు గ్యారంటీ స్కీంలపై తొలి సంతకం చేసి, తెలంగాణ ప్రజలకు సోనియమ్మ, మల్లికార్జున ఖర్గే ఇచ్చిన హామీలను నేరవేరుస్తాం..'అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణకు కేసీఆర్ కుటుంబం తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. ఉద్యోగం కోసం చదివి చదివి వేసారిపోయిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంటే.. అసలు ఆమె దరఖాస్తే చేసుకోలేదని నిందలు వేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ ఆడబిడ్డపైన నిందలేయటానికి సిగ్గుండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పాలకులు అవసరమా? మనకు అని ప్రజలను ప్రశ్నించారు. సోమవారం రాత్రి వికారాబాద్ చిగుళ్లపల్లి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

కేసీఆర్ నిండా ముంచారు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఈ ప్రాంతం నుంచి పాదయాత్ర ప్రారంభించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారని రేవంత్ గుర్తుచేశారు.. అందుకే తాము కూడా ఇక్కడి నుంచే ఎన్నికల ప్రచార శంఖారావం పూరిస్తున్నామని చెప్పారు. కేసీఆర్ హుస్నాబాద్ నుంచి ప్రచారం ప్రారంభిస్తే.. మనం వికారాబాద్ నుంచి విజయోత్సవ సభలు మొదలు పెడుతున్నామని అన్నారు. కేసీఆర్‌కు హుస్నాబాద్ కలిసొస్తదో.. కాంగ్రెస్‌కు వికారాబాద్ కలిసొస్తదో తేల్చుకుందాం అని సవాలు విసిరారు. అమరుల త్యాగాలకు చలించిపోయిన సోనియమ్మ ప్రత్యేక రాష్ట్రం ఇస్తే.. కేసీఆర్ ప్రజలను నిండా ముంచారని ఆరోపించారు. నాడు వైఎస్సార్ ప్రాణహిత ప్రాజెక్టును డిజైన్ చేసి ప్రారంభించడంతో పాటు రూ.11 వేల కోట్లు ఖర్చు చేశారని, కేసీఆర్ మాత్రం ప్రాజెక్టు డిజైన్ మార్చేసి ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. పాలమూరు ఎత్తిపోతల ద్వారా నీళ్లిస్తామని కల్లబొల్లి మాటలతో కాలయాపన చేయడం తప్ప ఈ ప్రాంతానికి బీఆర్‌ఎస్ చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఈ ప్రాంతానికి ఏమైనా ఆంధ్రోడు సీఎంగా ఉన్నాడా? లేక పక్క రాష్ట్రపోడు సీఎంగా ఉన్నాడా? అని ధ్వజమెత్తారు. తొలుత ఎన్నెపల్లిలోని సయ్యద్ యాసిన్, మాణెమ్మ, యాదయ్య ఇళ్లకు వెళ్లిన రేవంత్ ఆరు గ్యారంటీ పథకాల గురించి వివరించారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న పేదలందరికీ వీటిని వర్తింపజేస్తామని తెలిపారు. మాజీ మంత్రులు గడ్డం ప్రసాద్‌కుమార్, ఎ.చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

సీఎం చెప్పినా.. ఐఏఎస్‌లు వినట్లేదు

- వారి తీరుతో సంక్షోభంలో విద్యుత్ సంస్థలు: సీఎండీ ప్రభాకర్‌రావు
- నిధులివ్వకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- ఇది ఇలాగే కొనసాగితే సరఫరాల్లో అంతరాయాలు తప్పవు.. తమను పదవి నుంచి తొలగించే కుట్ర కూడా చేస్తున్నారని ఆవేదన



సాక్షి, హైదరాబాద్: 'ఆర్థిక శాఖలోని కొంతమంది ఐఏఎస్ అధికారులు విద్యుత్ సంస్థల ప్రగతికి అడ్డుపడుతున్నారు. మాకు రావాల్సిన నిధులు మంజూరు చేయడం లేదు. విద్యుత్ సంస్థల నుంచి పంపిన ఫైళ్లను తొక్కిపెడుతున్నారు. సీఎం చెప్పినా.. వినడం లేదు. ఐఏఎస్ అధికారుల తీరుతో విద్యుత్ సంస్థలు సంక్షోభంలోకి వెళ్లే పరిస్థితి తలెత్తింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తప్పకపోవచ్చు'అని తెలంగాణ విద్యుత్ సంస్థల సీఎండీ ప్రభాకర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మింట్ కాంపౌండ్‌లో విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (వీఏఓఏటీ) నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

సహాయ నిరాకరణను సహించం

'విద్యుత్ సంస్థల్లో ఐఏఎస్‌లు లేరు. అంతా ఇంజనీర్స్ ఉన్నారు. ఇక్కడ ఓ అకౌంట్స్ ఆఫీసర్ పెత్తనం ఏమిటనే అసూయ కూడా ఉంది. మనపై ప్రభుత్వంలోని కొంతమందికి అసూయ ఉంది. ప్రస్తుతం దేశంలోని అన్ని రాష్ట్రాల్లో విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. తెలంగాణలో నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నా.. కొంతమందికి కన్ను కుట్టినట్లు ఉంటోంది. ఆర్థిక శాఖలో కొంతమంది అసూయతో అడ్డుతగులుతు న్నారు. సీఎం ఆదేశించినా పట్టించుకోవడం లేదు. నిధులు మంజూరు చేయకుండా బాధపెడుతున్నారు. దురుద్దేశంతో విద్యుత్ సంస్థల ఫైళ్లను పెండింగ్‌లో పెడుతున్నారు. అలాంటి ఐఏఎస్‌లకు తగిన మార్గదర్శకాలు జారీ చేసి విద్యుత్ సంస్థలకు ఆటంకాలు కలగకుండా చూడాలని సీఎం కేసీఆర్‌ను అభ్యర్థిస్తున్నా. ఈ అంశాన్ని బహిరంగంగా చెప్పినందుకు.. మమ్మల్ని పదవి నుంచి తొలగించేందుకు కూడా కుట్ర చేస్తారు. అయినా భయపడేది లేదు'అని ప్రభాకర్‌రావు చెప్పారు.

ఓ శత్రువులా చూస్తున్నారు

'విద్యుత్ ఉత్పత్తిలోనే కాదు.. సరఫరా, రెవెన్యూ వసూళ్లలోనూ దేశంలోనే తెలంగాణ విద్యుత్ సంస్థలు మొదటి స్థానంలో నిలిచాయి. సమష్టి కృషితోనే ఇదంతా సాధ్యమైంది. సీఎం కేసీఆర్ లేకుంటే విద్యుత్ సంస్థలు ఇంత ప్రగతిని సాధించేవి కావు. ప్రస్తుతం రాష్ట్ర ప్రగతిలో విద్యుత్ సంస్థలదే కీలక పాత్ర. పరిశ్రమలు, విదేశీ పెట్టుబడులు వెల్లువలా రావడానికీ నిరంతరాయ విద్యుత్ సరఫరానే ప్రధాన కారణం. దీంతో విద్యుత్ సంస్థలు, ఉద్యోగులపై అసూయ కూడా పెరుగుతోంది'అని ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. వీఏఓఏటీ ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాస రావు, వీఏఓఏటీ అధ్యక్షుడు ఎస్.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్‌తో కాంగ్రెస్ పొత్తు చర్చలు

- ప్రొఫెసర్ కోదండరాం, ఇతర నేతలతో పీసీసీ నేతలు మల్లు రవి భేటీ
- తమకు ఆరు సీట్లిస్తే పొత్తుకు సిద్ధమన్న కోదండరాం!
- టీజేఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేసే అంశంపైనా చర్చ?

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో కలసి పోటీచేసే అంశంపై టీజేఎస్‌తో కాంగ్రెస్ పార్టీ చర్చలు ప్రారంభించింది. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్ సోమవారం టీజేఎస్ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి ప్రొఫెసర్ కోదండరాం, పి.ఎల్.విశ్వేశ్వర్‌రావు, ధర్మార్జున్, నిజ్జన రమేశ్ తదితరులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల పొత్తుపై ఇరు పార్టీల నేతలు చర్చించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌తో కలసి పనిచేసేందుకు కోదండరాం సంసిద్ధత వ్యక్తం చేశారని.. తమకు ఆరు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని కోరినట్టు తెలిసింది. ఎల్లారెడ్డి, జహీరాబాద్, సూర్యాపేట, ముథోల్‌తో పాటు మరో రెండు సీట్లు ఇవ్వాలని టీజేఎస్ నేతలు ప్రతిపాదించినట్టు సమాచారం. ముథోల్‌తోపాటు మరో స్థానం ఇచ్చేందుకు సిద్ధమనే కోణంలో కాంగ్రెస్ నేతలు సంకేతాలు ఇచ్చినా.. ఆయా అంశాలపై పార్టీ పెద్దలతో మాట్లాడి తుది నిర్ణయం వెల్లడిస్తామని చెప్పినట్టు తెలిసింది. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో టీజేఎస్ విలీనంపైనా చర్చ జరిగినట్టు సమాచారం. కోదండరాంతో భేటీ అనంతరం మాజీ ఎంపీ మల్లు రవి మీడియాతో మాట్లాడారు. ఇరు పార్టీల మధ్య పొత్తు చర్చలు జరిగిన మాట వాస్తవమేనని చెప్పారు. తుది నిర్ణయం తీసుకునే అధికారం తమ చేతిలో లేదని.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఇతర సీనియర్లతో మాట్లాడాక టీజేఎస్ నేతలతో మరోసారి సమావేశమవుతామని వెల్లడించారు.

మా స్కీములన్నీ కేసీఆర్ కాపీకొట్టారు

ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ స్కీములన్నింటినీ సీఎం కేసీఆర్ కాపీ కొట్టారని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో దుర్గామాతకు పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. పది సంవత్సరాలుగా అధికారంలో ఉంటున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్‌ను ఎందుకు రూ.500 ఇవ్వలేదని ప్రశ్నించారు. ఓట్ల కోసం ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీ స్కీములను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. కాగా, విద్యార్థిని ప్రవల్లిక ఆత్మహత్య ఘటన ప్రభుత్వ హత్యేనని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ప్రవల్లిక ఆత్మహత్యపై మంత్రి కేటీఆర్ దుర్మార్గంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఆత్మహత్యలకు పాల్పడవద్ద ని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తాను ఏ స్థాయిలో ఉన్నా ఉద్యోగ ఖాళీలన్నింటినీ భర్తీ చేయిస్తానని కోమటిరెడ్డి స్పష్టం చేశారు.

30 మందితో టీటీడీపీ అభ్యర్థుల జాబితా సిద్ధం

టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో టీడీపీ తరఫున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 30 మంది అభ్యర్థుల జాబితా సిద్ధంగా ఉందని టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీటీడీపీ పోటీ చేయకుండా కాంగ్రెస్‌కు మద్దతిస్తుందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశా రు. సోమవారం ఇక్కడి ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో అభ్యర్థులను పోటీలో నిలుపుతామన్నారు. 30 మంది అభ్యర్థులను ఇప్పటికే ఖరారు చేశామని, మరో 87 మంది అభ్యర్థుల విషయంలో సర్వే నివేదికలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. జనసేనతో ఎన్నికల పొత్తు ఉంటుందని, పార్టీ అధినేత నిర్ణయం మేరకు సీట్ల సర్దుబాటు ఉంటుందని పేర్కొన్నారు. తమ పార్టీ అధినేత చంద్రబాబుపై పెట్టిన కేసు మంగళవారం వరకు పూర్తవుతుందని, బాబు బయటకు వస్తారనే నమ్మకం ఉందని అన్నారు. టీడీపీ మేనిఫెస్టోను కూడా సిద్ధం చేశామని, పొలిట్ బ్యూరో సభ్యుడు నందమూరి బాలకృష్ణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వస్తారని తెలిపారు.

ANNAMACHARYA INSTITUTE OF TECHNOLOGY & SCIENCES ESTD: 2005
(Approved by AICTE & Affiliated to JNTUH, Hyderabad) ICET CODE: AITH
Abdullapurmat Mandal, NH- 65, R.R Dt, Hyderabad
Cell No: 9490424046, 9032002245, & 9848924705
Permanent Affiliation from JNTUH & Accredited by NAAC with "B+" Grade
Admission Notification for MBA/MCA B-Category Seats (2023-24)

Course	MBA	MBA (SF)	MCA (SF)
Intake	60	60	120
'B' Category Seats	18	18	36

Application Form and instructions to candidates can be downloaded from our College website www.aits-hyd.org or obtained from the College Office. Filled in applications shall be submitted on or before 21st October 2023 between 10 am to 5 pm on all days in the College Office. Tuition fee as fixed by TAFRC, Telangana State Government.
Note: Candidate should have secured the following percentage of marks in the Qualifying Examination.
50% - For General Candidates (for OC)
45% - The candidates belonging to reserved categories (SC,ST,BC). PRINCIPAL





ఆనందంగా జీవించడం అనేది
ఆత్మ యొక్క అంతర్గత శక్తి.
– మార్కస్ అరీలియస్

సాక్షి
మంగళవారం, 17 అక్టోబర్ 2023

మానవత్వం మరిస్తే...

పది రోజులైంది. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై పాలస్తీనా ప్రాంత తీవ్రవాద గ్రూపు హమాస్ జరిపిన దాడి తాలూకు ప్రకంపనలు ఆగేలా లేవు. హమాస్‌ను తుదముట్టిస్తామంటూ గాజాపై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడి అంతకంతకూ తీవ్రతరమవుతోంది. భూతల దాడులకు దిగడానికి సర్వసన్నద్ధమైంది. ఇప్పటికే గాజాను ఈ యూదు దేశం అష్టదిగ్బంధనం చేయడంతో అక్కడి పాలెస్తీనియన్లకు తినడానికి తిండి కాదు కదా తాగడానికి నీళ్ళయినా లేని పరిస్థితి. ఆగని యుద్ధంలో ఇప్పటికి 2600 మందికి పైగా పాలస్తీనియన్లు, ఇరువైపులా కలిపి 4 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. పది వేల మందికి పైగా గాయపడ్డారు. పిల్లలు, స్త్రీలు, వృద్ధులనే తేడా లేకుండా, బాధితుల కనీసపాటి అవసరాలకు కూడా అక్కర లేకుండా అంతర్జాతీయ మానవతావాద చట్టానికి (ఐహెచ్ఎల్)కి నీళ్ళొది లేస్తున్న ఇజ్రాయెల్ – హమాస్ మధ్య యుద్ధం చివరికి మానవ సంక్షోభంగా మారిపోయే సూచనలున్నాయి. మానవతా దృక్పథం అవసరమనే అంతర్జాతీయ సమాజంలో ఇది ఆందోళన రేపుతోంది.

పాలస్తీనా జనాభా 23 లక్షలైతే, 11 లక్షల మంది పైగా పౌరులు ఇజ్రాయెల్ హెచ్చరికలతో ఇప్పటికే ఉత్తర గాజా విడిచివెళ్ళారు. అంటే సగం మంది నిరాశ్రయులయ్యారు. గాజా నుంచి ఈజిప్టులోకి వెళ్ళేందుకు రాఫా మార్గం తెరిచేందుకు దౌత్య యత్నాలు జరుగుతుండడంతో మరింతమంది అటూ వెళ్ళవచ్చు. యుద్ధం సృష్టించిన ఈ బీభత్సంలో సొంత గడ్డ విడిచివెళ్ళాల్సిన దైన్యంలో పడిన వీరి జీవితకాలపు దుఃఖాన్ని ఎవరు తీర్చగలరు? ఇజ్రాయెల్ భూతల దాడులు చేస్తే, ఇప్పటికే తిండి, నీళ్ళు, విద్యుత్తు, ఇంధనం లేక అల్లాడుతున్న ప్రాంతంపై అది అమానుష దాడి. హమాస్ మాటేమో కానీ, అన్నెం పున్నెం ఎరుగనివారు బలైపోతారు. ఐరాస ప్రతినిధి అన్నట్టు అది సామూహిక ఉరిశిక్ష వేయడమే! 'ఆరుబయలు కారాగారం'గా పేరుబడ్డ గాజా 'ఆరు బయలు శవాగారం' అవుతుంది.

ఇజ్రాయెల్‌పై హమాస్ దాడినీ, వందలమంది మరణానికి కారణమైన తీరునూ, అమాయకులను బందీలుగా తీసుకెళ్ళిన వైనాన్నీ మానవతావాదులు ఎవరూ సమర్థించరు. కానీ, ఇప్పుడు ఇజ్రాయెల్ చేస్తున్నదేమిటి? ఆత్మరక్షణ ధోరణిని అతిక్రమించి, గాజాను తుడిచిపెట్టేయాలనీ, పాలస్తీనాను ఉనికిలో లేకుండా చేయాలనీ తెగబడుతున్న తీరును ఏమనాలి? ఒకప్పుడు సురక్షితంగా బతకడానికి తమకంటూ ఓ దేశం కావాలని మొదలైన యూదులు నాటి సువిశాల ఒట్టోమన్ సామ్రాజ్యంలో పాలస్తీనా ప్రావిన్స్‌లో భూములు కొనడంతో ఆరంభించారు. మొదటి ప్రపంచ యుద్ధానంతర పరిణామాల్లో చివరకు పాలస్తీనా విభజనకూ, 1948లో స్వతంత్ర ఇజ్రాయెల్ ఏర్పాటుకూ కారణమయ్యారు. ఆనాడు పాలస్తీనాకు యూదులు వలసొస్తే, ఈనాడు పాలస్తీనియన్లు వలస పోతున్న పరిస్థితి. రావణకాష్ఠంలా సాగుతున్న పాలస్తీనా అంశంలో ఇరుపక్షాల తప్పులూ కొల్లలు.

ఇజ్రాయెల్ – పాలస్తీనా అంశాన్ని ముస్లిమ్ – యూదు సమస్యగా చిత్రీకరించి, అగ్నికి ఆజ్యం పోస్తున్న ఇరుపక్షాల దేశాలకూ చివరకు స్వప్రయోజనాలే కీలకం. పేదవులపై సానుభూతి, ఆయుధాలు అందించి యుద్ధాన్ని పెద్దది చేయడంతో పెరిగే మంటలు ప్రజలకు పనికిరావు. గాజా కేవలం 41 కి.మీ.ల పొడవాటి చిన్న భూభాగమే కావచ్చు. దాన్ని కైవసం చేసుకోవాలన్న ఇజ్రాయెల్ ఆకాంక్ష నెరవేరడం సులభమేమీ కాదు. గతంలో 2009లో 15 రోజులు, 2014లో 19 రోజులు గాజాపై ఇజ్రాయెల్ దండయాత్ర చేయకపోలేదు. అన్నిటికీ యుద్ధం పరిష్కారమైతే అనేక సమస్యలు ఏనాడో పరిష్కరమయ్యేవి. పాలస్తీనియన్లలో 44 శాతం మంది 2006లో తీవ్రవాద హమాస్‌కు ఓటు వేసి తప్పు చేశారు. దానికి ఇప్పుడు మూల్యం చెల్లిస్తున్నారు. అన్నీ కోల్పోయి, భవితపై ఆశ లేని దుఃస్థితికి వచ్చారు. ప్రాణాలు అరచేత పెట్టుకొని పారిపోదామన్నా అభ్యంతరం చెబుతూ, అమాయకులైన వారినే హమాస్ అడ్డం పెట్టుకొంటున్న వార్తలు విచారకరం.

ఈ పరిస్థితుల్లో ఈ యుద్ధం తక్షణం ఆగేందుకు ప్రపంచ దేశాలన్నీ ప్రయత్నించాలి. బాధితులకు తక్షణ సాయం, శాంతిస్థాపన తక్షణ కర్తవ్యం కావాలి. దురదృష్టవశాత్తూ ప్రపంచ దేశాలు రెండు వర్గాలుగా చీలిపోయి మాట్లాడుతున్నాయి. అయితే, హమాస్ దాడితో వచ్చిన సానుభూతి క్షీణిస్తూ, విమర్శలు పెరగడాన్ని ఇజ్రాయెల్ సైతం గమనిస్తోంది. గాజాకు అత్యవసర సాయం అందేందుకు దోవ ఇస్తామని ఇజ్రాయెల్ ప్రధాని నెతెన్యాహూ అన్నట్టు తాజా వార్త. అలాగే, దాడులు ఆపేస్తే ఇజ్రాయెలీ బందీలను హమాస్ విడిచిపెడతానందని ఇరాన్ మాట. హమాస్ నుంచి ఆ మేరకు అధికారిక ప్రకటన రాలేదు కానీ, యుద్ధాన్ని ఆపే అలాంటి కనీస ప్రయత్నాలు అత్యవసరం.

మన సంగతికొస్తే, మునుపటితో పోలిస్తే భారత ఆర్థిక సౌభాగ్యానికీ, జాతీయ భద్రతకూ ఇటీవల అతి కీలకమైన మధ్యప్రాచ్యంపై దేశంలో అధికార, ప్రతిపక్షాలు దేశీయంగా హిందూ, ముస్లిమ్ ఓటు బ్యాంక్ రాజకీయాలు చేయడం మానాలి. ప్రతిపక్షాలను విశ్వాసంలోకి తీసుకొని, క్రమం తప్పకుండా సమావేశమై, మారుతున్న పరిస్థితుల్నీ, మన దేశం అనుసరిస్తున్న వ్యూహాన్నీ ఎరుకపరచాలి. సంక్షోభం ముదురుతున్న వేళ సమతూకమే భారత మంత్రం. యుద్ధంలో మానవీయ చట్టాలను గౌరవించాల్సిందిగా ఇజ్రాయెల్‌కు విజ్ఞప్తి చేయాలి. హమాస్ దుశ్చర్యకు గాజాలో అమాయకులపై ప్రతీకారం అర్థరహితమని నచ్చజెప్పాలి. అలాగే, హమాస్ వద్ద బందీలైన ఇజ్రాయెలీలను వెంటనే విడిపించేందుకు అరబ్ మిత్ర దేశాలు పాటుపడేలా కృషి చేయాలి. అటు ఇజ్రాయెల్‌తోనూ, ఇటు ఇరాన్, ఖతార్ మొదలు సౌదీ అరేబియా, ఈజిప్ట్ దాకా మధ్యప్రాచ్యంలోని కీలక దేశాలతోనూ ఉన్న సత్సంబంధాల రీత్యా భారత్ ఈ యుద్ధానికి తెరపడేలా చూడాలి. మధ్యప్రాచ్యాన్ని కమ్ముకొస్తున్న మానవ సంక్షోభాన్ని నివారించాలి.

నైతిక సందిగ్ధతల అంతస్సంఘర్షణ

కామెంట్



కరణ్ థాపర్

సరైన ఫలితాన్ని సాధించడానికి సరైనవి కాని మార్గాలను అనుసరించడం ఆమోదయోగ్యమేనా? "అర్థవంతమైన దానిని సాధించడం కోసం మనం నమ్మిన సిద్ధాంతాలు, మనం పాటించే విలువలు, మనం అనుసరించే ప్రమాణాలలో కొన్నింటిని త్యాగం చెయ్యడం కూడా గౌరవనీయమే" అనే వాదన రాజకీయాలలో ఉంది. ఒక శక్తిమంతమైన నిర్ణయం తీసుకోడానికి ప్రధాని తన కార్యాలయానికి ఉన్న అపారమైన అధికారాలను ఎలాంటి నైతికపరమైన సంకోచాలూ లేకుండా ఉపయోగించడం ఆత్మ సమ్మతం అవుతుందా? కాలమిస్ట్ ఆకార్ పటేల్ తొలి నవల 'ఆఫ్టర్ మెస్సయ'... గొప్ప ఉద్విగ్నతకు లోను చేసే సాంప్రదాయిక రాజకీయ రచనల మాదిరిగా కాకుండా... రాజకీయాల సహజ స్వభావాన్ని, గొప్ప విజయాలు తరచు సిగ్గుచేటు సర్దుబాట్ల నుంచి సంప్రాప్తించడంలోని వైరుధ్యాన్ని ప్రతిబింబిస్తోంది.

నిజం చెప్పొద్దూ... తనొక నవల రాశానని ఆకార్ పటేల్ నాతో అన్నప్పుడు నేను ఆశ్చర్యచకితుణ్ణి అయ్యాను. పటేల్‌ను ఒక దృష్టికోణం గల పత్రికా రచయితగా, మోదీ ప్రభుత్వాన్ని తూర్పార పట్టే ఒక గట్టి రాజకీయ వ్యాసకర్తగా, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌కు ధీశాలి అయిన ఛైర్మన్‌గానే నేను ఎరుగుదును. అంతే తప్ప, కాల్పనికత అయన అజ్ఞాత బలం అయి ఉంటుందని నేను ఏ కోశానా అనుకోలేదు.

ఇంతేనా నాకు పటేల్ గురించి తెలిసింది! కథనానికి లోతైన నైతిక కోణాన్ని అందించే అంతస్సంఘర్షణతో పాత్రలను సృష్టించగల సామర్థ్యంతో పాటుగా ఆయన ఊహాశక్తిలోని ప్రతిభను, కదలనివ్వని కథన పటిమను ఆయన తాజా రచన 'ఆఫ్టర్ మెస్సయ' బహిర్గతం చేస్తోంది. గొప్ప ఉద్విగ్నతకు లోను చేసే సాంప్రదాయిక రాజకీయ రచనల మాదిరిగా కాకుండా ఈ పుస్తకం రాజకీయాల సహజ స్వభావాన్ని, గొప్ప విజయాలు తరచు సిగ్గుచేటు సర్దుబాట్ల నుంచి సంప్రాప్తించడంలోని వైరుధ్యాన్ని ప్రతిబింబిస్తోంది.


ఈ నవలొక వాస్తవ ఘటనల అల్లికగా ప్రారంభం అవుతుంది. నిజమైన వ్యక్తులు ఉంటారు. అయితే వారికి పెట్టుడు పేర్లు ఉంటాయి. ప్రధాన మంత్రిని 'ది బిగ్ మ్యాన్' అంటారు పటేల్. పుస్తకంలో ఎక్కడా ప్రధాని పేరు కనిపించదు. కానీ ఆ బిగ్ మ్యాన్ మాట్లాడేటప్పుడు "ప్రజాస్వామ్యం యొక్క భాష, చిహ్నాలు... పాలకుడు తన గురించి తను మూడో వ్యక్తిగా వ్యక్తం చేసుకుంటున్న ప్రస్తావనలతో కలిసి ఉంటాయి." అది మొదటి గుర్తు.

ఆ బిగ్ మ్యాన్ ప్రారంభోత్సవాలను కూడా ఇష్టపడతారు కనుక, "బిగ్ మ్యాన్ అధ్యక్షత వహించేందుకు వీలైనంతగా అత్యుత్తమమైన ఒక కార్యక్రమాన్ని లేదా వేడుకను అందించడంపై మంత్రిత్వ శాఖలు దృష్టి పెడతాయి." అది రెండవ గుర్తు. ఇక మూడోది... "రాజకీయ వ్యతిరేకత. అదేదో అంతర్గత శత్రువైనట్లుగా దానిపై హింసాత్మక దాడులు జరుగుతుంటాయి. ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలు ఆ శత్రువును చావనివ్వని, బతకనివ్వని వాస్తవ రాజకీయాలకు అతీతమైన ఒక నిరంతర స్థితిలో ఉంచడంలో పూర్తిగా నిమగ్నం అయి ఉంటాయి".

ఇప్పుడీ పుస్తకంలోని అబ్బుర పరుస్తూ చదివించే సంతోషదాయకమైన సృజనాత్మక ముగింపు గురించి తప్ప మరింకేదీ బహిర్గతం చేయడం నాకు ఇష్టం లేదు. బదులుగా ఇందులో పటేల్ కథనానికి పునాదిగా జరిగిన శక్తిమంతమైన రాజకీయ... నిజానికి నైతికపరమైన చర్చ గురించి మీకు చెబుతాను.



'మహారాణి' వెబ్ సిరీస్‌లో హ్యూమా ఖురేషీ: ప్రతీకాత్మక చిత్రం



పటేల్ పుస్తకంలో బిగ్ మ్యాన్ చాలా త్వరగా చనిపోతాడు. ఆయన తర్వాత మీరా అనే మహిళ అధికారంలోకి వస్తారు. 'లాయర్స్ కలెక్టివ్' అనే ఎన్జీవోకు పని చేస్తుంటారు మీరా. ఆమె అవివాహిత. ఒంటరి తల్లి. ఆమె కుమార్తె జైల్లో ఉంటుంది. బిగ్ మ్యాన్, ఆయన పార్టీ అనుసరించిన రాజకీయ విధానాలపై మీరాకు తృణీకారభావం ఉంటుంది. అనిష్టంగానే ప్రధాని అవుతారు. అయ్యాక మాత్రం గతంలోని క్రూరమైన చట్టాలను రద్దు చేయడం కోసం అపారమైన తన కార్యాలయ అధికారాలను ఉపయోగించు కోవాలనుకుంటారు. పేదల ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించే ప్రయత్నంగా ప్రభుత్వాన్ని బాధ్యతాయుతంగా, జవాబుదారీగా మార్చేయబోతారు.

అయితే సమస్య ఎక్కడొస్తుందంటే ఆమె తన కార్యాలయ అపరిమిత అధికారాలను అభ్యంతరం, అనైతికం అయిన మార్గాలలో ఉపయోగించవలసి రావడం. ఇక్కడ జనించే ప్రశ్న: సరైన ఫలితాన్ని సాధించడానికి సరైనవి కాని మార్గాలను అనుసరించడం ఆమోదయోగ్యమేనా? అన్నది.

ఆమె ముఖ్య సలహాదారు... ఆ సలహాదారుకు పేరేం ఉండదు... 'హౌస్ మేనేజర్' అంతే. ఆ మేనేజర్‌కు ఇది ఆమోదయోగ్యమే అనిపిస్తుంది. "అర్థవంతమైన దానిని సాధించడం కోసం మీరు నమ్మిన సిద్ధాంతాలు, మీరు పాటించే విలువలు, మీరు అనుసరించే ప్రమాణాలలో కొన్నింటిని త్యాగం చెయ్యడం గౌరవనీయం, ప్రశంసనీయం అయిన సంగతే" అంటారు హౌస్ మేనేజర్. కానీ అందువల్ల ప్రయోజనం పొందగలిగిన సగటు ప్రజలు దానిని అంగీకరించరు. మీరా వారిని సంప్రదించినప్పుడు ఒక వృద్ధురాలు... తరచు నిరాకరణకు గురవుతుండే, అదే సమయంలో సర్వకాలాలకు ఆమోదయోగ్యమైనదిగా ఉండే యుగాల వివేకాన్ని వ్యక్తపరుస్తుంది. "చేయవలసిన సరైనది ఒకే ఒకటి ఉంటుంది. అదే సరైనది" అని అంటుంది.

ఈ విధంగా పటేల్ పుస్తకం ముగింపునకు చేరుకుంటున్న కొద్దీ భారత రాజకీయాల స్వభావం గురించి; ఒకవైపు ఎత్తుగడలూ వ్యూహాలకూ, మరోవైపు సిద్ధాంతాలూ నైతికతలకూ మధ్య జరుగుతుండే ఘర్షణలతో ఒక శక్తిమంతమైన కథగా అభివృద్ధి చెందుతుంది. ప్రధాని కార్యాలయానికి ఉండే అపారమైన అధికారాలను నైతికపరమైన సంకోచాలు లేకుండా, అనుకున్న దానిని సాధించేందుకు మీరా ఏకచిత్తంతో దృష్టి సారించినందున పుస్తకంలోని ఈ భాగం కేవలం చదివించేలా మాత్రమే కాదు, ఒక వెల్లడింపుగానూ ఉంటుంది. మీరా తనలోని సందేహాలను అణిచివేస్తారు. అయితే ఆశించిన ఫలితాన్ని సాధించడానికి ఇదే ఏకైకమార్గం అని హౌస్ మేనేజర్ తనకు నచ్చజెప్పేందుకు ఆమె అనుమతిస్తారు. అందువల్లనే ముగింపులో ఫలితం అనేది ఫలితం కోసం అనుసరించిన మార్గాలపై విజయం సాధించడం కనిపిస్తుంది. అయితే చర్చ మాత్రం ముగింపు దశకు చేరకనే ఉండిపోతుంది. అది ఆమె మనస్సాక్షిని కృంగదీస్తూ ఉంటుంది.

నిజంగా రాజకీయాల్లో తరచు ఇలా జరుగుతుంటుందన్నది వాస్తవం. పటేల్ 'బిగ్ మ్యాన్'పై ఇదేమీ ప్రభావం చూపకపోవచ్చు కానీ ఇతర రాజకీయ నాయకులు తరచుగా ఇబ్బంది పడుతుంటారు. కొన్నిసార్లయితే దానివల్ల నలిగిపోతుంటారు కూడా. భారతదేశంలోనే కాదు, చాలా ప్రజాస్వామ్య దేశాలలో ఇలాగే జరుగుతుంటుంది.

అందుకే రాజకీయాల సారాంశం అన్నది రాజకీయపరమైన దాని కన్నా చాలా ఎక్కువైనది. ఎందుకంటే అది నిర్ణయాలకు, ఎంపికలకు, అంతిమంగా సైద్ధాంతికతల్ని మించిన అంశాలకు సైతం సంబంధించినది. అలాగే నైతికపరమైన వాటికి కూడా. పటేల్ ఆ సంగతిని స్పష్టంగా అర్థం చేసుకున్నారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వియన్నాకు సీబీఐ



నూరేళ్ల 'ఇంటర్‌పోల్'... వచ్చే నెలలో వియన్నాలో తన 91వ సాధారణ సభను నిర్వహించబోతోంది. ఆ సందర్భంగా మన సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్... మెహుల్ చోక్సీ రెడ్ నోటీస్‌ను రద్దు చేయడాన్ని ప్రశ్నించబోతున్నారు. అలాగే విదేశీ గడ్డపై నుంచి భారత్‌లో కల్లోలం రేపాలని ప్రయత్నిస్తున్న ఖలిస్థానీల ప్రస్తావన కూడా తేబోతున్నారు.

– నీరజ్ చౌహాన్, పత్రికా రచయిత

దోష విముక్తి!



2006 నిఠారీ కేసులో దోషులైన సురేంద్ర కోలీ, మోనీందర్ సింగ్ పంధేర్‌ల మరణశిక్షను అలహాబాద్ హైకోర్టు రద్దు చేయడం దిగ్భ్రమను కలిగించింది. చిన్నారులను అపహరించి, లైంగికంగా వేధించి, హత్య చేసి, వారి నిశ్చలన శరీరాలతో అమానుషంగా ప్రవర్తించారన్న అభియోగాన్ని వారే స్వయంగా ఒప్పుకున్నప్పటికీ వారిని నిర్దోషులుగా బయట పడేయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

– రేణు. కె., సోషల్ యాక్టివిస్ట్

సంకీర్ణం ముప్పు!



పోలండ్‌కు చెడ్డ రోజు. అధికార కన్జర్వేటివ్ పార్టీ అత్యధిక ఓట్లను సాధించినట్లు కనిపిస్తున్నప్పటికీ ప్రతిపక్షాలు సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చని ఎగ్జిట్ పోల్స్ సూచిస్తున్నాయి. అదే జరిగితే ఇప్పటి వరకు శాంతియుతంగా ఉన్న దేశానికి వామపక్ష ఉగ్రవాద భావజాలం ఉన్న వ్యక్తుల వల్ల ముప్పు పొంచి ఉన్నట్లే!

– సచిన్ జోస్, పొలిటికల్ ఎనలిస్ట్

జీవాహారం



'ప్రపంచ ఆహార దినం' (16 అక్టోబర్) మన జీవితాల్లో నీటి ప్రాముఖ్యాన్ని మనకు గుర్తు చేయాలి. 'నీరు జీవం.. నీరు ఆహారం' ఈ ఏడాది థీమ్ కనుక జీవం, ఆహారం లేకుండా మన ఒక్కర్ని కూడా వదిలిపెట్టి పోకూడదని సంకల్పం చెప్పుకుందాం. ఆకలి లేని ప్రపంచం కోసం కలిసి పని చేద్దాం.

– విశ్వజిత్ రాణే, గోవా ఆరోగ్య మంత్రి

కడుపు కోత



ఇజ్రాయిల్ వైమానిక దాడిలో తన కొడుకును కోల్పోయిన ఒక తల్లి హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని తన కొడుకును చూడాలని రెండు చేతులు జోడించి అక్కడి వారిని అభ్యర్థించినప్పుడు ఆసుపత్రి నర్సు దూరం నుంచి ఆమెకు ఇచ్చిన సంకేతం ఏమిటంటే... ఆమె కుమారుడి కుడి సగాన్ని మాత్రమే చూపించగలం అని!

– కరిష్మా కౌర్, పొలిటికల్ థింకర్



యుద్ధం

ఇద్దరు
ఇద్దరి చేతుల్లోనూ మారణాయుధాలు

ఆయుధం పేలనంతవరకు
ఇద్దరూ ఇద్దరుగానే వున్నారు

ఒక చేతిలోని ఆయుధం పేలగానే
మరో చేయి ఐదులిచ్చింది

తుపాకులు బాంబులు అనేమిటి
వినాశనానికి వేయి రూపాలు

ఇరువైపులా హాహాకారాలు ఆర్తనాదాలు
ఏరులై పారిన కన్నీళ్లు
రక్తపు టేరులు శవాల కుప్పలు

విజయం నాదంటే నాదన్నారు
చేతులెత్తి విర్రవీగారు
కాళ్ళకింది భూమి
కదిలిపోయిన సోయి లేదు

దూరంగా ఆయుధాల వ్యాపారి
హర్షామోదాలతో చప్పట్లు కొడుతున్నాడు
మాటల బేహారి శాంతి ప్రవచనం చెబుతున్నాడు

సామాన్య జనమే
నెర్రెలు బారిన నేలకేసీ ఆకాశంకేసీ చూస్తూ
ప్రార్థనలు చేస్తున్నారు

– వారాల ఆనంద్

ఆత్మహత్యలు ఎందుకు చేసుకుంటారు?

విశ్లేషణ



డానీ

హైదరాబాద్‌లో గ్రూప్–2 విద్యార్థిని ప్రవల్లిక మరణం ఆత్మహత్యల అంశాన్ని మరోసారి చర్చకు తెచ్చింది. పరీక్షల్ని ప్రభుత్వం వాయిదా వేయడం వల్లనే ఆమె నిరాశకు గురై చనిపోయిందని కొన్ని విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. ఆమె ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణం అని సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు మీడియాకు వివరించారు. పోలీసుల కథనం ప్రకారం శివరామ్ అనే మిత్రునితో ప్రవల్లిక కొన్నాళ్ళుగా ప్రేమలో వుంది. అతను మరో అమ్మాయితో పెళ్ళికి సిద్ధమయ్యి, నిశ్చితార్థం చేసుకున్నాడు. అది ఆమె మనసును గాయపరిచింది.

మనుషులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటారూ? అనే ప్రశ్న ఇలాంటి సందర్భాల్లో ముందుకు వస్తుంటుంది. ప్రతి ఆత్మహత్యకూ ఏదో ఒక కారణం వుంటుంది. అలా అనుకుంటే ప్రతి ఆత్మహత్య ప్రత్యేక మైనదే అవుతుంది. వ్యక్తిగతం అవుతుంది. అప్పుడు ఆత్మహత్యలను సూత్రీకరించడం కుదరదు. చర్చించడమూ కుదరదు. ఆత్మహత్యలకు సమాజమే కారణం అని నిర్ధారించినవాడు ఫ్రెంచ్ సమాజ శాస్త్రవేత్త ఎమిలి డర్ఖేమ్ (1858 – 1917). సామాజిక సంక్షోభం కారణంగానే మనుషులు ఆత్మహత్యలు చేసుకుంటారని నిర్ధారిస్తూ 1897లో ఆయన 'లా సూసైడ్' శీర్షికతో ఓ ఉద్గ్రంథాన్ని రాశాడు.

మనుషులు ఏం కోరుకుంటారూ? అని అడిగితే ఒక్కొక్కరూ ఒక్కో సమాధానం చెపుతారు. భారీ ఆదాయం వచ్చే ఉద్యోగం, విలాసవంతమైన ఇల్లు, అందమైన భార్య, మొనగాడైన భర్త, రాజ్యసభ సీటు, కేబినెట్లో స్థానం... ఇలా సాగుతుంది కోరికల జాబితా. వీటన్నింటినీ డర్ఖేమ్ కొట్టి పడేస్తాడు. ఈ కోరికలన్నీ పైకి కనిపించే అంశాలు; సారాంశంలో ప్రతి మనిషీ సంఘీభావాన్ని కోరుకుంటాడని చెబుతాడు. అదే మనిషి ప్రాథమిక కోరిక. సమాజంలో సంఘీభావం ఏ స్థాయిలో వుందో కొలవడానికి డర్ఖేమ్ ఒక పరికరాన్ని కనిపెట్టాడు. దానిపేరే 'ఆత్మహత్య'. సంఘీభావానికీ ఆత్మహత్యలకూ విలోమానుపాత సంబంధం వుంటుందని ఆయన తేల్చాడు. ఒక సమాజంలో ఆత్మహత్యల రేటు ఎక్కువగా వుంటే అక్కడ సంఘీభావం తక్కువగా వున్నట్టు. ఒక సమాజంలో ఆత్మహత్యల రేటు తక్కువగా వుంటే ఆ సమాజంలో సంఘీభావం ఎక్కువగా వున్నట్టు భావించాలన్నాడు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏడాదీ దేశాల వారీగా ఆత్మహత్యల నివేదికను ప్రకటిస్తూ వుంటుంది. వివిధ దేశాల్లో ఏడాదికి లక్ష మందికి 10 నుండి 40 మంది వరకు ఆత్మహత్యలు చేసుకుంటారు. అయితే ఈ గణాంకాలను కచ్చితమైనవని అనుకోలేము. అనేక కుటుంబాలు ఆత్మహత్యను సామాజిక అవమానంగా భావిస్తాయి. జీవిత బీమా తదితర టెక్నికల్ కారణాల వల్లనూ కొందరు ఆత్మహత్యల్ని దాచిపెడతారు. కొన్ని దేశాల్లో ఆత్మహత్య అనేది శిక్షించదగ్గ నేరం. ఇన్ని కారణాల వల్ల ఆత్మహత్యల గురించి కచ్చితమైన నివేదికలు రావు.



అయితే, కొన్ని నిర్ధారణలు చేయడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు పనికి వస్తాయి. మహిళల్లో ఎక్కువ శాతం ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటారు; కానీ పురుషులు ఎక్కువ శాతం ఆత్మహత్యలు చేసుకుంటారు. చదువుకోనివారికన్నా చదువుకున్నవారు, కుటుంబ వ్యవస్థలో వున్నవారికన్నా కుటుంబ వ్యవస్థలో లేనివారు ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకుంటారట!

జంతువులు ఒంటరిగా జీవించగలవుగానీ మనుషులు ఒంటరిగా జీవించలేరు. యుద్ధ సమయాల్లో, ఉద్యమాల సందర్భాల్లో మనుషుల మధ్య సంఘీభావం వున్నత స్థాయిలో వుంటుంది. అప్పుడు ఆ సమాజాల్లో ఆత్మహత్యల రేటు చాలా తక్కువగా వుంటుంది. ఆ దశ దాటిపోగానే ఆ స్థాయి సంఘీభావాన్ని పొందలేక గొప్ప నైరాశ్యానికి గురయ్యి చనిపోవాలనుకుంటారు.

ఎమిలి డర్ఖేమ్ దృష్టిలో ఆత్మహత్యలకు రెండే కారణాలుంటాయి. మొదటిది అనుబంధాలు; రెండోది ఆంక్షలు. అనుబంధాల వల్ల రెండు రకాలు ఆత్మహత్యలు, ఆంక్షల వల్ల మరో రెండు రకాల ఆత్మహత్యలు జరుగుతాయంటాడు. మొత్తం ఆత్మహత్యలు నాలుగు రకాలని ఆయన వర్గీకరించాడు. మనుషుల మీద ప్రేమాభిమానాలు చాలా ఎక్కువయినపుడు వారి కోసం కొందరు స్వచ్ఛందంగా చనిపోవడానికి సిద్ధపడతారు. చంద్రశేఖర్ ఆజాద్, భగత్ సింగ్, అల్లూరి శ్రీరామరాజు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చనిపోయినవారూ, నక్సలైట్ ఉద్యమ అమరులూ ఈ కోవలోనికి వస్తారు. మనం ఇలాంటి చావుల్ని బలిదానాలు(ఆల్ట్రూయిస్టిక్ సూసైడ్) అంటాము. మనుషుల మీద ప్రేమాభిమానాలు బొత్తిగా లేనప్పుడూ ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుంది. మనుషుల మీద ప్రేమాభిమానాలు లేని మనిషి ఒక అహంతో బతుకుతుంటాడు. బయటి నుండి సంఘీభావం అందక చనిపోవాల్సిన పరిస్థితి వస్తుంది. ఇలాంటి చావును అహంభావ ఆత్మహత్య (ఈగోయిస్టిక్ సూసైడ్) అంటారు.

కొందరి మీద ఇంటాబయట ఆక్షలుంటాయి. బట్టలు ఎలా వేసుకోవాలి, తల ఎలా దువ్వుకోవాలి, ఎలా నడవాలి, ఏం చదవాలి, ఎవర్ని పెళ్ళి చేసుకోవాలి వరకు తల్లిదండ్రులే శాసిస్తుంటారు. కొందరిని ఆఫీసులో పైఅధికారులు వేధిస్తుంటారు. వీటిని తట్టుకోలేక కొందరు మరణానికి సిద్ధపడతారు. వీటిని నిర్బంధ మరణం (ఫాటలిస్టిక్ సూసైడ్) అంటారు. కొన్ని సందర్భాల్లో 'ప్రభుత్వం చేసిన హత్య' అంటుంటాం. ఇలాంటివి ఈ కోవలోనికే వస్తాయి. ఆంక్షల్ని, నియమ నిబంధనల్ని అస్సలు పట్టించుకోని వారు కొందరుంటారు. వీరిలోనూ ఆత్మహత్యల రేటు ఎక్కువగా వుంటుంది. వీటిని క్రమశిక్షణ రహిత ఆత్మహత్యలు (అనామిక్ సూసైడ్) అనవచ్చు.

ఆత్మహత్యల్ని నివారించడానికి కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు పనిచేస్తున్నాయి. వీటికి కొన్ని యాప్‌లు కూడా వున్నాయి. ఆత్మహత్యల్ని నివారించడానికి అన్నింటికన్నా ముఖ్యమైనది సంఘీభావం. అది వర్తమాన సమాజంలో క్రమంగా కనుమరుగైపోతున్నది. ఇది అమానవీయమైన పరిణామం. మనుషుల మధ్య సంఘీభావాన్ని నెలకొల్పడానికి అందరూ పూనుకోవాల్సిన సందర్భం ఇది.

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్టు
మొబైల్: 90107 57776

విజయానికి సంకేతం

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ నవమి వరకూ దేవీ నవరాత్రులను జరుపుకొంటాం. పదవ రోజు... అంటే ఆశ్వయుజ దశమిరోజు విజయదశమి పర్వదినం. ఇది శరదృతువు గనుక ఈ పండుగ దినాలను శరన్నవరాత్రులు అంటారు. దుర్గాదేవి ఆలయాల్లో అమ్మవారిని మొదటిరోజు శైలపుత్రి, రెండోరోజు బ్రహ్మచారిణి, మూడో రోజు చంద్రఘంటాదేవి, నాలుగో రోజు కూష్మాండాదేవి, ఐదోరోజు స్కందమాత, ఆరో రోజు కాత్యాయని, ఏడోరోజు కాళీ మాత, ఎనిమిదోరోజు మహాగౌరి, తొమ్మిదో రోజు సిద్ధిదాత్రీ దేవి – రూపాల్లో ఆరాధిస్తారు. పదవ రోజు రాజరాజేశ్వరీదేవి రూపాలతో అమ్మవారిని అలంకరిస్తారు. దేవి రూపానికి తగినట్లు ఆ వేళ నైవేద్యం సమర్పిస్తారు. శరన్నవరాత్రుల్లో అమ్మ వారికి వరుసగా కేసరి, పొంగలి, అల్లం గారెలు, దద్ధోజనం, అప్పాలు–పులిహోర, పెసర పప్పు పాయసం, వడపప్పు–చలిమిడి, చక్రపొంగలి, కేసరి, పూర్ణాలు, లడ్డూలు నైవేద్యంగా సమర్పిస్తారు.

నవరాత్రి చెడును, విశృంఖలత్వాన్ని నిర్మూలించడానికి, అలాగే జీవితంలో అన్ని అంశాల పట్ల, అంటే మన శ్రేయస్సుకి దోహదపడే వస్తువులు, విషయాల పట్ల కూడా కృతజ్ఞతా భావంతో ఉండటానికి సంబంధించినది. నవరాత్రుల తొమ్మిది రోజులు మూడు ప్రాథమిక లక్షణాలైన తామస, రజస, సత్వ గుణాలకు అనుగుణంగా వర్గీకరించబడ్డాయి. మొదటి మూడు రోజులు తామసికమైనవి, వాటికి ప్రతీకలు తీవ్రమైన దుర్గ, కాళి దేవతలు. తరువాతి మూడు రోజులు లక్ష్మికి సంబంధించినవి – కోమలమైనదే కానీ ధన, వస్తు, కనక, వాహనాలకు ఆధారమైన దేవి. ఆఖరి మూడు రోజులు సరస్వతి కోసం ఉద్దేశించబడినవి. అదే సత్వ గుణం. అది జ్ఞానం, జ్ఞానోదయానికి సంబంధించినది. నవ రాత్రుల తరువాత పదవది, అంటే ఆఖరుది విజయ దశమి – అంటే ఈ మూడు గుణాలను జయించారని అర్థం.

దేవదానవులు పాలసముద్రాన్ని మథించినప్పుడు అమృతం జనించిన శుభముహూర్తదినం ఈ విజయదశమి రోజే. 'శ్రవణా' నక్షత్రంతో కలసిన ఆశ్వయుజ దశమికి 'విజయ' అనే సంకేతముంది. అందుకనే దీనికి 'విజయదశమి' అని పేరు వచ్చింది.

'శమీపూజ' – శమీ వృక్షమంటే జమ్మిచెట్టు. శమీవృక్షం పాపాన్ని పరిహరిస్తుంది, శత్రువులను నాశనం చేస్తుందని అర్థం. ఇది ఆనాడు అర్జునుని ధనువును కాపాడింది, శ్రీరాముడికి ప్రియాన్ని కల్గించింది. జమ్మి ఆకును బంగారంగా భావించి, పెద్దల చేతిలో ఆకును ఉంచి ఆశీర్వాదాలు తీసుకుంటారు. విజయదశమి రోజున జమ్మిచెట్టు వద్దకు వెళ్ళి పార్వేట జరుపుకొంటారు.

– నందిరాజు రాధాకృష్ణ

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, ఆశ్వయుజమాసం, **తిథి:** శు.తదియ రా.11.56 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** విశాఖ రా.8.11 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** రా.12.15 నుండి 1.52 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.03 వరకు, తదుపరి రా.10.32 నుండి 11.21 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.08 నుండి 12.46 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.55, **సూర్యాస్తమయం:** 5.35.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

కేసీఆర్ అసమర్థతకు ఆ మేనిఫెస్టో నిదర్శనం

● బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి తరుణ్ ఛుగ్



సాక్షి, న్యూఢిల్లీ: తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ ప్రభుత్వ అసమర్థతకు బీఆర్ఎస్ మేనిఫెస్టో నిదర్శనమని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌ఛుగ్ విమర్శించారు. ఇన్నేళ్లుగా అధికారంలో ఉన్న కేసీఆర్ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను ఎందుకు అమలు చేయలేకపోయారని ఛుగ్ ప్రశ్నించారు. సోమవారం ఢిల్లీలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ మేనిఫెస్టోపై మండిపడ్డారు. అది అబద్ధాల పుట్ట అని వ్యాఖ్యానించారు. తెలంగాణలోని యువత, మహిళలు, రైతులు, వ్యాపారులు, కార్పొరేట్లు.. ఇలా అందరిలోనూ కేసీఆర్‌పై వ్యతిరేకత ఉందని అన్నారు. అధికార అహంకారంతో మేనిఫెస్టోలో హామీలు ఇస్తున్నారని, మరి ఇన్నేళ్లు వాటిని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది

● ప్రవల్లిక మృతిపై బీజేపీ నేత కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: ప్రవల్లిక మృతిపై మంత్రి కేటీ రామారావు మాట్లాడుతున్న తీరు దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తన వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, దివంగత ప్రవల్లిక పరువు తీసేందుకు పోలీసులను వాడుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. ఎన్నికలు ఉన్నా లేకపోయినా శాంతి భద్రతలు కాపాడే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే తప్ప ఎన్నికల సంఘానిది కాదన్నారు. సోమవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ...ప్రవల్లిక గ్రూప్-4 రాసి గ్రూప్ 1,2 కోసం ప్రిపేర్ అవుతున్న విషయం కేటీఆర్ దాస్తే దాగేది కాదన్నారు. ఆత్మహత్య ఘటనపై విచారణ జరపక ముందే, పోస్టుమార్టమ్ నివేదిక రాకముందే ప్రవల్లిక ప్రేమ వ్యవహారంతో ఆత్మహత్య చేసుకున్నారని డీసీపీ ఎలా చెబుతారని ప్రశ్నించారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఆపరేషన్, సౌత్ సర్కిల్, గ్రేటర్ హైదరాబాద్
టెండరు ప్రకటన నం. 05/2023-24 (పత్రికా ప్రకటన)
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్, సౌత్ సర్కిల్, హైదరాబాద్
DIPR RO No 8143-PP/CL/Advt/1/2023-24, Dt: 16.10.2023

Dr. YSR UNIVERSITY OF HEALTH SCIENCES
A.P.: VIJAYAWADA - 520008

NOTIFICATION

Applications through online are invited from the NEET- UG -2023 Rank holders for admission into UG AYUSH (BHMS, BAMS & BUMS) courses under Competent Authority Quota seats in Govt. & Private Un-aided Non-Minority AYUSH Colleges available under Dr. YSR UHS, Vijayawada for the academic year 2023-24 in the state of Andhra Pradesh.

Please visit the following URLs for filling up the online application form and for uploading of scanned original certificates:

Schedule for Registration of Online Application and Uploading of Scanned Certificates:	from 11.00 A.M on 17.10.2023 upto 5.00 P.M on 21.10.2023.
Application form UG AYUSH (BHMS, BAMS & BUMS) available	https://ugayushcq.ysruhs.com

Visit University website http://drysruhs.edu.in for detailed Notifications/ Prospectus/Regulations.

VIJAYAWADA
Date:16.10.2023

Sd/- (Dr.V.RADHIKA REDDY)
REGISTRAR

సంతానలక్ష్మిగా లక్ష్మీతాయారమ్మవారు	అన్నపూర్ణ అలంకరణలో భద్రకాళి	బ్రహ్మచారిణిగా సరస్వతీ అమ్మవారు	బ్రహ్మచారిణిగా జోగులాంబ



భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లక్ష్మీతాయారు అమ్మవారు సోమవారం సంతానలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు.



హనుమకొండ కల్చరల్: వరంగల్ శ్రీభద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న దేవీశరన్నవరాత్రి మహోత్సవాలలో రెండోరోజు ఆశ్వయుజశుద్ధ విదియ సోమవారం శ్రీభద్రకాళి అమ్మవారిని అన్నపూర్ణగా అలంకరించారు. బ్రహ్మచారిణి రూపంలో పూజలు జరిపారు.



భైంసా: నిర్మల్ జిల్లా బాసరలో దేవీనవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండవ రోజు సోమవారం సరస్వతీ అమ్మవారు కుడిచేతిలో జపమాల, ఎడమ చేతిలో కమండలంతో బ్రహ్మచారిణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ అమ్మవారు సోమవారం బ్రహ్మచారిణిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. 'స్వాధిష్ఠాన చక్రనిలయాం బ్రహ్మచారిణ్యాముత్తమాం'అంటూ శరన్నవరాత్రులలో భాగంగా అమ్మవారిని బ్రహ్మచారిణిగా అలంకరించి ఆరాధించారు.

ఈసీఐఎల్ డైరెక్టర్‌గా అనురాగ్ మాల్వీయా



కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) డైరెక్టర్ పర్సనల్‌గా అనురాగ్ మాల్వీయా బాధ్యతలు స్వీకరించినట్లు సంస్థ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి. హెచ్ఆర్ ప్రొఫెషనల్‌గా 31 సంవత్సరాల అనుభవం కలిగిన మాల్వీయా.. పలు ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో సేవలందించినట్లు వెల్లడించారు. భోపాల్ యూనివర్సిటీలో ఎంబీఏలో గోల్డ్ మెడల్ సాధించి అక్కడే తన పీజీ పూర్తి చేశారు. ఈసీఐఎల్ బోర్డు సభ్యుడిగా కొనసాగనున్న మాల్వీయా సిబ్బంది విధివిధానాలు నిర్వహణ బాధ్యతలను చూసుకోనున్నట్లు తెలిపారు.

తొలి జాబితాకు తప్పని ఎదురు చూపులు

బీజేపీ ఆశావహుల్లో ఉత్కంఠ

- సీఈసీ సమావేశం వాయిదాతో నిరాశ
- ఏకాభిప్రాయం కుదిరిన, సింగిల్ క్యాండిడేట్ సీట్ల నేతలకూ దొరకని గ్రీన్‌సిగ్నల్
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు దూసుకుపోతుండటంపై కలవరం
- 'పారాచ్యూట్'నేతలతో తమ సీట్లకు ముప్పు రావచ్చనే ఆందోళన

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అసెంబ్లీ టికెట్ల ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు అభ్యర్థుల జాబితాలు విడుదల చేస్తూ దూసుకుపోతుంటే.. పార్టీ పరంగా ఇంకా తొలి జాబితా కూడా ఖరారు కాకపోవడం వారిని కలవరపరుస్తోంది. సోమవారం ఢిల్లీలో జరగాల్సిన కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశం జరగకపోవడం, 18 లేదా 19వ తేదీన జరగవచ్చనే సమాచారంతో.. తొలి జాబితా విడుదలకు ఇంకో మూడురోజుల వరకు వేచి చూడాల్సి ఉంటుందని అంటున్నారు. దీంతో టికెట్లు ఆశిస్తున్న వారు, మొదటి జాబితాలోనే తమకు చోటు దక్కుతుందనే ఆశాభావంతో ఉన్నవారిలో టెన్షన్ మొదలైంది. ఇప్పటికే ఏకాభిప్రాయం కుదిరిన, సింగిల్ క్యాండిడేట్ సీట్లున్న 38–40 స్థానాల్లోని అభ్యర్థులకు కూడా పోటీకి సిద్ధం కావాలనే కనీస సమాచారం లేకపోవడంతో అయోమయం నెలకొంది. బీఆర్ఎస్ ఇప్పటికే 97 మంది అభ్యర్థులకు బీఫారంలు అందజేసింది. పలు నియోజకవర్గాలు, జిల్లా కేంద్రాల్లో ఎన్నికల ప్రచారాన్ని కూడా ప్రారంభించింది. కాంగ్రెస్ పార్టీ కూడా 55 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించిన నేపథ్యంలో...బీజేపీ నేతల్లో ఉత్కంఠ కొనసాగుతోంది.

ప్రధాని ఎన్నికల శంఖం పూరించినా..

వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడానికి ముందే మహబూబ్‌నగర్, నిజామాబాద్‌లలో ప్రధాని మోదీ సభలతో పార్టీ నాయకులు, కేడర్‌లో ఉత్సాహం ఏర్పడిందని రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. అధికార బీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌ల కంటే ముందుగానే ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టడం, వాటికి మంచి స్పందన రావడం పార్టీకి శుభపరిణామం అనే అభిప్రాయం వ్యక్తమైంది. ఇక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన మరుసటి రోజే ఆదిలాబాద్‌లో అమిత్ షా సభ జరిగింది. హైదరాబాద్‌లో వివిధ సామాజిక రంగాలకు చెందిన ప్రముఖులు, మేధావులతో ఆయన సమావేశం నిర్వహించారు. దీంతో పార్టీలో, కేడర్‌లో జోష్ మరింత పెరిగిందని, కానీ దానిని కొనసాగించేలా అభ్యర్థుల ఎంపికలో వేగం లేకుండా పోయిందని పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తమౌతోంది. ఇప్పటికి కనీసం మొదటి జాబితానైనా ప్రకటించి ఉంటే, 35 నుంచి 40 నియోజకవర్గాల్లో ప్రచారం మొదలై ఉండేదని వాపోతున్నారు. 2009 నుంచి వరుసగా జరిగిన మూడు అసెంబ్లీ ఎన్నికల్లోనూ అభ్యర్థుల ఖరారులో ఆలస్యం జరగడం, అభ్యర్థుల్లో గందరగోళం ఏర్పడడం, సరిగా ప్రచారం చేయకపోవడం వంటి సమస్యలను ప్రస్తావిస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లలో టికెట్లు లభించని వారిని బీజేపీలోకి ఆహ్వానించి పోటీ చేయించేందుకు ఎదురు చూసే పరిస్థితి రాకుండా ఈసారి జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని కొందరు నేతలు సూచిస్తున్నారు. చివరి నిమిషంలో వచ్చే ఇతర పార్టీలకు చెందిన 'పారాచ్యూట్'నేతలతో తమ సీట్లకు ముప్పు ఏర్పడొచ్చుననే ఆందోళన కూడా ఆశావహులను వెంటాడుతోందని అంటున్నారు.



22వ తేదీకి ముందే తొలి జాబితా!

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే బీజేపీ అభ్యర్థుల తొలి జాబితాను ఫైనల్ చేసేందుకు ఈ నెల 18 లేదా 19న సీఈసీ భేటీ అయ్యే అవకాశం ఉంది. 70కి పైగా స్థానాల్లో అభ్యర్థిత్వాలపై పరిశీలన జరిపి, ఏకాభిప్రాయం కుదిరిన 40 వరకు స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. అనంతరం ఈ నెల 22కి ముందే తొలి జాబితాను విడుదల చేసేందుకు పార్టీ సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తదితరులు పాల్గొనే భేటీకి అందుబాటులో ఉండాల్సిందిగా రాష్ట్ర నేతలకు ఇప్పటికే ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. మంగళవారం సాయంత్రం కూడా సీఈసీ భేటీ కానున్నప్పటికీ మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేయనుందని సమాచారం.



బడంగ్‌పేట సభలో అభివాదం చేస్తున్న జవదేకర్, కిషన్‌రెడ్డి, రాజ్‌నాథ్‌సింగ్, లక్ష్మణ్ తదితరులు

'కారు' బేకార్

▶ మొదటి పేజీ తరువాయి

పీఎంఏవై పథకాలు లబ్ధిదారులకు చేరడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా పీఎంఏవై కింద దాదాపు 4 కోట్ల మందికి సొంతింటి కల నిజం చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ప్రజల చేతిని ఏనాడో వదిలేసిందని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, ఉద్యోగ ఖాళీలు ఉన్నా ఎందుకు భర్తీ చేయట్లేదో యువతకు సీఎం సమాధానం చెప్పాలన్నారు. ఏ పరీక్ష జరిగినా పేపర్లు లీకవుతున్నాయని విమర్శించారు. దళితులకు ఇచ్చిన మాట కూడా కేసీఆర్ నిలబెట్టుకోలేదన్నారు.


'లక్ష్మి'..'చేయి' ఊపితేనో, 'కారు'లోనో రాదు..

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ చెప్పింది చేస్తుందని.. గుజరాత్ అభివృద్ధిలో దేశానికే మోడల్ అయ్యిందని పేర్కొన్నారు. 'తెలంగాణ కు కేంద్రం అనేక నిధులు మంజూరు చేసింది. అనేక సంక్షేమ పథకాలు మంజూరు చేసింది. మూడు వందే భారత్ రైళ్లు మంజూరు చేసింది. కరోనా వంటి కష్టకాలంలోనూ దేశాన్ని అగ్రగామిగా నిలిపింది. కోవిడ్ వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేసి ఇతర దేశాలకు కూడా పంపిణీ చేసింది'అని గుర్తు చేశారు. జనవరి 24 నుంచి అయోధ్యలో రామాలయం అందుబాటులోకి తెస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏ ఒక్కరి పోరాట ఫలితంగానో ఏర్పడలేదన్నారు. రాష్ట్ర ఏర్పాటులో బీజేపీ కీలక పాత్ర పోషించిందని చెప్పారు. తెలంగాణ వెనుకబాటుకు నాడు కాంగ్రెస్ అనుసరించిన విధానాలే కారణమని విమర్శించారు. 'లక్ష్మి'.. 'చేయి'ఊపితేనో.. 'కారు'లోనో రాదు. కమలం వికసిస్తేనే వస్తుంది. కమలం గుర్తుకు ఓటేసి 'లక్ష్మి'ని ఇంటికి తెచ్చుకోవాల్సిన అవసరముందని వ్యాఖ్యానించారు.

బీజేపీని ఆశీర్వదించండి: రాజేందర్

బీజేపీ–తెలంగాణ బంధం ఈనాటిది కాదని, 1997లో కాకినాడలో తెలంగాణకు అనుకూలంగా పార్టీ తీర్మానం చేసిందని బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ గుర్తు చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే నాయకుడు ప్రధాని మోదీ అని, తెలంగాణలో బీజేపీని ఆశీర్వదిస్తే కిలో కూడా తరుగులేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని, ఉద్యోగాల భర్తీ చేపడతామని, ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందజేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, పార్టీ నేత ప్రేమేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'ప్రవల్లిక ఇంటికెళ్లి పరామర్శించే ధైర్యం కేటీఆర్‌కు ఉందా?'



సాక్షి, హైదరాబాద్: ఆత్మహత్య చేసుకున్న ప్రవల్లిక కుటుంబాన్ని ఇంటికెళ్లి పరామర్శించే ధైర్యం మంత్రి కేటీఆర్‌కు ఉందా అని ఏఐసీసీ అధికార ప్రతినిధి డోలీ శర్మ ప్రశ్నించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రవల్లిక మృతిపై పోలీసులు, ప్రభుత్వం వ్యవహరించిన తీరు అవమానకరంగా ఉందని ధ్వజమెత్తారు. తల్లిదండ్రులు రెండు పూటలా భోజనం కూడా లేకుండా పిల్లలను హైదరాబాద్‌కు పంపి చదివిస్తున్నారని, ఇక్కడ ఉద్యోగాల్లేక తల్లిదండ్రుల కష్టాలు చూడలేక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రవల్లిక అన్ని రకాల గ్రూప్స్ పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారని డోలీ శర్మ తెలిపారు. ఈ ప్రభుత్వం పరీక్షలను సరిగా నిర్వహించలేకపోతోందని మండిపడ్డారు. ప్రవల్లిక తల్లిదండ్రులతో రేవంత్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడారని, కాంగ్రెస్ పార్టీ వారి కుటుంబానికి అండగా ఉంటుందని డోలీ శర్మ భరోసా ఇచ్చారు.

మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి కన్నుమూత



భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి హఠాన్మరణం పొందారు. సోమవారం తెల్లవారుజామున రెండు గంటలకు బీపీ తగ్గడం, ఛాతీలో నొప్పివస్తోందని చెప్పడంతో కుటుంబసభ్యులు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు గుండె సంబంధిత వైద్యశాలకు, ఆ తర్వాత ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సత్యవతి మొదట సీపీఎంలో పనిచేశారు. 2009లో దివంగత మహానేత వైఎస్సార్ చొరవతో కాంగ్రెస్ తరఫున భద్రాచలం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో మళ్లీ కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2017 ఆగస్టులో బీజేపీలో చేరిన ఆమె 2018లో పోటీ చేసి ఓడిపోయారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండగానే గుండెపోటుతో మరణించారు. సత్యవతి మృతదేహం వద్ద స్థానిక ఎమ్మెల్యే పొదెం వీరయ్య నివాళులర్పించారు. ఆమె మృతిపట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ,కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ కె.లక్ష్మణ్, ఇతర నేతలు డీకే అరుణ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు.


ప్రవల్లిక ఆత్మహత్యపై న్యాయ విచారణ చేయించాలి

● రాష్ట్ర మానవ హక్కుల సంఘానికి దాసు సురేశ్ ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ప్రవల్లిక ఉదంతంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ చేయించాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం రాష్ట్ర మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓటమి పాలవుతామనే భయంతోనే ప్రభుత్వం ప్రవల్లిక ఉదంతాన్ని తొక్కి పెడుతోందని పేర్కొన్నారు. ఆమె ఆత్మహత్యపై మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు పూర్తి అర్థరహితమని అన్నారు. పోటీ పరీక్షలకు ప్రవల్లిక హాజరు కాలేదన్న మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలను సురేశ్ ఖండించారు. ఆమె కుటుంబాన్ని ఆదుకోవడం చేతకాని ప్రభుత్వం వారి పరువును బజారుకీడ్చే విధంగా అభాండాలు వేయడం గర్హనీయమని అన్నారు. ఘటనాస్థలిలో పోలీసులు తనపై అనుచితంగా ప్రవర్తించారని, దీనికి సంబంధించిన ఆధారాలను దాసు సురేశ్ మానవ హక్కుల కమిషన్‌కు అందించారు.

ప్రవల్లికది ప్రభుత్వ హత్య: కన్హయ్యకుమార్



సాక్షి, హైదరాబాద్: పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ప్రవల్లికది ఆత్మహత్య కాదని, ప్రభుత్వ హత్యని ఎన్ఎస్‌యూఐ ఇన్‌చార్జి కన్హయ్య కుమార్ ఆరోపించారు. సోమవారం గాంధీభవన్‌లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగాలు భర్తీ చేయలేని ప్రభుత్వం బీఆర్ఎస్ అని, పేద విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంటే బీఆర్ఎస్ నేతలు చులకన చేసి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉద్యోగాల భర్తీని ప్రహసనంగా మార్చారని, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు.

SECUNDERABAD CANTONMENT BOARD
Sardar Patel Road, Court Compound, Secunderabad-500 003

PUBLIC NOTICE

This is for the information of the general public that the following transferees have applied for transfer of property as mentioned against their names. Their requests have been processed and the names of the transferees are to be recorded in the tax register as maintained by this office, as per Section 81 of the Cantonments Act., 2006.

Sr. No.	Name of the existing owner as per the tax records. Shri/Smt.	Name of the Transferee. Shri./Smt.	Locality	Sale Deed Doc.No. & Date
1	SHRI K P DASARATH	SHRI KATIPAGA UMA RANI	PNO 10, SANJEEVAIAH NAGAR, BOWENPALLY	SETTLEMENT DEED NO 1195/2019, DT 18-06-2019
2	SMT RAMA DEVI PEACHERI	SHRI Dr NARSINGA RAO PEACHERI S/o LATE SRINIVASA RAO PEACHERI	SY NO 113 AND 115/FNO G2, AMARAVATHI CHS	SETTLEMENT DEED 1199/2023, DT 30-06-2023 (LINK DOCUMENTS)
3	SMT RAMA DEVI PEACHERI	SHRI Dr NARSINGA RAO PEACHERI S/o LATE SRINIVASA RAO PEACHERI	SY NO 113 AND 115/FNO G3, AMARAVATHI CHS	SETTLEMENT DEED 1200/2023, DT 30-06-2023 (LINK DOCUMENTS)
4	SMT RAMA DEVI PEACHERI	SHRI Dr NARSINGA RAO PEACHERI S/o LATE SRINIVASA RAO PEACHERI	SY NO 113 AND 115/FNO 202/SF, AMARAVATHI CHS	SETTLEMENT DEED 1201/2023, DT 30-06-2023 (LINK DOCUMENTS)
5	SMT RAMA DEVI PEACHERI	SHRI Dr NARSINGA RAO PEACHERI S/o LATE SRINIVASA RAO PEACHERI	OP/SY NO 113 and 115/ SHOP NO 2 AMARAVATHI CHS	SETTLEMENT DEED 1202/2023, DT 30-06-2023 (LINK DOCUMENTS)
6	SHRI Y RANGA RAO	SMT TINU SHARMA W/O SURESH SHARMA	FNO G-5/GF, AHALYA APARTMENTS, BOWENPALLY	SALE DEED NO 1570/2012, DT 15-11-2012 (LINK DOCUMENTS)
7	SHRI PRASHANT K, SMT MAYAK	SHRI PRASHANT KOTHARI S/O LATE PRADEEP JAIN KOTHARI	PNO 85/GF/FF, RAVI C H S	RELEASE DEED NO 760/2022, DT 23-04-2022, LEGAL HEIR & DEATH CERTIFICATE OF MAYA KOTHARI
8	SHRI BHOGARAJU NAGA SATYA KESAVA KRISHNA	1. M/S ENARAYAN ELEX INDIA PRIVATE LIMITED REP BY CHETAN GHIA S/O LATE JAYANTILAL GHIA 2. BHAVESH GHIA S/O LATE JAYANTILAL GHIA	FNO G-6/GF, BLOCK A, PRIYA ENCLAVE APARTMENTS, BALANRAI	SALE DEED NO 1271/2022, DT 13-07-2022 (LINK DOCUMENTS)
9	SHRI P THANGASWAMY	1.SHRI SAI GANESH DHATRIKA S/O D VENKAT RAMANA 2. SMT ADITI DHATRIKA W/O SAI GANESH DHATRIKA	FNO G-3/GF, SHIVA ARUN COLONY, MAREDPALLY	SALE DEED NO 910/2020, DT 05-08-2020 (LINK DOCUMENTS)
10	SMT M SUGUNA	1. SHRI NIRMAL KUMAR CHHEJER 2.SMT VANITHA DEVI CHHEJAR	155/P/FNO 308, SANJEEVAIAH NAGAR, BOWENPALLY	SALE DEED NO 662/2010, DT 26/04/2010 SALE DEED NO 1616/1999
11	SMT R UMA	SHRI NUNAVATH YUGANDAR	PNO 125 IN SY NO 194/1, GANDHI NAGAR, RK PURAM	SALE DEED NO 1522/2023, DT 19.08.2023, GIFT DEED 1762/2022 DT 07-10-2022 (LINK DOCUMENT)
12	SHRI P SATYANARAYANA	1. SMT SRIDEVI MACHERLA W/o ANAND MACHERLA 2. KUM AKSHARA MACHERLA (MINOR BY GUARDIAN MOTHER SMT SRIDEVI MACHERLA) 3. MS KALPANA MACHERLA W/o LAKSHMAN RAO	PNO 35, TRIMURTHY WEAKER SECTION II, MAHENDRA HILLS	SALE DEED NO 1531/2023, DT 21-08-2023, (LINK DOCUMENTS)
13	SHRI P J JOHN	SHRI SHIBHU JOHN S/O LATE P J JOHN	PNO 5/FF/B, SANJEEVAIAH NAGAR, VENKAT REDDY COLONY, BOWENPALLY	RELEASE DEED NO 899/2022, DT 16-06-2022 2. DEATH CERTIFICATE OF P J JOHN 3. FAMILY MEMBERS LEGAL HEIRS CERTIFICATE
14	SMT A SRI DEVI	SHRI PRAKASH TILOKANI S/O NISHITHA TILOKANI	PNO 25/1, AMARJYOTHI CHS, BOWENPALLY	SALE DEED NO 585/2022 DT 31-03-2022
15	MRS VIOLA NANADEVAN	1. SHRI N SURENDRAN 2. SHRI N CHANDRAN 3.KUM NAMDLA HYDERABAD	PNO 35 AND 38/GF/FF, SARASWATHI NAGAR, VENT-III	WILL DEED NO 29/B III/15, DT 23-03-2015 (LINK DOCUMENT)
16	SMT V SASHI REKHA	1. M/S ENARAYAN ELEX INDIA PRIVATE LIMITED BY ITS DIRECTORS CHETAN GHIA S/O LATE JAYANTILAL GHIA 2. BHAVESH GHIA S/O LATE JAYANTILAL GHIA	SY NO 25/F NO 208/SF/BLK-A, PRIYA ENCLAVE, AVANTI CLY, BALANRAI RASOOLPURA	SALE DEED NO 1270/2022, DT 13-07-2022, SALE DEED NO 937/2003, DT 02-06-2003
17	SHRI SURENDER MOHAN CHAND	SMT GANGA LAXMI SUDHA W/O GANGA RAMCHANDER	PNO 42, PICKET CO-OP HOUSING SOCIETY	SALE DEED NO 852/2021, DT 17-04-2021, SALE DEED NO 1804/2003 DT 30-08-2023
18	SHRI G SUDHIR KUMAR	M/S COMPUTER BAZAR REP BY ITS PARTNER NIRMAL KUMAR LALWANI S/O SRI BADAL CHAND LALWANI	PNO 36/FNO 309/SF, GANDHAM APARTMENTS, BOWENPALLY	SALE DEED NO 512/1999, DT 27-03-1999, SALE DEED NO 1335/2008, DT 06-09-2008
19	SHRI OM PRAKASH GUPTA, SMT CHANDRA PRABHA GUPTA	SHRI ASHWIN LALWANI S/O ASHOK KUMAR LALWANI	PNO 3/GF/FF/SF/TF, BHAVANA COLONY, BOWENPALLY	SALE DEED NO 818/2022, DT 02-05-2022
20	SMT P VIJAYALAXMI	SHRI MADHU TIWARI S/O SANJAY KUMAR TIWARI	PNO 38/FNO 2/GF, ASHA OFFICERS COLONY, RK PURAM	SALE DEED NO 708/2023, DT 24-04-2023
21	SHRI CH V S N PRASAD	SMT ANNIE SYLVIA DONAL W/O MR HARRY ELIAS ANNY DONAL	FNO 105, AP TEXT BOOK COLONY, (FLATS ON 32/33/34), KARKHANA	SALE DEED NO 1368/2021, DT 23/07/2021 SALE DEED NO 111/2001, DT 22-01-2001
22	SHRI S SRINIVASA RAO	1.SHRI SANGENENI VEERA PANI RAMACHANDRA MARUTH S/O LATE S SRINIVASA RAO 2. SHRI SANGENENI HEMALATHA RAO W/O LATE SRINIVAS RAO 3. SHRI SANGENENI KALYANI SURYA DHANA LAKSHMI D/O LATE S SRINIVASA RAO	PNO 182, GUNROCK ENCLAVE COLONY, KARKHANA	SALE DEED NO 999/ 1982, DT 15-04-1982, LEGAL HEIRS CERTIFICATE DT 17-12-2005 DEATH CERTIFICATE OF SHRI LATE S SRINIVASA RAO
23	SMT A C UMA	SHRI GOGIKAR SURENDER S/O LATE G RAJESHWAR	HNO 25 (NEW NO 2-6-37), SIKH VILLAGE	SALE DEED NO 884/2019, DT 30-04-2019 SALE DEED NO 834/2013, DT 25-04-2013
24	SHRI KESARAM CHOWDARY	SHRI CHAJJARAM CHOUDHARY S/O KESARAM CHOUDHARY	PNO 30/PART, CHANDULAL BOWLI, SIKH VILLAGE	SETTLEMENT DEED NO 1513/2023, DT 19-08-2023
25	SHRI M KRISHNAM RAJU	SMT MUDUNURI PRAVEENA W/O LATE MUDUNURI VIJAY LAKSHMI NARASIMHA RAJU	PNO 3/FNO 202/FF, HANUMANJI CHS, BOWENPALLY	DEATH CERTIFICATE OF SHRI MUDUNURI KRISHNAM RAJU, GIFT SETTLEMENT DEED NO 846/07, DT 03-05-2007 (LINK DOCUMENTS), LEGAL HEIRS CERTIFICATE
26	SHRI DR K SATISH CHANDRA	SHRI MUKKA SAI RAM S/O M JANARDHAN	11/5/101/FF, SIVA ARUN COLONY, MAREDPALLY	SALE DEED NO 1400/2011 DT 22-08-2011
27	SHRI A V SRINIVAS MURTHY	SMT APPANI VANAJA W/O LATE APPANI SATYENDAR	PNO 36/GF/FF/SF AND PNO 36/1/GF/FF/SF, SRI MALANI COLONY, BOWENPALLY	SALE DEED NO 1385/2023, DT 20-07-2023 (LINK DOCUMENTS)
28	SMT PAKALA MANOHARI DEVI	ANIPEDDI RATNASINDHU W/O SHRI VEMURI DURGA TIRIPURA SUNDARESHWAR	FNO 303/TF, S R REDDY APARTMENTS, BOWENPALLY	SALE DEED NO 943/2023, DT 24-05-2023 (LINK DOCUMENTS)
29	SHRI V N ACHARYA	SMT PADMAJA BHASKAR W/O SHRI V BHASKAR	PNO 14, LIC CHS, CHANDULAL BOWLI	SALE DEED NO 1002/09, DT 31-07-2009
30	SHRI VISHWANATH ANIL KUMAR	SMT KASHAMALLA PALLAVI W/O KASHAMALLA NARSING RAO 2. SHRI GRK MOHAN S/O SRI G LAXMI NARAYANA	PNO 39/C/SF, DHANALAKSHMI COLONY, MAHENDRA HILLS	SALE DEED NO 1620/2023, DT 02-09-2023 (LINK DOCUMENT)

Any person having any objection to the above transfer/mutation in the name of the transferee in tax records of this office are required to inform this office in writing within (21) twenty one days of publication of this notice. If no objection is received within this stipulated time, this office will take necessary decision to enter the name of transferee in the tax register of this office.

No. SCB/TB/2344, Office of the Cantonment Board,
Court House Compound, S.P. Road, Secunderabad - 500 003.
Date : 16-10-2023

Sd/-
Chief Executive Officer,
Secunderabad Cantonment Board

SECUNDERABAD CANTONMENT BOARD
Sardar Patel Road, Court Compound, SECUNDERABAD-500 003

NOTICE INVITING AUCTION

The Secunderabad Cantonment Board is inviting applications from interested bidders to participate in Open Auction for the sale of crackers in Secunderabad Cantonment Area.

Sl. No.	Description	No. of Shops / Stalls	Cost of Application Form (including of GST) (in Rs.)	EMD amount per shop (in Rs.)	Dates for sale of Application Forms	Submission of applications with EMD	Date of Auction/ Bid
1.	Permission for sale of crackers on the Class 'C' land in Secunderabad Cantonment area for the year 2023 for a period of 10 days i.e. from 03-11-2023 to 12-11-2023.	25 Stalls/ sheds at various locations	Rs.2,360/- (Application Form: Rs. 2000/- & GST Rs. 360/-)	25,000/-	19th & 20th October, 2023	25th & 26th October, 2023	28th October, 2023

- The Application Form along with terms and conditions can be obtained on payment of **Rs.2,360/-** through online "**secunderabadcantt.gov.in**" by self-generating the challan on scheduled dates as above.
- Auction shall be conducted at office of the Cantonment Board, Secunderabad on scheduled date & time as above.
- The right to accept/reject/cancel any application without assigning any reason whatsoever shall be vested absolutely with the Chief Executive Officer, Cantonment Board, Secunderabad.
- The applications are also invited to erect temporary crackers stalls other than **class 'C' land**, Secunderabad Cantonment area. The applicants are required to get details from the Revenue Section of Cantonment Board during office hours on all working days for obtaining Application Forms on payment.

No. SCB/RS/Crackers/2023/2352
Office of the Cantonment Board,
Court House Compound, S.P.Road,
Secunderabad – 500 003. Date : 16-10-2023

Sd/-
Madhukar Naik D
Chief Executive Officer
Secunderabad Cantonment Board.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WALK-IN INTERVIEWS

Fortune Paints Private limited is one of the leading Paints manufacturing company hiring for both Andhra Pradesh & Telangana States for following Positions.

Executives and Managers- Sales & Marketing Engineers – Site Execution Required

Experience : 02-10 Years (Relevant Industry experience)

technopaints

Shilpa Hills, Kothaguda, Serilingampally Mandal, Hyderabad, TS-500084

9392195556 / 9281499590 & Email:hr.technopaints@gmail.com





గాజా స్ట్రిప్ దిశగా సాయుధ శకటంపై వెళ్తూ విక్టరీ సింబల్ చూపుతున్న ఇజ్రాయెల్ సైనికుడు

మోహరించిన ఇజ్రాయెల్ సేనలు

గాజాపై భూతల దాడులకు సన్నాహాలు

- సరిహద్దుల్లో యుద్ధ ట్యాంకులు, రిజర్వ్ సైనికులు
- పదో రోజుకు చేరిన ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణ
- గాజాలో 2,750 మంది, ఇజ్రాయెల్‌లో 1,400 మందికి పైగా మృతి
- గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులను ఖండించిన ఇరాన్

జెరూసలేం/గాజా స్ట్రిప్/రఫా: గాజాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హమాస్ మిలిటెంట్ల అంతు చూడడంతోపాటు వారి స్థావరాలను నేలమట్టం చేయడమే లక్ష్యంగా భూతల దాడులకు ఇజ్రాయెల్ సైన్యం సన్నద్ధమవుతోంది. సరిహద్దుల్లో భారీ సంఖ్యలో యుద్ధ ట్యాంకులను మోహరించింది. పదాతి దళాలు పూర్తిస్థాయి యుద్ధ సన్నాహాల్లో మునిగిపోయాయి. 3 లక్షలకుపైగా ఇజ్రాయెల్ రిజర్వ్ సైనికులు గాజా సరిహద్దుకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆదేశాల కోసం వారు ఎదురుచూస్తున్నారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం సోమవారం పదో రోజుకు చేరుకుంది. ఈ పోరులో ఇప్పటిదాకా గాజాలో 2,750 మంది పాలస్తీనియన్లు మృతి చెందారని, 9,700 మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. హమాస్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో 1,400 మందికి పైగా మరణించినట్లు తెలిసింది. అతిత్వరలోనే ఉత్తర గాజాపై ఇజ్రాయెల్ సేనలు భూతల దాడులు ప్రారంభిస్తాయని ప్రచారం సాగుతోంది. ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరికలు జారీ చేయడంతో ఉత్తర గాజా నుంచి జనం దక్షిణ గాజాకు వలస బాట పట్టారు. ఇప్పటిదాకా 6 లక్షల మందికిపైగా జనం వెళ్లిపోయినట్లు అంచనా. ఇజ్రాయెల్‌కు సాయంగా మిత్రదేశం అమెరికా పంపించిన అత్యాధునిక యుద్ధవిమాన వాహక నౌకలు మధ్యధరా సముద్రంలో గాజా తీరంలో మోహరించాయి. గాజాను గుప్పిట్లో పెట్టుకొని తమ భద్రతకు ముప్పుగా పరిణమించిన హమాస్ మిలిటెంట్ గ్రూప్‌ను నామరూపాల్లేకుండా చేయడమే తమ ముందున్న కర్తవ్యమని ఇజ్రాయెల్ సైన్యం తేల్చిచెబుతోంది. గాజాలో ప్రజల కష్టాలకు తెరపడడం లేదు. ఆహారం, నీరు, ఇంధనం కొరత తీవ్రరూపం దాలుస్తోంది. ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో గాయపడిన వేలాది మంది ఆసుపత్రుల్లో చేరారు. ఆసుపత్రుల్లో వారి పరిస్థితి మరింత హృదయవిదారకంగా మారింది. చికిత్సలు ఆగిపోవడంతో బాధితులు ప్రాణాలు కోల్పోతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. మృతదేహాలను భద్రపర్చడానికి ప్లాస్టిక్ బ్యాగ్‌లు కూడా లేవని వాపోతున్నారు.

హమాస్ చేతిలో బందీలు 199 మంది

గాజాలో హమాస్ మిలిటెంట్ల చేతిలో ప్రస్తుతం 199 మంది బందీలు ఉన్నారని ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగారీ సోమవారం వెల్లడించారు. దాదాపు 150 మంది బందీలు ఉన్నట్లు ఇప్పటిదాకా భావించామని, కానీ, 199 మంది ఉన్నట్లు తేలిందని చెప్పారు. బందీల్లో చాలామంది ఇజ్రాయెల్ సైనికులు, మహిళలు, చిన్నారులు ఉన్నారని పేర్కొన్నారు. అయితే, బందీల్లో విదేశీయులు ఉన్నారో లేదో ఆయన

వైమానిక దాడులు నిలిపివేస్తే బందీలు విడుదల

గాజా స్ట్రిప్‌పై వైమానిక దాడులను ఇజ్రాయెల్ నిలిపివేస్తే బందీలను విడుదల చేయడానికి హమాస్ సిద్ధంగా ఉందని ఇరాన్ విదేశాంగ శాఖ సోమవారం తెలియజేసింది. కానీ, దీనిపై హమాస్ స్పందించలేదు. తమపై దాడులు ఆపడంతోపాటు ఇజ్రాయెల్ జైళ్లలో ఉన్న వేలాది మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేస్తే, అందుకు బదులుగా తమ వద్ద ఉన్న బందీలను విడుదల చేయాలన్న ఆలోచనలో హమాస్ ఉన్నట్లు సమాచారం.

ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దుల్లో....

లెబనాన్ సరిహద్దుల్లో నివసిస్తున్న యూదులంతా వెంటనే అక్కడి నుంచి ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ సైన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. లెబనాన్ సరిహద్దుల సమీపంలో 28 యూదు కాలనీలు ఉన్నాయి. ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దుల్లోనూ యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఇజ్రాయెల్ సైన్యం, లెబనాన్ ప్రభుత్వ మద్దతున్న షియా తీవ్రవాద సంస్థ హెజ్బొల్లా సభ్యుల మధ్య పరస్పరం కాల్పులు జరుగుతున్నాయి. సరిహద్దుల్లో ఇజ్రాయెల్ సైనిక స్థావరాల్లోని నిఘా కెమెరాలను హెజ్బొల్లా సభ్యులు ధ్వంసం చేయడం ప్రారంభించారు. తమ కదలికలను ఇజ్రాయెల్ గుర్తించకుండా ఉండేందుకు వారు ఈ పని చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్–హెజ్బొల్లా మధ్య జరిగిన తాజా ఘర్షణలో ఒక ఇజ్రాయెల్ సైనికుడు, ఒక పౌరుడు మరణించారు. లెబనాన్‌లో ఒక జర్నలిస్టు సహా ముగ్గురు పౌరులు మృతిచెందారు.

నన్ను తీసుకోండి.. బందీలను వదిలేయండి

హమాస్‌కు జెరూసలేం చర్చి కార్డినల్ పియర్‌బటిస్టా వినతి

జెరూసలేం: హమాస్ మిలిటెంట్ల చేతిలో వందలాది మంది ఇజ్రాయెల్ పౌరులు బందీలుగా ఉండడంపై జెరూసలేంలోని రోమన్ క్యాథలిక్ చర్చి మతపెద్ద కార్డినల్ పియర్‌బటిస్టా పిజ్జాబల్లా ఆందోళన వ్యక్తం చేశారు. వారిని క్షేమంగా విడిపించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. తాను బందీగా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. తనను అధీనంలోకి తీసుకొని, బందీలందరినీ విడుదల చేయాలని హమాస్‌కు విజ్ఞప్తి చేశారు. బందీల మార్పిడికి తాను ఉపయోగపడితే సంతోషిస్తానని వివరించారు. చిన్నారులు త్వరగా వారి ఇళ్లకు చేరాలని కోరుకుంటున్నానని తెలిపారు. బందీలకు స్వేచ్ఛా స్వాతంత్య్రాలు లభిస్తే అంతకన్నా తనకు కావాల్సింది ఏమీ లేదని పియర్‌బటిస్టా పిజ్జాబల్లా స్పష్టం చేశారు. ఆయన వినతి పట్ల హమాస్ సానుకూలంగా స్పందిస్తుందా? అంటే అనుమానమేనని ఇజ్రాయెల్ అధికారులు చెబుతున్నారు.



ఇజ్రాయెల్ దాడుల్లో కుప్పకూలిన భవన శిథిలాల మధ్య దిగాలుగా ఓ పాలస్తీనా బాలుడు



గాజా స్ట్రిప్‌లోని నుసైరత్ క్యాంప్ ప్రాంతంలో ఇజ్రాయెల్ వైమానిక దాడిలో దెబ్బతిన్న భవనాన్ని పరిశీలిస్తున్న పాలస్తీనియన్లు

వచ్చేవారం ఇజ్రాయెల్‌కు జో బైడెన్!

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వచ్చేవారం ఇజ్రాయెల్‌లో పర్యటించబోతున్నారని తెలిసింది. ఈ పర్యటన ఇంకా అధికారికంగా ఖరారు కాలేదు. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ అరబ్ దేశాల పర్యటన ముగించుకొని సోమవారం ఇజ్రాయెల్‌కు తిరిగివచ్చారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూతోపాటు అధికారులతో సమావేశమయ్యారు. తాజా పరిణామాలపై చర్చలు జరిపారు.

గాజాపై ఆధిపత్యం పొరపాటే అవుతుంది: బైడెన్

ఇజ్రాయెల్ సేనలు గాజాలో సుదీర్ఘకాలంపాటు ఉండడం పెద్ద పొరపాటుగా పరిణమించే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అభిప్రాయపడ్డారు. గాజాపై యుద్ధం వద్దంటూ ఇజ్రాయెల్‌కు పరోక్షంగా సూచించారు. యుద్ధాల్లో పాటించాల్సిన నియమ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని పేర్కొన్నారు. గాజా ప్రజలకు ఆహారం, నీరు, ఔషధాలు, నిత్యావసరాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఇజ్రాయెల్‌కు హితవు పలికారు. గాజాలో పాలస్తీనియన్ల ఆధ్వర్యంలోనే పాలన కొనసాగాలని తాను ఆశిస్తున్నట్లు బైడెన్ తాజాగా స్పష్టం చేశారు. మొత్తం పాలస్తీనియన్లకు హమాస్ మిలిటెంట్లు ప్రతినిధులు కాదని తేల్చిచెప్పారు. గాజాను ఇజ్రాయెల్ ఎక్కువ కాలం అధీనంలో ఉంచుకుంటుందని తాను భావించడం లేదన్నారు.

మమ్మల్ని పరీక్షించొద్దు: నెతన్యాహూ

తమ దేశ ఉత్తర సరిహద్దుల్లో తమను పరీక్షించవద్దని ఇరాన్, హెజ్బొల్లా సంస్థను ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ హెచ్చరించారు. ఆయన సోమవారం ఇజ్రాయెల్ చట్టసభ 'నెస్సెట్'లో ప్రసంగించారు. హమాస్‌ను ఓడించడానికి ప్రపంచ దేశాలు చేతులు కలపాల్సిన అవసరం ఉందని చెప్పారు. 'ఈ యుద్ధం మీ యుద్ధం' అని అన్నారు. హమాస్ మిలిటెంట్లు నాజీ ముష్కరుల్లాంటివారేనని నెతన్యాహూ తేల్చిచెప్పారు.

దాడులు ఆపకపోతే అన్ని చేతులూ ట్రిగ్గర్‌పైనే: ఇరాన్

గాజాపై కొనసాగుతున్న ఇజ్రాయెల్ వైమానిక దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. పాలస్తీనియన్లపై దురాక్రమణను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. లేనిపక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. దురాక్రమణ సాగిస్తున్న ఇజ్రాయెల్‌పై కఠిన చర్యలు తీసుకునేందుకు తమ ప్రాంతంలో అందరూ సిద్ధంగా ఉన్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి హుస్సేన్ అమీరబ్దొల్లాహియాన్ స్పష్టం చేశారు. గాజాపై దాడులు ఆపకపోతే అన్ని చేతులూ ట్రిగ్గర్‌పైనే ఉంటాయని, ఇజ్రాయెల్‌కు గుణపాఠం తప్పదని తేల్చిచెప్పారు. గాజాలో సాధారణ పౌరులపై జరుగుతున్న అనాగరిక దాడులను వెంటనే ఆపాలని అమెరికాకు ఇరాన్ సూచించింది. గాజాపై వైమానిక దాడులు ఆపకపోతే తాము ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగాల్సి వస్తుందని ఇజ్రాయెల్‌కు ఇరాన్ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది.

బందీలను వెంటనే విడుదల చేయాలి: ఐరాస

బందీలందరినీ బేషరతుగా వెంటనే విడుదల చేయాలని హమాస్ మిలిటెంట్లకు ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటేరస్ హితవు పలికారు. అలాగే గాజా స్ట్రిప్‌కు ఆహారం, నీరు, ఔషధాల సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలని సోమవారం ఇజ్రాయెల్‌కు సూచించారు. ప్రపంచ దేశాల నుంచి పాలస్తీనియన్లకు మానవతా సాయం అందేలా ఆంక్షలు తొలగించాలని, సరిహద్దులు తెరవాలని అన్నారు. సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోవడం హర్షించదగ్గ పరిణామం కాదని చెప్పారు. ఈజిప్టు, జోర్డాన్, వెస్ట్‌బ్యాంకు నుంచి నిత్యావసరాలు పాలస్తీనియన్లకు అందేలా ఇజ్రాయెల్ చొరవ తీసుకోవాలని కోరారు.

ఘర్షణ ఆగిపోవాలి: రిషి సునాక్

ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణ మరింత విస్తరించవద్దని కోరుకుంటున్నానని బ్రిటిష్ ప్రధానమంత్రి రిషి సునాక్ చెప్పారు. ఘర్షణ ఆగిపోవాలని, ఇందుకోసం తన వంతు కృషి చేస్తానని, ఈ దిశగా ప్రపంచ దేశాల అధినేతలతో కలిసి పని చేస్తానని వివరించారు. రిషి సునాక్ తాజాగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూతో ఫోన్‌లో మాట్లాడారు. జోర్డాన్ రాజు అబ్దుల్లాతో లండన్‌లో సమావేశమయ్యారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంపై వారితో చర్చించారు. సామాన్య ప్రజలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఇజ్రాయెల్‌కు రిషి సునాక్ సూచించారు.

ఢిల్లీ మద్యం కేసు.. నిందితుల జాబితాలో ఆప్!

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో అక్కడి పాలక పార్టీ ఆప్‌ను మరిన్ని సమస్యలు చుట్టుముట్టేలా కన్పిస్తున్నాయి. దీనికి సంబంధించిన అవినీతి, మనీ లాండరింగ్ కేసుల్లో ఆప్‌ను కూడా నిందితుల జాబితాలో చేర్చే విషయమై ఆలోచన చేస్తున్నట్టు సీబీఐ, ఈడీ పేర్కొన్నాయి. వాటి తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు సోమవారం సుప్రీంకోర్టుకు ఈ మేరకు నివేదించారు. అవినీతి వ్యతిరేక చట్టం, నగదు అక్రమ తరలింపు (నిరోధక) చట్టంలోని సెక్షన్ 70 ప్రకారం ఈ చర్య తీసుకోదలచినట్టు వివరించారు. అయితే సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్న కేసుల్లో ఆప్‌పై ప్రత్యేక అభియోగాలు మోపుతారా అన్న విషయమై మంగళవారం స్పష్టత ఇవ్వాల్సిందిగా ఆయనకు ధర్మాసనం సూచించింది. మద్యం విధానం కేసులో అరెస్టై జైల్లో ఉన్న ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం, ఆప్ నేత మనీశ్ సిసోడియా బెయిల్ పిటిషన్లపై వాదనల సందర్భంగా ఏఎస్జీ ఈ మేరకు ప్రకటన చేశారు.

సిసోడియాను నిరవధికంగా జైల్లో ఉంచలేం

న్యూఢిల్లీ: ఎక్సైజ్ పాలసీ కేసులను ఎదుర్కొంటున్న ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను నిరవధికంగా జైల్లో ఉంచలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. మనీష్ సిసోడియా పెట్టుకున్న బెయిల్ పిటిషన్లపై జస్టిస్ సంజయ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిల ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం..సిసోడియాపై మోపిన అభియోగాలపై దిగువ కోర్టులో వాదనలు ఎప్పుడు ప్రారంభమవుతాయంటూ సీబీఐ, ఈడీల తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజును ప్రశ్నించింది. 'సిసోడియాను ఈ విధంగా మీరు సుదీర్ఘ కాలం కటకటాల వెనుక ఉంచలేరు. ఒక కేసులో చార్జిషీటు వేశాక ఆ వెంటనే వాదనలు మొదలవ్వాలి. ఇప్పటిదాకా మీరు వాదనలను ఎందుకు ప్రారంభించలేదు? ఎప్పుడు మొదలవుతాయి? మాకు ఈ విషయం రేపటి(మంగళవారం) కల్లా చెప్పండి' అని ధర్మాసనం ఎస్వీ రాజును ఆదేశించింది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ కింద సిసోడియాను ప్రాసిక్యూట్ చేయడానికి ముందుగా అనుమతి తీసుకున్నారా అని ధర్మాసనం ప్రశ్నించగా, రాజు అవునని బదులిచ్చారు. ఈ కేసులో మంగళవారం కూడా వాదనలు కొనసాగనున్నాయి. మార్చి 9వ తేదీన సిసోడియాను ఈడీ అధికారులు అరెస్ట్ చేసి, తీహార్ జైలులో ఉంచిన విషయం తెలిసిందే.

ఎంబీబీఎస్ విద్యార్థులకు స్టైపెండ్ చెల్లించండి

న్యూఢిల్లీ: దేశంలో 70 శాతం వైద్య కళాశాలలు ఎంబీబీఎస్ విద్యార్థులకు సక్రమంగా స్టైపెండ్ చెల్లించకపోవడంతో సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంత జరుగుతున్నా జాతీయ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) ఏం చేస్తోందని నిలదీసింది. స్టైపెండ్ చెల్లించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ప్రైవేట్ మెడికల్ కాలేజీ విద్యార్థుల నుంచి భారీగా డొనేషన్లు, క్యాపిటేషన్ ఫీజులు వసూలు చేస్తుంటాయని పేర్కొంది. ఎంబీబీఎస్ విద్యార్థులు నిర్బంధ కార్మికులు కాదని తేల్చిచెప్పింది. వారికి తక్షణమే స్టైపెండ్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎన్ఎంసీని ఆదేశించింది.



సురేంద్ర కోలీ



మణీందర్ సింగ్ పంధేర్

నిఠారి వరుస హత్యల కేసులో దోషులకు విముక్తి

అలహాబాద్ హైకోర్టు తీర్పు ● సరైన సాక్ష్యాధారాలు లేవని వ్యాఖ్య

ప్రయాగ్‌రాజ్/న్యూఢిల్లీ: 2006 నాటి నిఠారి వరుస హత్యల కేసులో నిందితులుగా మణీందర్ సింగ్ పంధేర్, పని మనిషి సురేంద్ర కోలీలకు అలహాబాద్ హైకోర్టు విముక్తి కల్పించింది. వారికి వ్యతిరేకంగా సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంది. నోయిడాలోని ఓ బంగ్లా వెనుక 8 మంది చిన్నారుల ఎముకలు కనిపించడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ ఇద్దరూ కలిసి పలువురు బాలికలపై లైంగికదాడికి, దారుణ హత్యలకు పాల్పడటంతోపాటు నరమాంస భక్షకులుగా మారినట్లు కూడా ఆరోపణలొచ్చాయి. అత్యాచారం, హత్య నేరాలకు పాల్పడిన వీరిద్దరికీ ఘజియాబాద్‌లోని సీబీఐ కోర్టు ఉరిశిక్ష విధించింది. దీనిని సవాల్ చేస్తూ పంధేర్, కోలీలు వేసిన పిటిషన్లను జస్టిస్ అశ్వనీ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్‌హెచ్ఏ రిజ్వీల ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఎటువంటి సందేహాలకు తావు లేకుండా వీరిద్దరికీ వ్యతిరేకంగా కేసును నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైనట్లు ధర్మాసనం పేర్కొంది. అలహాబాద్ హైకోర్టు తాజా తీర్పుతో పంధేర్ జైలు నుంచి విడుదలయ్యేందుకు మార్గం సుగమమైందని ఆయన లాయర్ మనీషా భండారి చెప్పారు. అయితే, మరో కేసులో జీవిత ఖైదు శిక్షపడిన కోలీ మాత్రం జైలులోనే ఉంటాడని అన్నారు. తీర్పు ప్రతి అందాక తదుపరి చర్యపై నిర్ణయం తీసుకుంటామని సీబీఐ అధికారి ఒకరు తెలిపారు.2007లో పంధేర్, కోలీలపై 19 కేసులు నమోదయ్యాయి. అయితే, సాక్ష్యాలు దొరకలేదంటూ మూడు కేసుల్లో మాత్రమే సీబీఐ అభియోగ పత్రాలు నమోదు చేయగలిగింది. మిగతా 16 కేసులకుగాను మూడు కేసుల నుంచి కోలీ బయటపడ్డాడు. ఒక కేసులో విధించిన మరణశిక్షను కోర్టు జీవిత ఖైదుగా మార్చింది. కోలీకి విధించిన మరణశిక్షను జీవితఖైదుగా మార్చడాన్ని సవాల్ చేస్తూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. తాజాగా అలహాబాద్ కోర్టు తీర్పుతో 12 కేసుల నుంచి అతడికి విముక్తి లభించింది. అదే సమయంలో, పంధేర్‌పై ఉన్న ఆరు కేసుల్లో, ఒకటి సీబీఐ వేసింది కాగా, మరో అయిదు బాధితుల కుటుంబాలవి. గతంలో సెషన్స్ కోర్టు అతడిపై ఉన్న మూడు కేసులను కొట్టివేసింది. మిగతా మూడింటిలో 2009లో ఒకటి, తాజాగా అలహాబాద్ కోర్టు తీర్పుతో రెండు కేసుల నుంచి పంధేర్ బయటపడినట్లయిందని అతడి లాయర్ చెప్పారు. కోలీ ఘజియాబాద్ కారాగారంలో, అతడి మాజీ యజమాని పంధేర్ నోయిడా జైల్లో ఉన్నారు.

చీలిక దిశగా జేడీ(ఎస్)?

- ఎన్డీఏతో పొత్తుపై పొరపొచ్చాలు
- దానితో జత కట్టేందుకు వీల్లేదు
- కర్ణాటక జేడీ(ఎస్) చీఫ్ ఇబ్రహీం
- తమదే అసలు పార్టీ అని వాదన

బెంగళూరు: మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ సారథ్యంలోని జనతాదళ్ (సెక్యులర్) చీలిక దిశగా సాగుతున్నట్టు కన్పిస్తోంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకోవాలన్న ఆయన నిర్ణయాన్ని పార్టీ కర్ణాటక విభాగం అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి సి.ఎం.ఇబ్రహీం బాహాటంగా వ్యతిరేకించారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమిలో తాను చేరబోయేది లేదని ఆయన సోమవారం కుండబద్దలు కొట్టారు. పైగా తమ వర్గమే సిసలైన జేడీ(ఎస్) అని ఆయన చెప్పుకొచ్చారు! ''దేవెగౌడ, ఆయన తనయుడు, మాజీ సీఎం కుమారస్వామి బీజేపీతో జట్టు కట్టాలనుకుంటే అది వారిష్టం. మేం మాత్రం అందుకు మద్దతిచ్చేదే లేదు'' అని స్పష్టం చేశారు. తద్వారా పార్టీలో చీలిక తప్పదని సంకేతాలిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుని హోదాలో కర్ణాటక విభాగం విషయమై ఏ నిర్ణయమైనా తీసుకునేందుకు తనకు సర్వాధికారాలూ ఉన్నాయని తేల్చి చెప్పారు. బీజేపీతో పొత్తులను వ్యతిరేకిస్తూ పొరుగు రాష్ట్రాల్లో ఎందరో నేతలు పార్టీని వీడారని దేవెగౌడకు ఆయన గుర్తు చేశారు. కనుక బీజేపీతో పొత్తు యోచన మానుకోవాలని సూచించారు. ''జేడీ(ఎస్) ఎప్పటికీ ఎన్డీఏతో కలవరాదనేదే మా తొలి నిర్ణయం. ఇక ఈ పొత్తుకు దేవెగౌడ అస్సలు అనుమతించరాదన్నది మా రెండో నిర్ణయం'' అని పార్టీ నేతలతో భేటీ అనంతరం ఇబ్రహీం మీడియాకు తెలిపారు.



ఇబ్రహీం

ఆ ఊపిరి ఆపలేం!

- 26 వారాల గర్భాన్ని తొలగించడం కుదరదు
- గర్భిణి పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: 26 వారాల ఐదు రోజుల వయసున్న గర్భాన్ని తొలగించుకునేందుకు ఓ వివాహిత పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ''ఆమె ప్రసవానంతర కుంగుబాటుతో బాధపడుతుండటం వాస్తవమేనని ఎయిమ్స్ మెడికల్ బోర్డు తేల్చింది. అయితే గర్భస్థ శిశువు బాగానే ఉందని, ఆరోగ్యపరంగా అసాధారణ పరిస్థితులేమీ లేవని బోర్డు స్పష్టం చేసింది. ఆమె వాడుతున్న మందులు కూడా పిండం ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపేవేమీ కావని వెల్లడించింది. అంతేగాక పిండం వయసు వైద్యపరంగా అబార్షన్ (ఎంటీపీ)కి అనుమతించిన 24 వారాల గరిష్ట గడువును కూడా దాటేసింది. కనుక ఈ మేరకు నిర్ణయం తీసుకుంటున్నాం'' అని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం ఈ మేరకు సోమవారం తీర్పు వెలువరించింది. ''ఇప్పుడు అబార్షన్‌కు అనుమతించడం భ్రూణ హత్యతో సమానం. ఎంపీటీ చట్టంలోని 3, 5 సెక్షన్లను ఉల్లంఘించడమే. సదరు మహిళ ఆస్పత్రి ఖర్చులన్నింటినీ ఎయిమ్స్ భరిస్తుంది. చిన్నారిని పెంచుకోవడమా, దత్తతకివ్వడమా అనేది ప్రసవానంతరం తల్లిదండ్రులు నిర్ణయించుకోవచ్చు'' అని స్పష్టం చేసింది. ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా కూడా ఉన్నారు. ఇప్పటికే తనకిద్దరు పిల్లలని, 2022 సెప్టెంబర్‌లో రెండో కాన్పు అనంతరం కుంగుబాటుకు గురయ్యానని పేర్కొంటూ ఓ 27 ఏళ్ల గర్భిణి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మూడో బిడ్డను కని పెంచే శారీరక, ఆర్థిక, భావోద్వేగపరమైన స్తోమత లేనందున అబార్షన్‌కు అనుమతించాలని కోరింది. ఆమెను పరీక్షించిన ఎయిమ్స్ బృందం నివేదిక ఆధారంగా ఆమె 26 వారాల గర్భాన్ని తొలగించుకునేందుకు అక్టోబర్ 9న సుప్రీంకోర్టు అనుమతించడం తెలిసిందే. ఈ తీర్పును వెనక్కు తీసుకోవాలంటూ కేంద్రం పిటిషన్ వేసింది. పిండం బాగానే ఉందని, చక్కగా ఎదిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని పేర్కొంటూ ఎయిమ్స్ బృందంలోని ఒక వైద్యుడు సుప్రీంకోర్టుకు అక్టోబర్ 6న పంపిన ఈ మెయిల్‌ను ఉటంకించింది. ఈ నేపథ్యంలో దీనిపై పునర్విచారణ జరిపిన జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ బి.వి. నాగరత్న ద్విసభ్య ధర్మాసనం తొలుత అబార్షన్‌కు అనుమతించినా, బుధవారం భిన్నమైన తీర్పు వెలువరించింది. దాంతో కేసు సీజేఐ ధర్మాసనం ముందుకొచ్చింది.

చట్టమూ అంగీకరించదు...

వివాహితలకు అబార్షన్ చేసుకునేందుకు ఎంటీపీ చట్టం ప్రకారం అనుమతించిన గరిష్ట గడువు 24 వారాలు. అత్యాచార బాధితులు, దివ్యాంగులు, మైనర్ల వంటి బాధిత మహిళలకు ఇందుకు మినహాయింపు ఉంటుంది. ఈ గడువును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విడిగా విచారిస్తామని సీజేఐ ధర్మాసనం స్పష్టం చేసింది.

లూటీకి మాత్రమే కాంగ్రెస్ గ్యారెంటీ

బీజేపీ చీఫ్ జేపీ నడ్డా వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీపై బీజేపీ చీఫ్ జేపీ నడ్డా నిప్పులు చెరిగారు. ఆ పార్టీ లూటీకి మాత్రమే గ్యారెంటీ ఇస్తుందని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారానికి అవసరమైన డబ్బు వసూళ్ల కోసం కర్ణాటకను ఆ పార్టీ ఏటీఎంలా మార్చేయడం సిగ్గు చేటన్నారు. కర్ణాటకలోని కొందరు కాంట్రాక్టర్ల నివాసాలపై దర్యాప్తు సంస్థల్లో సుమారు రూ.100 కోట్ల అక్రమసొత్తును బయటపడినట్లుగా వచ్చిన వార్తలపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అవినీతి డీఎన్ఏకి ఇది ఒక చిన్న మచ్చుతునక మాత్రమేనని ఆయన సోమవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. కాంగ్రెస్ మద్దతుదారులైన ఈ కాంట్రాక్టర్లే గత బీజేపీ ప్రభుత్వం కమీషన్లు వసూలు చేస్తోందంటూ ఆరోపణలు చేశారని ఆయన గుర్తు చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అవినీతి పెచ్చుమీరిందని ఆరోపించారు.'కాంగ్రెస్, అవినీతి ఒకే నాణేనికి రెండు పార్శ్వాలు. ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లను కూడా కాంగ్రెస్ అవినీతికి ఏటీఎంలుగా మార్చుకుంది. ఇప్పుడు తెలంగాణ, మధ్యప్రదేశ్‌లను కూడా ఏటీఎంలుగా మార్చి ప్రజా సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధికి ఉద్దేశించిన ధనాన్ని దోచుకోవాలని కలలుగంటోంది. కాంగ్రెస్ లూటీకి మాత్రమే గ్యారెంటీ ఇవ్వగలదు' అని నడ్డా ఆరోపించారు. హామీలు ఇవ్వడంలో ఆరితేరిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఓ అడుగు ముందుకేసి హామీలకు బదులు గ్యారెంటీలిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు.

ఎలక్టోరల్ బాండ్లపై విస్తృత ధర్మాసనం

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీల నిధుల సమీకరణ కోసం చేసే ఎలక్టోరల్ బాండ్ల జారీ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణకు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించింది. దీనిపై దాఖలైన 4 ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై అక్టోబర్ 31, నవంబర్ 1 తేదీల్లో ధర్మాసనం తుది విచారణ జరపనుంది. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం సోమవారం ఈ మేరకు పేర్కొంది. దీన్ని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారిస్తుందని తొలుత ధర్మాసనం పేర్కొనడం తెలిసిందే. ''కానీ విషయ తీవ్రత, ప్రాధాన్యం దృష్ట్యా సుప్రీంకోర్టు కార్యకలాపాలను నియంత్రించే ఆర్టికల్145(4) ప్రకారం కనీసం ఐదుగురు జడ్జిల ధర్మాసనం దీనిపై వాదనలు ఆలకిస్తుంది'' అని తాజాగా వివరించింది. 2024 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎలక్టోరల్ బాండ్ల పథకం మళ్లీ తెరపైకి రాకముందే ఈ కేసును తేల్చేయాలని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అక్టోబర్ 10న ధర్మాసనాన్ని అభ్యర్థించారు. బాండ్ల ద్వారా ఇలాంటి అనామక నిధుల ప్రవాహం ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా జరిగి దేశం అవినీతిరహితంగా మారాలన్న ఆశయానికి తూట్లు పొడుస్తోందని ఆయన ఆరోపించారు. దాంతో ఈ పిటిషన్లపై విచారణను అక్టోబర్ 31న మొదలు పెట్టి నవంబర్ 1కల్లా ముగిస్తామని ధర్మాసనం ప్రకటించింది.

2018లో తెరపైకి...

పార్టీల నిధుల సమీకరణలో పారదర్శకత కోసమని 2018 జనవరి 2న కేంద్రం ఈ ఎలక్టోరల్ బాండ్ల పథకం తెచ్చింది. దీని ప్రకారం పార్టీలు నగదుకు బదులుగా బాండ్ల రూపంలో విరాళాలు స్వీకరిస్తాయి. భారత పౌరులు, సంస్థలు బాండ్లను కొనుగోలు చేయవచ్చు. ఈ రూపంలో పార్టీలకు ఇప్పటిదాకా ఏకంగా రూ.12,000 కోట్లు అందాయని పిటిషన్‌దారుల్లో ఒకరు పేర్కొన్నారు. వీటిలో మూడింట రెండొంతుల మొత్తం ఒకే పార్టీకి చేరిందన్నారు! ఎలక్టోరల్ బాండ్ల సేకరణపై నిషేధం విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలన్న విజ్ఞప్తిని సుప్రీంకోర్టు రెండు సార్లు తోసిపుచ్చింది.

ఐటీ సోదాల్లో రూ.102 కోట్ల సొత్తు స్వాధీనం

న్యూఢిల్లీ: కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న సోదాల్లో ఇప్పటి వరకు రూ.102 కోట్ల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సోమవారం ఆదాయ పన్ను(ఐటీ)శాఖ తెలిపింది. ఈ నెల 12వ తేదీ నుంచి బెంగళూరు సహా 55 ప్రాంతాల్లో దాడులు జరిపి లెక్కల్లో చూపని రూ.94 కోట్ల నగదుతోపాటు రూ.8 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాలు, 30 ఖరీదైన విదేశీ తయారీ గడియారాలు కలిపి మొత్తం రూ.102 కోట్ల సొత్తును పట్టుకున్నామని వివరించింది. అక్రమ సొత్తుకు సంబంధించి డాక్యుమెంట్ల హార్డు కాపీ, డిజిటల్ డేటా తదితర సాక్ష్యాధారాలను కూడా చేజిక్కించుకున్నామని తెలిపింది. బోగస్ కొనుగోలు రసీదుల ద్వారా భారీగా పన్ను ఎగవేతకు గురైనట్లు కూడా గుర్తించామంది.

సాక్షి, హైదరాబాద్

ఆకాశంలో సగభాగం అంటూ మహిళలను పొగడటం తప్ప అవకాశాలపరంగా వెనుకబాటులో ఉన్నారు. ఉమ్మడి ఏపీ నుంచి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు దాదాపు 71 ఏళ్ల కాలంలో మహిళలు ప్రాతినిధ్యం వహించని అసెంబ్లీ నియోజకవర్గాలు అనేకం ఉన్నాయి. 1952లో అసెంబ్లీ ఎన్నికలు మొదలు 2018 ఎన్నికల వరకు రాష్ట్రంలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళల ప్రాతినిధ్యం పరిశీలిస్తే కేవలం 51 సెగ్మెంట్లలోనే అడపాదడపా కనిపించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ స్థానాల్లో 70 స్థానాల్లో ఇప్పటివరకు మహిళల ప్రాతినిధ్యమే లేకపోవడం గమనార్హం. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు బరిలోకి దిగిన సందర్భాలు అత్యంత పరిమితంగానే ఉన్నాయి.


ఒక్కసారి కూడా మహిళా ప్రాతినిధ్యం లేని స్థానాలు..: చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, బోధన్, నిజామాబాద్ అర్బన్, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, రామగుండం, మంథని, పెద్దపల్లి, కరీంనగర్, వేములవాడ, మానకొండూరు, హుజూరాబాద్, హుస్నాబాద్, సిద్దిపేట, నారాయణఖేడ్, సంగారెడ్డి, పటాన్‌చెరు, దుబ్బాక, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్బీనగర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, వికారాబాద్, తాండూరు, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, నాంపల్లి, కార్వాన్, గోషామహల్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాఖుత్‌పుర, కొడంగల్, నారాయణపేట్, మహబూబ్‌నగర్, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, సూర్యాపేట, మునుగోడు, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, వరంగల్ వెస్ట్, వర్ధన్నపేట, భూపాలపల్లి, పినపాక, పాలేరు, మంథని, వైరా, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట, సనత్‌నగర్, బహదూర్‌పురా.

ఉమెన్‌కు పవర్ పరిమితమే

51 సెగ్మెంట్లలో అడపాదడపా చాన్స్..

2009లో అత్యధికంగా 15 మంది మహిళలు శాసనసభలోకి..

రాష్ట్ర ఏర్పాటు తర్వాత గెలిచిన మహిళా ఎమ్మెల్యేలు 10 మందిలోపే..



1952 నుంచి 2018 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఎమ్మెల్యేల ప్రాతినిధ్యమిదీ...

రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఇలా..

- 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 8 మంది మహిళలే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. వారిలో కాంగ్రెస్ నుంచి జె.గీతారెడ్డి, డీకే అరుణ విజయం సాధించగా టీఆర్‌ఎస్ నుంచి అజ్మీరా రేఖ, బొడిగె శోభ, గొంగిడి సునీత, కొండా సురేఖ, కోవా లక్ష్మి, పద్మాదేవేందర్‌రెడ్డి గెలుపొందారు.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన మహిళల సంఖ్య ఆరుకు తగ్గింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున సీతక్క (అనసూయ), సబితారెడ్డి, బానోత్ హరిప్రియ గెలుపొందగా, టీఆర్‌ఎస్ నుంచి అజ్మీరా రేఖ, గొంగిడి సునీత, పద్మాదేవేందర్‌రెడ్డి విజయం సాధించారు.

మహిళా రిజర్వేషన్లతోనే..

చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలనే డిమాండ్ కొన్నేళ్లుగా వినిపిస్తోంది. ఇందులో భాగంగా పార్లమెంట్‌లో మహిళా బిల్లు కోసం ఎన్నో పోరాటాలు జరిగాయి. తాజాగా మహిళా బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనేది ఈ చట్టం సారాంశం. అన్ని స్థానాల్లో మహిళలకు అవకాశం లభించేలా రొటేషన్ పద్ధతిని ఈ చట్టంలో పొందుపరిచారు. 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల నుంచి ఈ చట్టం అమల్లోకి రానుంది. రాష్ట్రంలో సగానికిపైగా అసెంబ్లీ స్థానాల్లో మహిళలకు ఇప్పటివరకు అవకాశం దక్కకపోగా, వచ్చే అసెంబ్లీ ఎన్నికలతో మహిళా రిజర్వేషన్లు అమలైతే వారి ప్రాతినిధ్యం అమాంతం పెరగనుంది.

తొలి ఓటరు రంభాబాయి

కాగజ్‌నగర్ రూరల్: కుమురం భీం జిల్లా సిర్పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని కాగజ్‌నగర్ మండలం మాలిని గ్రామ పంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రాన్ని రాష్ట్రంలో మొదటి పోలింగ్ కేంద్రంగా గుర్తించారు. ఫలితంగా ఈ గ్రామానికి చెందిన ఆత్రం రంభాబాయికి తొలి ఓటరుగా అవకాశం దక్కింది. గతంలో సుర్పం మారుబాయి తొలి ఓటరుగా ఉండగా, ఇటీవల ఎన్నికల అధికారులు ఇంటి నంబరు ఆధారంగా ఓటరు జాబితాను సవరించగా రంభాబాయి రాష్ట్రంలో తొలి ఓటరుగా మారారు. ఈ పోలింగ్ కేంద్రంలో 430 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 208, మహిళలు 222 మంది ఉన్నారు. మాలిని పోలింగ్ కేంద్రం కాగజ్‌నగర్‌కు 45 కిలోమీటర్ల దూరంలో గుట్టల మధ్యలో ఉంటుంది. అక్కడికి వెళ్లాలంటే సిర్పూర్(టీ) మండల కేంద్రం నుంచి చీలపెల్లి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.

సమస్యలతో సతమతం ..: మాలినిగ్రామానికి సరైన రోడ్డు లేదు. రాళ్లురప్పలతో కంకర తేలిన రోడ్డు ఉండడంతో జనం అవస్థలకు గురవుతున్నారు. సిర్పూర్(టీ) నుంచి మాలిని గ్రామానికి వెళ్లే మార్గమధ్యంలో రెండు ఒర్రెలపై కల్వర్టులు లేకపోవడంతో వర్షాకాలంలో వాహనాలు వెళ్లలేని పరిస్థితి.. మిషన్ భగీరథ పైపులు వేసినప్పటికీ నల్లాల్లో నీరు రావడం లేదు. గ్రామంలోని చేదబావికి మోటార్లు బిగించుకుని దాహార్తి తీర్చుకుంటున్నారు. అడవి మధ్యలో ఉన్న ఈ గ్రామంలో సిగ్నల్ వ్యవస్థ లేకపోవడంతో ఫోన్లు కూడా పనిచేయవు.



ప్రతీసారి ఓటు వేస్తున్నా...

నాకు ఓటుహక్కు వచ్చినప్పటి నుంచి వినియోగించుకుంటున్నా. రాష్ట్రంలో తొలి ఓటరుగా చోటు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా. అయితే మా ఊరిలో కనీస సౌకర్యాలు లేక బాధపడుతున్నాం. అధికారులు, నాయకులు పట్టించుకుని సౌకర్యాలు కల్పించాలి.

– రంభాబాయి, మాలిని



మాలిని గ్రామం

మేకల కల్యాణ్ చక్రవర్తి

ఎన్నికలు, రాజకీయాలు ఆర్థికాంశాలతోనే ముడిపడి ఉంటాయని.. ప్రజల ఆర్థిక ప్రయోనాలే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నికల ఎజెండాలు అవుతాయని ప్రముఖ ఆర్థిక నిపుణుడు, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ అందె సత్యం స్పష్టం చేశారు. అయితే రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత హామీలన్నీ అనుచితమేమీ కావని.. కొన్ని పైకి ఉచితంగానే కనిపిస్తున్నా ఉత్పత్తిని పెంచే సాధకాలుగా ఉపయోగపడతాయనే అభిప్రాయపడ్డారు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం కన్నా.. ప్రజలను కొనుగోలు చేయడంపై రాజకీయ పార్టీలు దృష్టి పెట్టడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఎన్నికలు, ప్రజల ఎజెండా, ఆర్థిక ప్రయోజనాలు, వాటి ప్రభావం, రాజకీయాల్లో వచ్చిన మౌలిక మార్పులపై అందె సత్యం 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలివీ..



Interview

ఆర్థిక నిపుణుడు అందె సత్యం

ఉచితాలన్నీ.. అనుచితమేం కాదు

- టీవీలు, మిక్సీలు ఫ్రీగా ఇస్తే నష్టం.. వ్యవసాయానికి సాయం చేస్తే ఉత్పత్తికి తోడ్పాటు
- అమెరికాలో పదేళ్లుగా వ్యవసాయంలో సగం ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంది
- అయినా అక్కడ రైతుల సంఖ్య 60 లక్షల నుంచి 20 లక్షలకు తగ్గింది
- ఆకలి సూచీలు పెరుగుతున్న వేళ నగదు సాయం ప్రజలకు మేలు చేస్తుంది
- ఆరోగ్యం, విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారానే కేరళలో పేదరికం తగ్గింది
- ఎన్నికల్లో ప్రలోభాలు ప్రకటించడమంటే ప్రజాభిప్రాయాన్ని హైజాక్ చేయడమే
- జమిలి ఎన్నికల ప్రతిపాదన అధ్యక్ష తరహా పాలనకు దారితీస్తుందని వ్యాఖ్య

● ఎన్నికలకు, ఆర్థిక ప్రయోజనాలకు అసలు సంబంధమేంటి?

ఎన్నికల్లో ఒక భాగం రాజకీయాలైతే, మరో భాగం ఆర్థికఅంశాలు. ఎత్తుగడలు, పొత్తులు, విధానాలు రాజకీయ అంశాలైతే.. ఎన్నికల ప్రణాళికకు సంబంధించినవి ఆర్థికాంశాలు. ఎన్నికల ప్రణాళికల్లో సంక్షేమం, ఉచితాలు ప్రాధాన్యత సంతరించుకుంటాయి. సంక్షేమంతోపాటు ఉత్పత్తిని పెంచే విధానాలూ ఉంటాయి. ఓట్ల కోసం ఉచిత హామీలు ఉంటాయి.

● ఉచితాలు సరికాదనే చర్చపై మీ అభిప్రాయం?

తమిళనాడులో మాదిరిగా మిక్సీలు, టీవీలు ఇస్తే అవి ఉచితాల కిందకు వస్తాయి. మన రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ కూడా ఆ దిశలో ఆలోచించడం లేదు. వారి ప్రణాళికల్లో అనుచితాలు లేవు. టీవీ ఇస్తే ప్రజలకు సంక్షేమమేమీ లేదు. ఉత్పత్తి రాదు. కేవలం వినోదం మాత్రమే వస్తుంది. అలాంటివి అనుచితం. అదే పేద కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లిళ్లకు సాయం చేయడం వారు అప్పుల బారినపడకుండా చూడటమే. వీటిని ఉచితాలుగా చూడొద్దు. ఇవి సాంఘిక సంక్షోభానికి పరిష్కార మార్గాల్లాంటివి.

● వ్యవసాయానికి ఆర్థిక సాయం మంచి అంశమేనా?

ఏ దేశంలోనైనా వ్యవసాయం గిట్టుబాటుగా లేదు. చాలా దేశాలు వ్యవసాయాన్ని ప్రోత్సహించి నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. అమెరికాలో దశాబ్దకాలంగా రైతులకు అయ్యే ఖర్చులో సగభాగం సబ్సిడీ ద్వారా ప్రభుత్వమే భరిస్తూ వస్తోంది. అయినా రైతుల సంఖ్య 60 లక్షల నుంచి 20 లక్షలకు తగ్గిందన్న విషయాన్ని గుర్తించాలి. వ్యవసాయానికి అన్నివిధాలా సాయం చేసి నిలబెట్టుకోవడం అవసరం. వ్యవసాయ సబ్సిడీలు, పెట్టుబడి సాయం, ఉచిత విద్యుత్, రుణమాఫీ కచ్చితంగా ఉత్పత్తి కోవలోకే వస్తాయి. ఆ ప్రణాళికల ఫలితం తెలంగాణలో ప్రత్యక్షంగా కనిపిస్తోంది. ఆసరా పెన్షన్లు ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకు ఉపయోగపడతాయి. పేదల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. ఆరోగ్యశ్రీ పథకాలను విస్తృతం చేయడం ద్వారా మానవ వనరుల అభివృద్ధి జరుగుతుంది.

● విద్య, వైద్య రంగాల్లో ఖర్చుతో ప్రయోజనమేనా?

విద్య, వైద్య రంగాల్లో ఖర్చు సమంజసమైనది. వైద్యంపై ఖర్చు జీవన ప్రమాణాలపై ప్రభావం చూపుతుంది. అయితే ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి పార్టీలు మాట్లాడకపోవడం నిరుత్సాహాన్ని కలిగించేదే. ఉన్నత విద్యా రంగంలో డ్రాపౌట్స్ పెరుగుతున్నాయి. నేటికీ దేశంలో 30శాతం మంది మాత్రమే గ్రాడ్యుయేట్లు ఉన్నారు. కాబట్టి విద్యపై ఖర్చు అవసరం. కేరళలో ఆరోగ్య, విద్యా వనరుల కారణంగానే పేదరికం 0.7 శాతానికి తగ్గింది.

● పార్టీలు ఓటర్లను ప్రలోభపెట్టడం..

ఎన్నికల సమయంలో అభ్యర్థులు పెట్టే ఖర్చు కేరళ మినహా దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కువగా ఉంది. తెలంగాణలోనూ అసెంబ్లీ సెగ్మెంట్‌కు రూ.25 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు ఖర్చవుతుందన్న అంచనాలున్నాయి. ఇది ప్రజాభిప్రాయాన్ని హైజాక్ చేయడం, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే.

● రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్న తీరుపై మీ స్పందన?

వ్యవస్థ పూర్తిగా వాణిజ్యపరమైనప్పుడు రాజకీయాలు కూడా వాణిజ్యపరం అవుతాయి. రాజకీయ పార్టీల నాయకులు గతంలో వ్యాపారుల దగ్గర ఆర్థిక సాయం తీసుకునేవారు. ఇప్పుడు రాజకీయ నాయకులే వ్యాపారులయ్యారు. ఈ లక్షణాన్నే ఎన్నికల్లోనూ ఉపయోగిస్తున్నారు.

● జమిలి ఎన్నికలతో...

భారత్‌లో జమిలి ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదు. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వాలు మధ్యంతరంగా కూలిపోయినప్పుడు మళ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి వస్తుంది. జమిలి ఎన్నికల ప్రతిపాదన భవిష్యత్‌లో అధ్యక్ష తరహా పాలనకు దారితీయొచ్చు.

● ప్రజలు ఆర్థిక ప్రయోజనాల కోసం ఇలా ఎదురుచూడాల్సిందేనా?

ఎప్పుడూ ప్రభుత్వాల వద్ద అడుక్కుని లబ్ధి పొందడమే ప్రజల పనిగా మారింది. భూపంపిణీతో పాటు సామాజిక సమస్యలను పరిష్కరించని కారణంగానే ఈ దుస్థితి. ప్రజల కొనుగోలు శక్తిని నిరంతరం పెంచే విధంగా కాకుండా ప్రజలను కొను గోలు చేసి రాజకీయ నాయకులు కుంభకోణాలకు పాల్పడుతున్నారు. అందుకే ఆర్థిక ప్రయోజనాల కోసం ఎన్నికల సమయంలో ప్రజలు పడిగాపులు కాయాల్సి వస్తోంది.

● నగదు బదిలీ పథకాలతో నష్టమా.. లాభమా?

దేశంలో ఆకలి సూచీలు దిగజారిపోతున్నాయి. అంటే కింది స్థాయి పేదలకు ప్రభుత్వాల సాయం అవసరమే. పేదల కొనుగోలు శక్తి కారణంగా ప్రభుత్వానికి పన్నులు వస్తాయి. డిమాండ్, ఉత్పత్తి పెరుగుతాయి. ఇక మన దేశంలో ఉద్యోగులు, కార్మికుల వాటా ఎక్కువ. పాత పింఛన్ ప్రభుత్వాలకు భారమనేది అభివృద్ధి నిరోధక ఆలోచన. బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా పాత పింఛన్ విధానాన్నే అమలు చేస్తున్నాయి.

గాసిప్ టైమ్

హస్తరేఖలకు పసుపు
అసలు నేతలకు ముసుగు

కాంగ్రెస్‌లోకి వస్తున్న టీడీపీ మాజీ నాయకులను చూస్తే అనుమానం కలుగుతోందని ఇది టీపీసీసీనా.. ? టీటీడీపీనా.. ? అని కాంగ్రెస్‌లోని కొంతమంది నాయకులు అభిప్రాయపడుతున్నారట. టీపీసీసీ ముఖ్యుడు గతంలో ఆ పార్టీలో ఉన్న సమయంలో తన సహచరులుగా మెలిగిన అనేక మందిని ఇప్పుడు హస్తం నీడకు తెచ్చేస్తున్నారు. వరంగల్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల నుంచి చాలామందిని టీపీసీసీలోకి తీసుకుని వచ్చేలా కసరత్తు చేస్తూ.... అసలు కాంగ్రెస్ వాదులు బయటకు వెళ్లేందుకు పొగపెడుతున్నారంటూ ఆ పార్టీ వర్గాలు కలత చెందుతున్నాయి. తన చుట్టూరా పాత నేతలే ఎక్కువ ఉండడమేకాక, వారికే అధిక ప్రాధాన్యతనిస్తున్నారని కాంగ్రెస్ నేతలు గుసగుసలాడుతున్నారు. తొలి జాబితాలో తన సహచరులకు టికెట్లు ఇప్పించుకోవడంలో కృతకృత్యుడు అయినట్లు పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో తాను తీసుకొచ్చిన వారికి టికెట్లు ఇప్పించుకున్నారని అంటున్నారు.

ఓట్ దిస్ పాయింట్

బీ ఫారం అంటే ఏమిటి? ఎవరు ఇస్తారు?

- ఎలక్షన్ సింబల్స్ (రిజర్వేషన్ అండ్ అలాట్‌మెంట్) ఆర్డర్, 1968లోని పేరాగ్రాఫ్‌లు 13 (ఏ), (సీ), (ఈ), 13ఏ ప్రకారం జాతీయ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులకు బీ–ఫారంను అందజేస్తాయి. నియోజకవర్గం పేరు, అభ్యర్థి పేరు, తండ్రి/తల్లి/భర్త పేరు, చిరునామా, ప్రత్యామ్నాయ అభ్యర్థి పేరు, తండ్రి/తల్లి/భర్త పేరు, చిరునామా వంటి వివరాలు బీ–ఫారంలో ఉంటాయి. నామినేషన్ల దాఖలుకు చివరి రోజు మధ్యాహ్నం 3 గంటల్లోగా బీ–ఫారంను రిటర్నింగ్ అధికారికి అందజేయాల్సి ఉంటుంది.

ఓటు ప్లాట్‌ఫామ్‌పై వందేభారత్

గౌరిభట్ల నరసింహమూర్తి

ఎన్నికల్లో తొలిసారి 'రైలు' ప్రచారాస్త్రంగా నిలవబోతోంది. గతంలో కొన్ని ప్రాంతాల్లో 'ఇన్ని దశాబ్దాలు గడిచినా మా ప్రాంతానికి రైలు రాలేదు' అన్న నెగెటివ్ అంశం ప్రచారంలో వినిపించినా.. ఇప్పుడు దానికి భిన్నంగా, ఓ రైలు ఘనతను తమకు అనుకూలంగా మలుచుకుంటూ నేతలు ప్రసంగ పాఠాన్ని సవరించుకుంటున్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే జరిగిన కొన్ని ఉప ఎన్నికల్లో కనిపించిన ఈ పంథా, ఇప్పుడు తెలంగాణ ఎన్నికల్లోనూ కనిపించబోతోంది.


కేంద్రప్రభుత్వం ట్రెయిన్ 18 పేరుతో ప్రయోగాలు నిర్వహించిన తర్వాత ''వందేభారత్'గా పట్టాలెక్కిన సంగతి తెలిసిందే. తొలి రైలే ప్రజలను విపరీతంగా ఆకట్టుకుంది. బ్లూ చారలున్న తెలుపు రంగు కోచ్‌లు, ప్రత్యేకంగా పుష్ పుల్ పద్ధతిలో రెండు వైపులా ఇన్‌బిల్ట్ ఇంజిన్‌తో ఉండటం, 180 కి.మీ. వేగం అందుకునే సామర్థ్యం, విలాసంగా కనిపించే కోచ్‌లు.. ఇలా ఒకటేమిటి, ఇంతకాలం విదేశాల్లోనే కనిపించిన రైలు మనపట్టాలపై పరుగు పెడుతుంటే ప్రజల్లో విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. ఫలితంగా మా ప్రాంతానికి కావాలంటే మా ప్రాంతానికి కావాలంటూ రైల్వేపై అన్ని రాష్ట్రాల నుంచి ఒత్తిడి పెరిగింది.

బీజేపీ ప్రచార ప్రణాళికలో సిద్ధం

- రైల్వే శాఖ నుంచి పూర్తి వివరాలు సేకరించిన ఆ పార్టీ నేతలు
- ఇటీవల దేశవ్యాప్తంగా ఉప ఎన్నికల్లో హోరెత్తిన తీరు
- ఆధునిక భారత్, మేకిన్ ఇండియా సుసాధ్యానికి ఇవే

ఏకంగా మూడు రైళ్లతో..

దేశవ్యాప్తంగా విపరీతమైన డిమాండ్ ఉన్న ఈ వందేభారత్ రైళ్లు తెలంగాణకు ఏకంగా మూడు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికీ కొన్ని రాష్ట్రాలకు వాటిని కేటాయించనే లేదు. ఈ తరుణంలో సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం, సికింద్రాబాద్ నుంచి తిరుపతి, కాచిగూడ నుంచి బెంగళూరు మధ్య మూడు వందేభారత్ రైళ్లు పరుగుపెడుతున్నాయి. ఇప్పుడు ఇదే బీజేపీకి పెద్ద ప్రచారాస్త్రంగా మారింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కొన్ని దశాబ్దాల కాలంలో తెలంగాణకు సాధారణ రైళ్లు మంజూరు కావటమే గొప్ప అనుకుంటున్న తరుణంలో, మోదీ ప్రభుత్వం సెమీ బుల్లెట్ రైళ్లుగా పేర్కొనే వందేభారత్ రైళ్లను మూడింటిని కేటాయించటాన్ని ప్రధానంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో జరిగిన సభల్లో వందేభారత్ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. వాటి ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో కేంద్రమంత్రి హోదాలో ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రముఖంగా పేర్కొంటూ తెలంగాణకు వరాలుగా అభివర్ణించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రాష్ట్రంలో జరిగే ఎన్నికల ప్రచారంలో బీజేపీ నేతలు వందేభారత్‌ను కీర్తిస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.



జనవరి నాటికి స్లీపర్ క్లాస్ రైళ్లు కూడా..

ప్రస్తుతం పగటి పూట నడిచే చెయిర్‌కార్ కోచ్ రైళ్లు మాత్రమే తిరుగుతున్నాయి. జనవరి నాటికి స్లీపర్ క్లాస్ రైళ్లు కూడా అందుబాటులోకి రానున్నాయి. వీటి చార్జీ ఎక్కువగా ఉన్నందున, సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉండేలా వందే సాధారణ్ రైళ్ల తయారీని కూడా ప్రారంభించారు.


ప్రచారం చేయాలని...

ఆ రైళ్లపై విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయం మొత్తంగా వందేభారత్ రైళ్లు సంబంధించిన పూర్తి సమాచారాన్ని రాష్ట్ర బీజేపీ నేతలు రైల్వే శాఖ నుంచి సేకరించారు. వాటి వివరాలను పార్టీ కార్యకర్తలకు కూడా అందిస్తున్నారు. ప్రచారంలో వీటిని విస్తృతంగా ప్రజలకు తెలియజెప్పాలని సూచిస్తున్నారు.

ఈ రెండు రైళ్లను ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కొద్ది రోజుల ముందు స్వయంగా ప్రధాని మోదీ వచ్చి ప్రారంభించిన విషయం తెలిసిందే. అమృత్ భారత్‌స్టేషన్ల పేరుతో రాష్ట్రంలో 21 స్టేషన్లకు పూర్తి ఆధునిక భవనాలు నిర్మించే పని ప్రారంభించారు. ఆధునిక రూపు తెస్తున్న ఘనత బీజేపీ ప్రభుత్వానిదే అని ఆ పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నారు.

మనోహరాబాద్–కొత్తపల్లి ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట వరకు ప్రారంభించిన రైలు సర్వీసు కూడా ప్రచారంలో భాగమవుతోంది. ఆ రైలు సర్వీసు ప్రారంభం రోజు ఆ ఘనత తమదంటే తమది అంటూ బీజేపీ–బీఆర్‌ఎస్ నేతలు పేర్కొంటూ దాడులు చేసుకున్న సంగతి విదితమే. దీంతో ఎన్నికల్లో కూడా స్థానికంగా అది ప్రచారాస్త్రంగా మారబోతోంది.

రెండు దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ప్రాజెక్టును పూర్తి చేసి కాచిగూడ నుంచి దేవరకద్ర మీదుగా కర్ణాటక సరిహద్దులోని కృష్ణా స్టేషన్ వరకు రోజువారీ ప్యాసింజర్ రైలు సర్వీసును ఇటీవల ప్రారంభించారు.



ఓటర్ల హక్కు

తాము ఎన్నుకోబోయే అభ్యర్థికి సంబంధించిన అన్ని వివరాలను తెలుసుకోవడం ఓటర్ల హక్కుగా ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అందువల్లే పోటీ చేసే అభ్యర్థులు తమ ఆస్తులు, అప్పులు, ఉన్న కేసులు, జైలు జీవితం అనుభవిస్తే ఆ వివరాలు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలు, కుటుంబ సభ్యుల వివరాలన్నీ నామినేషన్ సందర్భంగా లిఖితపూర్వకంగా ఎన్నికల అధికారికి తెలపాలని పేర్కొంది. అయితే కొందరు అభ్యర్థులు అఫిడవిట్‌లో అన్ని వివరాలు తెలపడంలో అవలంబిస్తున్న నిర్లక్ష్యంపై సుప్రీం కోర్టులో కేసు దాఖలైంది. దీనిపై 2013లో న్యాయస్థానం తీర్పును వెలువరించింది. దాని ప్రకారం అఫిడవిట్‌లో ఏ ఒక్క కాలమ్‌ను నింప కుండా ఖాళీగా ఉంచవద్దంటూ పేర్కొంది. ఎవరైనా అభ్యర్థి పొరపాటున ఎక్కడైనా ఖాళీగా వదిలేస్తే దాన్ని పూర్తిగా నింపాలంటూ తేల్చి చెప్పింది.



అఫిడవిట్‌లో అలసత్వం వద్దు

నామినేషన్ దాఖలులో జాగ్రత్తలు తప్పనిసరి ● ముగ్గురు ఎమ్మెల్యేలకు అఫిడవిట్ తిప్పలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సతీమణి వనమా పద్మావతి పేరిట ఉన్న ఇన్నోవా వాహనంపై హైదరాబాద్‌లోని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.135 ట్రాఫిక్ చలాన్ పెండింగ్‌లో ఉంది. ఆయన కుటుంబం పాల్వంచ మున్సిపాలిటీకి రూ.3,120 వాటర్ బిల్లు బకాయి ఉంది. వీటితో పాటు వివిధ ఆస్తులు, తనపై నమోదైన పోలీసు కేసుల వివరాలను 2018 ఎన్నికల్లో నామినేషన్ దాఖలు సందర్భంగా వనమా అఫిడవిట్‌లో పేర్కొనలేదు. పారదర్శకత పాటించడంలో విఫలమైనందున వనమా ఎన్నికను రద్దు చేయాలంటూ ఆయన ప్రత్యర్థి జలగం వెంకట్రావు హైకోర్టును ఆశ్రయించి చుక్కలు చూపించారు. చిన్న ట్రాఫిక్ చలానాయే కదా అనే నిర్లక్ష్యం, ప్రజాజీవితంలో ఉన్నోళ్లపై పోలీసు కేసులు సహజమే అనే ఏమరుపాటు ఇబ్బంది తెచ్చిపెట్టగా కేసు ఇంకా సుప్రీంలో కొనసాగుతోంది. ప్రజా జీవితంలో ఉన్నోళ్ల ప్రతీ అంశాన్ని ప్రజలకు తెలియజేయాల్సిందే. ఆస్తులు, అప్పులు, కేసుల వివరాల వెల్లడిలో అలసత్వముంటే ఇబ్బందులు ఎదురవుతాయనేందుకు వనమా ఉదంతం ఉదాహరణగా నిలుస్తోంది. వనమా తరహాలోనే నామినేషన్ సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్‌లో వివరాలను టాంపరింగ్ చేశారనే ఆరోపణలతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సైతం న్యాయపరమైన చిక్కుల్లో పడిన సంగతి తెలిసిందే.

పత్రికా ప్రకటనలు

అభ్యర్థులు తమపై నమోదైన క్రిమినల్ కేసుల వివరాలను ప్రజలకు బహిరంగా తెలపాలనే నిబంధన సైతం 2013 నుంచి అమల్లోకి తెచ్చారు. నామినేషన్ దాఖలు చేసిన తర్వాత పోలింగ్‌కు రెండు రోజుల ముందులోపు స్థానికంగా ఉన్న పేపర్లు/టీవీల్లో ప్రకటనల ద్వారా క్రిమినల్ కేసుల వివరాలను ప్రజలకు తెలపాల్సి ఉంటుంది. అది కూడా ఏ మూలనో కాకుండా ప్రముఖంగా కనిపించేలా మూడు సార్లు ప్రకటనలు ఇవ్వాలి. ఇలా ప్రజలకు అన్ని వివరాలను తెలియజేయకుండా ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టినట్టయితే ప్రజా ప్రాతినిధ్య చట్టం –1951 ప్రకారం అనర్హతకు గురవుతారు.

బీ ఫామ్ అందుకోగానే

బీ ఫామ్ అందుకోవడమే ఆలస్యం నామినేషన్ దాఖలు చేయడం, ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించడమే తరువాయి అనుకుంటే పొరపాటే. నామినేషన్ సందర్భంగా అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్ (లిఖిత వాంగ్మూలం) విషయంలో జాగ్రత్త పడకపోతే చిక్కులు తప్పవు. అక్కడ రాసే ప్రతీ అక్షరం, పొందు పరిచే ప్రతీ విషయం ఆ అభ్యర్థిని నీడలా వెంటాడుతాయి. ఏమైనా పొరపాట్లు జరిగితే ఎన్నిక రద్దవ్వడమే కాదు తదుపరి ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా వీలుండదు.

ఇంకా పెరగాలి ఓటు ధర!

ఓ జర్నలిస్టు... ఓ (అ)సామాన్య ఓటరును ఇంటర్వ్యూ చేస్తున్నాడు.

ఓటును నోటుకూ, ఓ రేటుకూ అమ్ముకుంటున్నారనీ, ఈ పద్ధతి తప్పు అని తెలియజెప్పాలని సదరు జర్నలిస్టు ఉద్దేశం. అదే విషయాన్ని అతణ్ణి అడిగాడు.

''సార్... పేపర్లలో టీవీల్లో... మీరే దాన్ని 'విలువైన ఓటు', 'విలువైన ఓటు' అంటుంటారా, లేదా? మరి అంత విలువైనదాన్ని ఫ్రీగా ఇచ్చేయడమేంటి?... నాన్సెంచ్''

''ఓటు ధర ఇలా పెరిగిపోవడం ఓ చెడు సంకేతం కాదా?''

''ఎంతమాత్రమూ కాదు. నిజానికి నా ఒపీనియనింగు పెకారం ఓటింగు ప్రైసింగు వింకా పెరగాలి. ఒకప్పటి రేట్లూ..ఇప్పటి ధరలూ, ఇప్పటికి తరిగిపోయిన రూపాయి విలువా.. వీటన్నింటినీ కూలంకచంగా పరిచీలింపచేసి, ఏ ఆడమ్ చ్మిత్తుతోనో, అమర్త చేనుతోనో లెక్కలు కట్టించారనుకోండి, పెరిగిన ద్రవ్యోల్బణం పెకారం.. ప్చ్..ఇప్పటి మన ఓటు ధర చాలా తక్కువని తెలుతుంది. ఇంకో విషయం.. ఓటు ధర బాగా పెరిగిందనుకోండి.. 'అమ్మో.. మా చీటు ఇంతటి వ్యాల్యుయేషనబుల్ కదా' అంటూ, దాన్ని నిలబెట్టుకోవడం కోసం మమ్మల్ని మరింత చంతృప్తిపరచేలా పాలిస్తుంటారు సార్ నేతలు''

''అదేంటీ... ఇలా చెబుతున్నారు?''

''సార్... మీకు మీ ఆఫీసువాళ్లు ఏడాదికోసారి బోనసు ఇస్తుంటారా, లేదా? దాన్ని మీరు తీసుకుంటారా లేక 'అబ్బే..అప్పనంగా వచ్చింది మాకెందుకండీ' అని వదిలేస్తారా?''

''తీసుకుంటాం''

''మాకు నెలనెలా వచ్చే మా పింఛనే జీతమనుకుందాం. జన్మకో శివరాత్రి అన్నట్టుగా ఎప్పుడో... ఐదేళ్లకోసారి బోనసుగా ఏ ఐదువేలో, ఆరువేలో ఇస్తారు. మీరు ఏడాదికోసారి బోనసు రాకపోతేనే ఎంతో అల్లల్లాడిపోతారు కదా. మాకేమో ఏదో ఓ రెణ్ణెల్ల పింఛన్ను..అది కూడా ఐదేళ్లకు.. మచ్చుకు కొద్దిగా బోనసులాగా పడేస్తే..మీరీమాత్రానికే ఇంతగా విదైపోతుంటారెందుకో నాకు అర్థంకావడం లేదు''

''ఇలా ఓటుకు ధర పెరుగుతూ పోవడం ప్రజాస్వామ్యానికి అనర్థం కాదా?''

''ఓటును అమ్మడం, అమ్ముకోవడం అని మాటిమాటికీ అనకండి సిరాగ్గా! అమ్ముతున్నాడంటూ బదనాం చేయడానికి ఓటరే దొరికాడా మీకు తేరగా? అసలుఓటును అమ్ముకోడం అనడమేంటి? బార్బేరియన్'' అన్నాడు చిరాగ్గా.

''మరి ఏమనాలి?''

''సార్.. నిజానికి ఇదొక వెకనమిక్ యాక్టివిటీ. అనగా... ఓ ఆర్థిక కార్యెకలాపం. ఉదాహరణకు..ఓ విలువైన పనికి టెండర్లు పిలుస్తారు. బిడ్డింగు వేస్తారు. ఎవరు ఎక్కువ లాభదాయకంగా కోటింగు చేస్తే, వాళ్లకు ఇస్తారు. ఓటు విషయంలోనూ అదే జరుగుతోందని ఎందుకనుకోరు? 'అరె ఓ విలువైన పనికి బిడ్డింగు జరిగింది, ఎవరు ఎక్కువగా ఇస్తే, వాళ్లకు ఓటిచ్చారు' అని మీరెందుకనుకోరు?''

''బిడ్డింగులో ఎవరు లాభదాయకంగా కోట్ చేస్తే వారికే పని అప్పగిస్తారు. కానీ ఓటు విషయంలో అభ్యర్థులందరినుంచీ డబ్బులు తీసుకుంటారు కదా ఓటర్లు?''

''నేను ముందే చెప్పాను కదా... ఇదొక ఆర్థిక కార్యెకలాపం అని. 'ఓట్లు అమ్ముకుంటుంటారూ, అమ్ముకుంటున్నారం'టూ అదేపనిగా ఓటరును బ్లేమింగు చేస్తుంటారుగానీ..వాస్తవానికి ఏ ముగ్గురో, నలుగురో పోటీపడి ఆక్షనింగులో మానుంచి ఎమ్మెల్లే పదవిని కొనుక్కుంటున్నారననే 'ఓ-కామర్స్'లా దీన్ని మీరెందుకు చూడరు? అరె... మార్కెట్ అన్నాక వొడిదొడుకులుంటాయ్. డిమాండును బట్టి 'ఎలక్షన్ ఓటు రేటు సూచీ' విండెక్సు ప్రకారం.. ఒక్కోసారి ఓటు ధర అమాంతం పెరుగుతుంది. ఒక్కోసారి పడిపోతుంది. కొన్నిసార్లు కొందరు ఓడిన అభ్యర్థులు తామిచ్చిన డబ్బులు తిరిగి వసూలు చేసుకున్న దాఖలాలు లేవా? మిగతా కామర్సు విషయాల్లోలాగే..చెరతులు వర్తిస్తాయనీ లేదా 'ద వోటు ప్రైసెస్ ఆర్ సబ్జెట్టు టు మార్కెట్ రిచుకు' అని పేపర్లలో మీరే రాస్తుంటారు కదా. ఇక్కడా అంతే. చేమ్ టు చేమ్. దీనికి మీరెందుకంతగా ఆశ్చర్యపోతుంటారెందుకో నాకర్థం కావడం లేదు''

''మీరు పేపర్లు బాగా చదువుతూ, టీవీ ఎక్కువగా చూస్తుంటారు కదా? అందునా బిజినెస్ రిలేటెడ్ ప్రోగ్రాములు''

''అవును... మీకెలా తెలుసు?'' కాస్త సిగ్గు నటిస్తూ, కాంప్లిమెంటులా తీసుకున్నాడా ఎక్స్‌పర్టు!!



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

ఫొటో స్టోరీ

బీఆర్ఎస్ నేత.. కాంగ్రెస్ మేనిఫెస్టో



అధికార పార్టీ ఎమ్మెల్యే జోగు రామన్న ఆదిలాబాద్‌లో విలేకరుల సమావేశానికి ముందు ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ మేనిఫెస్టోను క్షుణ్ణంగా పరిశీలించారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



బతుకమ్మకూ కోడ్

తెలంగాణ సంప్రదాయ వేడుక.. బతుకమ్మ పండగ. ప్రతి ఏడాది గ్రామాలు, పట్టణాల్లో చెరువుల వద్ద బతుకమ్మ పండగ కోసం ప్రత్యేక ఘాట్‌లు ఏర్పాటు చేస్తూ బతుకమ్మ విగ్రహాలను నెలకొల్పేవారు. కానీ ఈసారి ఎన్నికల కోడ్ రావడంతో విగ్రహాల ప్రతిష్ఠాపన నిలిచిపోయింది. తయారుచేసిన బతుకమ్మ ప్రతిమలు అమ్ముడుపోవడం లేదని వరంగల్‌కు చెందిన విగ్రహాల తయారీదారుడు కార్తీక్ ఆవేదన వ్యక్తం చేశారు.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

పంచతంత్రం

రాజస్తాన్‌లో అధికారం నిలబెట్టుకుంటే..
2024లో పగ్గాలు మాకే: ఖర్గే

జైపూర్: రాజస్తాన్‌లో మరోసారి అధికారంలోకి వస్తే, 2024 ఎన్నికల తర్వాత కేంద్రంలో ఏర్పడేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. రాజస్తాన్‌లోని బరన్ జిల్లాలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం అశోక్ గెహ్లోత్ ప్రభుత్వం పాల్పడిన అవకతవకలకు సంబంధించిన వివరాలన్నీ 'రెడ్ డైరీ'లో ఉన్నాయంటూ ఇటీవల ప్రధాని మోదీ పదేపదే చేస్తున్న ఆరోపణలపై ఖర్గే స్పందిస్తూ.. రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పడుతుందని కూడా అదే 'రెడ్ డైరీ'లో రాసి ఉందంటూ వ్యాఖ్యానించారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పాటైన పక్షంలో 2024లో కేంద్రంలో తమ పార్టీయే అధికారంలోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలు 25 మంది బీజేపీలను ఎన్నుకున్నప్పటికీ వారు రాష్ట్రానికి నిధులు గానీ నీళ్లు గానీ తేలేకపోయారని ఆరోపించారు.

ప్రజలు మళ్లీ మాకే అధికారమిస్తారు: సీఎం గెహ్లోత్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్‌కే అధికారమిచ్చేందుకు ప్రజలు సిద్ధమయ్యారని రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లోత్ చెప్పారు. కోవిడ్ మహమ్మారి వంటి సవాళ్లున్నా, ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు కుట్రలు జరిగినప్పటికీ సుపరిపాలన అందించిన కాంగ్రెస్‌నే ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రజల్లో బీజేపీ పట్ల ఇప్పటికీ ఆగ్రహం ఉందని, ఆ పార్టీకి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తమ ప్రభుత్వం విద్య, ఆరోగ్య రంగాల్లో ఎన్నో కొత్త పథకాలను ప్రజల కోసం తీసుకువచ్చిందని వివరించారు. రాజస్తాన్‌లో నవంబర్ 25న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది.

మిజోరంలో 39 మందితో కాంగ్రెస్ జాబితా విడుదల

ఐజ్వాల్: మిజోరం అసెంబ్లీ ఎన్నికలకు గాను సోమవారం కాంగ్రెస్ పార్టీ 39 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను విడుదల చేసింది. ఇందులో నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు చోటు దక్కింది. మిజోరం పీసీసీ చీఫ్ లాల్‌సాటా ఐజ్వాల్ వెస్ట్–3 స్థానం నుంచి, పార్టీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లాల్ థంజారా ఐజ్వాల్ నార్త్–3 నుంచి బరిలోకి దిగనున్నారు. మంగళవారం జరిగే కార్యక్రమంలో ఈ జాబితాను అధికారికంగా ప్రకటిస్తామని కాంగ్రెస్ మీడియా విభాగం అధ్యక్షుడు లాల్‌రెమ్‌రువాటా చెప్పారు. త్వరలోనే తాము కూడా అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని ప్రతిపక్ష బీజేపీ తెలిపింది. రాష్ట్రంలోని 40 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 7న ఎన్నికల పోలింగ్ జరగనుంది.

పార్టీలన్నింటికీ... నవంబర్ పరీక్ష...!

కీలకంగా మారిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు | సర్వశక్తులూ ఒడ్డుతున్న బీజేపీ, కాంగ్రెస్, స్థానిక పార్టీలు

● లోక్‌సభ ఎన్నికలకు దిశానిర్దేశం చేయనున్న ఫలితాలు!

● బీజేపీకి, ఇండియా కూటమికి అక్షరాలా అగ్నిపరీక్షే

ఐదు రాష్ట్రాలు. వాటిలో నాలుగు కీలక రాష్ట్రాలు. మొత్తం 16 కోట్ల పై చిలుకు ఓటర్లు. దాదాపు 650 పై చిలుకు అసెంబ్లీ స్థానాలు. ఎంతోమంది వెటరన్ నాయకులకు కీలక పరీక్ష. కీలకమైన లోక్‌సభ ఎన్నికల ముంగిట మోదీ సారథ్యంలోని బీజేపీకి, దాని ఓటమే లక్ష్యంగా జాతీయ స్థాయిలో పుట్టుకొచ్చిన విపక్ష ఇండియా కూటమి సత్తాకూ అగ్నిపరీక్ష! ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలు ఇలా ఎన్నో రకాలుగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వాటి ఫలితాలపైనా సర్వత్రా అంతే ఆసక్తి వ్యక్తమవుతోంది. దేశ రాజకీయ భవిష్యత్తును నిర్దేశించడంలో వచ్చే నవంబర్ కీలకంగా మారనుంది. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీలకు జరుగుతున్న ఎన్నికలు వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలకు రంగం సిద్ధం చేయనున్నాయి. అందుకే వీటి ఫలితాలను తమకు అనువుగా మార్చుకోవాలని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, విపక్ష ఇండియా కూటమి పట్టుదలగా ఉన్నాయి. అందుకోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు ఆ తర్వాత వచ్చే లోక్‌సభ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయాలని ఏమీ లేదు. ఉదాహరణకు 2018లో ఇలాగే రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. మూడింట్లోనూ కాంగ్రెస్సే నెగ్గింది. కానీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆ మూడు రాష్ట్రాల్లోని 65 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ నెగ్గింది కేవలం మూడంటే మూడు! ఈసారి మాత్రం జాతీయ స్థాయిలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఐదు రాష్ట్రాల ఎన్నికలు కచ్చితంగా 2024 లోక్‌సభ ఎన్నికలకు మూడ్ సెట్ చేస్తాయని భావిస్తున్నారు.

ఈ సీనియర్లకు పెను పరీక్ష

తాజా అసెంబ్లీ ఎన్నికలు ఎంతోమంది వెటరన్ నాయకుల భవితవ్యాన్ని తేల్చేయనున్నాయి. బీజేపీ నుంచి మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్, రాజస్తాన్‌లో వసుంధర రాజె, ఛత్తీస్‌గఢ్‌లో రమణ్‌సింగ్‌తో పాటు కాంగ్రెస్ నుంచి రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్, మధ్యప్రదేశ్‌లో కమల్‌నాథ్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు. అలాగే తెలంగాణలో భారాస అధినేత కేసీఆర్, మిజోరంలో సీఎం జోరాంతంగా ముక్కోణపు పోటీ ఎదుర్కొంటున్నారు. ఇటీవలే పుట్టుకొచ్చిన ఇండియా కూటమికి ఈ ఎన్నికలు తొలి అగ్నిపరీక్ష కానున్నాయి. కాంగ్రెస్‌తో పాటు పలు ఇండియా కూటమి పార్టీలు జపిస్తున్న కులగణన మంత్రం ఏ మేరకు ఫలిస్తుందో ఈ ఎన్నికలు తేల్చనున్నాయి.

ఎవరి ప్రయత్నాల్లో వారు...

కాంగ్రెస్	బీజేపీ
➤ కర్ణాటకలో మాదిరిగా రాష్ట్రాలవారీగా సామాజిక, ఆర్థిక, సంక్షేమ పథకాల ప్రకటన...	➤ నరేంద్ర మోదీ ఛరిష్మాను ఓట్లుగా మార్చుకునేలా ప్రచారం...
➤ ఓబీసీలను బీజేపీకి దూరం చేసేందుకు జాతీయ స్థాయిలో కులగణనకు డిమాండ్	➤ కేంద్ర మంత్రులతో పాటు పేరున్న సీనియర్ ఎంపీలకు అసెంబ్లీ టికెట్లు
➤ స్థానికాంశాలకు ప్రాధాన్యం. ప్రచార వ్యూహాలు, అభ్యర్థుల ఎంపికల్లో వీలైనంత వరకు స్థానిక ముఖ్య నేతలకు నిర్ణయాధికారం.	➤ జీ20 సదస్సు ఘనవిజయం, మహిళా బిల్లు, ఎల్పీజీ సిలిండర్ ధర తగ్గింపు వంటి ప్రచారాలు

2018లో 5 రాష్ట్రాల్లో పార్టీలవారీ ప్రదర్శన

పార్టీ	స్థానాలు	ఓట్ల శాతం
కాంగ్రెస్	306	45
బీజేపీ	199	29
ఇతరులు	174	26

అంకెల్లో ఎన్నికలు...

అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ మిజోరంల్లో మొత్తం లోక్‌సభ స్థానాలు 83	మొత్తం అసెంబ్లీ స్థానాలు 679	మొత్తం ఓటర్లు 16.1 కోట్లు	మహిళా ఓటర్లు 7.8 కోట్లు తొలిసారి ఓటర్లు 62 లక్షలు

– సాక్షి, నేషనల్ డెస్క్

మణిపూర్‌ను కాదని ఇజ్రాయెల్‌పై ఆసక్తి ఎందుకు?

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీరు సిగ్గుచేటు

'భారత్' భావనపై కాషాయ పార్టీ దాడి చేస్తోంది | కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపాటు

మిజోరం రాజధాని ఐజ్వాల్‌లో రాహుల్ పాదయాత్ర

ఐజ్వాల్: మణిపూర్ మంటల్లో కాలిపోతున్నా ఏమాత్రం పట్టించుకోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పరిణామాలపై మాత్రం ఎనలేని ఆసక్తి చూపుతున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు. మోదీ తీరు సిగ్గుచేటు అని దుయ్యబట్టారు. మిజోరం రాజధాని ఐజ్వాల్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ సోమవారం 2 కిలోమీటర్ల మేర పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం రాజ్‌భవన్ వద్ద సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పొరుగు రాష్ట్రం మణిపూర్ ఇప్పుడు ఒకే ఉమ్మడి రాష్ట్రంగా లేదని, తెగల మధ్య ఘర్షణలతో రెండుగా విడిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 1986లో శాంతి ఒప్పందంతో మణిపూర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశాంత వాతావరణం నెలకొల్పిందని గుర్తుచేశారు. ఇప్పుడు రాష్ట్రం రావణకాష్టంగా మారిందన్నారు. మణిపూర్‌లో పరిస్థితులను చక్కదిద్దడంపై దృష్టి పెట్టకుండా ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంపై ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం ఆసక్తి చూపుతుండడం తనకు ఎంతో ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నారు. మణిపూర్‌లో ఘర్షణ మొదలైన తర్వాత మన దేశ పాలకుడు ఇప్పటికీ అక్కడ పర్యటించకపోవడం నిజంగా సిగ్గుచేటు అని రాహుల్ ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సుపరిపాలన

మణిపూర్‌లో నెలకొన్న సమస్యలే దేశంలో ఇతర ప్రాంతాల్లోనూ కనిపిస్తున్నాయని, మైనార్టీలు, గిరిజనులు, దళితులు సౌకర్యవంతంగా లేరని, ఒత్తిళ్లకు గురవుతున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశ ప్రజలపై అణచివేత చర్యలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. భారత్ అనే భావనపై కాషాయ పార్టీ దాడి చేస్తోందని పరోక్షంగా అధికార బీజేపీపై ధ్వజమెత్తారు. ఆ పార్టీ వేర్వేరు వర్గాలు, మతాలు, భాషలను లక్ష్యంగా చేసుకుందని అన్నారు. బీజేపీ నాయకులు దేశంలో విద్వేషం, హింసను ప్రేరేపిస్తున్నారని విమర్శించారు. మిజోరంలో ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, మతంపై బీజేపీ దాడులు చేస్తోందని, రాష్ట్రంలోని అధికార మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్ఎఫ్) అందుకు వత్తాసు పలుకుతోందని రాహుల్ ఆక్షేపించారు. ఎంఎన్ఎఫ్ పాలనలో మిజోరంలో మాదకద్రవ్యాల బెడద పెరిగిపోయిందని, ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. డ్రగ్స్ వల్ల మిజోరంలో 250 మంది యువకులు చనిపోయారని తెలిపారు. మిజోరం పాలకులు ఢిల్లీ పాలకులు తొత్తులుగా మారారని రాహుల్ గాంధీ ఘాటుగా విమర్శించారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లో సుపరిపాలన అందిస్తున్నామని గుర్తుచేశారు. మిజోరం ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, మత విశ్వాసాలను కాపాడడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

పాదయాత్రకు విశేష స్పందన

ఇదిలా ఉండగా, ఐజ్వాల్‌లో రాహుల్ పాదయాత్రకు విశేష స్పందన లభించింది. ఇరువైపులా బారులు తీరిన వేలాది మంది ప్రజలకు అభివాదం చేస్తూ ఆయన ముందుకు సాగారు. కొందరితో కరచాలనం చేశారు. పాదయాత్రలో ప్రజలు ఆయనతో ఉత్సాహంగా సెల్ఫీలు తీసుకున్నారు.



సోమవారం ఐజ్వాల్‌లో పాదయాత్రలో పాల్గొన్న రాహుల్ గాంధీ



నల్లగొండలో తీగ లాగితే...

నల్లగొండ జిల్లాలో ఆదివారం చిక్కిన హవాలా గ్యాంగ్ తీగ లాగితే... హైదరాబాద్‌లోని ఉత్తర మండల కేంద్రంగా దందా చేస్తున్న సూత్ర ధారులు చిక్కారు. -10లో



గోవా టు హైదరాబాద్

అక్రమంగా గోవా నుంచి హైదరాబాద్‌కు ఎండీఎంఏ డ్రగ్ పిల్స్ సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ, ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. -10లో

సెలూన్ యజమాని దారుణ హత్య



ఓ హెయిర్ సెలూన్ యజమాని దారుణ హత్యకు గురైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాపారాయుడు పేటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బిహార్‌కు చెందిన యువకుడు ఈ హత్యకు పాల్పడి ఉండవచ్చునని హతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. -10లో



మహేశ్వరం: రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు గొర్రె పిల్లను బహూకరిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

కమలనాథులెవరో?

రేపే బీజేపీ అభ్యర్థుల జాబితా

- తొలి జాబితాపై ఆశావహుల్లో టెన్షన్
- ఆచితూచి అడుగులేస్తున్న బీజేపీ

సాక్షి, సిటీబ్యూరో: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు అభ్యర్థిత్వాలను ఖరారు చేయడమేగాకుండా.. ప్రచారపర్వంలో దూసుకుపోతుండగా బీజేపీ మాత్రం టికెట్ల కసరత్తును పూర్తి చేయ కపోవడం ఆశావహులను ఆందోళ నకు గురి చేస్తోంది. సోమవారం తొలి జాబితా విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ, సీఈసీ సమా వేశం వాయిదా పడడంతో మరో రెండు రోజుల వరకు అభ్యర్థిత్వాల ఖరారుపై సస్పెన్స్ కొనసాగనుంది. మరోవైపు మొదటి జాబితా విడు దల కానుండటంతో ఆశావ హుల్లో టెన్షన్ పెరుగుతోం ది. ఇందులో తమ పేర్లు ఉంటాయో. ..లేవోనన్న ఉత్కంఠ కూడా వారిని మరింత ఆందోళనకు గురిచేస్తోంది. బీజేపీ నాయకత్వం మాత్రం గెలుపు లక్ష్యంగా అభ్య ర్థుల ఎంపికపై దృష్టి సారించటంతోపాటు.. అవసరమైతే కొత్త వారికి కూడా అవకాశం కల్పించా లన్న యోచనతో వ్యూహాత్మ కంగా వ్యవహరిస్తోంది. నగర సిట్టింగ్ ఎమ్మెల్యే రాజాసింగ్ అభ్యర్థిత్వంపై సస్పెన్స్ నెలకొంది. ఆయనపై సస్పెన్షన్‌ను ఎత్తివేయకపోవడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసే అంశంపై రాష్ట్ర నాయకత్వం ఎటూ తేల్చుకోలేకపోతోంది. ఒకవేళ రాజాసింగ్ గనుక బరిలో లేకపోతే ఆయన స్థానం లో విక్రమ్‌గౌడ్‌కు చాన్స్ ఇచ్చే అవకాశముంది. సికిం ద్రాబాద్ సెగ్మెంట్‌కు మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి రేసులో ముందంజలో ఉండగా.. సారంగపాణి, శ్యామ్‌లు కూడా వారి ప్రయత్నాలను ముమ్మరం చేశారు. సనత్‌నగర్ నుంచి మర్రిశశిధర్‌రెడ్డి, ముషీ రాబాద్‌కు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తనయ విజయలక్ష్మి పేర్లు అధిష్టానం పరిశీల నలో ఉన్నాయి. ఇక కేంద్ర మంత్రి కిష న్‌రెడ్డి మరోసారి అంబర్‌పేట నుంచి అసెంబ్లీ బరిలో నిలిచే అవకాశముంది. మలక్‌పేట్‌లో సురేంద ర్‌రెడ్డి, చీకోటి ప్రవీణ్‌కు మార్, హరిగౌడ్, ఖైరతాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఇంద్రసేన్‌రెడ్డి, శేరిలింగంపల్లిలో రవికుమార్ యాదవ్, కుత్బుల్లా పూర్‌లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అలాగే, కూకట్‌పల్లి నుంచి వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, మాధవరం కాంతా రావు, మేడ్చల్‌లో పటోళ్ల విక్రంరెడ్డి, మోహన్‌రెడ్డి, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ఉప్పల్‌లో ప్రభాకర్ లేదా రాజకీయ సమీకరణలో భాగంగా కొత్తగా మరో ఇద్దరి నాయకుల పేర్లు తెరపైకి వస్తున్నాయి. ఎల్బీ నగర్‌లో సామ రంగారెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, మహేశ్వరం నుంచి అందె శ్రీరాములు యాదవ్, బొక్కా నర్సింహారెడ్డి, వీరేంద ర్‌గౌడ్, కల్వకుర్తిలో ఆచారి, రాజేంద్రనగర్‌లో తోకల శ్రీనివాస్‌రెడ్డి, ఇబ్రహీంపట్నంలో మాజీ ఎం పీ బూర నర్సయ్యగౌడ్, షాద్‌నగర్‌లో విష్ణువర్ధన్ రెడ్డి, అందె బాబయ్య, జూబ్లీహిల్స్ నుంచి లంకెల దీపక్‌రెడ్డి, జూటూరి కీర్తి రెడ్డి, వీరపనేనని పద్మ, అలపాటి లక్ష్మినారాయణ, చేవెళ్ల నుంచి విజయ్‌కు మార్, ప్రకాశ్ ప్రయత్నాలు చేస్తుండగా..మాజీ ఎమ్మెల్యే రత్నం గనుక పార్టీ తీర్థం పుచ్చుకుంటే ఆయన పేరును పరిశీలించాలని కమలం నాయకత్వం భావిస్తోంది.

కుటుంబ పాలనకు తెరదించాలి

జనగర్జన సభలో బీజేపీ నేతలు

బడంగ్‌పేట్: తెలంగాణలో కుటుంబ పాలనకు తెరదించి బీఆర్‌ఎస్ ప్రభు త్వాన్ని తరిమికొట్టాలని బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి, కేంద్ర మాజీ మంత్రి ప్రకాష్ జవదేకర్ పిలుపునిచ్చారు. బడంగ్‌పే టలోని సిరిపురం యాదయ్య స్మారక క్రీడా ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన మహేశ్వరం జనగర్జన సభకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సిం గ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన హిందీలో ప్రసంగం చేస్తుంటే ఎంపీ డా.కె.లక్ష్మణ్ తెలుగులో అనువ దించారు. అనంతరం జవదేకర్ మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో 1,200 మందిని పొట్టన పెట్టు కున్నారని ధ్వజమెత్తారు. తొమ్మిదేళ్లలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని అన్నారు. ప్రవళిక మరణం ప్రభుత్వ హత్య అని..దీనికి మూల్యం చెల్లించుకోక తప్పద న్నారు. బీఆర్‌ఎస్ ఓడిపోవడం ఖాయమని, తెలంగాణలో తాము అధికారం లోకి రావడం పక్కా అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మూడో స్థానానికే పరిమితమవుతుందని జోస్యం చెప్పారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చా ర్జి అందెల శ్రీరాములు మాట్లాడుతూ.. దళితులతో పాటు అన్ని వర్గాల ప్రజలను మంత్రి సబితారెడ్డి మోసం చేశారని విమర్శించారు.

బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై!

- కాంగ్రెస్‌లోకి మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్
- ఆయన వెంటే సతీమణి, హఫీజ్‌పేట కార్పొరేటర్ పూజిత



జగదీశ్వర్ గౌడ్, పూజిత

గచ్చిబౌలి: బీ ఫామ్‌లు అం దించిన మరుసటి రోజు శేరి లింగంపల్లిలో బీఆర్‌ఎస్‌కు పెద్ద షాక్ తగిలింది. ఇద్దరు కార్పొరేటర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. మాదాపూర్ కార్పొరే టర్ జంగదీశ్వర్ గౌడ్, ఆయన సతీ మణి, హఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజిత గౌడ్‌లు బీఆర్‌ఎస్ వీడ నున్నారు. గత కొద్ది రోజులుగా పార్టీ మారుతున్నట్లు వస్తున్న ఊహాగానా లను ఖండించని జగదీ శ్వర్ గౌడ్..ఎట్టకేలకు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు పార్టీ కేడర్‌కు స్పష్టమైన సంకేతాలి చ్చారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయను న్నారు. అక్కడి నుంచి నేరుగా టీపీసీసీ అధ్య క్షులు రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. అభిమానులు, కార్యకర్తలు పెద్దమ్మతల్లి ఆలయం వద్దకు రావాలని పిలుపునిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. జగదీశ్వర్ గౌడ్ దంప తులు కాంగ్రెస్‌లో చేరుతుండటం తో బీఆర్‌ఎస్ నాయకులు ఎవరు వెళ్లారనే ఆసక్తి నెలకొంది. జగదీశ్వర్ గౌడ్ కాంగ్రెస్ నుంచి మొదటిసారి కార్పొ రేటర్‌గా గెలిచారు. 2016లో మాదాపూర్ కార్పొరేటర్‌గా టీఆర్‌ఎస్ నుంచి రెండోసారి గెలిపొందారు. 2020లో డివిజన్ల పునర్విభజన జరగడంతో మాదా పూర్‌నుంచి జగదీశ్వర్ గౌడ్, హఫీజ్‌పేట్ నుంచి ఆయన సతీ మణి పూజిత గెలుపొందారు. ఈ రెండు డివిజన్లలో ఆయ నకు మంచి పట్టు ఉంది. వీరు పార్టీ వీడితే మాదాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్లలో బీఆ ర్‌ఎస్‌కు నష్టం వాటిల్లే అవ కాశం ఉందని రాజకీయ పరి శీలకులు భావిస్తున్నారు. కొద్ది రోజులుగా జగదీశ్వర్‌గౌడ్ పార్టీ అధి ష్టానానికి అందుబాటులోకి రాకపోవడంతో పార్టీ మారుతున్నట్లు బీఆర్‌ఎస్ అధిష్టానం నిర్ధయానికి వచ్చింది. ఈ క్రమంలోనే ఆయా డివిజన్లలో దిద్దుబాటు చర్యల్లో భాగంగా నాయకులె వరు బీఆర్‌ఎస్‌ను వీడవద్దని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సమావేశాలు నిర్వహించారు.

కాంగి'రేసు'లో చిచ్చు

గాంధీ భవన్‌కు చేరిన మేడ్చల్ పంచాయితీ

- ఉప్పల్‌లో ఆగని రాజీనామాల పర్వం
- క్రమశిక్షణ చర్యలకు సిద్ధమైన పార్టీ



గాంధీ భవన్ వద్ద నిరసన తెలుపుతున్న హరివర్ధన్ రెడ్డి మద్దతుదారులు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ కాంగ్రెస్‌లో అసమ్మతి మం టలు ఆరడం లేదు. కాంగ్రెస్ తొలి జాబితా ప్రకటనతో వివిధ సెగ్మెంట్ల అభ్యర్థిత్వాలపై తీవ్ర స్థాయిలో నిరస నలు వ్యక్తమవుతున్నాయి. టికెట్ ఆశించి భంగపడిన నాయకుల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. మరోవైపు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకు పడుతున్నారు. ఏకంగా ఫ్లెక్సీలు కాల్చివేత, దిష్టిబొమ్మలను దగ్ధం చేసి ఆందోళన దిగుతున్నారు. వీటిని పార్టీ క్రమశిక్షణ కమిటీ తీవ్రంగా పరిగణిస్తోంది. ఏకంగా నిరసనకారులపై సస్పెన్షన్ వేటు వేస్తోంది. అసమ్మతి వాదుల నుం



నిరసన తెలుపుతున్న పాతబస్తీ నాయకులు

చి గాంధీభవన్‌కు సైతం నిరసన సెగ తగులుతోంది. ఉప్పల్, మేడ్చల్, కుత్బుల్లాపూర్, ముషీరాబాద్, గోషా మహల్, సనత్‌నగర్ తదితర నియోజకవర్గాలలో అసమ్మతి అంతర్గతంగా రగులుకుంటోంది. ఇప్పటికే ఉప్పల్ స్థానం టికెట్ ఆశించిన రాగిడి లక్ష్మారెడ్డి, సింగి రెడ్డి సోమశేఖర్ రెడ్డి, ఆయన భార్య..ఎ.ఎస్‌రావు నగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషారెడ్డి పార్టీకి రాజీనామా చేయగా, తాజాగా టీపీసీసీ మాజీ కార్యదర్శి పూదూరి జితేందర్ రెడ్డి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అందరితోపాటు ఆయన కూడ పీసీసీ అధ్యక్షుడి రేవం త్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. తాజాగా ఉప్పల్ పంచాయతీ గాంధీభవన్‌కు చేరింది.

పాతబస్తీ సెగ్మెంట్లలో సైతం

పాతబస్తీ అసెంబ్లీ సెగ్మెంట్ల అభ్యర్థిత్వాలపై సైతం అసమ్మతి వ్యక్తమవుతోంది. రెండు రోజుల క్రితం ఏకంగా ఆయా నియోజకవర్గాలకు చెందిన మైనా రిటీ నేతలు గాంధీభవన్‌లో నిరసనకు దిగారు. బహ దూర్‌పురా అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. పాతబస్తీకి చెందిన టికెట్లు..సంబంధం లేని వారికి ఇచ్చారని వారు ఆందోళన నిర్వహించారు. మరోవైపు చాంద్రాయణగుట్ట, కార్వాన్, మలక్‌పేట అసెంబ్లీ నియోజక వర్గాల నుంచి టికెట్ ఆశించిన మైనారిటీ నేతలు బాహాటంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు.

బహదూర్‌పురా నేతపై సస్పెన్షన్ వేటు

గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేసిన బహదూర్‌పురా అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఖలీమ్ బాబాపై కాంగ్రెస్ కమశిక్షణ కమిటీ సస్పెన్షన్ వేటు వేసింది. టికెట్ రాలేదన్న ఆక్రోశంతో పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించి గాంధీ భవన్‌లో పార్టీ నాయకుల దిష్టిబొమ్మలను దగ్ధం చేయడం, ఫ్లెక్సీలను చించి వేయడం, నాయకులపై అనుచిత వ్యాఖ్యలను చేయడం లాం టి చర్యలను క్రమశిక్షణ కమిటీ సీరియస్‌గా పరిగణి స్తోంది. సోమవారం గాంధీ భవన్‌లో క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ చిన్నారెడ్డి అధ్యక్షతన సమావేశమైన కమిటీ బహదూర్‌పురా అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కలీమ్ బాబాను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. పార్టీ టికెట్ల కేటాయిం పు ఏఐసీసీ నియమ నిబంధనల ప్రకారం జరుగు తుందని, టికెట్ల కేటాయింపు పూర్తిగా సెంట్రల్ ఎల క్షన్ కమిటీ నిర్ణయాధికారం ప్రకారం ఉంటుందని కమిటీ పేర్కొంది. టికెట్ల కేటాయింపులో ఒక్కరి బాధ్యత ఉండదని..పీసీసీ అధ్యక్షుడిని ఒక్కడినే బా. ధ్యుడిని చేయడాన్ని కక్ష పూరిత చర్యగా క్రమశిక్షణా కమిటీ పరిగణించి చర్యలకు ఉపక్రమిస్తోంది.

ఢిల్లీ పీఠానికే ఎసరు పెట్టిన ఘనుడు రేవంత్

రాగిడి లక్ష్మారెడ్డి ధ్వజం

ఉప్పల్: రాష్ట్రానికి, కాం గ్రెస్ పార్టీకి పట్టిన చీడ పీడ రేవంత్‌రెడ్డి అని కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఉప్పల్ నేత రాగిడి లక్ష్మారెడ్డి ధ్వజమె త్తారు. ఉప్పల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడారు. తానే పీఎం అవు తానంటూ ఏకంగా ఢిల్లీ పీఠానికే రేవంత్ ఎసరు పెట్టాడని ఆరోపించారు. 'పార్టీలోకి నువ్వు ఎప్పుడు వచ్చావో గుర్తు పెట్టుకో. నాలాంటి వాళ్లను తొక్కేస్తే దేవుడు నిన్నూ తొక్కేస్తాడు' అంటూ రాగిడి తీవ్రంగా స్పం దించారు. తనకు టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేసిన రేవంత్‌రెడ్డిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఉప్పల్, కొడంగల్‌లో పార్టీ అభ్యర్థులను ఖచ్చితంగా ఓడిస్తామని చెప్పారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేసే



వారికే తమ మద్దతు ఉంటుందని తెలి పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు మేడల మల్లికార్జున్ గౌడ్, ముఖ్యనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టార్గెట్.. మెజార్టీ

తొలి ఐదు స్థానాల్లో మనం ఉండాలి !

- ప్రతిపక్షాలు రెచ్చగొట్టినా ఘర్షణలొద్దు
- సనత్‌నగర్ నియోజకవర్గ పార్టీ శ్రేణులకు మంత్రి తలసాని దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్

సాక్షి, సిటీబ్యూరో: సనత్‌నగర్ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ ఖాయమే అయినప్పటికీ, అత్యధిక మెజార్టీ సాధించే తొలి ఐదు స్థానాల్లో తానుండాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆకాంక్షించారు. ఆ మేరకు పార్టీ శ్రేణులు పనిచే యాలని కోరారు. ఎన్నికల నేపథ్యంలో జలవిహా ర్‌లో ఏర్పాటుచేసిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లా డుతూ, గతంలో ఈ నియోజకవర్గం నుంచి ఎన్నికై ముఖ్యమంత్రిగా పనిచేసిన మర్రి చెన్నారెడ్డి కూడా చేయలేని పనులెన్నో చేసిన తాను...భారీ మెజార్టీని ఆశించడం తప్పు కాదన్నారు. ఎలాగూ గెల వలేమని తెలిసి ప్రతిపక్షాలు కెలికి కయ్యం పెట్టుకుంటాయని, వారెంతగా రెచ్చగొట్టినా ఘర్షణలకు దిగొద్దని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల తర్వాత ఏ పార్టీ వారైనా మనవారేనని, అదే విధా నంతో ఇంతకాలం ఎలాంటి పక్షపాతం లేకుండా అందరి పనులు చేసిన తాను భారీ మెజార్టీ ఆశిస్తు న్నట్లు చెప్పారు. కార్యకర్తలందరూ తాజా ఓటరు జాబితాలో పేరుందో లేదో చెక్ చేసుకోవాలని, లేకుంటే నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి కార్యకర్త తల ఎత్తుకొని తిరిగేలా నియోజకవ ర్గంలో అభివృద్ధి పనులు చేశానని, మీరే అభ్య ర్థుల్లా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. 9వ తేదీన తన నామినేషన్ సందర్భంగా నియోజకవర్గ మంతా కదిలివచ్చినట్లు కనిపించాలన్నారు. సమా వేశంలో పాల్గొన్న సిక్కుసమాజ్, గుజరాత్ సమాజ్, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, వివిధ బస్తీలు, కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు శ్రీనివా స్‌యాదవ్‌కు తమ మద్దతు ప్రకటించారు. కార్పొ రేటర్లు కొలన్ లక్ష్మి, హేమలత, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్లు నామన శేషుకుమారి, ఆకుల రూప, ఉప్పల తరుణి, కిరణ్మయి, డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్‌రెడ్డి, గుర్రం పవన్ కుమార్ గౌడ్, వెంక టేష్ రాజు హన్మంతరావు, శ్రీనివాస్ గౌడ్ తదిత రులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలను కాళేశ్వరంలో ముంచాలా ?

ప్రధానమంత్రి మోదీ, కాంగ్రెస్ వాళ్లు కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ ఏటీఎం అని, అవినీతి ప్రాజెక్టు అని ఆరోపిస్తున్నారని..ప్రాజెక్టులో నీళ్లు లేవంటున్న వాళ్లను తెచ్చి మెడలు పట్టి అందులో ముంచాలా ? అని ప్రశ్నించారు. కాళేశ్వరానికి ముందు రైతుల నుంచి సేకరించిన ధాన్యం 65 లక్షల క్వింటాళ్లు కాగా, ప్రస్తుతం అది ఐదారు రెట్లు పెరగడం వారికి కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు గ్యాస్ సిలిండర్‌కు దండం పెట్టి ఓటేసేందుకు వెళ్లిన మోదీ..అధికారంలోకి వచ్చాక రూ.400 ధరను రూ.1300కు పెంచారన్నారు. ప్రస్తుత ప్రతిపక్ష నేతకు సీఎంను కూడా గౌరవించే సంస్కారం లేదని, ఏకవచనంతో సంబోధిస్తు న్నారని పరోక్షంగా రేవంత్‌రెడ్డినుద్దేశించి వ్యాఖ్యా నించారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గం నుంచే గెలిచి, కేంద్రమంత్రి కూడా అయిన కిషన్‌రెడ్డి ఏనా డైనా మీ సమస్యలు పట్టించుకున్నారా, మీకు అం దుబాటులో ఉన్నారా ? అని ప్రశ్నించారు.

వంద శాతం ఓటింగ్ లక్ష్యం

- ఈ నెల 31వరకు కొత్త ఓటరు నమోదుకు అవకాశం
- పెయిడ్ ఆర్టికల్స్‌పై ప్రత్యేక నిఘా
- ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్



మాట్లాడుతున్న రోనాల్డ్‌రాస్

గన్‌ఫౌండ్రీ: కొత్త ఓటర్లు ఈ నెల 31వ తేదీ వరకు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని జీహెచ్‌ఎంసీ కమిషనర్, నగర ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ తెలిపారు. నగరంలో వంద శాతం ఓటింగ్ నమోదుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఈమేరకు తుది ఓటరు జాబితాను ప్రక్షాళన చేసి నట్లు తెలిపారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఓటింగ్‌పై అవగాహన, కేబుల్ ఆప రేటర్, ఎంఎస్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొత్త ఓటర్లు ఫామ్-6, ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లిన వారు ఫామ్-8తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లో తమ ఓటును రీ చెక్ చేసుకోవాలని కోరారు. నగర వ్యాప్తంగా 2 లక్షల75 వేల నకిలీ ఓట్లను గుర్తించి వాటిని తొలగించామన్నారు. పార దర్శంగా ఓటరు నమోదు ప్రక్రియ సాగుతోందని తెలిపారు. నవంబర్ 10వ తేదీ నుంచి ఓటరు సమా చారం తెలియజేసే స్లిప్‌లను పంపిణీ చేస్తామని వెల్ల డించారు. ఓటరు నమోదు కోసం కళాశాలలు, గెటెడ్ కమ్యూనిటీ, కాలనీలలో ప్రత్యేక సమావేశాలు నిర్వ హించామని, అదే విధంగా ఓటింగ్ శాతం పెంచడం కోసం కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. వయోవృద్ధు లు(80కి పైబడిన వారు), వికలాంగులు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫామ్-12 ద్వారా దరఖాస్తు చేసుకో వాలని సూచించారు.

పక్కాగా ఎన్నికల నియమావళి అమలు

హైదరాబాద్ జిల్లాలో ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేస్తున్నట్లు రొనాల్డ్ రాస్ వెల్లడిం చారు. అందులో భాగంగా వివిధ శాఖల సమన్వయంతో నగర సరిహద్దుల్లో 18 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నియమావళి అమ లులో ఉన్నందున పౌరులు లెక్కకు మించిన నగ దును తీసుకెళ్లాలంటే సంబంధిత ధృవ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. తనిఖీలలో పట్టుబడిన నగదును పరిశీలించడానికి జిల్లా కలెక్టరే ట్‌లో గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశామన్నారు. సోమవారం వరకు రూ.18.9 కోట్ల నగదు సీజ్, 2389 ఆయుధాలు డిపాజిట్, 2300 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అంతే కాకుండా గత 6 నెలల నుంచి మద్యం అమ్మకా లను పరిశీలి స్తున్నట్లు తెలిపారు. 128 కేసులు బుక్ చేశామని, అక్రమ మద్యం, డ్రగ్స్ వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెయిడ్ ఆర్టికల్స్‌పై నిఘా: కలెక్టర్

టీవీ, దినపత్రిక, కేబుల్ చానళ్లలో ప్రసారమయ్యే ఎలాంటి రాజకీయ ప్రకటనలైనా వాటికి ఎన్నికల నియమావళి వర్తిస్తుందని కలెక్టర్ అనుదీప్ తెలి పారు. పెయిడ్ ఆర్టికల్స్ పర్యవేక్షణ కోసం జీహెచ్ ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎంసీఎంసీ(మీడియా సర్టిఫికేషన్-మీడియా మానిటరింగ్) కమిటీ ఏర్పాటు చేశామన్నారు. కేబుల్ చానల్‌లో రాజకీయ ప్రకటనల కోసం అనుమతి తీసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న 24 గంటల వ్యవధిలో అనుమతి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అనం తరం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సువిధ, ఎంసీఎంసీ, 1950 కాల్‌సెం టర్‌ను వారు సందర్శించారు.

పండగల వేళ... ఓట్ల సంబురం

- మేనిఫెస్టోతో...మళ్లీ ప్రజల వద్దకు బీఆర్‌ఎస్
- 18న మేడ్చల్‌లో సీఎం కేసీఆర్ ఎన్నికల సభకు ఏర్పాట్లు
- ఆరు గ్యారంటీలతో.. ఇంటింటికీ కాంగ్రెస్
- అసంతృప్తుల మచ్చికకు నేతల యత్నం
- తొలి జాబితాపై కమలం ఆశావహుల్లో ఉత్కంఠ



సాక్షి, మేడ్చల్ జిల్లా: సద్దుల బతుకమ్మ, దసరా..దీపావళి పండగలు సమీపి స్తున్న తరుణంలో వీటికి కాస్త అటు ఇటుగా ఓట్ల సంబురంపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. ప్రచార పర్వంలో వ్యూహాత్మకంగా ఒక పార్టీకి మించి మరో పార్టీ ముం దుకెళ్లేందుకు ప్రయత్నాలు ఆరంభించాయి. వచ్చే నెల 30న పోలింగ్‌కు ముహూర్తం ఖరారైంది. బరిలోకి దిగే పార్టీల అభ్యర్థులు వచ్చే నెల 3 నుంచి 10లోపు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. కొద్ది రోజు ల్లోగానీ ఏ నియోజకవర్గంలో ఎవరు పోటీలో ఉంటారనేది తేలిపోనుంది. అధికార బీఆర్‌ఎస్ ఇప్పటికే అభ్యర్థిత్వాలను ఖరారు చేయగా, అధినేతతోపాటు అభ్యర్థులంతా ప్రచార గోదాలోకి దిగారు. కాంగ్రెస్ పార్టీ జిల్లాలో ఐదింటికి గానూ ..మొదటి విడతలో మేడ్చల్, ఉప్పల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్ అభ్యర్థులను ప్రకటించగా, కూకట్‌పల్లి ఆశావ హుల్లో మాత్రం ఇంకా టెన్షన్ కొనసాగుతోంది. భారతీయ జనతా పార్టీ తొలి జాబితాను బుధ వారం ప్రకటించనుండటంతో..ఆశావహులు తమ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు.

మళ్లీ ప్రజల వద్దకు బీఆర్‌ఎస్

బీఆర్‌ఎస్ సిట్టింగులకే మెజారిటీ సీట్లు ఇవ్వ టంతో అభ్యర్థులు గడిచిన నెల రోజుల్లో నియో జకవర్గాలను ఒక దఫా చుట్టేశారు. ప్రారం భోత్సవాలు. శంకుస్థాపనలు, సంక్షేమ పథకాల పంపిణీ వంటి కార్యక్రమాలు వారు ప్రజల్లోకి వెళ్లటానికి అవకాశంగా మారాయి. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన క్రమం లో కుల సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ.. ముందుకెళ్తున్నారు. మేనిఫెస్టో విడుదలతో.. అందులోని అంశాలు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే విధంగా అభ్యర్థులు తగిన కార్యాచరణతో ప్రజల వద్దకు వెళ్తున్నారు.

కేసీఆర్ సభపై దృష్టి

బీఆర్‌ఎస్ తొలివిడత ఎన్నికల ప్రచార సభల్లో భాగంగా ఈ నెల 18 (బుధవారం)న మేడ్చ ల్‌లో నిర్వహించ తలపెట్టిన సీఎం కేసీఆర్ ఎన్ని కల బహిరంగసభ ఏర్పాట్లపై పార్టీ యంత్రాం గం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. సభ విజయవం తానికి మంత్రి మల్లారెడ్డి ప్రత్యేక చర్యలు తీసు కుంటున్నారు. వాహనాలు, జనసమీకరణపై బీఆర్‌ఎస్ దృష్టి కేంద్రీకరించింది.

ఆరు గ్యారంటీలతో..కాంగ్రెస్

ఆరు గ్యారంటీలంటూ ఎన్నికల రణంలోకి దూకిన కాంగ్రెస్ పార్టీ...నాలుగింటిలో అభ్యర్థుల ఎంపిక పూర్తి కావటంతో ..ఇంటిం టికి, గడప గడపకు ప్రచార కార్యక్రమం చేపట్టిం ది. మల్కాజిగిరి, మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థులు తమ ప్రచారాన్ని ఉధృతం చేసే ప్రయత్నం చేస్తుండగా, మిగతా నియోజకవర్గాల్లో అసంతృ ప్తులను బుజ్జగించేందుకు పలువురు కాంగ్రెస్ నేతలను అధిష్టానం రంగంలోకి దింపింది.

కమలం.. ఆచితూచి..

భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల ఎంపికపై ఆచితూచి అడుగులు వేస్తోంది. తొలి జాబితా బుధవారం ప్రకటించనున్న నేపథ్యంలో ఆశా వహులు టెన్షన్‌కు గురవుతున్నారు. మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజక వర్గాల్లో ఆశావహులు ఎక్కువగా ఉండటం తో..గెలుపు గుర్రాలకు మాత్రమే టికెట్లు ఇవ్వాలన్న యోచనతో కమలం పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది.



గోవా టు హైదరాబాద్‌

డ్రగ్స్‌ సరఫరా చేస్తున్న ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలు

నాగోలు: అక్రమంగా గోవా నుంచి హైదరాబాద్‌కు ఎండీఎంఏ డ్రగ్‌ పిల్స్‌ సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎల్‌బీనగర్‌ ఎస్‌ఓటీ, ఎల్‌బీనగర్‌ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి డ్రగ్‌ పిల్స్‌ (ఎక్టసీ పిల్స్‌) 27, రెండు సెల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొంపల్లి, సుచిత్ర ప్రాంతానికి చెందిన సోలమన్‌ సుసైరాజ్‌ తరచూ గోవా వెళ్లి అక్కడ నివాసం ఉంటున్న ఆఫ్రికా దేశానికి చెందిన ఫేవర్‌ వద్ద డ్రగ్స్‌ కొనుగోలు చేసి పాత బోయిన్‌పల్లికి చెందిన దేవరాయ్‌ క్రిష్ణకాంత్‌కు అప్పగించేవాడు. అతను వాటిని నగరంలోని పలు ప్రాంతాల్లో విక్రయించేవాడు. సోమవారం సాలమన్‌ గోవా నుంచి ఎండీఎంఏ డ్రగ్‌ పిల్స్‌ను తీసుకువస్తున్నట్లు సమాచారం అందడంతో నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు ఎల్‌బీనగర్‌ ప్రాంతంలో క్రిష్ణకాంత్‌తో పాటు అతడిని అరెస్టు చేశారు. వారి నుంచి 27 డ్రగ్‌ పిల్స్‌, రెండు సెల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్‌ సరఫరా చేసిన ఫేవర్‌ పరారీలో ఉన్నట్లు తెలిపారు. సోలమన్‌ సుసైరాజ్‌ను గతంలో అమీర్‌పేట ఎక్సైజ్‌ పోలీసులు ఎన్‌డీపీఎస్‌ కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వివరించారు.

సామాన్యుడి పరువు రోడ్డు కీడుస్తున్నారు!

- ఎన్నికల నేపథ్యంలో పోలీసుల విస్తృత తనిఖీలు
- ఎక్కడిక్కడ నగదు, బంగారం, వెండి స్వాధీనం
- పార్టీలు, అభ్యర్థులతో సంబంధాలపై విచారణ
- రూఢీ కాకుండానే పేర్లు, ఫొటోలు మీడియాకు

సాక్షి, సిటీబ్యూరో: 'ఏదైనా క్రిమినల్‌ కేసుకు సంబంధించి పోలీసులు అదుపులోకి తీసుకున్న, అరెస్టు చేసిన నిందితుడు న్యాయస్థానంలో దోషిగా తేలే వరకు అతడి ఫొటోలు, వీడియోలు బహిర్గతం చేయకూడదు' అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీలు, సోదాల్లో చిక్కుతున్న 'లెక్కలు లేని' సొమ్ముతో పాటు దొరికే వ్యక్తులకు సంబంధించిన వివరాలు మీడియాకు ఎలా వెల్లడిస్తున్నారన్నది అంతుచిక్కడం లేదు.

'కోడ్‌' అమలులో ఇవీ భాగమే...

ఎన్నికల నేపథ్యంలో షెడ్యూల్‌ వెలువడిన నాటి నుంచి కోడ్‌ ఆఫ్‌ కాండక్ట్‌ అమలులోకి వస్తుంది. ఇందులో భాగంగా నగదు, మద్యం, బంగారం, వెండి సహా ఇతర వస్తువుల అక్రమ రవాణాపై నిఘా వేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా పోలీసు విభాగం ఎక్కడికక్కడ తనిఖీలు, సోదాలు నిర్వహిస్తుంది. ఎన్నికల నేపథ్యంలో అసాంఘిక శక్తుల కదలికలకు అడ్డుకట్ట వేయడానికి, ఓటర్లను ప్రభావితం చేసే, ప్రలోభాలకు గురి చేసే వాటిని అడ్డుకునేందుకు ఈ చర్యలు అనివార్యం. అయితే అసలు చిక్కంతా... దీనిపై పోలీసులు చేస్తున్న 'ప్రచారం' వల్లే వచ్చిపడుతోంది. రూ.లక్షకు మించి నగదు తరలిస్తున్న వ్యక్తులు దానికి సంబంధించిన వివరాలు, మూలం చెప్పకపోతే స్వాధీనం చేసుకునే అధికారం పోలీసులకు ఉంది. అదే ఆదాయపు పన్ను శాఖ అధికారులైతే ఇన్‌కంట్యాక్స్‌ యాక్ట్‌లోని 132 సెక్షన్‌ కింద స్వాధీనం చేసుకుంటారు. ఆపై సదరు అనుమానితుడు ఆ సొమ్ముకు లెక్కచూపిస్తే తిరిగి అప్పగిస్తారు.


'ఎన్నికల'తో లింకులు బయటపడకపోయినా...

రాష్ట్ర పోలీసు విభాగం ఇప్పటి వరకు పట్టుకుంటున్న నగదు, నగలు, వస్తువులతో 'ఎన్నికల' లింకులు బయటపడలేదు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడానికే వీటిని తరలిస్తున్నట్లు ఎక్కడా రూఢీ కాలేదు. కేవలం సరైన పత్రాలు, బిల్లులు, ఇన్వాయిస్‌లు లేకుండా తీసుకువెళ్తున్న ఆరోపణలతోనే స్వాధీనాలు జరుగుతున్నాయి. ఇలా సీజ్‌ చేసిన నగదు రూ.2 లక్షల లోపు ఉంటే పూర్వాపరాలు పరిశీలించి, దాని యజమాని ఇచ్చే సమాధానంతో సంతృప్తి చెందితే పోలీసులే తిరిగి ఇచ్చేయవచ్చు. ఆ నగదు రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల మధ్య ఉంటే అది జిల్లా ఎన్నికల అధికారి నియమించే కమిటీ వద్దకు వెళ్తుంది. నలుగురు సభ్యులతో ఉండే ఈ కమిటీకి సదరు మొత్తాన్ని అప్పగిస్తారు. నగదు యజమాని కమిటీ ఎదుట హాజరై నగదు మూలం, అవసరాలకు సంబంధించి వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. దీనిపై కమిటీ సంతృప్తి చెందితే నగదు తిరిగి అప్పగిస్తుంది. పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు రూ.10 లక్షలకు మించితే విషయం ఆదాయపు పన్ను శాఖకు నివేదించాల్సి ఉంటుంది. రాజకీయ పార్టీలు, నేతలతో సంబంధాలు బయటపడే వరకు వీటిని కలిగి ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ఆస్కారం లేదు.

వ్యాపార, వాణిజ్య ప్రాంతాల్లో తనిఖీలు...

ఎన్నికల సంఘం ఆదేశాల పేరు చెబుతున్న పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. కోడ్‌ అమలులో ఉన్నన్ని రోజు ఎలక్షన్‌ సెల్‌ పని చేస్తుంది. క్షేత్ర స్థాయి పోలీసులు, అధికారులు నిత్యం దీనికి డెయిలీ సిట్యుయేషన్‌ రిపోర్టు (డీఎస్‌ఆర్‌) పంపిస్తుండాలి. ఈ నివేదిక ఆధారంగానే వారి పనితీరును ఈసీ నిర్ణయిస్తుంది. ఈ నేపథ్యంలోనే పోలీసులు తమ పనితీరు బయటకు చెప్పుకోవడానికి మాత్రమే ఇలా మీడియా దగ్గర హడావుడి చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఎవరూ రూ.2 లక్షలకు మించి నగదు రూపంలో లావాదేవీలు చేయకూడదు. అయితే ప్రభుత్వం, యంత్రాంగాలు, ఆదాయపు పన్ను శాఖ... ఔనన్నా, కాదన్నా ఇప్పటికే చాలావరకు నగదు రూపంలోనే లావాదేవీలు జరుగుతున్నాయి. దీంతో వ్యాపార, వాణిజ్య ప్రాంతాలతో పాటు నిర్మాణ, రియల్‌ ఎస్టేట్‌ రంగాలకు చెందిన వారూ నగదు తీసుకెళ్లడం పరిపాటి. వీరి కదలికలు ఉండే ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేస్తూ, చిక్కిన నగదుతో పాటు దాని యజమానుల వివరాలను బయటకు చెబుతున్నారు. ఫలితంగా వ్యాపారులు, కొందరు ఉద్యోగుల పరువుకు భంగం వాటిల్లుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో తనిఖీల్లో సొమ్ము, సొత్తు వివరాలు వెల్లడించినా.. సంబంధీకుల వివరాలు 'అక్రమం' అని తేలే వరకు వెల్లడించకపోవడం ఉత్తమం అనే వాదన వినిపిస్తోంది. దీని వల్ల నిజమైన 'అక్రమార్కులు' పట్టుబడటంతో పాటు అమాయకుల పరువు బజారున పడకుండా ఉంటుంది. మరోపక్క ఇలాంటి తనిఖీలను మీడియాకు ప్రదర్శించడం ద్వారా 'అసలు నగదు' తరలిస్తున్న వారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకునే ప్రమాదమూ ఉంది.





సికింద్రాబాద్‌ నుంచి పోటీ చేస్తా: కేఏ పాల్‌


తుకారాంగేట్‌ మరాఠా బస్తీలో పర్యటిస్తున్న కేఏ పాల్‌

అడ్డగుట్ట: తనకు అవకాశమిస్తే సికింద్రాబాద్‌ నియోజకవర్గాన్ని ఆదర్శనీయంగా తీర్చిదిద్దుతానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కే.ఏ పాల్‌ అన్నారు. ఇక్కడి నుంచే ప్రజాశాంతి తరుపున పోటీ చేస్తానని, ప్రజలు తనను ఆదిరించాలని కోరారు. సోమవారం అడ్డగుట్ట డివిజన్‌లోని తుకారాంగేట్‌ మరాఠా బస్తీలో ఆయన పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాల్‌ మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో ఒక్క అంశం కూడా నెరవేర్చే విధంగా లేవన్నారు. బంగారు తెలంగాణ చేస్తానని మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేశాడని, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజాశాంతి పార్టీ తరపున బరిలో ఉండాలని కోరుకునే వారు పార్టీ కార్యాలయంలో సంప్రదించాలని ఈ సందర్భంగా చెప్పారు.

ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

అల్వాల్: సైనిక్‌పురి శృంగేరి శంకరమఠం విజయ గణపతి ఆలయంలో శారదా శరణం నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం అమ్మవారిని మహేశ్వరిగా అలంకరించి వృషభవాహనంపై ఊరేగించారు.

గౌతం నగర్‌లో..

గౌతంనగర్‌ డివిజన్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో దేవీనవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభంగా కొనసాగుతున్నాయి. ఓల్డ్‌ మిర్జాల్‌గూడలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు చేశారు.


ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

నల్లగొండలో తీగ లాగితే సిటీ డొంక కదిలింది!

- ఆదివారం దామరచర్ల వద్ద రూ.3.04 కోట్లు సీజ్‌
- ఆ నగదు మూలాలు నగరంలో ఉన్నట్లు గుర్తింపు
- రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్‌ నార్త్‌జోన్‌ బృందం
- నలుగురి పట్టివేత, రూ.2.09 కోట్లు స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో: నల్లగొండ జిల్లాలో ఆదివారం చిక్కిన హవాలా గ్యాంగ్‌ తీగ లాగితే... హైదరాబాద్‌లోని ఉత్తర మండల కేంద్రంగా దందా చేస్తున్న సూత్రధారులు చిక్కారు. నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2.09 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్‌ ఓఎస్డీ పి.రాధాకిషన్‌ రావు సోమవారం వెల్లడించారు. గుజరాత్‌కు చెందిన దినేష్‌ కుమార్‌, సచిన్‌ కుమార్‌ నగరానికి వలసవచ్చారు. వీరు ఉత్తరాదికి చెందిన హవాలా ముఠాలతో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నారు. వారి ఆదేశాల మేరకు సిటీలోని వివిధ ప్రాంతాలతో పాటు రాష్ట్రం, ఇతర రాష్ట్రాలకు నగదు సరఫరా చేస్తున్నారు. తమ వద్ద పని చేసే విపుల్‌ కుమార్‌ భాయ్‌, అమర్‌ సిన్హా జాలలకు రూ.3.04 కోట్లు అప్పగించారు. తమ కారు కింది భాగంలో ప్రత్యేక అర ఏర్పాటు చేసుకున్న వీరు అందులో నగదు నింపారు. ఆ మొత్తాన్ని చెన్నై తరలిస్తుండగా.. ఆదివారం నల్లగొండ జిల్లా, దామరచర్ల మండలం, వాడపల్లి వద్ద పోలీసులకు చిక్కారు. విచారణలో సూత్రధారులు నగరంలో ఉన్నట్లు తెలిసింది. దీనిపై సమాచారం అందుకున్న నార్త్‌జోన్‌ టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ కె.సైదులు నేతృత్వంలో ఎస్సైలు బి.అశోక్‌రెడ్డి, పి.గగన్‌దీప్‌, జి.నవీన్‌తో కూడిన బృందం రంగంలోకి దిగింది. లోతుగా ఆరా తీయగా దినేష్‌ కుమార్‌ పాటిల్‌, సచిన్‌కుమార్‌ విష్ణుభాయ్‌ పాటిల్‌, జితేందర్‌ పాటిల్‌, శివ్‌రాజ్‌ నవీన్‌ భాయ్‌ మోడీ, మీట్‌ రాకేష్‌ పాటిల్‌, తఖోర్‌ నాగ్జీ ఈ హవాలా దందాలో కీలకమని తేలింది. నల్లగొండ జిల్లాలో తమ నగదు చిక్కిన విషయం తెలుసుకున్న వీరు తమ వద్ద ఉన్న నగదును బ్యాగుల్లో పెట్టి మరోప్రాంతానికి తరలించే ప్రయత్నం చేశారు. ఈ విషయం గుర్తించిన టాస్క్‌ఫోర్స్‌ టీమ్‌ గాంధీనగర్‌ ప్రాంతంలో నిఘా వేసింది. అటుగా వెళ్తున్న కారు, ద్విచక్ర వాహనాన్ని అడ్డుకుని తనిఖీ చేయగా రూ.2.09 కోట్లు లభించాయి. నిందితులతో పాటు నగదును తదుపరి చర్యల నిమిత్తం గాంధీనగర్‌ పోలీసులకు అప్పగించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

■ Affordable 3BHK Flats IN Ready to Occupy Gated Community Must SEE ! Last 2 Flats Available for sale No GST 9490439711 [H-193220]

■ Near Kowkur, Yapral, Sec-Bad, Ready to Occupy 3BHK Flats -1715 SFT & 1945 SFT Gated Community, Clubhouse, Near GHMC Park Must See Call: 8247859501 [H-193221]

Services

■ బ్యాంక్‌,ప్రైవేట్‌ సంస్థలలోతాకట్టుపెట్టిన బంగారంను మా డబ్బుతో విడిపించి ఇతర సంస్థలలో తక్కువ(89పైసలు)వడ్డీకి,ఎక్కువగ్రాము (4500) రేటుకు తాకట్టు పెట్టించబడును.8977044454. [T-764094]

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్‌, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్‌ ధరకు కొనబడును Ph: 9100329739 [H-788377]

BUSINESS OFFER

■ ఇంటి నుండి 100 రకాల ఉత్పత్తులతో రోజు సంపాదన. LED's, TV's, AC's, Mobiles కొత్తవి కొన/అమ్మబడును. EMI, Credit Cardలో బ్యాలెన్స్‌ ఉన్నవారికి Spot పర్సనల్‌/ బిజినెస్‌ ఫైనాన్స్‌ సలహాలకై సంప్ర: 9100729447 [HA-3380]

OLD AGE HOME

■ వృద్ధులకు, బెడ్‌పేషెంట్స్‌కు, దీర్ఘ వ్యాధులతో ఉన్నవారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24గం॥ వైద్య, భోజనం వసతి ఉప్పల్‌, ECIL, Hyd. సంప్ర: 9949520296, 7981467036. [H-189498]

HOME NEEDS

PEST CONTROL

■ వాసనలేని మరకలు పడని ISI కెమికల్స్‌ 5 సం॥ వ్యారంటీతో చెదలు (బొద్దింకలు, నల్లులు, బల్లులు) నివారించే సంస్థ, హిందుస్థాన్‌ పెస్ట్‌ కంట్రోల్‌. సంప్ర : 7981533849, 9490178238. [HA-732]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Jannamraju Mahender Rao Father of Jannamraju Anandavenkat Rao Previously Called as Jannamaraju Ananda Venkat,11 years,Student, R/o. Flat No.505, Prakruthi Residency Spring field Colony Jeedimetla vi Hyderabad, My Son name changed from Jannamaraju Ananda Venkat (old name) to Jannamraju Anandavenkat Rao (new name) for future Records Purpose [HA-1549]

■ I, Madhuri R/o H.No 7-268/1, Adarsh Colony, Patancheru Mandal, Chitkul, Sangareddy Telangana-502307 changed my name to Poojari Madhuri [UA-36788]

■ I, M A Zafarullah Khan S/o: M A Rahman Khan, R/o: 18-13-8 /A/447/1 Wadi-e-Farhan Bandla guda ChandrayanGutta Hyderabad-500005, aged 69 Yrs changed my Name from Zafarullah Khan to M A Zafarullah Khan [UA-36792]

■ I, Guntku Rajendar S/o, Kistaiah R/o H. No. 10-43/3, Main Road, Gandhari(v&m), Kamareddy Dist. 503114 have changed my name to Guntuku Rajender for all purposes. [DA-9138]

Wanted

■ హయత్‌నగర్‌ లోని రెడ్డి మెస్‌లో పని చేయడానికి కుకింగ్‌ మాస్టర్స్‌ & హెల్పర్స్‌ కావలెను. మంచి జీతం మరియు టిఫిన్‌, భోజనం+వసతి కల్పించబడును. ఫోన్‌ : 9347171036 [HA-793413]

■ ప్రముఖ హౌస్‌ కీపింగ్‌ సర్వీసెస్‌ బోడుప్పల్‌ ఏరియాలో ఆఫీస్‌బాయ్‌, హౌస్‌ కీపింగ్‌ బాయ్స్‌ & ఫీల్డ్‌ ఆఫీసర్స్‌ కావలెను. 8 గం. డ్యూటీ. సంప్ర: 6281854047 [HA-793472]

■ రిసెప్షనిస్ట్‌, టెలికాలర్లు-హోం బేస్డ్‌ DTP డాటా ఎంట్రీ, వీడియో ఎడిటింగ్‌, యాంకర్లు, హెల్పర్స్‌, డ్రైవర్లు, కలెక్షన్‌ బాయ్స్‌, సూ॥వైజర్‌, ఇంగ్లీష్‌ టీచర్లు, మజీ॥ 10-16K, ఫ్రీ రూం మీల్స్‌ @9505261777 [H-788338]

■ లాండ్రీ సర్వీస్‌లో ఇస్త్రీ / Ironing చేయుటకు మనుషులు కావలెను. టిఫిన్‌ + మధ్యాహ్న భోజనం + జీతం- 21,000/- ఫోన్‌ : 8897754655 [HA-189613]

■ అన్నపూర్ణ హోమ్‌కేర్‌ పెద్దవారికి సేవ చేయుటకు, పేషెంట్‌ కేర్‌, కేర్‌ టేకర్స్‌, ఆయాలు, స్త్రీ/పురుషులు కావలెను. జీతం : 16000/- 30000/- రూమ్‌ + భోజన సౌకర్యం కలదు. ఫోన్‌ : 9390427694 [H-788833]

■ బంజారాహిల్స్‌రోడ్‌ నం. 3, అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న చిన్న ముస్లిం కుటుంబానికి చిన్న బేబీస్‌ ను చూసుకొనుటకు ఇంట్లోనే ఉండి, పూర్తి సమయం కోసం ఒంటరి లేదా వితంతువు లేడీ ఒక ఆడమనిషి కావలెను. 8106564907 [HA-193316]

■ చైతన్యపురిలోని ASPR Marketing Pvt. Ltd., కంపెనీలో పనిచేయడానికి లేడీ టెలికాలర్‌ కావలెను. (Fluency-Hindi, English & Telugu) ఫోన్‌:9390356112 [HA-793412]

■ V.B. Johnson Elevators Lift కంపెనీలో లేడీ రిసెప్షనిస్టు (తెలుగు, హిందీ ఇంగ్లీష్‌) 2 Years Exp. వారు కావలెను. ఫోన్‌ : 9154954305, 9177762495 [HA-189612]

■ ఉప్పల్‌ డిపో వద్ద మా ఫార్మా కంపెనీకి అనుభవం గల క్లర్క్‌ విత్‌ కంప్యూటర్‌ ఆపరేటర్‌, టూరింగ్‌ చేయగల సేల్స్‌ ఎగ్జిక్యూటివ్స్‌ కావలెను. ఫోన్‌ : 7989823219 [HA-793367]

■ త్రివేణి హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీతం: 18K. Ph: 9640400073/9848571888 [H-189342]

■ రామకృష్ణ గ్రూపు (AP NO-1) VJA, HYD. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, ఇంటి/ వంట పని, బేబికేర్‌ కొరకు వర్కర్స్‌ కావలెను, భోజనం+వసతి+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్‌ ✆ 92814 52828, 92814 52833 [B-1068147]

■ ప్రముఖ విద్యాసంస్థకు హైదరాబాదు ఉప్పల్‌ నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్‌, టీచర్స్‌, మార్కెటింగ్‌ ఎగ్జిక్యూటివ్స్‌ కావలెను. ఆకర్షణీయమైన జీతం+ ఇన్సెంటివ్‌ ఇవ్వబడును. సంప్రదించండి. సెల్‌:8880118899 [G-4740]

■ Profound Infra Real Estate Company Required 50 No's- Sales & Marketing Executives. Attractive Salary+ Incentives. @Kondapur. Ph:9390807711 [HA-733]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్‌ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

జోన్‌ సెంటర్స్‌

దిల్‌సుఖ్‌నగర్‌	9912348016	రాజేంద్రనగర్‌	9010202372
ఎల్‌.బి.నగర్‌	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్‌	9951602997
సికింద్రాబాద్‌	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్‌	9705144457	చందానగర్‌	9010213322
అమీర్‌పేట్‌	9505507563	ఉప్పల్‌	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్‌, రోడ్‌ నెం. 1, బంజారాహిల్స్‌, హైదరాబాద్‌ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

ఉత్తమ పరిశోధకులకు సన్మానం


ఉత్తమ పరిశోధకులతో ప్రొ.మహమూద్‌.

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.కవి కిశోర్‌, పద్మశ్రీ డాక్టర్‌ వహీద్‌లను రాష్ట్ర ఉన్నత విద్య మండలి వైస్‌ చైర్మన్‌ ప్రొ.ఎస్‌కే మహమూద్‌ సోమవారం తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్‌ యూనివర్సిటీ ప్రపంచస్థాయిలో టాప్‌-2 పరిశోధకులుగా ప్రొ.కవికిశోర్‌, డాక్టర్‌ వహీద్‌లను గుర్తించినట్లు తెలిపారు. వర్సిటీలు వారిని ఆదర్శంగా తీసుకోవాలని ప్రొ.మహమూద్‌ పేర్కొన్నారు.

చిల్డ్రన్స్‌హోం నుంచి బాలిక అదృశ్యం


మంచాల ప్రియ

వెంగళరావునగర్‌ : చిల్డ్రన్‌ హోంలో ఆశ్రయం పొందుతున్న బాలిక అదృశ్యమైన సంఘటన మధురానగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్‌ జిల్లా, ఉప్పనంతల గ్రామానికి చెందిన మంచాల ప్రియను 2020లో అమీర్‌పూర్‌ చిల్డ్రన్స్‌హోం నుంచి మధురానగర్‌లోని చిల్డ్రన్‌హోంకు తీసుకువచ్చారు. కాగా ఆమె పలుమార్లు హోం నుంచి పారిపోగా పోలీసులు వెతికి తెచ్చి హోంలో అప్పగించారు. తనకు హోంలో ఉండటం ఇష్టం లేదని తోటి విద్యార్థులతో తరచూ చెప్పే ప్రియ ఆదివారం రాత్రి ఎవరికీ చెప్పకుండా హోం నుంచి పారిపోయింది. హోంలో కుక్‌గా పని చేస్తున్న గుర్రం యాదమ్మ ఫిర్యాదు మేరకు మధురానగర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

53 మందితో ధర్మ సమాజ్‌ పార్టీ తొలి జాబితా

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు-2023లో భాగంగా 'ధర్మ సమాజ్‌ పార్టీ' 53 మంది ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. సామాజికంగా 93 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ అణగారిన వర్గాలకు చెందిన అభ్యర్థులనే ధర్మ సమాజ్‌ పార్టీ తరపున నిలబెడుతున్నామని పార్టీ అధ్యక్షులు డా.విశారదన్‌ మహారాజ్‌ పేర్కొన్నారు. ఈ నెల 20న 2వ విడత, 26న 3వ విడతలో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో తమ అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌, బీజేపీల మోసపూరిత వైఖరిని ఎన్నికల సంగ్రామంలోనే ఎండగడతామన్నారు.

జస్టిస్‌ వి.భాస్కర్‌రావు కన్నుమూత


జస్టిస్‌ వి.భాస్కర్‌రావు(ఫైల్‌)

ఉప్పల్‌: హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్‌ వి.భాస్కర్‌రావు (94) సోమవారం కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మహబూబ్‌నగర్‌ జిల్లాకు చెందిన భాస్కర్‌ రావు ప్రస్తుతం ఉప్పల్‌ ఈస్ట్‌ కల్యాణపురిలో నివాసముంటున్నారు. ఆయనకు భార్య లలితాదేవి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీఎస్సీ ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన 1963లో న్యాయవాద వృత్తి చేపట్టారు. దేవరకొండ, నల్లగొండలో పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌గా పని చేశారు. 1981లో డిస్ట్రిక్‌ సెషన్స్‌ జడ్జిగా విధులు నిర్వర్తించారు. రాజమండ్రి, శ్రీకాకుళం, సికింద్రాబాద్‌లో జిల్లా జడ్జిగా, ఉమ్మడి హైకోర్టు రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించారు. 1995లో ఉమ్మడి ఏపీలో అదనపు న్యాయమూర్తిగా, 1997లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 1999లో హైకోర్టు జడ్జిగా పదవీ విరమణ పొందిన ఆయన ప్రస్తుతం కమిటీ ఫార్మ్‌డ్‌ ప్రివెంటివ్‌ డిటెక్షన్‌ యాక్ట్‌ చైర్మన్‌గా పని చేస్తున్నారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో జస్టిస్‌ భాస్కర్‌రావు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎస్‌ఓటీ పోలీసుల అత్యుత్సాహం

- మద్యం షాప్‌ల కలెక్షన్‌ సీజ్‌
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు
- షాప్‌లు మూసివేసి నిరసన

కుత్బుల్లాపూర్‌: ఎన్నికలను నేపథ్యంలో ఎస్‌ఓటీ పోలీసుల అత్యుత్సాహం కారణంగా మద్యం వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. ఆదివారం రాత్రి 11 గంటల వరకు దుకాణాల వద్ద సివిల్‌ డ్రెస్‌లో వచ్చి తిష్ట వేసిన ఎస్‌ఓటీ సిబ్బంది ఆ తర్వాత సిబ్బంది చేతిలో ఉన్న డబ్బులను తీసుకెళ్లడంతో ఎటూ పాలుపోని పరిస్థితి నెలకొంది. కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇదే తరహాలో ఆదివారం రాత్రి ఆకస్మాత్తుగా ఎస్‌ఓటీ పోలీసుల పేరుతో తనిఖీల పేరిట హల్‌చల్‌ చేశారు. అధికారుల వైఖరికి నిరసగా సోమవారం మద్యం వ్యాపారులు సమావేశమై స్వచ్ఛందంగా 34 మద్యం దుకాణాలను మూసివేశారు. ఈ విషయమై పోలీస్‌ ఉన్నతాధికారుల నుంచి మద్యం దుకాణదారులకు స్పష్టమైన హామీ అందడంతో సోమవారం సాయంత్రం నుండి యథావిధిగా దుకాణాలు తెరిచి అమ్మకాలు కొనసాగించారు.



మద్యం దుకాణాలను మూసి వేసిన దృశ్యం

హెయిర్‌ సెలూన్‌ యజమాని దారుణ హత్య

బిహార్‌ యువకుడిపై కుటుంబసభ్యుల అనుమానం


అశోక్‌ (ఫైల్‌)


అశోక్‌ మృతదేహం

మూసాపేట: ఓ హెయిర్‌ సెలూన్‌ యజమాని దారుణ హత్యకు గురైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని పాపారాయుడు పేటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కూకట్‌పల్లి సీఐ సురేందర్‌ గౌడ్‌ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నర్సాపూర్‌, పోతంశెట్టి గ్రామానికి చెందిన అశోక్‌ (47) కుటుంబంతో సహా పాపారాయుడు నగర్‌లో నివాసం ఉంటూ హర్ష లుక్స్‌ పేరుతో సెలూన్‌ నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి షాప్‌ షట్టర్‌ సగం వరకు మూసి ఉండటంతో కస్టమర్లు ఉండవచ్చని కుటుంబ సభ్యులు భావించారు. ఆ తర్వాత అతడి భార్య నీరజ ఫోన్‌ చేయగా రెండు సార్లు కట్‌ చేశారు. మూడోసారి ఫోన్‌ స్విచాఫ్‌ రావటంతో అనుమానం వచ్చిన ఆమె కుమారుడిని షాప్‌ వద్దకు పంపింది. అతను అక్కడికి వెళ్లి చూడగా షట్టర్‌ బయట రక్తం మరకలు ఉండటంతో అనుమానం వచ్చి షాప్‌ తెరవగా అశోక్‌ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. దీంతో అతను పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించారు. గుర్తు తెలియని వ్యక్తులు అశోక్‌పై పలు మార్లు కత్తెరతో పొడిచి హత్య చేసినట్లు గుర్తించారు. షాప్‌లోని సీసీ కెమెరాలను ధ్వంసం చేయడమేగాక రికార్డర్‌, మృతుని మొబైల్‌ను సైతం ఎత్తుకెళ్లారు. బీహార్‌కు చెందిన పంకజ్‌ అనే యువకుడు అశోక్‌ను హత్య చేసి ఉండవచ్చునని అతడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారని, ఆ విషయంపై ఇంకా స్పష్టత రాలేదన్నారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామన్నారు. క్లూస్‌ టీం, డాగ్‌ స్క్వాడ్‌ బృందాలతో తనిఖీలు చేపట్టారు.

గతంలో పనిచేసిన బిహారీ పనేనా?

బిహార్‌కు చెందిన పంకజ్‌ నాలుగు నెలల క్రితం అశోక్‌ వద్ద పని చేసేవాడు. సరిగ్గా పని చేయకపోవడంతో అశోక్‌ అతడిని ఉద్యోగంలోంచి నుంచి తీసివేశాడు. దీంతో కక్ష పెంచుకున్న పంకజ్‌ మరికొందరితో కలిసి హత్య చేసి ఉండవచ్చునని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

ఎన్నికల తనిఖీల్లో రూ.4.92 కోట్ల నగదు పట్టివేత

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ గౌతమ్‌ వెల్లడి

సాక్షి,మేడ్చల్‌ జిల్లా: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా నగదు, మద్యం తరలింపుపై పోలీసులు, ఎన్నికల అధికారుల నిఘా నిరంతరంగా కొనసాగుతుందని మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ గౌతమ్‌ తెలిపారు. ఎన్నికల షెడ్యూల్‌ విడుదలైనప్పటి నుంచి జిల్లాలోని పలు చెక్‌ పోస్టుల వద్ద రూ. 4,92,85,390 నగదు, రూ.3,04,66,728 విలువైన బంగారు తదితర ఆభరణాలతో పాటు 7,049 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 179 కేసులు నమోదు చేయడంతో పాటు 136 మందిని అరెస్టు చేసినట్లు కలెక్టర్‌ వివరించారు. ఎన్నికల కోడ్‌ అమలులో ఉన్నందున రూ. 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లరాదని, ఒకవేళ తీసుకెళితే సరైన ఆధారాలు ఉండాలని పేర్కొన్నారు. లేని పక్షంలో నగదును సీజ్‌ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

మూడు రోజులుగా అక్క శవం పక్కనే

- అక్క, తమ్ముడు ఇద్దరూ మానసిక వికలాంగులు
- అక్క చనిపోయినా గుర్తించలేని వైనం
- ప్రసాదాలు తింటూ జీవనం
- కుళ్లిపోయి దుర్గంధం

రాంగోపాల్‌పేట్‌: అక్కా తమ్ముడు ఇద్దరూ మానసిక వికలాంగులు...ఇద్దరు కలిసి ఆదయ్యనగర్‌లోని సొంతింట్లో కింది పోర్షన్‌లో ఉంటున్నారు. మొదటి అంతస్తులో వీరి అన్నయ్య కుటుంబం నివాసం ఉంటోంది. కానీ మూడు రోజుల క్రితం అక్క చనిపోయింది, ఆ విషయం తమ్ముడికి తెలియదు...యథావిధిగా తన పనులు తాను చేసుకుంటున్నాడు. మూడు రోజులకు శవం కుళ్లిపోయి, పురుగులు పట్టి దుర్వాసన వస్తుండటంతో ఏమి జరిగిందోనని అదే ఇంట్లో పై అంతస్తులో ఉండే అన్నయ్య వచ్చి చూడటంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే...ఆదయ్యనగర్‌కు చెందిన బలరాంకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా హుబ్లీలో ఉంటుంది. చిన్న కుమార్తె చంద్రకళ (40), చిన్న కుమారుడు పరశురాం గ్రౌండ్‌ ఫ్లోర్‌లో ఉంటుండగా పెద్ద కుమారుడు బాలకృష్ణ కుటుంబంతో కలిసి మొదటి అంతస్తులో నివాసం ఉంటున్నాడు. చంద్రకళ, పరశురాంలకు మానసిక పరిస్థితి సరిగా లేదు..మూడేళ్ల క్రితం వరకు వీరి అలనాపాలన తల్లి చూసుకునేది, ఆమె మరణించడంతో పరిసర ప్రాంతాల్లోని ఆలయాల వద్ద పెట్టే ప్రసాదాలు తెచ్చుకుని తింటూ జీవనం సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా అనారోగ్యంతో చంద్రకళ నాలుగు రోజుల క్రితం మృతి చెందింది. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో బాలకృష్ణ కుమార్తె మైనా అక్కడికి వెళ్లి చూడగా కుళ్లిపోయి, పురుగులు పట్టిన స్థితిలో చంద్రకళ మృతదేహం కనిపించింది. పక్కనే పరశురాం ఆలయం నుంచి తెచ్చుకున్న ప్రసాదం తింటూ కనిపించాడు. మార్కెట్‌ పోలీసులకు సమాచారం అందించడంతో వారు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా బన్సీలాల్‌పేట్‌లో అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఆస్తిపాస్తులున్నా....

వీరికి సొంత ఇంటితో పాటు దుకాణం కూడా ఉంది. రూ.లక్షల విలువైన ఆస్తులు ఉన్నా వారు ఇద్దరూ మానసిక వికలాంగులు కావడంతో కనీసం ఇంట్లో వంట చేసుకుని తినే పరిస్థితి కూడా లేదు. దీంతో గుడి వద్ద ప్రసాదాలు తెచ్చుకుని జీవనం సాగిస్తున్నారు.

క్లుప్తంగా...

ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తు



దరఖాస్తు అందిస్తున్న యర్రవరపు రమణ

బంజారాహిల్స్: వైఎస్సార్‌టీపీ ఖైరతాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ సీటు తనకు కేటాయించాలని ఖైరతాబాద్ కోఆర్డినేటర్ యర్రవరపు రమణ కోరారు. ఈ మేరకు తన అభ్యర్థిత్వ దరఖాస్తును రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్ట రామ్‌రెడ్డికి అందజేశారు. పార్టీ విజయానికి సైనికుడిలా పనిచేస్తానన్నారు.

నటి రాజ్‌పుత్ సందడి



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పెద్దమ్మ టెంపుల్ సమీపంలోని అనూషరెడ్డి కోచర్ 5వ వార్షికోత్సవ వేడుకల్లో నటి పాయల్ రాజ్‌పుత్ పాల్గొని సందడి చేశారు. వివాహాలు, పండుగల కోసం విభిన్న రకాల వస్త్రాలను అందుబాటులో ఉంచామని క్రియేటివ్ కలెక్షన్ డైరెక్టర్ అనూషరెడ్డి అన్నారు. కార్యక్రమంలో నటి అనూష మదివాడ, ప్రముఖులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌కు అభినందనలు



రాగిణిరెడ్డి అభినందిస్తున్న యువకులు

రహమత్‌నగర్: కొండాపూర్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డా. రాగిణిరెడ్డిని ఎస్పీఆర్‌హిల్స్‌కు చెందిన యువకులు ఆదివారం కలిసి అభినందించారు. విధి నిర్వహణలో ప్రశంసలు పొందుతున్న డా.రాగిణిరెడ్డి రోగులకు మెరుగైన సేవలు అందించాలని కొలన్ అరవింద్, గిరి నిహాల్‌రెడ్డి, ప్రశాంత్, రవళి కోరారు.

బీఆర్‌ఎస్ పథకాలు దేశానికే ఆదర్శం

బంజారాహిల్స్: బీఆర్‌ఎస్ ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని జూబ్లీహిల్స్ డివిజన్ బీఆర్‌ఎస్ నేతలు అన్నారు. సోమవారం డివిజన్‌లో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను హర్షిస్తూ కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నగేష్, సాగర్, దాసు, శ్రీను, వెంకటస్వామి, వెంకటేష్, విజయరావు, రమణ, రాము, సత్యనారాయణ, దర్మానాయక్, చంద్రమ్మ, చెన్నయ్య, బాల్‌రెడ్డిచదాసు, రాజు, ఉపేందర్, జగన్, రంగన్న పాల్గొన్నారు.

బొమ్మల కొలువు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం–69లోని నందగిరిహిల్స్ లేపాక్షి హస్తకళా ఎంపోరియంలోని బొమ్మల కొలువు ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంటుంది. దసరా, బతుకమ్మ పండుగలను పురస్కరించుకొని కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలతో, సాంప్రదాయ కళలకు అద్దం పట్టేలా కొలువైన బొమ్మలు అందరిని ఆకర్శిస్తున్నాయి.

డైనమిక్‌గా ఉంటేనే విజయాలు

సాక్షి, సిటీబ్యూరో: నిరంతరం మారుతున్న వ్యాపార ప్రక్రియ, లక్ష్యాలను వ్యూహాత్మకంగా అమలు చేయడానికి ఒక 'డైనమిక్ ఆపరేటింగ్ ఇంజిన్' ఉండాలంటున్నారు టోనీ సల్దాన్హా, అంతర్జాతీయ వ్యాపారవేత్త, రచయిత టోనీ మరో రచయిత ఫిలిప్పో పాసెరితో కలిసి రచించిన రివల్యూషనైజింగ్ బిజినెస్ ఆపరేషన్స్(హౌ టు బిల్డ్ డైనమిక్ బిజినెస్ ప్రాసెస్ ఫర్ ఎండ్యూరింగ్ కాంపిటేటివ్ అడ్వాంటేజ్) పుస్తక పరిచయ కార్యక్రమం సోమవారం నగరంలోని మారియట్ గోల్డ్ హోటల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టోనీ పుస్తకం రాయడానికి తనను పురికొల్పిన అంశాలతో పాటు ఆధునిక వ్యాపార సూత్రాలను అతిథులకు వివరించారు. ఈ కార్యక్రమానికి నగరానికి చెందిన పలువురు వ్యాపార రంగ ప్రముఖులు హాజరయ్యారు.



రౌడీషీటర్ల కదలికలపై ఫోకస్

- నిత్యం వివరాలపై ఆరా తీస్తున్న పోలీసులు
- ఇప్పటికే 70 శాతం బైండోవర్లు పూర్తి

బంజారాహిల్స్: వచ్చే నెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఉద్రిక్తలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుగుణంగా పోలింగ్, ప్రచార, పాదయాత్రలు, రోడ్‌షోల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గత వారం రోజుల నుంచి తనిఖీలు ముమ్మరం చేస్తూ రౌడీషీటర్లతో పాటు సమస్యలకు కారకులయ్యే వారిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. రౌడీషీటర్లతో పాటు సస్పెక్ట్స్, ట్రబుల్‌మాంగర్స్ కదలికలపై దృష్టి సారించారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో వీరి కదలికలను గమనిస్తూనే వారి రోజువారి కార్యక్రమాలపై ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా బ్లూకోట్స్, పెట్రోలింగ్ పోలీసులు పాయింట్ బుక్స్, చెకింగ్‌ల ద్వారా సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఎక్కడెక్కడ ఘర్షణ, గొడవలు జరిగాయి, మద్యం పంపిణీ, గొడవలకు కారణాల కోణంలో పోలీసులు తమ ప్రాంతంలో మ్యాపులు రూపొందించుకొని నివేదికలు సిద్ధం చేసుకోవడమే కాకుండా ఆ ప్రాంతాలను జియో ట్యాగింగ్ చేశారు. దాదాపు అన్ని పోలీస్‌స్టేషన్లలోనూ 70 శాతం రౌడీషీటర్ల బైండోవర్ పూర్తయింది. మిగతావాటిలో కొంతమంది చిరునామాల్లో ఉండకపోవడం వల్ల ఇతర ప్రాంతాలకు వెళ్లడం జరిగింది. ఈ పదిరోజుల వ్యవధిలో వారందరినీ బైండోవర్ చేయాలని ఎన్నికల అధికారులు సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో రౌడీషీటర్లను వంద శాతం బైండోవర్ చేసే దిశలో ప్రణాళికలు సిద్ధం చేసి ఇందుకోసం స్పెషల్ డ్రైవ్ చేశారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ఇప్పటికే జియో ట్యాంగింగ్ ఆ పోలింగ్ బూత్‌ల పరిధిలో నివాసముంటున్న రౌడీషటర్లు, సస్పెక్ట్స్, ట్రబుల్‌మాంగర్స్ వివరాలను నమోదు చేసుకున్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న బంజారాహిల్స్ సతీష్, తదితరులు

ఖైరతాబాద్ నియోజకవర్గం..

పోలీస్ స్టేషన్	రౌడీషీటర్లు, సస్పెక్ట్స్, ట్రబుల్‌మాంగర్స్
ఫిలింనగర్:	10
బంజాహిల్స్:	10
మాసబ్‌ట్యాంక్:	11
పంజగుట్ట:	4
లేక్ పోలీస్‌స్టేషన్:	8
సైఫాబాద్:	1
ఖైరతాబాద్:	6
జూబ్లీహిల్స్:	1
దోమలగూడ:	4
అబిడ్స్:	1
నారాయణగూడ:	1

జూబ్లీహిల్స్ నియోజకవర్గం...

జూబ్లీహిల్స్	08
ఫిలింనగర్	21
మధురానగర్	14
ఎస్ఆర్‌నగర్	29
బోరబండ	55

వెస్ట్ జోన్ పరిధిలో..

బంజారాహిల్స్	81
మాసబ్‌ట్యాంక్	19
జూబ్లీహిల్స్	8
ఫిలింనగర్	31
పంజగుట్ట	25
మధురానగర్	14
ఎస్ఆర్‌నగర్	29
బోరబండ	55

బెస్ట్ ఆఫ్ లక్ నాగేందర్



ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ బీ–ఫారంను అందజేశారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే దానం ధీమా వ్యక్తం చేశారు.

–బంజారాహిల్స్

బీఆర్‌ఎస్‌కే మా మద్దతు

తెలంగాణ సీమాంధ్రుల అసోసియేషన్

పంజగుట్ట: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో ఉన్న సుమారు 50 లక్షల మంది సీమాంధ్రులు బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ సీమాంధ్ర వెల్ఫేర్ అసోసియేషన్ ప్రకటించింది. 2018లో కూడా అప్పటి టీఆర్‌ఎస్‌కు మద్దతు పలికామని, ఈ సారి కూడా ఎల్.బీ స్టేడియంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి కేటీఆర్ సమక్షంలో మద్దతు ప్రకటిస్తామన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ కన్వీనర్ ఆర్.ఆర్.రెడ్డి, ప్రతినిధులు జ.ఎస్. సత్యనారాయణ, అమూల్యారెడ్డి, బాలకృష్ణలు మాట్లాడుతూ .. రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో సుమారు 5 నుండి 10 వేల ఓట్లు సీమాంధ్రులవి ఉంటాయని గెలుపు ఓటమిలు శాసించే స్థాయిలో ఉంటాయని గత ఎన్నికల కన్నా ఈ సారి మరింత ఉత్సాహంతో పనిచేసి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎవ్వరికి బీఫాం ఇస్తారో వారిని గెలిపించుకుంటామన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీమాంధ్రులు అన్నిచోట్లా ఎంతో భద్రంగా ఉన్నారని ఇక్కడ ఎలాంటి భేదభావాలు లేవని, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో కూడా ఎలాంటి తారతమ్యం లేకుండా సమాన వాటా ఇస్తున్నారన్నారు. కొంతమంది పెట్టుబడిదారులు గత ఎన్నికల్లో కూడా కుల రాజకీయాలు ఇక్కడ కూడా తెచ్చి సీమాంధ్రులను చీల్చేందుకు యత్నించారని కాని దాన్ని దీటుగా తిప్పికొట్టామని ఈసారి కూడా అలాంటి ప్రయత్నాలు చేస్తే తప్పక తిప్పికొడతామన్నారు. ఈ సమావేశంలో పి.కామయ్య, జి.వి. నాయుడు, సతీష్ యాదవ్, ఇస్మాయిల్, మల్లిఖార్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతున్న సీమాంధ్రులు

అన్ని స్థానాల్లో బరిలో దిగుతాం

పంజగుట్ట: యువత, ఎస్సీ, ఎస్టీ, బీసీ, అగ్రవర్ణ పేదల అభివృద్ధే లక్ష్యంగా తమ పార్టీ ముందుకెళ్తుందని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మినేని వికాస్ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. జరగబోయే ఎన్నికల్లో తమ పార్టీ నుంచి 119 స్థానాల్లో బరిలోకి దింపుతున్నట్లు వెల్లడించారు. జనరల్ స్థానాల్లో కూడా ఎస్సీ, ఎస్టీలకు సీట్లు కేటాయిస్తామని ముఖ్యంగా ఉత్సాహంగా ఉన్న యువతకు ఎక్కువ సీట్లు ఇస్తామన్నారు. ఇటీవల మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కేటాయించిన నేపథ్యంలో తమ పార్టీ మహిళలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఎన్నికలకు తమ పార్టీ పూర్తి సిద్ధంగా ఉందని టికెట్లు ఆశిస్తున్న వారు ఖైరతాబాద్, ఆనంద్‌నగర్ కాలనీలోని తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఉపేందర్ పాశ్వాన్, బాల సుబ్రహ్మణ్యం, ప్రకాష్, వెంకన్న, రాకేష్ పాల్గొన్నారు.

నీరు–ఆహార సంరక్షణలో భాగస్వాములవ్వాలి



బంజారాహిల్స్: నీరు–ఆహార సంరక్షణలో భాగస్వామ్యం కావాలని నగరానికి చెందిన పలు కళాశాలల విద్యార్థులు నినదించారు. వరల్డ్ ఫుడ్ డే నేపథ్యంలో సోమవారం నగరంలోని విరించి హాస్పిటల్ ఆధ్వర్యంలో 'నీరే జీవితం–నీరే ఆహారం' థీమ్ పైన ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, నీరు–ఆహార సంరక్షణపై అవగాహన కల్పించారు. వుమెన్ ఎన్విసన్ కౌన్సిల్ ఫర్ ఎంటర్‌ప్యూనర్షిప్ వ్యవస్థాపక డైరెక్టర్ ప్రవీణ నాయుడు, ఫుడ్ టెక్నాలజిస్ట్ డా.మోహన్ పాలిపాక, జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్శిటీ నుంచి ప్రొ. బి.విద్యా సాగర్ ముఖ్య అతిథులుగా హాజరై ఆహార సంరక్షణ ఆవశ్యకత గురించి వివరించారు. ఈ సందర్భంగా విరించి హాస్పిటల్స్ సీఈఓ డా.సాయి రవి శంకర్ మాట్లాడుతూ.. వివిధ జీవరాశుల మనుగడకు నీరు ఆవశ్యకమైన అంశమని మనం తినే ఆహార ఉత్పత్తితో పాటు మన జీవన ప్రయాణం కూడా నీటిపై ఆధారపడి ఉందన్నారు. నీటి వనరులు పరిమితంగా ఉండడంతో వాటి వృథా అరికట్టి సంరక్షించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, సిబ్బందికి నిర్వహించిన పోస్టర్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విరించి హాస్పిటల్స్ చీఫ్ డైటీషియన్ అపర్ణ నెమలికంటి తదితరులు పాల్గొన్నారు.

ఆ హాస్టళ్లను తొలగించండి



నిరసన తెలుపుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

పంజగుట్ట: పంజగుట్ట కాలనీ గ్రౌండ్‌ను వెంటనే పునరుద్ధరించి, రెసిడెన్షియల్ జోన్‌లో ఉన్న కమర్షియల్ హాస్టల్స్‌ను వెంటనే తొలగించాలని అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 50 ఏళ్ల క్రితం ఏర్పడ్డ తమ కాలనీ తెలంగాణ రాష్ట్రం రాగానే సేఫ్ కాలనీగా గుర్తింపు పొందిందని గుర్తు చేశారు. రెసిడెన్షియల్ జోన్‌లో ఉన్న కాలనీలో కమర్షియల్‌గా కొంతమంది హాస్టళ్లను నిర్వహిస్తూ ఇక్కట్లకు గురి చేస్తున్నారన్నారు. అర్ధ రాత్రి కాలనీలోకి యువతీ, యువకులు వస్తున్నారని కొంతమంది మద్యం తాగి హంగామా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలోని పిల్లలు ఆటలకు దూరం అవడం, పెద్దలు శారీరక వ్యాయామాలు చెయ్యలేని పరిస్థితి ఉందని తమ కాలనీ గ్రౌండ్‌లోకి తమను అనుమతించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. దీనిపై జీహెచ్ఎంసీ, క్రీడా శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని.. ఓ మహిళా మంత్రి అండదండలతో గ్రౌండ్‌ను థర్డ్‌పార్టీకి ఇచ్చి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ప్రచారం ఉందన్నారు. నిరసనలో సుజాత, మూర్తి, రవికుమార్, భుజంగరావు, అజయ్ పాల్గొన్నారు.

గౌరి సిగ్నేచర్స్ వెడ్డింగ్ అటెలైర్ ప్రారంభం



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం–36లో నూతనంగా ఏర్పాటు చేసిన గౌరి సిగ్నేచర్స్ బెస్పోక్ వెడ్డింగ్ అటెలైర్‌ను సోమవారం హీరో మహేష్‌బాబు, ఆయన సతీమణి నటి నమ్రతా శిరోద్కర్ ప్రారంభించారు. సరికొత్త కలెక్షన్స్‌ను చూసి సంతోషాన్ని వ్యక్తం చేశారు. శుభకార్యాలకు సాంప్రదాయ వస్త్రాలను అందంగా అందిస్తుండటం ఆనందదాయకమని, గౌరి సిగ్నేచర్స్ అందరి మన్ననలు పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గౌరి సిగ్నేచర్స్ సీఈఓ ఉదయ్‌సాయి కొతవరపు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

వీణావాణీలకు శుభాకాంక్షలు



వెంగళరావునగర్ : అవిభక్త కవలలైన వీణావాణీ సోమవారం 20వ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలోని మహిళా శిశుసంక్షేమ శాఖ బాలసదన్‌లో వీరు ఆశ్రమం పొందుతున్నారు. మురళీ–నాగలక్ష్మి దంపతులకు జన్మించిన ఈ కవలల తలలు అతుక్కుని జన్మించిన వీరిని ఎన్ని ఆసుపత్రులకు చూపించినా వారిని విడదీయడం సాధ్యం కాలేదు. దాంతో వారిని చిన్నతనం నుంచే తల్లిదండ్రులు స్టేట్‌హోంలోని శిశువిహార్‌లో ఉంచారు. నాటి నుంచి నేటి వరకు కూడా వారు అక్కడే ఆశ్రయం పొందుతూ విద్యనభ్యసిస్తున్నారు. పది, ఇంటర్‌లోనూ ఇరువురు మంచి మార్కులు సాధించారు. భవిష్యత్‌లో సీఏ కావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. ప్రస్తుతం ఆంధ్రా మహిళా సభ కళాశాలలో బీ.కాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. సోమవారం వీరి జన్మదిన వేడుకలు బాలసదన్‌లో తల్లిదండ్రులు, అధికారుల సమక్షంలో నిర్వహించారు.

ఎన్‌ఆర్‌ఆర్‌పురంలో రక్తదాన శిబిరం



సర్టిఫికెట్లు అందజేస్తున్న సొసైటీ ప్రతినిధులు

రహమత్‌నగర్ : అక్బరి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో తలసీమియా బాధితుల కోసం బోరబండ సైట్–1 ఎన్‌ఆర్‌ఆర్‌పురంలో ఆదివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు డా.జుబైర్ మాట్లాడుతూ.. అక్బరి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం తలసీమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డా.చాంద్ పాషా, మహ్మద్ ఇషాక్ అహ్మద్, అన్సర్, సత్తార్, కరీమోద్దిన్ అబ్దుల్ రహీం,తౌఫిక్,సలాఉద్దిన్ సయ్యద్ అక్బర్,ఇమ్రాన్ పాల్గొన్నారు.రక్తదానం చేసిన యువకులకు సర్టిఫెకెట్లు అందజేశారు.

సమాజ సేవలో భాగస్వాములవ్వాలి

లిబర్టీ: సమాజంలో మానవతవీరులను పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఆదినారాయణ అన్నారు. సమాజంలో రోజు రోజుకు మానవ నైతిక విలువలు తగ్గిపోతున్నాయని అన్నారు. సోమవారం మాతృదేవోభవ సమస్త జాతీయ అధ్యక్షులు కె.బి. శ్రీధర్ ఆత్మీయ సత్కారం చేసి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.ఆదినారాయణ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో నా వాళ్లు అన్న భావన తగ్గిపోయిందని నేను అన్న భావన పెరిగిపోవడంతో ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో విలువలు తగ్గిపోతున్నాయన్నారు.

మున్సిపల్ కార్మికుల వినతి

లిబర్టీ: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎలక్షన్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబుకు తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేసురత్నం నేతృత్వంలో పలువురు ఆయనను కలి వినతిపత్రం అందజేశారు.

మహిళ అదృశ్యం



గౌరీ

వెంగళరావునగర్: మధురానగర్‌లోని స్టేట్‌హోంలో ఉంటున్న కుమార్తె వివరాలు తీసుకురావడానికి వచ్చిన మహిళ అదృశ్యమైన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. మేగ రాజు, గౌరీ దంపతులు తమ కుమార్తె కరిష్మాతో కలిసి కొంతకాలంగా ఓల్డ్ బోయిన్‌పల్లిలో నివాసం ఉంటున్నారు. రాజు బెలూన్లు విక్రయిస్తుండగా, గౌరీ, తన కుమార్తెతో భిక్షాటన చేస్తుంది. ఈ క్రమంలో ఈ ఏడాది ఆగస్టు 22న గౌరీ, తన కుమార్తెతో కలిసి ప్యారడైజ్ సర్కిల్ వద్ద భిక్షాటన చేస్తున్నారు. దీంతో మహిళా శిశుసంక్షేమశాఖకు చెందిన కొందరు వారిని తీసుకువెళ్లి తార్నాకలోని హోంలో ఉంచారు. 28వ తేదీన అక్కడ నుంచి మధురానగర్‌లో ఉన్న స్టేట్‌హోంకు తరలించారు. చిన్నారిని స్టేట్‌హోంలోని శిశువిహార్‌లోనే ఉంచుకుని ఆమె వివరాలను తీసుకురావాలని తల్లి గౌరిని ఇంటికి పంపారు. అయితే గౌరీ మాత్రం ఇంటికి రాలేదు. విషయం తెలుసుకుని ఆందోళన చెందిన గౌరీ భర్త ఆమె కోసం వెదికాడు. ఆమె ఆచూకీ మాత్రం లభించపోవడంతో రాజు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో యువతి...



కోటేశ్వరి

వెంగళరావునగర్: ఓ యువతి ఇంటి నుంచి పారిపోయిన ఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దుక్కా నాగరాజు రహమత్‌నగర్‌లోని హనుమాన్ టెంపుల్ గల్లీలో కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. ఈయనకు కోటేశ్వరి, రాము అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాము మేస్త్రీగా పనులు చేస్తుండగా, కోటేశ్వరి జూబ్లీహిల్స్‌లోని ఓ షాపులో సేల్స్‌గర్ల్‌గా పని చేస్తుంది. ఈనెల 15న అర్ధరాత్రి 3 గంటల సమయంలో కోటేశ్వరి ఇంట్లో ఉన్న ఒక టిన్నర తులాల బంగారాన్ని తీసుకుని ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఉదయం చూసేసరికి కోటేశ్వరి కనిపించలేదు. ఆమె సోదరుడు రాము తన బంధువులు, స్నేహితులు, ఆమె పని చేసే చోట విచారించాడు. ఫలితం లేకపోవడంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇఫ్లూలో ఆంగ్ల నైపుణ్య శిక్షణ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజస్ సెంట్రల్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో ఆంగ్ల నైపుణ్య శిక్షణ ప్రారంభమైంది. సోమవారం వీసీ ప్రొ.సురేష్‌కుమార్ అధ్యక్షత వహించగా కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి అభిలాష్ జోషి ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. నవంబరు 10 వరకు కొనసాగే శిక్షణలో 28 దేశాలకు చెందిన 95 మంది అభ్యర్థులు ఆంగ్లంలో శిక్షణ పొందనున్నట్లు పీఆర్వో తెలిపారు.



గాయిత్రీ దేవీగా జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి



బాలత్రిపుర సుదరీదేవీగా రాజరాజేశ్వరీ అమ్మవారు



గాయిత్రీ దేవీగా భ్రమరాంభ అమ్మవారు



స్వరాజ్ నగర్ బోరబండలో..

దుర్గమ్మా.. దీవించమ్మా!

శ్రీనగర్‌కాలనీ/రహమత్‌నగర్/బంజారాహిల్స్: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు సోమవారం గాయిత్రీ దేవీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి గాయిత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. జూబ్లీహిల్స్ సీతారామ స్వామి దేవాలయంలో కొలువుతీరిన పర్వతవర్ధిని దేవీ అమ్మవారి సన్నిధిలో మోహినీ హట్టం, భరత నాట్యం భక్తులను పరవశింపచేశాయి.



పర్వతవర్ధిని దేవీ అమ్మవారు





పూజల్లో పాల్గొన్న వేముల లక్ష్మణ్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

క్లుప్తంగా...

‘రజాకార్’ను నిలుపుదల చేయాలి

ఎన్నికల సంఘానికి రావి నారాయణరెడ్డి మనవరాలు ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల వేళ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా రూపొందించిన రజాకార్ సినిమాను విడుదల కాకుండా నిలుపుదల చేయించాలని తెలంగాణ సాయుధ పోరాట యోధులు రావి నారాయణరెడ్డి మనవరాలు రావి ప్రతిభారెడ్డి విజ్ఞప్తి చేశారు. రావి నారాయణరెడ్డి ఫౌండేషన్ తరపున సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. నిజాం ప్రభువు, రజాకార్లు, భూస్వాముల అరాచకాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాలు చేసిన తెలంగాణ రైతాంగ చరిత్ర ఎంతో విస్తృతమైనదని, ఘనమైనదని.. అలాంటి చరిత్రను వక్రీకరిస్తూ ఈ సినిమాను తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరికి ఎన్నికల్లో లబ్ధి కలిగించడం కోసం మతం కోణంలో రజాకార్ సినిమా తీశారని, అసలు చరిత్రను విస్మరించారని ఆరోపించారు. ఇటీవల విడుదల చేసిన సినిమా ట్రైలర్ తీవ్ర అభ్యంతకరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సినిమాను ఎన్నికల సంఘం ముందుగా వీక్షించాలని, అభ్యంతకర సన్నివేశాలను తొలగించిన తర్వాతే విడుదలకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామని, అక్కడి నుంచి వచ్చే సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని సీఈఓ వికాస్‌రాజ్ హామీ ఇచ్చారని ప్రతిభారెడ్డి తెలిపారు.

అమరవీరుల స్మారక చిహ్నం శిల్పి రమణారెడ్డి పుస్తకావిష్కరణ

సాక్షి, హైదరాబాద్: సచివాలయం ఎదుట ఉన్న అమరవీరుల స్మారక చిహ్నం శిల్పకారుడు ఎంవీ రమణారెడ్డి సాగించిన ప్రయాణంపైన ప్రఖ్యాత క్రిటిక్ కోహ్లి ముఖర్జీ జోష్ రచించిన ‘ఎంవీ రమణారెడ్డి, పాత్ టు ఆర్టిస్టిక్ బ్రిలియన్స్–ఎ జర్నీ అన్‌వీల్డ్’ పుస్తకాన్ని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ (టీడీఎఫ్) అధ్యక్షుడు దివేశ్ అనిరెడ్డి, టీడీఎఫ యూఎస్‌ఏ చైర్మన్ వెంకట్ మారెమ్, టీడీఎఫ యూఎస్‌ఏ మాజీ అధ్యక్షురాలు కవిత చల్లా, టీడీఎఫ యూఎస్‌ఏ న్యూజెర్సీ మురళి చింతలపాణి తదితరులు ఈనెల 15న వాషింగ్టన్ డీసీలో ఆవిష్కరించారు. కళాత్మక పరిపూర్ణత కోసం రమణారెడ్డి నిరంతర అన్వేషణ, శిల్పకళలో ఆయన సాగించిన ప్రయాణం, విజయాలపైనే ఈ పుస్తకాన్ని రచించినట్లు రచయిత కోహ్లి తెలిపారు. కాగా, రమణారెడ్డి ఎన్నో రకాల శిల్పాలను రూపొందించినప్పటికీ ఈ అమరవీరుల స్మారక చిహ్నంలో అనేక ప్రత్యేకతలున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద అతుకులు లేని స్టెయిన్‌లెస్ స్టీల్ నిర్మాణాల్లో ఇదొకటి. ఈ స్మారకం మెరుగుపెట్టిన, ప్రతిబింబించే పుటాకార ఆకారంతో, కాంతికి ఆశ్రయం కలిగించే విధంగా ఉంటుంది. తెలంగాణ ఉద్యమ భావోద్వేగం, చరిత్రను గుర్తుచేసుకుంటూ జ్ఞానం, అవగాహన కలిగించేలా ఈ కాంతిని సూచిస్తుంది. పుస్తక ప్రచురణకు తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్, ఇండియా, యూఎస్‌ఏ, కేవీసీ ప్రాజెక్టు సంస్థలు సహకరించాయి.

మెజారిటీ ప్రాంతాల్లో నైరుతి నిష్క్రమణ పూర్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఎక్కువ ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ పూర్తయినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో రుతుపవనాల ఉపసంహరణకు అనుకూల పరిస్థితులు ఉండటంతో వేగంగా ప్రక్రియ పూర్తవుతోందని, రానున్న మంగళ, బుధవారాల్లో మిగిలిన ప్రాంతాల నుంచి పూర్తిగా నైరుతి రుతుపవనాల నిష్క్రమణ జరుగుతుందని వెల్లడించింది. ఈ సమయంలో అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశాలుంటాయని సూచించింది. నైరుతి నిష్క్రమణ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈశాన్య రుతుపవనాల కదలికలు మొదలవుతాయని వివరించింది. ప్రస్తుతం రాష్ట్రానికి తూర్పు దిశ నుంచి గాలులు వీస్తున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం ఆదిలాబాద్, భద్రాచలంలలో 35.8 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే గత 24 గంటల్లో మెదక్‌లో 19.4 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది.

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్ట	కనిష్ట
ఆదిలాబాద్	35.8	21.2
భద్రాచలం	35.8	26.0
హకీంపేట్	32.0	20.9
దుండిగల్	31.8	22.1
హనుమకొండ	34.0	23.0
హైదరాబాద్	32.5	22.5
ఖమ్మం	35.5	25.0
మహబూబ్‌నగర్	32.8	23.7
మెదక్	34.6	19.4
నల్లగొండ	32.5	23.0
నిజామాబాద్	34.4	22.5
రామగుండం	33.4	22.6

షేర్ల కోసం.. తుపాకీతో రామోజీ బెదిరింపు

సంతకం పెడతావా లేదా అంటూ బరితెగింపు

మార్గదర్శి సహ వ్యవస్థాపకుడు జీజే రెడ్డి వారసులపై దౌర్జన్యం

సాక్షి, అమరావతి: ‘మీ షేర్లను బదిలీ చేస్తున్నట్లు సంతకాలు పెడతారా లేదా!?’.. ఓ గదిలో తలకు తుపాకీ గురిపెట్టి మరీ ఇలా బెదిరిస్తే ఎవరైనా ఏం చేస్తారు.. ప్రాణభయంతో సంతకాలు చేసేస్తారు కదా. ఈ ఉదంతంలోనూ బాధితులు అదే పనిచేశారు. కానీ, ఇక్కడ తలకు తుపాకీ పెట్టి బెదిరించింది ఎవరో కాదు.. చెరుకూరి రామోజీరావు అలియాస్ ఈనాడు రామోజీరావు. ఆ బాధితులు మరెవరో కాదు.. రామోజీరావుతో కలిసి మార్గదర్శి చిట్‌ఫండ్స్ స్థాపించిన జీజే రెడ్డి కుమారులు మార్టిన్ రెడ్డి, యూరి రెడ్డి.

ఇలా.. తుపాకీతో బెదిరించి మరీ మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లోని 288 షేర్లను తన కోడలు శైలజ కిరణ్ పేరిట అక్రమంగా బదిలీ చేశారు రామోజీ. ఆ ఒక్క సంతకమే కాకుండా మరికొన్ని ఫోర్జరీ సంతకాలు, నకిలీ డాక్యుమెంట్లతో తతంగం కానిచ్చేశారు. ఆ విధంగా 2016 నాటికి రూ.1,59,69,600 మూలధన విలువ ఉన్న 288 షేర్లను అక్రమంగా కైవసం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఇటీవల గుర్తించిన బాధితుడు యూరి రెడ్డి ఏపీ సీఐడీకి ఈనెల 13న ఫిర్యాదు చేయడంతో రామోజీరావు అక్రమాల బండారం బట్టబయలైంది. జీజే రెడ్డి పెద్ద కుమారుడు మార్టిన్‌రెడ్డి ప్రస్తుతం విదేశాల్లో ఉండగా.. భారత్‌లో నివసిస్తూ తన కుటుంబ ఆస్తి వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న ఆయన రెండో కుమారుడు యూరి రెడ్డి సీఐడీకి ఫిర్యాదు చేశారు. ప్రాథమిక ఆధారాలు ఉండటంతో రామోజీరావు, శైలజ కిరణ్‌లపై సీఐడీ కేసు నమోదు చేసింది. సెక్షన్లు 420, 467, 120–బి రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఏ–1గా రామోజీరావు, ఏ–2గా శైలజ కిరణ్‌లను నిందితులుగా చేర్చింది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ సంచలనాత్మక కేసు వివరాలివీ..

ఆదరించిన చేయినే కాటేసిన రామోజీ..

కృష్ణాజిల్లా జొన్నలపాడుకు చెందిన జీజే రెడ్డి చెకోస్లోవేకియాలో ఉన్నత విద్య పూర్తిచేసిన అనంతరం ఢిల్లీలో నవభారత్ ఎంటర్‌ప్రైజెస్ అనే కంపెనీని ఏర్పాటుచేశారు. 1960లో కమ్యూనిస్ట్ పార్టీ నేత కొండపల్లి సీతారామయ్య సిఫార్సుతో తన జిల్లాలోని పెదపారుపూడికి చెందిన రామోజీరావుకు తన కంపెనీలో టైపిస్ట్‌గా ఉద్యోగం ఇచ్చారు. అనంతరం జీజే రెడ్డి ఆర్థిక సహకారంతో రామోజీరావు మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను 1962లో నెలకొల్పారు. ఆ కంపెనీలో జీజే రెడ్డికి 288 షేర్లు ఉన్నాయి. జీజే రెడ్డి 1985లో చెకోస్లోవేకియాలో చనిపోయారు. ఆయన భార్య కూడా 1986లో మరణించారు. ఆ తర్వాత.. జీజే రెడ్డి ఇద్దరు కుమారులు మార్టిన్, యూరి రెడ్డి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో తమ తండ్రి వాటా షేర్ల కోసం రామోజీరావును చాలాసార్లు సంప్రదించినప్పటికీ ఆయనేమీ చెప్పలేదు.

పత్రికల ద్వారా తెలుసుకుని సంప్రదిస్తే..

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో షేర్ల వివరాలను 2014లో పత్రికల్లో వచ్చిన వార్తల ద్వారా మార్టిన్‌రెడ్డి, యూరి రెడ్డి తెలుసుకున్నారు. అప్పటి నుంచి రెండేళ్లపాటు ప్రయత్నించిన తరువాత 2016, సెప్టెంబరు 29న రామోజీరావు తనను కలిసేందుకు ఆ సోదరులు ఇద్దరికీ అపాయింట్‌మెంట్ ఇచ్చారు. తమ షేర్లకు సంబంధించి షేర్ సర్టిఫికెట్ ఇవ్వాలని మార్టిన్‌రెడ్డి రామోజీని కోరారు. అప్పుడు 2007–08 వార్షిక సంవత్సరానికి సంబంధించి షేర్లపై డివిడెండ్ కింద రూ.39,74,400 విలువైన యూనియన్ బ్యాంక్ చెక్ (నంబరు 137991)ను ఆయన వారికిచ్చారు. మిగిలిన ఏళ్లకు సంబంధించిన డివిడెండ్ మొత్తాన్ని కూడా చెల్లించాలని యూరీ రెడ్డి కోరారు. అవన్నీ సెటిల్ చేస్తానని చెప్పి రామోజీరావు వెళ్లిపోయారు.



FIRST INFORMATION REPORT (Under Section 154 Cr. P.C)

రామోజీ, శైలజాకిరణ్‌లపై నమోదైన ఎఫ్ఐఆర్

తుపాకీ పెట్టి బెదిరించి మరీ..

అనంతరం.. రామోజీరావు సిబ్బంది మార్టిన్ రెడ్డి, యూరి రెడ్డిలను ఓ గదిలో కూర్చోమని చెప్పి వెళ్లారు. కాసేపటికి రామోజీ ఆ గదిలోకొచ్చి ఓ రూ.100 విలువైన స్టాంపు పేపర్‌పై రాసిన అఫిడవిట్ మీద మార్టిన్‌రెడ్డిని సంతకం చేయమన్నారు. తన వాటా షేర్లను తన సోదరుడు యూరి రెడ్డి పేరిట మార్చేందుకు ఎలాంటి అభ్యంతరంలేదని అందులో రాసి ఉంది. అదే సమయంలో 2016, అక్టోబరు 5వ తేదీతో ఉన్న రూ.2,88,000 పోస్ట్ డేటెడ్ చెక్ (నంబరు 296460)ను యూరి రెడ్డికి ఇచ్చి తేదీలేని ఫామ్ ఎస్‌హెచ్–4పై సంతకం చేయమని రామోజీరావు చెప్పారు. కానీ, దీనిపై సంతకం చేసేందుకు యూరి రెడ్డి నిరాకరించారు. వెంటనే రామోజీరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ.. తుపాకీ తీసి అన్నదమ్ములు మార్టిన్ రెడ్డి, యూరి రెడ్డిల తలకు గురిపెట్టారు. ‘మిమ్మల్ని కాపాడటానికి ఇక్కడ ఎవరూ లేరు’ అని బెదిరించారు. దీంతో ప్రాణభయంతో ఆ ఫామ్‌పై యూరి రెడ్డి సంతకం చేశారు. తమ షేర్లను ఎవరి పేరిట బదిలీ చేస్తోందనిగానీ, తేదీగానీ ఆ ఫామ్‌పై లేవు. రామోజీరావు తుపాకీతో బెదిరించడంతో కేవలం ప్రాణభయంతోనే ఆ ఫామ్‌పై సంతకాలు చేసి బయటకొచ్చారు.

చెక్కు మార్చలేదు.. షేర్ల బదిలీకి అంగీకరించలేదు..

మరోవైపు.. ప్రాణభయంతో ఆ ఫామ్‌పై సంతకం చేసినప్పటికీ.. తమకు రామోజీరావు ఇచ్చిన చెక్కును మాత్రం వారు నగదుగా మార్చుకోలేదు. ఎందుకంటే షేర్లు బదిలీ చేయడం సమ్మతం కాదు కాబట్టి. నిజానికి.. షేర్లు బదిలీ చేయాలంటే ఒక్క పత్రంపై సంతకంచేస్తే సరిపోదు. అందుకు సంబంధించిన చాలా పత్రాలపై సంతకాలు చేయాల్సి ఉంటుంది. చిట్‌ఫండ్స్ చట్టం, కంపెనీల చట్టం ప్రకారం నిర్దేశించిన అన్ని పత్రాలపై తాను సంతకాలు చేయలేదు కాబట్టి తాను షేర్లు బదిలీ చేసినట్లు కాదని యూరి రెడ్డి ధీమాగా ఉన్నారు. అలాగే, రామోజీరావు ఇచ్చిన చెక్కును నగదుగా మార్చుకోలేదు కాబట్టి తాను షేర్లు బదిలీకి అంగీకరించలేదనడానికి బలమైన సాక్ష్యంగా ఉందని ఆయన భావించారు. కానీ, ప్రాణభయంతో మరోసారి రామోజీని సంప్రదించేందుకు సాహసించలేదు. తమ షేర్లపై రావల్సిన డివిడెండ్‌ను కూడా అడగలేకపోయారు. దీంతో.. 2016 నాటికి ఒక్కోటి రూ.55,450 విలువ చేసే 288 షేర్లు అంటే రూ.1,59,69,600 మూలధన విలువైన షేర్లు ఆయన పేరిట ఉన్నాయి.

ఫోర్జరీ సంతకాలతో అక్రమంగా బదిలీ..

మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలపై ఇటీవల ఏపీ సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో.. యూరి రెడ్డి తన షేర్ల గురించి తెలుసుకోవాలని భావించారు. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ కార్యాలయంలో పరిశీలించగా ఆయన పేరిట ఒక్క షేర్ కూడా లేదని తెలుసుకుని ఆశ్చర్యపోయారు. ఆయన పేరిట ఉన్న 288 షేర్లను 2016లోనే శైలజా కిరణ్ పేరిట బదిలీ చేసినట్లు గుర్తించారు. తాను సంతకాలు చేయకుండా ఎలా బదిలీ చేశారా అని పరిశీలిస్తే రామోజీరావు కుతంత్రం బయటపడింది. యూరి రెడ్డి సంతకాలను ఫోర్జరీ చేసి మరీ ఆయన వాటా షేర్లను శైలజా కిరణ్ పేరిట అక్రమంగా బదిలీ చేసేశారన్నది వెల్లడైంది.

మూలధన నిధి సేకరించింది ఏపీలోనే కాబట్టి..

తన షేర్లను అక్రమంగా శైలజాకిరణ్ పేరిట బదిలీ చేయడంపై యూరి రెడ్డి ఏపీ సీఐడీకి ఫిర్యాదు చేశారు. న్యాయ నిపుణులను సంప్రదించిన తరువాతే ఆయన నిబంధనల మేరకు ఫిర్యాదు చేశారు. యూరి రెడ్డి ఫిర్యాదును పరిశీలించి ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని నిర్ధారించుకున్న తరువాత సీఐడీ విభాగం కేసు నమోదు చేసింది. ఏ–1గా చెరుకూరి రామోజీరావు, ఏ–2గా చెరుకూరి శైలజా కిరణ్‌లను పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.



విశాఖలో ఇన్ఫోసిస్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఉద్యోగులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాగర తీరంలో ఐటీ వెలుగులు

విశాఖలో ఆరంభమైన ఇన్ఫోసిస్ కార్యాలయం

- వెయ్యి మందికి ఐటీ ఉద్యోగాలు
- డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం జగన్
- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో రూ.1,646 కోట్ల విలువైన ఐటీ కార్యాలయాలు, ఫార్మా యూనిట్లకు సీఎం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం, సాక్షి, అమరావతి: ఐటీ సేవల హబ్‌గా మారేందుకు విశాఖపట్నానికి అన్ని అవకాశాలు, సామర్థ్యాలు పుష్కలంగా ఉన్నాయని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పర్యటన సందర్భంగా విశాఖలో ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సీఎం జగన్ ప్రారంభించారు. ఫార్మా కంపెనీల 4 యూనిట్లకు ప్రారంభోత్సవాలు, రెండు యూనిట్లకు శంకుస్థాపనలు నిర్వహించారు. మొత్తం రూ.1,646 కోట్ల విలువైన ఐటీ కార్యాలయాలు, ఫార్మా యూనిట్ల ఏర్పాటుతో 3,450 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. ఆయా కార్యక్రమాల్లో సీఎం జగన్ ఏమన్నారంటే..

విశాఖకు విశేష సామర్థ్యం..

విశాఖ నగరానికి విశేషమైన సామర్థ్యం ఉంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తరహాలో విశాఖపట్నం కూడా ఐటీ హబ్‌గా మారబోతోంది. ఏపీలో విశాఖ అతిపెద్ద నగరం. టైర్ 1 సిటీగా ఎదగడానికి కావాల్సిన అన్ని అర్హతలు, సామర్థ్యం ఈ నగరానికి ఉన్నాయి. ప్రథమశ్రేణి నగరంగా ఎదగడానికి అవసరమైన తోడ్పాటును ఇన్ఫోసిస్ అందించగలదని నేను బలంగా నమ్ముతున్నా. దాదాపు 3.28 లక్షల మంది ఉద్యోగులు, 18.5 బిలియన్ డాలర్ల రెవెన్యూ సామర్థ్యం కలిగిన ఇన్ఫోసిస్‌తో పాటు టీసీఎస్, విప్రో లాంటి సంస్థలు నగర ఐటీ స్వరూపాన్ని, ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చి వేస్తాయి. విశాఖకు ఇప్పుడు ఇన్ఫోసిస్ వచ్చింది. రానున్న రోజుల్లో మిగిలిన ఐటీ కంపెనీలు కూడా ఆ జాబితాలో చేరనున్నాయి. విశాఖలో అదానీ డేటాసెంటర్ కూడా రాబోతుంది. సబ్‌మెరైన్ ఇంటర్నెట్ కేబుల్ మనకు ప్రత్యేకంగా సింగపూర్ నుంచి వస్తుంది. రాబోయే రెండేళ్లలో డేటా సెంటర్ రానుంది. క్లౌడింగ్‌తో పాటు ఐటీ రంగంలో చాలా మార్పులు రానున్నాయి. ఇవాళ 1,000 మందితో ఇక్కడ ప్రారంభమైన ఇన్ఫోసిస్ రానున్న రోజుల్లో మరింత విస్తరించాలని ఆకాంక్షిస్తున్నా. రానున్న రోజుల్లో విశాఖలో పెట్టుబడులకు అనేక మంది ముందుకొచ్చే అవకాశాలున్నాయి. 14 ఇంజినీరింగ్ కాలేజీలు, 8 యూనివర్సిటీలు, 4 మెడికల్ కాలేజీలు, 12 డిగ్రీ కాలేజీలతో విశాఖ ఎడ్యుకేషన్ హబ్‌గా ఉంది. ఐఐఎం, నేషనల్ లా యూనివర్సిటీ లాంటి అత్యంత ప్రతిష్టాత్మక సంస్థలు కూడా ఉన్నాయి.

మధురవాడ ఐటీ హిల్స్‌లో ఇన్ఫోసిస్

గన్నవరం నుంచి విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి జగన్ తొలుత మధురవాడ ఐటీ హిల్స్‌లో రూ.35 కోట్లతో ఏర్పాటైన ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్‌ని ప్రారంభించారు. అనంతరం గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) సముద్రతీర ప్రాంత శుభ్రత కోసం రూ.15 కోట్లతో ఏర్పాటు చేసిన 6 బీచ్ క్లీనింగ్ యంత్రాలను ప్రారంభించారు. ఆ తరువాత పరవాడ చేరుకుని రూ.500 కోట్లతో ఫార్మాసిటీలో 19.34 ఎకరాల్లో ఏర్పాటైన అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ యూజియా స్టెరిలైజ్ యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం అచ్యుతాపురంలో లారస్ సంస్థ రూ.440 కోట్లతో నిర్మించిన ఫార్ములేషన్ బ్లాక్‌ను, రూ.191 కోట్లతో ఏర్పాటైన యూనిట్–2ను సీఎం ప్రారంభించారు. లారస్ రూ.240 కోట్లతో 450 మందికి ఉపాధి కల్పించేలా నిర్మించనున్న యూనిట్–3తో పాటు మరో రూ.240 కోట్లతో ఇదే సంస్థ పరవాడ వద్ద నిర్మించనున్న యూనిట్–7కు సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. కాగా పరిపాలన రాజధానిగా శరవేగంగా ముస్తాబవుతున్న విశాఖకు అక్టోబర్‌కే తరలి వెళ్లాల్సి ఉన్నా కార్యాలయాలు ఇంకా పూర్తి స్థాయిలో సిద్ధం కాకపోవడం, విస్తృత భద్రతా కారణాల దృష్ట్యా అధికారుల సూచనల మేరకు డిసెంబర్‌లో వెళ్లే అవకాశం ఉందని సీఎం సమావేశంలో చెప్పారు.

పెట్టుబడుల కేంద్రం విశాఖ

- రాష్ట్రంలో ఇన్ఫోసిస్ తొలి డెవలప్‌మెంట్ సెంటర్

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సీఐడీ ముందుకు ‘కిలారు’..

ఎట్టకేలకు విచారణకు హాజరైన లోకేశ్ బినామీ

సాక్షి, అమరావతి: చంద్రబాబు అక్రమాలు, అవినీతి కేసుల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడు, షెల్ కంపెనీల ద్వారా అక్రమ నిధులు చేరవేయడంలో కీలక పాత్రధారి అయిన కిలారు రాజేశ్ సీఐడీ విచారణకు హాజరయ్యారు. స్కిల్ స్కాంలో చంద్రబాబు అరెస్టు అయినప్పటి నుంచి పరారీలో ఉన్న ఆయన అనివార్యంగా సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారుల విచారణకు సోమవారం వచ్చారు. దీంతో తాడేపల్లిలోని సిట్ కార్యాలయంలో సీఐడీ అధికారులు ఆయన్ని దాదాపు ఆరుగంటలపాటు విచారించారు. స్కిల్ స్కాం, అసైన్డ్ భూముల దోపిడీ, అమరావతిలో తాత్కాలిక రాజధాని భవనాల కాంట్రాక్టుల కేటాయింపు, ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణం, ఫైబర్‌నెట్ కాంట్రాక్టుల ఖరారు.. ఇలా చంద్రబాబు, లోకేశ్ సూత్రధారులుగా సాగిన అన్ని కుంభకోణాల అక్రమ నిధుల తరలింపులో కిలారు రాజేశ్ పాత్రకు సంబంధించి దర్యాప్తులో వెలుగు చూసిన కీలక ఆధారాలతో సిట్ అధికారులు ఆయన్ని విచారించి ఉక్కిరిబిక్కిరి చేశారు.

విభిన్న కోణాల్లో సిట్ విచారణ..

టీడీపీ ప్రభుత్వ హయాంలో యథేచ్ఛగా సాగిన కుంభకోణాల్లో కీలకపాత్ర పోషించిన కిలారు రాజేశ్‌ను సీఐడీ అధికారులు విభిన్న కోణాల్లో విచారించినట్లు విశ్వసనీయ సమాచారం. స్కిల్ స్కాం దర్యాప్తులో షెల్ కంపెనీల ద్వారా ఆర్థిక లావాదేవీల్లో కిలారు రాజేశ్ పేరు ప్రముఖంగా బయటపడింది. ఆ ఆధారాలతో రూపొందించిన ప్రశ్నావళి నుంచి సీఐడీ అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. అవి..

- స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ప్రాజెక్టు వ్యవహారాల్లో ఎలాంటి పాత్ర పోషించారని సిట్ అధికారులు ప్రశ్నించగా.. తనకు ఆ ప్రాజెక్టుతో సంబంధం లేదని చెప్పేందుకు యత్నించారు. మరి ఎలాంటి పాత్ర లేనప్పుడు చంద్రబాబు అరెస్టు తరువాత ఎక్కడికి వెళ్లారు.. ఎందుకు వెళ్లారని రాజేశ్‌ను సిట్ అధికారులు నిలదీశారు. తాను ఎక్కడికీ పరారు కాలేదని.. ఆంధ్ర ప్రదేశ్‌లోనే ఉన్నానని చెప్పారు. దీంతో.. ఏపీలో ఎక్కడున్నారని సిట్ అధికారులు సూటిగా ప్రశ్నించేసరికి సమాధానం చెప్పకుండా దాటవేసేందుకు యత్నించారు.
- చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ పార్థసానిలతోపాటు షెల్ కంపెనీల ద్వారా కిలారు రాజేశ్ జరిపిన ఆర్థిక లావాదేవీలపైనా అధికారులు ఆయన్ని ప్రశ్నించారు. ఎటువంటి అధికారిక హోదా లేని ఆయన షెల్ కంపెనీలతో ఏ ప్రాతిపదికన లావాదేవీలు నిర్వహించారని సూటిగా ప్రశ్నించారు. తానెలాంటి లావాదేవీలు నిర్వహించలేదని రాజేశ్ బదులిచ్చారు. కీలకమైన బ్యాంకు ఖాతాలను ముందుంచి ప్రశ్నించడంతో ఆయన కంగుతిన్నట్లు సమాచారం. షెల్ కంపెనీల నుంచి వసూలుచేసిన నగదును ఎక్కడికి చేర్చారని సిట్ అధికారుల ప్రశ్నలతో రాజేశ్ తడబాటుకు గురయ్యారు. ఆ విషయంపై సమాధానం చెప్పకుండా మౌనం వహించినట్లు తెలిసింది.
- లోకేశ్‌తో ఉన్న సన్నిహిత సంబంధాలపై సిట్ అధికారుల ప్రశ్నలతో కిలారు రాజేశ్ తీవ్ర తడబాటుకు గురయ్యారు. ఆయనతో తనకు సాధారణ కార్యకర్త మాదిరి సంబంధమే తప్ప అంత కుమించిన సాన్నిహిత్యం లేదని నమ్మించేందుకు యత్నించారు. సాధారణ కార్యకర్త అయితే షెల్ కంపెనీలతో ఈ–మెయిల్స్ సమాచారాన్ని లోకేశ్, పెండ్యాల శ్రీనివాస్‌లతో ఎందుకు పంచుకున్నారని ప్రశ్నించడంతో షాక్‌కు గురయ్యారు. తానెలాంటి ఈ–మెయిల్స్ పంపలేదని బుకాయించేందుకు యత్నించగా సిట్ అధికారులు సంబంధిత ఈ–మెయిల్స్ కొన్ని చూపించినట్లు తెలుస్తోంది. ఇక లోకేశ్, పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ పార్థసాని, షెల్ కంపెనీల ప్రతినిధులతో జరిపిన ఫోన్‌కాల్, వాట్సాప్ డేటాను కూడా చూపిస్తూ సిట్ అధికారులు విభిన్న కోణాల్లో కిలారు రాజేశ్‌ను ప్రశ్నించడంతో మౌనమే ఆయన సమాధానమైంది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, అమరావతిలో తాత్కాలిక భవనాల నిర్మాణ కాంట్రాక్టుల ఖరారు, అసైన్డ్ భూముల అన్యాక్రాంతం, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్, ఫైబర్‌నెట్ టెండర్ల ఖరారు ఇలా అన్ని కుంభకోణాల్లోనూ ఆయన పాత్ర ఉండటంపై సిట్ అధికారులు నిలదీశారు. అప్పటివరకు మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన కిలారు రాజేశ్ కాస్త మెత్తబడి తనకెలాంటి ప్రమేయంలేదని చెబుతూ ప్రాధేయపడినట్లు తెలుస్తోంది. సీఐడీ దర్యాప్తునకు సహకరిస్తానని ఎన్నిసార్లు పిలిచినా విచారణకు హాజరవుతానని చెప్పారని సమాచారం. విచారణ అనంతరం ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకుని మంగళవారం కూడా విచారణకు పిలిచారు.

పరారు కాలేదు.. విచారణకు సహకరిస్తా : కిలారు

ఇక తాను పరారు కాలేదని సీఐడీ దర్యాప్తునకు సహకరిస్తానని కిలారు రాజేశ్ చెప్పారు. అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. తాను ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నానని.. తనకు సీఐడీ నోటీసులు ఇవ్వడంతో విచారణకు హాజరయ్యానన్నారు. ఎన్నిసార్లు పిలిచినా వచ్చి విచారణకు సహకరిస్తానన్నారు.

రూ.5.79 కోట్ల నగదు | 16.6 కేజీల పసిడి

వాహనాల తనిఖీల్లో భారీగా పట్టుబడుతున్న సొమ్ము

మియాపూర్/బన్సీలాల్ పేట్/కరీంనగర్ క్రైం/మహబూబ్‌నగర్ క్రైం: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు జరుపుతున్న వాహనాల తనిఖీల్లో భారీగా బంగారం, నగదు పట్టుబడుతోంది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా జరిపిన సోదాల్లో సుమారు రూ.5.79 కోట్ల నగదు, 16.646 కేజీల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంజీరా రోడ్డులో ఉన్న మై హోమ్ జ్యువెల్ ఎదురుగా అనుమానాస్పదంగా వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఆపి పోలీసులు తనిఖీచేశారు. ఆ వాహనంలో బషీర్‌బాగ్‌కు చెందిన కిలుముల్ల అనిరుధ్ (23), బాలిరాం అక్కే మారుతి, మూసాపేట్‌కు చెందిన శంకర్‌దుబే ఆరు బాక్సుల్లో బంగారం, వెండి ఆభరణాలను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వారి వద్ద సంబంధిత పత్రాలు లేకపోవడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని వాహనంలో ఉన్న 16.64 కేజీల బంగారు ఆభరణాలు, 23.58 కేజీల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు మియాపూర్ సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. మరో ఘటనలో మియాపూర్‌లోని ఆలివ్స్ ఎక్స్ రోడ్డు వద్ద బాచుపల్లికి చెందిన రాజుకుమార్ ద్విచక్రవాహనాన్ని తనిఖీచేయగా అతని వద్ద రూ.14,93,100 నగదు ఉన్నట్లు గుర్తించారు. సరైన పత్రాలు అతని వద్ద లేకపోవడంతో పోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు.

కవాడిగూడ, కరీంనగర్‌లో..

కవాడిగూడలో గాంధీనగర్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన వాహనాల తనిఖీల్లో 2.09 కోట్ల నగదు పట్టుబడింది. గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని కవాడిగూడ ఎన్‌టీపీసీ వద్ద కియా సెల్టోస్ కారు, సుజుకీ యాక్సెస్ ద్విచక్రవాహనంలో అక్రమంగా తరలిస్తున్న ఈ నగదును సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదులు, గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రవి చెప్పారు. కరీంనగర్ టూ టౌన్ స్టేషన్ పరిధిలో తనిఖీలు చేస్తుండగా రైటర్ సేఫ్ గార్డ్ కంపెనీకి చెందిన వాహనంలో రూ.2,36,48,494 అక్రమ నగదును జప్తు చేసినట్లు కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జరిపిన తనిఖీల్లో పోలీసులు రూ.1.19 కోట్ల నగదును సీజ్ చేశారు.



తనిఖీల్లో పట్టుబడ్డ బంగారం



సీజ్ చేసిన నగదు వివరాలు వెల్లడిస్తున్న కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు

వారంలో రూ.109 కోట్లు స్వాధీనం: సీఈఓ వికాస్‌రాజ్

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి వారం రోజుల్లో జప్తు చేసుకున్న మొత్తం నగదు, ఇతర వస్తువుల విలువ రూ.100 కోట్లకు మించిపోయింది. ఇప్పటివరకు జప్తు చేసిన నగదు రూ.58.96 కోట్లకు చేరింది. సోమవారం రూ.17.16 కోట్లు విలువ చేసే బంగారం, ఇతర ఖరీదైన ఆభరణాలను సీజ్ చేయగా, ఇప్పటివరకు జప్తు చేసిన ఇతర ఖరీదైన లోహాల విలువ రూ.33.62 కోట్లకు చేరింది. సోమవారం రూ.29.67 లక్షలు విలువ చేసే ల్యాప్‌టాప్‌లు, కుక్కర్లు, వాహనాలను జప్తు చేయగా, ఇప్పటివరకు సీజ్ చేసిన ఇలాంటి వస్తువుల మొత్తం విలువ రూ.6.89 కోట్లకు చేరింది. దీంతో జప్తు చేసిన మొత్తం నగదు, ఆభరణాలు, ఇతర వస్తువుల విలువ రూ.109.11 కోట్లకు చేరినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం రూ.77 లక్షలు విలువ చేసే 6,974 లీటర్ల మద్యం, 625 కేజీల బెల్లం పట్టుకున్నారు. దీంతో ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న మొత్తం మద్యం విలువ రూ.6.64 కోట్లకు చేరింది. సోమవారం రూ.29.51 లక్షలు విలువ చేసే 110 కేజీల గంజాయిని పట్టుకోగా, ఇప్పటి వరకు సీజ్ చేసిన మొత్తం గంజాయి విలువ రూ.2.97 కోట్లకు చేరింది.

ఏసీ బస్సుల్లో ‘స్నాక్స్’ బాదుడు!

- ప్రయాణికులు విధిగా చెల్లించాల్సిందే
- ప్రతి టికెట్‌పై రూ.30 పెంపు
- అమలులోకి తెచ్చిన ఆర్టీసీ
- ప్రయాణికులకు తృణధాన్యాలతో చేసిన తినుబండారాల పంపిణీ

సాక్షి, హైదరాబాద్: ఏసీ బస్సుల టికెట్ ధరలను ఆర్టీసీ సవరించింది. ప్రయాణించే దూరంతో సంబంధం లేకుండా ప్రతి టికెట్‌పై రూ.30 చొప్పున పెంచింది. ఏసీ స్లీపర్ సర్వీసు లహరి, గరుడ, గరుడ ప్లస్, రాజధాని బస్సుల్లో ఈ మార్పు చోటు చేసుకుంది. ఏసీ బస్సుల్లో ప్రయాణికులకు తృణధాన్యాలతో చేసిన స్నాక్స్ ప్యాకెట్‌ను అందించటాన్ని ప్రారంభించిన ఆర్టీసీ, ఆ తినుబండారాల చార్జీ రూపంలో రూ.30 చొప్పున పెంచుతూ టికెట్ ధరలను సవరించింది. ఈ కొత్త ధరలను ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచి అమలులోకి తెచ్చింది. చిరు ధాన్యాలతో స్నాక్స్ రూపొందించే ట్రూ గుడ్ అన్న సంస్థతో ఇటీవలే ఆర్టీసీ ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పుడు ఆ సంస్థ వాటిని ప్రయాణికులకు సరఫరా చేస్తోంది.

నో ఛాయిస్..

సాధారణంగా ఇలాంటి తినుబండారాలను అందించేటప్పుడు ప్రయాణికుల ఇష్టాయిష్టాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఇటీవల సూపర్ లగ్జరీ బస్సుల్లో అరలీటరు మంచినీటి సీసాను అందించే నిర్ణయం తీసుకున్నప్పుడు రూ.10 చొప్పున టికెట్ ధరను పెంచిన విషయం తెలిసిందే. ప్రయాణికుల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా, కచ్చితంగా పెంచిన ధరను చెల్లించేలా అమలులోకి తెచ్చింది. ఇప్పుడు కూడా, స్నాక్స్ ప్యాకెట్‌ను విధిగా తీసుకోవాల్సిందే. టికెట్‌లోనే దాని ధరను చేర్చినందున స్నాక్స్ ప్యాకెట్ రుసుమును కచ్చితంగా చెల్లించాల్సినట్టవుతుంది.



ఆర్టీసీ ఏసీ బస్సుల్లో సరాఫరా ప్రారంభించిన తృణ ధాన్యాలతో రూపొందించిన స్నాక్స్ ప్యాకెట్

‘స్నాక్స్’వల్ల పెరిగే ఆదాయం ఏమేరకు?

ప్రస్తుతం ఆర్టీసీ ఏసీ బస్సుల్లో నిత్యం దాదాపు 16 వేల నుంచి 18 వేల మంది వరకు ప్రయాణిస్తున్నారు. ఒక్కో టికెట్‌పై రూ.30 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నందున ఆర్టీసీకి నెలకు రూ.కోటిన్నర వరకు ఆదాయం పెరుగుతుంది. అయితే, తయారీ కంపెనీ నుంచి ఒక్కో ప్యాకెట్‌పై ఆర్టీసీ రూ.18 వరకు వెచ్చిస్తున్నట్టు సమాచారం. ఆ లెక్కన దీన్ని పెద్ద ఆదాయంగా పరగణించాల్సిన అవసరం ఉండదు.

ఏముంటాయంటే..

టికెట్ తీసుకోగానే ప్రయాణికుడికి ఓ ప్యాకెట్ ఇస్తారు. ట్రూ గుడ్–ఆర్టీసీ సంయుక్త వివరాలతో ఈ ప్యాకెట్‌లను రూపొందించారు. ఆ ప్యాకెట్‌లో చిరుధాన్యాలతో రూపొందించిన 25 గ్రాముల మురుకులు/కారప్పూస, పప్పు చెక్క, సేగు (ఇవి ఒక్కో ప్యాకెట్‌లో ఒక్కోరకం ఉంటుంది), 20 గ్రాముల మిల్లెట్ చిక్కీ, ఒక మిల్లెట్ రస్కులతో కూడిన విడివిడి ప్యాకెట్లు ఉంటాయి. ఐక్యరాజ్య సమితి 2023వ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో, ఆరోగ్యాన్ని అందించే చిరుధాన్యాలతో రూపొందించిన చిరుతిండిని అందించాలని నిర్ణయించినట్టు గతంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడించారు.



• డాక్టర్ విజయ శారదారెడ్డి

సంకల్పమే సగం బలం

**చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్య చట్టం ఊగిసలాడుతున్న సమయం అది.
శాసన నిర్మాణంలో మహిళల భాగస్వామ్యం అవసరాన్ని గుర్తించారామె.
'ఐ విల్' (ఇండియన్ ఉమెన్ ఇన్ లీడర్‌షిప్) కోర్సు చేశారు.
మహిళల జ్ఞానం... విజ్ఞత పరిపూర్ణమైనదని గ్రామీణమహిళలను చైతన్యవంతం చేశారు.
బ్యూటీ కాంటెస్ట్ కూడా సామాజిక చైతన్యానికి ఒక మాధ్యమం అని గుర్తించారు.
ఇప్పుడు ఆ కిరీటాన్ని కూడా గెలుచుకుని... తెలుగు రాష్ట్రాల్లో విజేతగా నిలిచారు.
మిసెస్ ఇండియా పోటీలలో తనను తాను నిరూపించుకోవడానికి సిద్ధమవుతున్నారు.**

డాక్టర్ విజయ శారదారెడ్డి... విద్యాసంస్థలను నిర్వహించిన దిట్ట. చదువు చెప్పాలన్నా, చదువు చెప్పించాలన్నా తాను అంతకంటే పెద్ద చదువులు చదివి ఉండాలనేది ఆమె నమ్మకం. అందుకే ఎం.ఎ హిస్టరీ, ఎంఈడీ చేశారు. ఎంబీఏ, ఎం.ఎస్‌సీ. సైకాలజీ, ఎం.ఫిల్, పీహెచ్‌డీ చేశారు. గౌరవపూర్వకంగా మరో డాక్టరేట్ అందుకున్నారు. సాఫ్ట్‌స్కిల్స్‌లో శిక్షణ పొందారు. పదివేల మందికి పైగా సాఫ్ట్‌స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించారు. యూఎస్, యూకేల్లో పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోర్సులు చేశారు. బెంగళూరు ఐఐఎమ్ నుంచి 'ఐ విల్' కోర్సు చేశారు. "పెళ్లినాటికి నేను చదివింది బీఎస్సీనే. పై చదువులన్నీ పెళ్లి తర్వాతనే. పెళ్లి అనేది మహిళ అభివృద్ధికి దోహదం చేయాలి తప్ప, మహిళ ఎదుగుదలకు అవరోధం కాకూడదని, సంకల్ప బలం, భాగస్వామి సహకారం ఉంటే ఏదైనా సాధించగలమనే వాస్తవాన్ని సాటి మహిళలకు తెలియచెప్పడానికి ఇన్నేళ్లుగా నా వంతు ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. ఇప్పుడు మిసెస్ ఇండియా పోటీల్లో పాల్గొనడంలో ఉద్దేశం కూడా అదే. ఈ పోటీల్లో అరవై ఏళ్లు నిండిన వయసు మహిళల విభాగం 'సూపర్ క్లాసిక్'లో పాల్గొని 'మిసెస్ తెలంగాణ- ఆంధ్రప్రదేశ్' విజేతనయ్యాను'' అన్నారామె.

ఉన్నది ఒకటే ఆప్షన్!

మిసెస్ ఇండియా పోటీల్లో భాగంగా 'తెలంగాణ- ఆంధ్రప్రదేశ్' సూపర్ క్లాసిక్ ఫైనల్స్ హైదరాబాద్‌లో సెప్టెంబర్ 24వ తేదీన జరిగాయి. ఎనిమిది నెలల నుంచి దశల వారీగా జరిగిన పోటీలవి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దాదాపు ఇరవై సెషన్స్ జరిగాయి. పోటీలో ఎవరెవరున్నారో కూడా తెలియదు. ఒక్కో సెషన్స్‌లో పాల్గొంటూ మాకిచ్చిన టాస్క్‌ను ఒక నిమిషం వీడియో ద్వారా ప్రెజెంట్ చేస్తూ వచ్చాం. ఈ పోటీల ద్వారా నాకు ఓ కొత్త ప్రపంచం గురించి తెలిసింది. మేధోపరమైన జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, మానసిక పరిణతి- పరిపక్వత, సమయానుకూలంగా స్పందించడం, సమాజాన్ని అర్థం చేసుకునే కోణం వంటివన్నీ ఉన్నాయి. నా పోటీదారుల బలాలేమిటో నాకు తెలియదు. నాకున్న ఆయుధం 'నేను గెలిచి తీరాలి' అనే పట్టుదల మాత్రమే. పోటీల్లో పాల్గొనప్పుడు మనకుండేది గెలవాలనే ఆప్షన్ ఒక్కటే. ప్లాన్ బీ ఉండకూడదు. ఏ అవకాశాన్నీ తేలిగ్గా తీసుకోలేదు. ప్రతి రౌండ్‌లో ప్రజెంటేషన్స్ చాలా థియరిటికల్‌గా ఇచ్చాను. ఫైనల్ రౌండ్‌లో విజేతలను ప్రకటించేటప్పుడు కూడా 'నేను రన్నర్ అప్ కాదు' అనుకుంటూ ఆత్మస్థయిర్యంతో ఉండగలిగాను.



ప్రతి రోజూ అమూల్యమే!

సౌందర్యమంటే బాహ్యసౌందర్యమే అయితే నా ఎత్తు, నా మేనిఛాయ అందాల పోటీలకు సరిపోవు. ప్రకటన చూసిన వెంటనే ఫోన్ చేసి మాట్లాడాను. 'బ్యూటీ' అనే పదం పరిధిని విస్తరించడంతోపాటు బ్యూటీ అంటే దేహసౌందర్యమనే అపోహను తొలగించడం, అందం అంటే కొలతలకు లోబడి ఉండడం కాదని తెలియచేయడంతోపాటు 'ఇన్నర్ బ్యూటీ' ప్రాధాన్యతను సమాజానికి తెలియచెప్పడానికే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళ జీవితం పెళ్లికి ముందు – పెళ్లి తర్వాత అనే వర్గీకరణ చట్రంలో ఉండిపోతోంది. ఆ చట్రంలో ఉండిపోయిన చాలామంది మహిళల్లో తమను తాము కోల్పోయిన భావన కలుగుతుంటుంది. మన జీవితంలో ప్రతి రోజూ అమూల్యమైనదేనని మహిళలకు తెలియచెప్పడానికి నేను ఈ పోటీలో పాల్గొన్నాను.

– డాక్టర్ విజయ శారదారెడ్డి
మిసెస్ తెలంగాణ- ఆంధ్రప్రదేశ్

ఇవే విజేతను చేశాయి!

మన సమాజంలో... అరవై ఏళ్లు వచ్చాయంటే 'ఒక చోట కూర్చుని కృష్ణా! రామా! అనుకునే సమయం, అనే భావనను మహిళలు కూడా ఒంటబట్టించుకున్నారు. నిజానికి భగవంతుడిని తలుచుకోవడానికి వార్ధక్యం రానవసరం లేదు. నా దైనందిన జీవితంలో ఎప్పుడూ దైవపూజ కూడా ఒక భాగంగా ఉండేది. ఉదయం మూడున్నరకు రోజు మొదలయ్యేది. వంట, పూజ, ఇంటి పనులన్నీ ముగించుకుని ఏడున్నరకంతా స్కూల్లో ఉండేదాన్ని. అప్పట్లో రోజుకు పద్దెనిమిది గంటలు పని చేయాల్సిన అవసరమే నన్ను ప్రత్యేకమైన వ్యక్తిగా తీర్చిదిద్దింది. ఈ సందర్భంగా నేను చెప్పేదేమిటంటే... అరవై నిండాయని మనతెలివితేటలు, అనుభవాలను అటకెక్కించాల్సిన అవసరం లేదు. కుటుంబం కోసం పని చేయాల్సిన అవసరం లేకపోతే సమాజం కోసం పని చేద్దాం. చిన్నప్పుడు మనకు తీరకుండా ఉండిపోయిన సరదాలను తీర్చుకుందాం. నాకు బొమ్మలేయడం ఇష్టం. ఇప్పుడు ప్రశాంతంగా బొమ్మలు వేసుకుంటున్నాను.

మహిళలు సాధించలేనిది లేదు!

చంద్రయాన్ ప్రాజెక్టులో తమను తాము నిరూపించుకున్నా, రాకెట్‌తో సమానంగా దూసుకుపోతున్నా సరే మహిళలు సమానత్వ సాధన కోసం పోరాడాల్సిన దుస్థితి ఇంకా పోలేదు. మహిళలను అణచి వేసింది సమాజమే, ప్రోత్సహించాల్సింది కూడా సమాజమే. ప్రభుత్వాలు చట్టం చేసి సరిపుచ్చకుండా వాటి అమలుతోపాటు మహిళలకు ప్రోత్సాహం కల్పించాలి. 'ఐ విల్' కోర్సు చెప్పేది కూడా అదే. ప్రతి మహిళలో నాయకత్వ లక్షణాలు అంతర్లీనంగా ఉంటాయి. అవి బహిర్గతమయ్యే అవకాశం ఆమెకివ్వాలి. నేను గమనించినంత వరకు ఆర్థికంగా మెరుగ్గా ఉన్న మహిళలకు తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇబ్బందులు ఉండడం లేదు. మధ్యతరగతి మహిళలు ఉన్నత చదువుల ఆకాంక్షను బ్యాంకు లోన్‌ల సహకారంతో సాధించుకుంటున్నారు. ఇక అల్పాదాయ వర్గాల మహిళలు మాత్రం ఎటువంటి అవకాశం లేక ఆశలను చిదిమేసుకుంటున్నారు. ఈ గ్యాప్‌ని స్టూడెంట్ ఎక్స్‌ఛేంజ్ వంటి ప్రోగ్రామ్‌ల ద్వారా ప్రభుత్వాలు భర్తీ చేయగలిగితే వారి జీవితాలు కూడా కాంతులీనుతాయి. నా వంతుగా మహిళలను చైతన్యవంతం చేయడానికి ప్రతి మాధ్యమాన్ని ఉపయోగించుకుంటున్నాను'' అన్నారామె పరిపూర్ణంగా నవ్వుతూ.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: నోముల రాజేశ్ రెడ్డి

స్ఫూర్తి

ఇష్టమైన కళ తీరిన వేళ

'అయ్యో' అనుకుంటే ఎదురుగుండా కనిపించే దారిలో అన్నీ అవరోధాలే కనిపిస్తాయి. 'అయినా సరే' అనుకుంటే మనసు ఎన్నో మార్గాలు చూపుతుంది. కేరళలోని కన్నూర్‌కు చెందిన సునితకు బొమ్మలు వేయడం అంటే ప్రాణం. అయితే చేతులు పటుత్వం కోల్పోవడంతో కుంచెకు దూరం అయింది. 'ఇష్టమైన కళ ఇక కలగానే మిగలనుందా?' అనుకునే నిరాశామయ సమయంలో మనసు మార్గం చూపించింది. మౌత్ ఆర్టిస్ట్‌గా గొప్ప పేరు తెచ్చుకుంది...





• సునిత

పోలియో బాధితురాలైన సునిత త్రిప్పనిక్కర అయిదు సంవత్సరాల వయసు నుంచి బొమ్మలు వేయడం ప్రారంభించింది. సునిత మొదట్లో చేతులతోనే బొమ్మలు వేసేది. అయితే డిగ్రీ చదివే రోజుల్లో చేతుల్లో పటుత్వం కోల్పోయింది. బ్రష్ పట్టుకోవడం కష్టంగా మారింది. ఆ సమయంలో తన సోదరుడిని స్ఫూర్తిగా తీసుకుని మౌత్ ఆర్టిస్ట్‌గా మారింది. దివ్యాంగుడైన ఆమె సోదరుడు నోటితో కుంచె పట్టుకుని బొమ్మలు వేస్తాడు.

సునిత ఇప్పటివరకు అయిదు వేలకు పైగా పెయింటింగ్స్ వేసింది.

ఆమె ఆర్ట్‌వర్క్స్ సొంత రాష్ట్రం కేరళతో పాటు సింగపూర్‌లోనూ ప్రదర్శితమయ్యాయి.

ప్రకృతి సంబంధిత చిత్రాలు వేయడం అంటే సునితకు ఇష్టం. విన్సెంట్ వాన్ గో ఆమెకు ఇష్టమైన చిత్రకారుడు.

'ప్రయాణాలు చేయడం, కొత్త విషయాలు నేర్చుకోవడం అంటే ఇష్టం. ఇక రంగులు అనేవి నన్ను ఎప్పుడూ అబ్బురపరిచే అద్భుతాలు. సంప్రదాయంతో పాటు ఆధునిక చిత్రధోరణులు అంటే కూడా ఇష్టం. మొదట్లో పళ్ల మధ్య కుంచె పట్టుకుని చిత్రాలు వేయడం చాలా కష్టంగా అనిపించింది. సాధన చేస్తూ చేస్తూ కష్టం అనిపించకుండా చేసుకున్నాను' అంటుంది సునిత.

సునిత చేసే ప్రయాణాలలో కనిపించే సుందర దృశ్యాలు కాన్వాస్‌పైకి రావడానికి ఎంతోకాలం పట్టదు.

'బాధితులకు ఓదార్పును ఇచ్చే శక్తి చిత్రకళకు ఉంది' అంటాడు వ్యాన్ గో. ఆ మాట సునిత విషయంలో అక్షరాలా నిజం అయింది. క్యాన్వాస్ దగ్గర ఉన్న ప్రతిసారీ తనకు వందమంది స్నేహితుల మధ్య సందడిగా ఉన్నట్లుగా ఉంటుంది. ధైర్యం చెప్పే గురువు దగ్గర ఉన్నట్లు అనిపిస్తుంది. ఆత్మీయతను పంచే అమ్మ దగ్గర ఉన్నట్లుగా ఉంటుంది. 'నా జీవితంలోకి చిత్రకళ రాకుండా ఉండి ఉంటే పరిస్థితి ఊహకు అందనంత విషాదంగా ఉండేది' అంటుంది సునిత.

బెంగళూరు నుంచి సింగపూర్ వరకు సునిత ఆర్ట్ ఎగ్జిబిషన్స్ జరిగాయి. అక్కడికి వచ్చే వారు ఆర్టిస్ట్‌గా ఆమె ప్రతిభ గురించి మాత్రమే మాట్లాడడానికి పరిమితం కాలేదు. స్ఫూర్తిదాయకమైన ఆమె సంకల్పబలాన్ని వేనోళ్లా పొగిడారు.

'మౌత్ అండ్ ఫుట్ పెయింటింగ్ ఆర్టిస్ట్స్' సంస్థలో సభ్యురాలైన సునిత దివ్యాంగులైన ఆర్టిస్ట్‌లకు సహకారం అందించే ఎన్నో సంస్థలతో కలిసి పనిచేస్తోంది. వీల్‌చైర్‌కే పరిమితమైన వారిలో విల్‌పవర్ పెంపొందించేలా సోదరుడు గణేష్‌తో కలిసి 'ఫ్లై' అనే సంస్థను ప్రారంభించింది. 'చిరకు' పేరుతో ఒక పత్రికను నిర్వహిస్తోంది.

కాలి వేళ్లే కుంచెలై...



• సరస్వతి శర్మ


రెండు చేతులు లేకపోతేనేం సరస్వతీ శర్మకు సునిత లాగే అంతులేని ఆత్మబలం ఉంది. సునిత నోటితో చిత్రాలు వేస్తే రాజస్థాన్‌కు చెందిన సరస్వతీ శర్మ కాలివేళ్లను ఉపయోగించి చిత్రాలు వేస్తుంది. ఇంగ్లీష్ సాహిత్యంలో మాస్టర్స్ చేసింది. ఫైన్ ఆర్ట్స్‌లో డిప్లొమా చేసింది. ఎడమ కాలితో నోట్స్ రాసుకునేది. 'మొదట్లో ఆర్ట్ అనేది ఒక హాబీగానే నాకు పరిచయం అయింది. అయితే అది హాబీ కాదని, అంతులేని శక్తి అని ఆ తరువాత అర్థమైంది' అంటుంది సరస్వతీ శర్మ. కోచిలోని 'మౌత్ అండ్ ఫుట్ ఆర్టిస్ట్స్' ఆర్ట్ గ్యాలరీలో సునిత చిత్రాలతో పాటు సరస్వతి చిత్రాలను ప్రదర్శించారు. ఒకవైపు నోటితో చిత్రాలు వేస్తున్న సునిత మరోవైపు కాలివేళ్లతో చిత్రాలు వేస్తున్న సరస్వతిలను చూస్తుంటే ప్రేక్షకులకు ఆత్మబలానికి నిలువెత్తు రూపాలను చూసినట్లుగా అనిపించింది.

సాగుబడి
చిత్త కార్తె: అక్టోబర్ 24 వరకు

- రసాయనిక సేద్యం భూముల్ని బీళ్లుగా మార్చుతుంటే.. ప్రకృతి సేద్యం బీళ్లను సాగులోకి తెస్తుంది
- ప్రకృతి సేద్యంలో రైతుల ఆదాయం అధికం
- ప్రకృతి సేద్యంతో 2050 నాటికి నిరుద్యోగం రేటు 31 నుంచి 7 శాతానికి తగ్గుతుంది.
- ప్రకృతి విపత్తులను దీటుగా తట్టుకోవడం ప్రకృతి సేద్యంతోనే సాధ్యం
- ఎఫ్ఏఓ, సిఐఆర్ఏడి, ఆర్‌వైఎస్ సంయుక్త అధ్యయన నివేదిక వెల్లడి

ప్రకృతి సేద్యమే రక్ష!

జలమే జీవం జలమే ఆహారం.. అనే నినాదంతో ఎఫ్ఏఓ ప్రపంచ ఆహార దినోత్సవం సోమవారం నిర్వహించింది. ఈ సందర్భంగా వెలువడిన ఓ తాజా నివేదిక ఆసక్తిని కలిగిస్తోంది. ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం అమలవుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2031 నాటికి పొలాలన్నిటినీ పూర్తిగా ప్రకృతి సేద్యంలోకి మార్చాలన్నది సంకల్పం. అయితే, ప్రకృతి వ్యవసాయ ప్రభావం 2050 నాటికి ఎలా ఉంటుంది? రసాయనిక వ్యవసాయంలో కొనసాగితే ఆ ప్రభావం ఏ విధంగా ఉంటుంది? ఇవి ఆసక్తికరమైన ప్రశ్నలు. ఈ అంశాలను లోతుగా శోధిస్తూ క్షేత్రస్థాయి ప్రకృతి సేద్య ఫలితాల ఆధారంగా 'ఆగ్రోఎకో 2050 ఫోర్‌సైట్ ప్రాజెక్టు'లో భాగంగా మూడేళ్ల పాటు విస్తృతంగా అధ్యయనం చేశారు.



• పారిశ్రామిక వ్యవసాయాన్ని కొనసాగిస్తే ఎడారీకరణే గతి..

• ప్రకృతిసేద్యం వల్ల దేశం ఇలా సుభిక్షంగా మారుతుంది

ఫ్రెంచ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్మెంట్ (సిఐఆర్ఏడి)కు చెందిన సీనియర్ ఆర్థికవేత్త బ్రూనో డోరిన్, ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) వ్యవసాయ శాస్త్రవేత్త అన్నే సోఫి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ శాఖకు చెందిన రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్) ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ టి. విజయకుమార్ పలువురు శాస్త్రవేత్తలు, రైతులతో కలిసి 2019 నుంచి 2022 వరకు అధ్యయనం చేశారు. అంతర్జాతీయ శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ నివేదికను రూపొందించటం విశేషం. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర శాఖల ఉన్నతాధికారులతో చర్చించిన తదనంతరం 'ఆగ్రోఎకో 2050: ఆంధ్రప్రదేశ్‌లో ఆహార వ్యవస్థలపై పునరాలోచన- ప్రకృతి వ్యవసాయం భవిష్యత్తులో ఆహార సమృద్ధిని ఎలా సాధిస్తుంది' అనే శీర్షికన అధ్యయన నివేదిక సిద్ధమైంది. నీతి ఆయోగ్ సభ్యులు (వ్యవసాయం) ప్రొఫెసర్ రమేశ్ చంద్ దీన్ని న్యూఢిల్లీలో ఇటీవల విడుదల చేశారు.



పారిశ్రామిక (రసాయనిక) వ్యవసాయాన్ని, ప్రకృతి వ్యవసాయాన్ని పోల్చుతూ రెండు విభిన్న పరిస్థితుల్లో 2050 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వ్యవసాయం, ఆహారం, పర్యావరణం, ఉపాధి, సంక్షేమం తదితర రంగాల్లో ఎలా ఉండబోతోంది అనే విషయంపై విశ్లేషణను ఈ నివేదిక వెల్లడిస్తోంది. రాష్ట్రంలో విస్తృతంగా అమలవుతున్న ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం సరికొత్త ఆహార వ్యవస్థల స్థాపనలో ఎలాంటి అవకాశాలను కలిగిస్తుంది అనే కోణంలో శోధించారు. ఆంధ్రప్రదేశ్‌లో 2020–21 నాటికి 7 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. 2031 నాటికి ఈ రైతుల సంఖ్య 60 లక్షలకు చేరుకోవాలన్నది లక్ష్యం. ఆర్థిక, పర్యావరణ, పోషకాహార, సామాజిక సవాళ్లను సమీకృత పద్ధతిలో పరిష్కరించే హరిత వ్యవసాయానికి ఏపీ రాష్ట్రం నాయకత్వం వహిస్తుందనేది అధ్యయన బృందం అభిప్రాయం.

'ప్రకృతి' నేర్పుతున్న అసాధారణ నీటి పాఠాలు!



ప్రకృతి వ్యవసాయం సాగు నీటి వినియోగ పద్ధతిని సమూలంగా మార్చివేస్తుంది. ప్రకృతి సేద్యంలో సాగయ్యే పంటలు నీటిని వినియోగించుకోవటం మాత్రమే కాదు, నీటిని ఉత్పత్తి చేసుకుంటాయి కూడా! నదుల్లో ఉండే నీటికి పది రెట్లు నీరు గాలిలో ఉంది. గాలి నుంచి నీటిని సంగ్రహించి ఉపయోగించుకోవడం ప్రకృతి వ్యవసాయంలోనే సాధ్యమవుతుంది. 365 రోజులు ఆకుపచ్చగా పంటలతో పొలాన్ని కప్పి ఉంచటం, అవశేషాలతో ఆచ్ఛాదన కల్పించటం వల్ల నేలలో నుంచి తేమ ఆవిరి కావటం తగ్గుతుంది. నేలలో సేంద్రియ పదార్థం, సేంద్రియ కర్బనం పెరుగుతుంది కాబట్టి నీటిని గాలి నుంచి గ్రహించి పట్టి ఉంచుకునే శక్తి ఈ పంటలకు సమకూరుతోంది. కురిసిన 100 చుక్కల్లో 50 చుక్కలు వాగుల్లోకి పోతున్నాయి లేదా ఆవిరవుతున్నాయి. ప్రకృతి సేద్యంలో ఈ నష్టం బాగా తగ్గి, భూమిలోకి నీరు ఎక్కువగా ఇంకుతుంది. నీటిని భౌతికశాస్త్ర కోణం నుంచి అర్థం చేసుకోవటమే ఇప్పటి వరకు చేశాం. ప్రకృతి వ్యవసాయం జీవశాస్త్ర కోణం నుంచి నీటిని చూడటం నేర్పుతోంది. ఈ అసాధారణ పాఠాలు మేం నేర్చుకుంటూ సరికొత్త పద్ధతులను అమల్లోకి తెస్తున్నాం. వర్షం కురవక ముందే విత్తనాలను గుళికలుగా మార్చి విత్తుతున్నాం. నెల తర్వాత కొద్ది పాటి జల్లులు పడినా పంటలు మొలకెత్తుతున్నాయి. ఒకటికి పది పంటలు వత్తుగా వేయటం వల్ల రైతులకు చాలా లాభాలు చేకూరుతున్నాయి. బంజరు భూములను దున్నే పని లేకుండా సాగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం. పాదులు చేస్తూ ఒక్కో పాదులో ఐదారు రకాల విత్తనాలు వేస్తూ బంజరు భూములను సైతం రైతులు సాగులోకి తెస్తున్నారు. మన రైతుల అనుభవాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

– టి. విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, ఏపీ రైతు సాధికార సంస్థ

విభిన్న సాగు పద్ధతుల్లో వ్యత్యాసాలు

జనాభా పెరుగుదల– ఉపాధి అవకాశాలు, ఆర్థిక పురోగతి– అసమానతలు, నేల వినియోగం, దిగుబడి – ఆహార ఉత్పత్తి తదితర కోణాల్లో రెండు విభిన్న సాగు పద్ధతుల్లో పొందే ఫలితాల్లో వ్యత్యాసాలను అధ్యయనం చేసి ఈ నివేదికలో పొందుపరిచారు:

- రసాయనాలతో కూడిన పారిశ్రామిక వ్యవసాయం ఇలాగే కొనసాగితే 2050 నాటికి రైతుల సంఖ్య సగానికి తగ్గుతుంది. నిరుద్యోగం రేటు 31 శాతం నుంచి 30 శాతానికి తగ్గుతుంది. అయితే, పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేపడితే రైతుల సంఖ్య కోటికి పెరుగుతుంది. నిరుద్యోగం రేటు 7 శాతానికి తగ్గుతుంది.
- ప్రకృతి వ్యవసాయం ద్వారా బంజరు భూములు కూడా సాగులోకి వస్తాయి. అధిక విస్తీర్ణం సాగులోకి వచ్చి అత్యధిక మంది రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నం అవుతారు. తక్కువ పెట్టుబడితో ఏడాది పొడవునా రసాయన రహిత సురక్షిత పంటలు పండిస్తారు. అందువల్ల అధిక మార్కెట్ ధర పొందుతారు.
- ప్రకృతి వ్యవసాయ విధానంలో విత్తనాలు, నీటి వినియోగం, రసాయనాలు, ఇంధనం, అప్పులు, భారీ యంత్ర సామగ్రి తదితర ఖర్చుల విషయంలో రైతులకు ఎంతో డబ్బు ఆదా అవుతుంది. ఈ రైతులు పంట ఉత్పత్తులను విలువ జోడించి అమ్ముతారు కాబట్టి అధికాదాయం వస్తుంది.
- ప్రకృతి వ్యవసాయంలో నిరుద్యోగం తగ్గి, వ్యవసాయ–వ్యవసాయేతర వేతనాల్లో అంతరం తగ్గటం కారణంగా ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటారు. ఆర్థిక వృద్ధి 6.5%కి చేరుకుంటుంది.
- రసాయనిక వ్యవసాయం కొనసాగిస్తే 2050 నాటికి ఇది 6.1 పైసలు మాత్రమే ఉంటుంది. ప్రకృతి వ్యవసాయంలో ప్రతి రైతు ఉత్పత్తి చేసిన ప్రతి కిలో కేలరీల ఆహారానికి 10.3 పైసల ఆదాయం పొందుతారు.
- రసాయనిక వ్యవసాయం కొనసాగిస్తే 2019లో 62 లక్షల హెక్టార్లున్న సాగు భూమి విస్తీర్ణం 2050 నాటికి 55 లక్షల హెక్టార్లకు తగ్గుతుంది. కొన్ని పంటలపై మాత్రమే దృష్టి కేంద్రీకరించే పారిశ్రామిక వ్యవసాయ విధానంలో బీడు భూముల విస్తీర్ణం 2019లో 24 లక్షల హెక్టార్ల నుంచి 2050 నాటికి 30 లక్షల హెక్టార్లకు పెరిగే ప్రమాదం ఉంది.
- ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో బీడు భూములు కూడా సాగులోకి వచ్చి 2019లో 62 లక్షల హెక్టార్లున్న సాగు భూమి 2050 నాటికి 80 లక్షల హెక్టార్లకు పెరుగుతుంది. పంట ఉత్పత్తి గణనీయంగా పెరిగి ప్రస్తుత సవాళ్లను అధిగమించవచ్చు.
- రసాయన సేద్యంలో మొత్తం మీద తక్కువ భూమి, తక్కువ మంది రైతులు, అధిక సాగు ఖర్చులు, అధిక నిరుద్యోగ రేటుతో కలిపి వ్యవసాయ జీవీఏ పెరుగుదల రేటు సగటున సంవత్సరానికి 4% నుంచి 3.5%కి తగ్గుతుంది.
- ప్రకృతి వ్యవసాయం నేల ఆరోగ్యాన్ని పెంపొందించి సారవంతమైన భూములను అందిస్తుంది. అనేక రకాల పంటలతో అధిక పంట సాంద్రత ఏర్పడుతుంది.
- ప్రకృతి వ్యవసాయం అనుసరిస్తున్న రైతులు దిగుబడిలో ఎలాంటి తగ్గుదల లేకపోవడమే కాకుండా, అధిక దిగుబడిని కూడా సాధిస్తున్నారు. వర్షాధార వ్యవసాయ భూముల్లోనూ పలు రకాల పంటల సాంద్రత వల్ల మరింత దిగుబడిని సాధిస్తున్నారు. మొత్తానికి ప్రకృతి వ్యవసాయంలో రైతులు 2019లో హెక్టారుకు రోజుకు 31,000 కిలో కేలరీల ఆహారాన్ని ఉత్పత్తి చేశారు. 2050 నాటికి అది 36,000 కిలో కేలరీలకు పెరుగుతుంది.
- రసాయనిక వ్యవసాయంలో 2050 నాటికి రైతులు రోజుకు హెక్టార్‌కు దాదాపు 44,000 కిలో కేలరీలు ఉత్పత్తి చేసినా.. ప్రకృతి సేద్యంలో పండే పంట ఉత్పత్తులు స్థూల,సూక్ష్మ పోషకాలు, పీచు పదార్థంతో కూడిన బలవర్ధకమైన, సమతుల్యమైన ఆహారాన్ని అందిస్తాయి.
- రెండు విభిన్న పద్ధతుల్లో ఆహారోత్పత్తి, సాగు విస్తీర్ణం, వార్షిక దిగుబడులను అంచనా వేసి చూస్తే.. 2050లో ప్రతి వ్యక్తికి అందుబాటులో ఉండే ఆహారం రసాయనిక వ్యవసాయం (4050 కిలో కేలరీలు/తలసరి/రోజు)లో కంటే ప్రకృతి వ్యవసాయం (5000 కిలో కేలరీలు/తలసరి/రోజు)లో గణనీయంగా పెరుగుతుంది. అంతేగాక ప్రకృతి సేద్యంలో పండించిన పంట ఉత్పత్తులు రసాయనిక ఉత్పత్తుల కంటే మరింత సమతుల్యంగా, ఆరోగ్యంగా ఉంటాయి.
- ప్రతికూల వాతావరణ పరిస్థితులకు తట్టుకొనే విధంగా వ్యవసాయ పంటల జీవ వైవిధ్యం పెరుగుతుంది. సేంద్రియ కర్బనం నేలల్లో వృద్ధి చెందుతుంది. తద్వారా వాతావరణ మార్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది.
- అధిక ఉష్ణోగ్రతలు, కరువు, తుపాన్లు, వరదలు వంటి వాతావరణ విపత్తులను తట్టుకోవడం రసాయనిక సేద్యంతో సాధ్యం కాదని నివేదిక స్పష్టం చేస్తోంది. పెట్టుబడి తగ్గటం, సురక్షిత నీటితోపాటు విస్తృత స్థాయిలో పౌష్టికాహారం అందించడం, పర్యావరణ పరిరక్షణ వల్ల రాష్ట్రం 'రైతు అభివృద్ధి'కి దిక్సూచిగా మారుతుంది.



వరికి బలం.. జిల్లేడు ద్రావణం..

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగయ్యే వరి పొలాల్లో పిలక, చిరు పొట్ట దశలో ఏర్పడే సూక్ష్మ పోషకాలు/ పొటాష్ లోపాలతో పాటు రసంపీల్చే పురుగుల నివారణకు జిల్లేడు ఆకుల ద్రావణం సమర్థవంతంగా పనిచేస్తోందని రైతులు చెబుతున్నారు. గత రెండేళ్లుగా ప్రకృతి వ్యవసాయదారులు జిల్లేడు ద్రావణాన్ని విస్తృతంగా వాడుతూ ప్రయోజనం పొందుతున్నారు.



జిల్లేడు ద్రావణం తయారీకి కావాల్సిన పదార్థాలు: 200 లీటర్ల నీరు, 20 కేజీల జిల్లేడు ఆకులు, 10 లీటర్ల నాటు ఆవు మూత్రం.

తయారీ విధానం: 200 లీటర్ల నీటిలో 20 కేజీల జిల్లేడు ఆకులు వేసి 10 లీటర్ల ఆవు మూత్రం కలపాలి. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం కలపాలి. 3 రోజుల తరువాత వాడకానికి సిద్ధమవుతుంది.

మోతాదు: 100 లీటర్ల నీటిలో 10 లీటర్ల జిల్లేడు ద్రావణం కలిపి పిచికారీ చెయ్యాలి.

నిల్వ : 7 రోజులు మాత్రమే నిల్వ ఉంటుంది.

వివరాలకు: రైతు సాధికార సంస్థ ఉత్తరాంధ్ర సాంకేతిక అధికారి హేమసుందర్:80743 20481



తిలక్ వర్మ

హైదరాబాద్ శుభారంభం

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో మేఘాలయ జట్టుతో సోమవారం జైపూర్‌లో జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొమ్మిది వికెట్ల తేడాతో గెలిచింది. మొదట మేఘాలయ జట్టు 6 వికెట్లకు 119 పరుగులు సాధించింది. హైదరాబాద్ బౌలర్లలో రవితేజ 16 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. హైదరాబాద్ 13.2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 120 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ తిలక్ వర్మ (31 బంతుల్లో 41 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), తన్మయ్ అగర్వాల్ (33 బంతుల్లో 46 నాటౌట్; 6 ఫోర్లు) రాణించారు.

గోవా చేతిలో ఆంధ్ర జట్టు ఓటమి

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో గోవా జట్టుతో రాంచీలో సోమవారం జరిగిన గ్రూప్ 'సి' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 31 పరుగుల తేడాతో ఓడిపోయింది. మొదట గోవా జట్టు 6 వికెట్లకు 232 పరుగులు చేసింది. అనంతరం ఆంధ్ర జట్టు 18.3 ఓవర్లలో 201 పరుగుల వద్ద ఆలౌటైంది. హనుమ విహారి (33 బంతుల్లో 58 ; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), షేక్ రషీద్ (14 బంతుల్లో 27 ; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులు గెలిపించలేకపోయాయి.


విహారి

ఆసీస్ బోణీ

- స్పిన్ వలలో లంక విలవిల
- 125/0 నుంచి 209 ఆలౌట్
- నాలుగు వికెట్లతో తిప్పేసిన జంపా
- రాణించిన మార్ష్, ఇంగ్లిస్


లక్నో: ఐదుసార్లు విశ్వవిజేత ఆస్ట్రేలియా ఎట్టకేలకు ఈ వన్డే వరల్డ్‌కప్‌లో బోణీ కొట్టింది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిన ఆసీస్ మూడో మ్యాచ్‌లో శ్రీలంకపై ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. ఆడమ్ జంపా స్పిన్, బ్యాటర్ల సమష్టి బాధ్యత 'కంగారూ' జట్టును గెలిపించాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక 43.3 ఓవర్లలో 209 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్లు కుశాల్ పెరీరా (82 బంతుల్లో 78; 12 ఫోర్లు), నిసాంక (67 బంతుల్లో 61; 8 ఫోర్లు) అర్ధసెంచరీలతో అదరగొట్టారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జంపా (4/47) తిప్పేయగా, పేసర్ స్టార్క్ 2 వికెట్లు తీశాడు. తర్వాత ఆసీస్ 35.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసి నెగ్గింది. మిచెల్ మార్ష్ (51బంతుల్లో 52; 9 ఫోర్లు), జోష్ ఇంగ్లిస్ (59 బంతుల్లో 58; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో రాణించారు. మదుషంకకు 3 వికెట్లు దక్కాయి.

శుభారంభానికి స్పిన్‌తో చెక్

లంక ఓపెనర్లు ఆడిన ఆట, చేసిన పరుగులు, జత కూడిన భాగస్వామ్యం చూస్తే భారీస్కోరు గ్యారంటీ అనిపించింది! దీంతో ఒకదశలో ఆసీస్‌కు మళ్లీ ఓటమి కంగారూ తప్పదేమో అనిపించింది. అంతలా నిసాంక, కుశాల్ పెరీరా ఓపెనింగ్ జోడీ 21 ఓవర్లదాకా అర్ధసెంచరీలతో పరుగుల్ని పోగేసింది. అయితే కమిన్స్ పేస్ ఇద్దరిని స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు పంపించింది. దీంతో 125 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడ్డాక... స్పిన్ వైపు పిచ్ మళ్లింది. ఇదే అదనుగా జంపా... కెప్టెన్ కుశాల్ మెండిస్ (9), సమరవిక్రమ (8)లను అవుట్ చేశాడు. మరో స్పిన్నర్ మ్యాక్స్‌వెల్ అసలంక (25) వికెట్ తీయగా ఆ తర్వాత ఎవరూ పది పరుగులైనా చేయనీకుండా జంపా స్పిన్ ఉచ్చు, స్టార్క్ నిప్పులు చెరిగే బౌలింగ్ లంకను ఉక్కిరిబిక్కిరి చేసింది. 157 వద్ద రెండో వికెట్ పడిన లంక అనూహ్యంగా 209 పరుగులకే కుప్పకూలింది. కేవలం 52 పరుగుల వ్యవధిలోనే 8 వికెట్లను కోల్పోయింది.

తడబడినా...

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆసీస్ మళ్లీ తడబడింది. వార్నర్ (11; 1 సిక్స్), స్టీవ్ స్మిత్ (0)లను మదుషంక ఒకే ఓవర్లో పెవిలియన్ చేర్చడంతో కంగారూ శిబిరం ఆత్మరక్షణలో పడినట్లయింది. అయితే మరో ఓపెనర్ మార్ష్, లబుషేన్ (60 బంతుల్లో 40; 2 ఫోర్లు) కుదురుగా ఆడి ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు.


ఆడమ్ జంపా

ధాటిగా ఆడిన మార్ష్ అర్ధసెంచరీ పూర్తయ్యాక రనౌట్ కాగా... తర్వాత వచ్చిన ఇంగ్లిస్, లబుషేన్ గట్టెక్కించే భాగస్వామ్యం నమోదు చేశారు. నాలుగో వికెట్‌కు 77 పరుగులు జతయ్యాక లబుషేన్ పెవిలియన్ చేరాడు. ఫిఫ్టీ అనంతరం జట్టు విజయానికి చేరువ చేసి ఇంగ్లిస్ నిష్క్రమించాడు. మ్యాక్స్‌వెల్ (21 బంతుల్లో 31 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), స్టొయినిస్ (10 బంతుల్లో 20 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడి ముగించారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) వార్నర్ (బి) కమిన్స్ 61; కుశాల్ పెరీరా (బి) కమిన్స్ 78; మెండిస్ (సి) వార్నర్ (బి) జంపా 9; సమరవిక్రమ (ఎల్బీడబ్ల్యూ) (బి) జంపా 8; అసలంక (సి) లబుషేన్ (బి) మ్యాక్స్‌వెల్ 25; ధనంజయ (బి) స్టార్క్ 7; వెలలాగె (రనౌట్) 2; కరుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) జంపా 2; తీక్షణ (ఎల్బీడబ్ల్యూ) (బి) జంపా 0; లహిరు (బి) స్టార్క్ 4; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (43.3 ఓవర్లలో ఆలౌట్) 209. వికెట్ల పతనం:** 1-125, 2-157, 3-165, 4-166, 5-178, 6-184, 7-196, 8-199, 9-204, 10-209. **బౌలింగ్:** స్టార్క్ 10-0-43-2, హాజల్‌వుడ్ 7-1-36-0, కమిన్స్ 7-0-32-2, మ్యాక్స్‌వెల్ 9.3-0-36-1, జంపా 8-1-47-4, స్టొయినిస్ 2-0-11-0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: మార్ష్ (రనౌట్) 52; వార్నర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 11; స్మిత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 0; లబుషేన్ (సి) కరుణరత్నే (బి) మదుషంక 40; ఇంగ్లిస్ (సి) తీక్షణ (బి) వెలలాగె 58; మ్యాక్స్‌వెల్ (నాటౌట్) 31; స్టొయినిస్ (నాటౌట్) 20; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (35.2 ఓవర్లలో 5 వికెట్లకు) 215. వికెట్ల పతనం:** 1-24, 2-24, 3-81, 4-158, 5-192. **బౌలింగ్:** లహిరు 4-0-47-0, మదుషంక 9-2-38-3, తీక్షణ 7-0-49-0, వెలలాగె 9.2-0-53-1, కరుణరత్నే 3-0-15-0, ధనంజయ 3-0-13-0.

ప్రపంచకప్‌లో నేడు

దక్షిణాఫ్రికా X నెదర్లాండ్స్
వేదిక: ధర్మశాల
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	3	3	0	6	1.821
న్యూజిలాండ్	3	3	0	6	1.604
దక్షిణాఫ్రికా	2	2	0	4	2.360
పాకిస్తాన్	3	2	1	4	-0.137
ఇంగ్లండ్	3	1	2	2	-0.084
అఫ్గానిస్తాన్	3	1	2	2	-0.652
బంగ్లాదేశ్	3	1	2	2	-0.699
ఆస్ట్రేలియా	3	1	2	2	-0.734
శ్రీలంక	3	0	3	0	-1.532
నెదర్లాండ్స్	2	0	2	0	-1.800

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఈదురు గాలులతో వర్షం, ఊడిపడిన హోర్డింగ్స్

బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షంతో మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడింది. గాలి బలంగా వీయడంతో స్టేడియంలోని కొన్నిచోట్ల హోర్డింగులన్నీ ఊడిపడ్డాయి. అదృష్టవశాత్తు ప్రేక్షకుల హాజరు పలుచగా ఉండటం... ఊడిపడిన చోట జనం లేకపోవడంతో ఎలాంటి నష్టం జరగలేదు.

ఒలింపిక్స్‌లో క్రికెట్

లాస్ ఏంజెలిస్-2028 విశ్వ క్రీడల్లో పునరాగమనం

- టి20 ఫార్మాట్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో నిర్వహణ
- స్క్వాష్, ఫ్లాగ్ ఫుట్‌బాల్ క్రీడాంశాలకు తొలిసారి చోటు
- మళ్లీ బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్, లాక్రాస్ క్రీడాంశాలకు స్థానం
- ఐఓసీ సెషన్స్‌లో ఆమోద ముద్ర

ముంబై: లాంఛనం ముగిసింది. ఎట్టకేలకు క్రికెట్ ఒలింపిక్స్ క్రీడల్లో పునరాగమనం చేయనుంది. 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ క్రీడల్లో క్రికెట్‌తో పాటు స్క్వాష్, బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్, లాక్రాస్ (సిక్స్-ఎ-సైడ్), ఫ్లాగ్ ఫుట్‌బాల్ క్రీడాంశాలను కొత్తగా చేర్చారు. ఐదు కొత్త క్రీడాంశాలకు లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో అనుమతి ఇవ్వాలని ఎగ్జిక్యూటివ్ బోర్డు చేసిన ప్రతిపాదనలకు సోమవారం అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సభ్యులు ఓటింగ్ ద్వారా ఆమోదం తెలిపినట్లు ఐఓసీ అధ్యక్షుడు థామస్ బాక్ ప్రకటించారు. 99 మంది ఐఓసీ సభ్యుల్లో ఇద్దరు మాత్రమే ఈ ఐదు క్రీడాంశాల ప్రతిపాదనను వ్యతిరేకించగా... 97 మంది సమ్మతించారు. లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ ఈవెంట్‌ను టి20 ఫార్మాట్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో ఆరు జట్ల మధ్య నిర్వహిస్తారు. ఆతిథ్య దేశం హోదాలో అమెరికా జట్టుకు నేరుగా ఎంట్రీ లభిస్తుంది. ఐసీసీ ర్యాంకింగ్స్ ఆధారంగా మిగతా ఐదు జట్లను నిర్ణయించే అవకాశముంది.

- 1877లో క్రికెట్‌లో తొలి టెస్టు మ్యాచ్ జరిగింది. 1900 పారిస్ ఒలింపిక్స్‌లో ఒకే ఒకసారి క్రికెట్ మెడల్ ఈవెంట్‌గా ఉంది. పారిస్ గేమ్స్‌లో కేవలం ఫ్రాన్స్, బ్రిటన్ జట్లు మాత్రమే పాల్గొన్నాయి. బ్రిటన్ జట్టుకు స్వర్ణం, ఫ్రాన్స్ జట్టుకు రజతం లభించాయి. ఆ తర్వాత క్రికెట్ విశ్వ క్రీడల జాబితాలో చోటు కోల్పోయింది. టెస్టు, వన్డే ఫార్మాట్‌ల బదులు మూడు, నాలుగు గంటల్లో ఫలితం వచ్చే టి20 ఫార్మాట్ రాకతో క్రికెట్ స్వరూపమే మారిపోయింది. విశ్వవ్యాప్తంగా జరుగుతున్న టి20 లీగ్‌లు ఎంతో మంది క్రికెటర్లకు కొత్తగా అవకాశాలు కల్పిస్తుండటంతోపాటు ఆర్థికంగా వారిని ఆదుకుంటున్నాయి. ప్రస్తుతం ఫుట్‌బాల్ తర్వాత ప్రపంచంలో అత్యధిక ఆదరణ కలిగిన క్రీడగా క్రికెట్‌కు గుర్తింపు వచ్చింది. ఫలితంగా 128 ఏళ్ల తర్వాత ఎట్టకేలకు క్రికెట్ ఒలింపిక్స్‌లో పునరాగమనం చేయనుంది.
- ప్రస్తుతానికి క్రికెట్‌తోపాటు మిగతా నాలుగు కొత్త క్రీడాంశాలు లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ వరకే పరిమితం కానున్నాయి. తదుపరి ఒలింపిక్స్ క్రీడల్లోనూ క్రికెట్ కొనసాగడమనేది ఆయా దేశాల కార్య నిర్వాహక కమిటీల ఆసక్తిపై ఆధారపడి ఉంది. ఐఓసీ నిబంధనల ప్రకారం ఒలింపిక్స్ క్రీడల ఆతిథ్య దేశానికి తమకు నచ్చిన కొన్ని క్రీడాంశాలను అదనంగా చేర్చే వెసులుబాటు ఉంది. 2032 ఒలింపిక్స్ ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ నగరంలో జరుగుతాయి. 2036 ఒలింపిక్స్ ఆతిథ్యానికి భారత్ ఆసక్తి కనబరుస్తోంది. ఆస్ట్రేలియా, భారత్‌లో క్రికెట్‌కు విపరీతమైన ఆదరణ ఉండటంతో 2032, 2036 ఒలింపిక్స్‌ల్లోనూ క్రికెట్ కొనసాగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.
- 'విశ్వవ్యాప్తంగా 2.5 బిలియన్ అభిమానులు కలిగిన ప్రపంచంలోని రెండో అత్యధిక ఆదరణ కలిగిన క్రికెట్ క్రీడను ఒలింపిక్స్‌లోకి స్వాగతం పలుకుతున్నాం. అమెరికాలోనూ మేజర్ లీగ్ క్రికెట్ టోర్నీ ద్వారా ఈ ఆటకు ఆదరణ పెరుగుతోంది. వచ్చే ఏడాది అమెరికా-వెస్టిండీస్ సంయుక్తంగా టి20 ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. నా మిత్రుడు విరాట్ కోహ్లికి సామాజిక మాధ్యమాల్లో ప్రపంచ వ్యాప్తంగా 340 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. బాస్కెట్‌బాల్ దిగ్గజం లేబ్రాన్ జేమ్స్, అమెరికన్ ఫుట్‌బాల్ స్టార్ టామ్ బ్రేడీ, గోల్ఫ్ స్టార్ టైగర్ వుడ్స్‌కంటే ఎక్కువ మంది ఫాలోవర్లు కోహ్లికి ఉన్నారు. అందుకే క్రికెట్ కేవలం కొన్ని దేశాలకే పరిమితం కాకుండా విశ్వవ్యాప్తంగా ఆదరణ పొందాలనే ఉద్దేశంతో ఒలింపిక్స్‌లో చోటు కల్పిస్తున్నాం' అని లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ స్పోర్ట్స్ డైరెక్టర్, ఒలింపిక్ చాంపియన్ షూటర్ నికోలో కాంప్రియాని వ్యాఖ్యానించాడు. ఒలింపిక్స్ క్రీడల్లో క్రికెట్‌కు చోటు లభించడంపట్ల ఐఓసీ సభ్యురాలు, ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ యజమాని నీతా అంబానీ హర్షం వ్యక్తం చేశారు. ఒలింపిక్స్‌లో క్రికెట్ శాశ్వతంగా కొనసాగేందుకు తమవంతుగా అన్ని చర్యలు తీసుకుంటామని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చైర్మన్ గ్రెగ్ బార్‌క్లే తెలిపారు.
- రగ్బీ తరహాలో ఆడే ఫ్లాగ్ ఫుట్‌బాల్‌కు... స్క్వాష్‌కు ఒలింపిక్స్‌లో తొలిసారి స్థానం దక్కింది. బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్‌కు వచ్చే ఏడాది పారిస్‌లో జరిగే ఒలింపిక్స్‌లో చోటు దక్కకపోయినా... అమెరికాలో ఎంతో ప్రాచుర్యం ఉండటంతో బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్ లాస్ ఏంజెలిస్‌లో మళ్లీ కనిపిస్తాయి.
- హాకీ తరహాలో ఆడే లాక్రాస్ క్రీడాంశం 1904 సెయింట్ లూయిస్ ఒలింపిక్స్‌లో, 1908 లండన్ ఒలింపిక్స్‌లో మెడల్ ఈవెంట్‌గా ఉంది. ఆ తర్వాత 1928 ఆమ్‌స్టర్‌డామ్, 1932 లాస్ ఏంజెలిస్, 1948 లండన్ ఒలింపిక్స్‌లో ప్రదర్శన క్రీడగా కొనసాగి ఆ తర్వాత చోటు కోల్పోయింది.


కోహ్లి


లాక్రాస్


బేస్‌బాల్


ఫ్లాగ్ ఫుట్‌బాల్


స్క్వాష్

సినిమా


శైలేష్ కొలను, నవాజుద్దీన్ సిద్ధిఖీ, వెంకటేశ్, వెంకట్ బోయనపల్లి

వారివల్లే ఈ ప్రయాణం సాధ్యమైంది - వెంకటేశ్

"నా మొదటి సినిమా(కలియుగ పాండవులు) నుంచి ఇప్పుడు 75వ సినిమా 'సైంధవ్' వరకూ నన్ను ఎంతగానో ప్రేమించి, ఆదరించి, అభిమానిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మీ ప్రేమ, అభిమానం, ఆప్యాయత వల్లే ఈ ప్రయాణం సాధ్యపడింది. ఇందుకు ప్రేక్షకులకు, నా అభిమానులకు, చిత్ర పరిశ్రమకు ధన్యవాదాలు'' అని హీరో వెంకటేశ్ అన్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేశ్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'సైంధవ్'. నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెరెమియా, సారా కీలక పాత్రల్లో నటించారు. నిహారిక ఎంటర్‌టైన్మెంట్స్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మించిన 'సైంధవ్' తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో జనవరి 13న విడుదల కానుంది. ఈ మూవీ టీజర్ లాంచ్ వేడుకలో వెంకటేశ్ మాట్లాడుతూ–

''బలమైన భావోద్వేగాలు, యాక్షన్‌కి అవకాశం ఉన్న కథ 'సైంధవ్'. కుటుంబ ప్రేక్షకులందరికీ సినిమా నచ్చుతుంది. ఇందులో నన్ను కొత్తగా చూస్తారు. గతంలో నా సినిమాలు 'చంటి, కలిసుందాం రా, లక్ష్మి' సంక్రాంతికి వచ్చి, హిట్ అయ్యాయి. ఇప్పుడు 'సైంధవ్' వస్తోంది. సంక్రాంతి రోజు ప్రేక్షకులు ఒక మంచి సినిమా చూడబోతున్నారు'' అన్నారు. ''ఈ మూవీ అందరికీ నచ్చుతుంది'' అన్నారు నవాజుద్దీన్ సిద్ధిఖీ. ''వెంకటేశ్‌గారి ప్రతిష్ఠాత్మక 75వ చిత్రానికి దర్శకత్వం చేసే అవకాశం నాకు ఇచ్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు'' అన్నారు శైలేష్ కొలను. ''వెంకటేశ్‌గారితో సినిమా చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు వెంకట్ బోయనపల్లి.

ప్రేమ..స్నేహం

'తెలుసు కదా' అంటున్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్న ఈ సినిమాకి 'తెలుసు కదా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రంలో సిద్ధు జొన్నలగడ్డ హీరో, రాశీఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా నటించనున్నారు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మించనున్నారు. సోమవారం ఈ సినిమా అనౌన్స్‌మెంట్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. ''సామాజిక అంశాలు, అనుబంధాల నేపథ్యంలో సాగే ఈ సోల్‌ఫుల్ లవ్‌స్టోరీలో సిద్ధు కొత్త అవతారంలో కనిపిస్తారు. ఓ అమ్మాయి, అబ్బాయిల మధ్య సాగే ఓ కథతో పాటు స్నేహం, కుటుంబం, త్యాగం, సెల్ఫ్ లవ్ అంశాలు ఈ చిత్రంలో ఉంటాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: తమన్, కెమెరా: కె.యువరాజ్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.


సిద్ధు జొన్నలగడ్డ


లావణ్య, వరుణ్ తేజ్, అల్లు అర్జున్

హీరో వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్యా త్రిపాఠిల వివాహం నవంబరు 1న జరగనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఓ వైపు ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్, మరోవైపు పెళ్లి పనులు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల చిరంజీవి ఇంట్లో ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ జరిగాయి. తాజాగా హీరో అల్లు అర్జున్, కుటుంబ సభ్యులు ప్రీ వెడ్డింగ్ పార్టీని ఏర్పాటు చేశారు. నిర్మాత అల్లు అరవింద్, హీరోలు చిరంజీవి, అల్లు అర్జున్, సాయిధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్, అల్లు శిరీష్, నితిన్, హీరోయిన్ రీతూవర్మతో పాటు మెగా, అల్లు కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఈ పార్టీలో సందడి చేశారు. ఈ ఫొటోలను వరుణ్ తేజ్, అల్లు శిరీష్ షేర్ చేశారు.

నువ్వు మొదలుపెట్టావ్.. నేను ముగిస్తాను!

'దేశంలోని శాంతికి, దేశంలోని శత్రువులకు మధ్య ఎంత దూరం ఉంటుంది. కేవలం ఒక మనిషంత' అంటూ మొదలవుతుంది 'టైగర్ 3' తెలుగు ట్రైలర్. సల్మాన్‌ఖాన్, కత్రినా కైఫ్, ఇమ్రాన్ హాష్మి ప్రధాన పాత్రధారులుగా మనీష్‌శర్మ దర్శకత్వంలో ఆదిత్యా చోప్రా నిర్మించిన స్పై ఫిల్మ్ 'టైగర్ 3'. యశ్‌రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్‌లోని 'టైగర్ జిందా హై', 'వార్', 'పఠాన్' చిత్రాల్లోని ఘటనలకు కొనసాగింపుగా 'టైగర్ 3' ఉంటుందని చిత్ర యూనిట్ చెబుతోంది. తాజాగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో 'టైగర్ 3' ట్రైలర్‌ను విడుదల చేసి, సినిమాను నవంబరు 12న విడుదల చేయనున్నట్లుగా చిత్రయూనిట్ వెల్లడించింది. 'టపాసులు కాల్చడం నువ్వు మొదలు పెట్టావ్.. నేను ముగిస్తాను', 'టైగర్‌కు శ్వాస ఉన్నంత వరకు, ఈ టైగర్ ఓటమిని ఒప్పుకోడు' అంటూ సల్మాన్‌ఖాన్ చెప్పే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. 'ఏక్తా టైగర్', 'టైగర్ జిందాహై' చిత్రాల తర్వాత 'టైగర్' ఫ్రాంచైజీలో వస్తున్న మూడో సినిమా 'టైగర్ 3'.


'టైగర్ 3' పోస్టర్

ఎక్స్‌ట్రాలోకి స్వాగతం

ఎన్నో విలక్షణమైన పాత్రలతో అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించి, వారి హృదయాల్లో తనదైన స్థానం సొంతం చేసుకున్న హీరో రాజశేఖర్ 'ఎక్స్ ట్రా– ఆర్డినరీ మేన్' చిత్రంలో ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఆయన సెట్స్‌లోకి అడుగుపెట్టారు. నితిన్, శ్రీలీల జంటగా వక్కంతం వంశీ దర్శకత్వంలో 'ఎక్స్‌ట్రా: ఆర్డినరీ మేన్' చిత్రం తెరకెక్కుతోంది. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్య మూవీస్ అండ్ ఎంటర్‌టైన్మెంట్, రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో రాజశేఖర్ నటిస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ మేరకు ఆయన సెట్స్‌లోకి అడుగు పెట్టగా, మేకర్స్ స్వాగతం పలికారు. ''ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్‌గా 'ఎక్స్‌ట్రా' రూపొందుతోంది. ఇప్పటి వరకు తన కెరీర్‌లో చేయని పాత్రను నితిన్ ఈ సినిమాలో చేస్తున్నారు'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ మూవీ డిసెంబరు 8న విడుదలకానుంది.


వక్కంతం వంశీ, సుధాకర్ రెడ్డి, రాజశేఖర్

అన్వేషి విజువల్స్ బాగున్నాయి - వరలక్ష్మి

''అన్వేషి' ట్రైలర్, విజువల్స్ చాలా బాగున్నాయి. సంగీతం, నేపథ్య సంగీతం కూడా చక్కగా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలి. చిత్ర యూనిట్‌కి అభినందనలు'' అని నటి వరలక్ష్మీ శరత్ కుమార్ అన్నారు. విజయ్ ధరణ్ దాట్ల, సిమ్రాన్ గుప్తా, అనన్య నాగళ్ల హీరో హీరోయిన్లుగా వీజే ఖన్నా దర్శకత్వం వహించిన చిత్రం 'అన్వేషి'. టి.గణపతి రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని నవంబరు రెండో వారంలో విడుదలకి సన్నాహాలు చేస్తున్నారు. గణపతి రెడ్డి పుట్టినరోజు(సోమవారం) సందర్భంగా 'అన్వేషి' మూవీ ట్రైలర్‌ను వరలక్ష్మి విడుదల చేశారు. టి.గణపతి రెడ్డి మాట్లాడుతూ– ''నిర్మాతగా 'అన్వేషి' నా తొలి చిత్రం. సినిమా అందరికీ నచ్చుతుంది'' అన్నారు. ''మంచి కథాంశంతో రూపొందిన మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు వీజే ఖన్నా, విజయ్ ధరణ్ దాట్ల, సిమ్రాన్ గుప్తా, అనన్య. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్, సహ నిర్మాతలు హరీష్ రాజు, శివన్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ దుర్గేష్ మాట్లాడారు.


అనన్య నాగళ్ల, వరలక్ష్మి, విజయ్ ధరణ్

నవంబరులో దీపావళి

ప్రముఖ నిర్మాత 'స్రవంతి' రవి కిశోర్ నిర్మించిన తొలి తమిళ సినిమా 'కిడ'. ఆర్ఏ వెంకట్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పూ రాముస్, కాళీ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని తెలుగులో 'దీపావళి'గా అనువదిస్తున్నారు. నవంబరు 11న తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమాని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'స్రవంతి' రవికిశోర్ మాట్లాడుతూ– ''వెంకట్‌కి ఇది తొలి సినిమా అయినా బాగా తీయగలడనే నమ్మకంతో పూర్తి స్వేచ్ఛ ఇచ్చాను. కథని అనుకున్నట్లు తెరపైకి తీసుకొచ్చాడు'' అన్నారు. ''తాతయ్య, మనవడు, ఓ మేకపిల్ల... ఈ మూడు పాత్రల మధ్య భావోద్వేగాలు 'దీపావళి'లో ప్రధానాంశం. ఆంధ్ర, తమిళనాడు సరిహద్దుల్లోని చిత్తూరు జిల్లాలోని ఓ గ్రామంలో ఈ చిత్ర కథ జరుగుతుంది'' అన్నారు ఆర్ఏ వెంకట్. ఈ చిత్రానికి సంగీతం: థీసస్, కెమెరా: ఎం. జయప్రకాశ్, సమర్పణ: కృష్ణ చైతన్య.


కాళీ వెంకట్

సస్పెన్స్ థ్రిల్లర్

సీనియర్ హిందీ నటుడు మిథున్ చక్రవర్తి కుమారుడు మిమో చక్రవర్తి హీరోగా పరిచయం అవుతున్న సినిమా 'నేనెక్కడున్నా'. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన ఈ సినిమాకు మాధవ్ కోదాడ దర్శకత్వం వహించగా, సశా చైత్రి హీరోయిన్. కేబీఆర్ సమర్పణలో మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 17న విడుదల కానుంది. మాధవ్ కోదాడ మాట్లాడుతూ– ''పాలిటిక్స్ అండ్ జర్నలిజం నేపథ్యంలో రూపొందిన సస్పెన్స్ థ్రిల్లర్ ఫిల్మ్ ఇది. హీరో హీరోయిన్లు జర్నలిస్ట్ పాత్రల్లో కనిపిస్తారు. జర్నలిజంపై రాజకీయ ప్రభావం ఎలా ఉంటుందో ఈ సినిమాలో చూపించాం'' అన్నారు. ''సినిమా సెన్సార్ పూర్తయింది'' అన్నారు నిర్మాత మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి. ఈ సినిమాకు సంగీతం: శేఖర్ చంద్ర, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ : రాజేష్ ఎస్ఎస్.


మిమో చక్రవర్తి



ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'సలార్'. ఈ చిత్రం తొలిపార్టు 'సలార్: సీజ్‌ఫైర్' లో వరదరాజ్ మన్నార్ పాత్రలో మలయాళ నటుడు–దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. సోమవారం ఆయన బర్త్ డే. ఈ సందర్భంగా 'సలార్: సీజ్ ఫైర్' నుంచి పృథ్వీరాజ్ కొత్తపోస్టర్‌ను రిలీజ్ చేశారు. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 22న విడుదల కానుంది.

నవాబ్ యాక్షన్

ముఖేష్ గుప్తా, అనన్య నాగళ్ల జంటగా రవి చరణ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'నవాబ్'. ఆర్ఎమ్ నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''థ్రిల్లింగ్ అండ్ ఎమోషనల్ ఎలిమెంట్స్‌తో ఓ డంప్ యార్డ్ చుట్టూ అల్లుకున్న కథగా 'నవాబ్' చిత్రం సాగుతుంది. త్వరలోనే షూటింగ్ పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌ను స్టార్ట్ చేస్తాం. వీలైనంత త్వరగా సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: పీఆర్, కెమెరా: రమేష్ కేఆర్.


ముఖేష్ గుప్తా

సాక్షి బిజినెస్

మంగళవారం
17-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
115	19
66,167	19,732

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తాలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	13,565	△ 158
డోజోన్స్	34,031	△ 360
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,631	△ 31
డాక్స్	15,238	△ 51
షాంఘై	3,074	▽ 14
నికాయ్	31,659	▽ 657

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	58,312
బంగారం (99.5 స్వచ్ఛత)	58,153
వెండి (కిలో)	69,456

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.50	84.17
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	99.61	102.95
€	యూరో	ఒకటి	86.16	89.23
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.89	56.59
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.56	53.88
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.88	61.81
SAR	సౌదీ రియాల్	ఫారెక్స్ కార్డ్	21.25	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	ఫారెక్స్ కార్డ్	21.78	23.57
¥	చైనా యువాన్	ఫారెక్స్ కార్డ్	10.27	12.34

సెలెక్ట్ మొబైల్స్ 'గ్రేట్ ఫెస్టివల్ డేస్'



హైదరాబాద్: సెలెక్ట్ మొబైల్స్ దసరా పండుగ సందర్భంగా గ్రేట్ ఫెస్టివల్ డేస్ ఆఫర్ ప్రకటించింది. స్మార్ట్‌ఫోన్ల కొనుగోలుపై ఆన్‌లైన్ కంటే రూ.5000 వరకు తగ్గింపు అందిస్తోంది. స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్, ఇతర యాక్సెసరీస్‌పై ప్రత్యేక ఆఫర్లు ప్రవేశపెట్టింది. పనిచేయని/పాత ఎలక్ట్రానిక్స్‌ను సెలెక్ట్ స్టోర్లలోని ఈ-వేస్ట్ బాక్స్‌లో వేసి రూ.10,000 వరకు డిస్కౌంట్ పొందవచ్చు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఈజీఈఎంఐపై 10% తక్షణ తగ్గింపు, ఐసీఐసీఐ ఫైనాన్స్‌పై రూ.10 వేల వరకు, బజాజ్ ఫిన్‌సర్వ్‌పై రూ.9 వేల వరకు క్యాష్‌బ్యాక్, ఎస్‌బీఐ క్రెడిట్, డెబిట్ కార్డులపై 5%, క్లైవర్‌పే పై 15% వరకు క్యాష్‌బ్యాక్ పొందవచ్చని సంస్థ సీఎండీ వై.గురు తెలిపారు.

బజాజ్ ఎలక్ట్రానిక్స్ భారీ ఆఫర్



హైదరాబాద్: బజాజ్ ఎలక్ట్రానిక్స్ రూ.1 కోటి నగదు, మారుతీ సుజుకీ 30 ఆల్టో కే10 కార్లతో భారత్‌లో అతిపెద్ద పండుగ బంపర్ డ్రా ఆఫర్ ప్రకటించింది. నటి అషూరెడ్డి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్ లాంఛనప్రాయంగా ప్రారంభించారు. ఈ ఆఫర్ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని బజాజ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్లలో 2024 జనవరి 3 వరకు అందుబాటులో ఉంటుంది. 'ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, గ్యాడ్జెట్లు, మొబైల్స్ ఇష్టపడే వారికి బజాజ్ ఎలక్ట్రానిక్స్ తొలి ప్రాధాన్యతగా ఉంటుంది. కస్టమర్లకు కృతజ్ఞతలు తెలిపేందుకు, వారితో సత్సంబంధాలు కొనసాగించేందుకు బంపర్ డ్రా ఆఫర్ ఒక ప్రధాన మార్గం' అని సంస్థ సీఈవో కిరణ్ బజాజ్ తెలిపారు.

మైనస్‌లోనే టోకు ధరలు..

- సెప్టెంబర్‌లో డబ్ల్యూపీఐ మైనస్ 0.26%
- ఈ తరహా ధోరణి వరుసగా ఆరవ నెల



న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 2023 సెప్టెంబర్‌లో అసలు పెరక్కపోగా (2022 ఇదే నెలతో పోల్చి) మైనస్ (–) 0.26 శాతంగా నమోదయ్యింది. టోకు ధరల సూచీ మైనస్‌లోనే కొనసాగడం ఇది వరుసగా ఆరవ నెల. ఏప్రిల్ నుంచీ నెలకొన్న ఈ తరహా ధోరణిని ప్రతి ద్రవ్యోల్బణంగా వ్యవహరిస్తారు.

ఎందుకంటే..: ప్రతి ద్రవ్యోల్బణానికి రసాయనాలు, రసాయన ఉత్పత్తులు, మినరల్ ఆయిల్స్, టెక్స్‌టైల్స్, బేసిక్ మెటల్స్, ఫుడ్ ప్రొడక్ట్స్ ధరలు తాజా సమీక్షా నెల్లో (2022 సెప్టెంబర్ ధరలతో పోల్చితే) తగ్గడమే కారణమని వాణిజ్య, పరిశ్రమ మంత్రిత్వ శాఖ సోమవారం తెలిపింది.

విభాగాల వారీగా చూస్తే...

ఫుడ్ ఆర్టికల్స్: ఈ విభాగంలో ద్రవ్యోల్బణం 3.35 శాతానికి తగ్గింది. అంతక్రితం రెండు నెలలూ ఈ విభాగంలో ద్రవ్యోల్బణం రెండంకెల్లో కొనసాగింది. ఆగస్టులో 10.60 శాతంగా ఉంది. తాజా సమీక్షా నెల్లో కూరగాయల ధరలు 15 శాతం తగ్గాయి. ఆగస్టులో వీటి పెరుగుదల రేటు 48.39 శాతంగా ఉంది. ఆలూ ధరలు 25.24 శాతం తగ్గాయి. అయితే పప్పులు (17.69%), ఉల్లి (55.05%) ధరలు సెప్టెంబర్‌లో పెరిగాయి. రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 3 నెలల కనిష్ట స్థాయిలో 5.02 శాతంగా నమోదయిన సంగతి తెలిసిందే.

ఫ్యూయెల్ అండ్ పవర్: ఈ రంగంలో ప్రతి ద్రవ్యోల్బణం 3.35 శాతంగా ఉంది.

తయారీ: మొత్తం సూచీలో మెజారిటీ వాటా గల ఈ రంగంలో ధరల తగ్గుదల 1.35%గా నమోదైంది.

ఇక పెరిగే అవకాశం..

సెప్టెంబర్ వరకూ టోకు ధరల సూచీలో తగ్గుదల నమోదయినప్పటికీ, ఇకపై పెరిగే అవకాశమే ఉందన్నది నిపుణుల వాదన. అంతర్జాతీయంగా పెరుగుతున్న క్రూడ్ ధరలు, వర్షాభావం ఖరీఫ్ పంటపై అనిశ్చితి ధోరణి ఇందుకు కారణం కావచ్చని కేర్‌ఎడ్జ్ చీఫ్ ఎకనమిస్ట్ రజనీ సిన్హా పేర్కొన్నారు.

జియో ఫైనాన్షియల్ లాభం రెట్టింపు

క్యూ2లో రూ. 668 కోట్లు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి విడివడిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ తొలిసారి త్రైమాసిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికం(క్యూ2)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర లాభం రెట్టింపై రూ. 668 కోట్లను అధిగమించింది. గతేడాది(2022–23) ఇదే కాలం (జులై–సెప్టెంబర్)లో కేవలం రూ. 332 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 47 శాతం జంప్‌చేసి రూ. 608 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 414 కోట్ల టర్నోవర్ మాత్రమే సాధించింది. అయితే ఇందుకు రూ. 217 కోట్ల డివిడెండ్ ఆదాయం జత కలిసింది. ఇంతక్రితం ఐసీఐసీఐ బ్యాంక్ (సైబర్‌సెక్యూరిటీ) సీఐఎస్‌వోగా పనిచేసిన ఏఆర్ గణేశ్‌ను గ్రూప్ టెక్నాలజీ ఆఫీసర్‌గా ఎంపిక చేసినట్లు కంపెనీ ఈ సందర్భంగా పేర్కొంది.

మూడో రోజూ నష్టాలు

- అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావం
- ఐటీ, ఫార్మా, షేర్లలో అమ్మకాలు
- సెన్సెక్స్ నష్టం 115 పాయింట్లు
- 19,750 దిగువకు నిఫ్టీ



ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని బలహీన సంకేతాలు, క్రూడాయిల్ ధరల పెరుగుదల ప్రభావాలతో స్టాక్ సూచీలు మూడోరోజూ నష్టాలు చవిచూశాయి. ఫలితంగా సోమవారం సెన్సెక్స్ 115 పాయింట్లు నష్టపోయి 66,167 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 19 పాయింట్లు పతనమై 19,732 వద్ద నిలిచింది. ప్రతికూల అంతర్జాతీయ సంకేతాల ప్రభావంతో ఉదయం సూచీలు మిశ్రమంగా మొదలయ్యాయి. రోజంతా పరిమిత శ్రేణిలో లాభ, నష్టాల మధ్య ఊగిసలాడాయి. ప్రథమార్ధంలో బ్యాంకింగ్, రియల్టీ, ఐటీ స్టాకుల్లో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఒక దశలో సెన్సెక్స్ 244 పాయింట్లు క్షీణించి 66,039 వద్ద, నిఫ్టీ 59 పాయింట్లు పతనమై 19,692 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. అయితే ద్వితీయార్ధంలో మెటల్, ఆటో, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టాలు కొంతమేర తగ్గాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ. 594 కోట్ల షేర్లు విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,184 కోట్ల షేర్లు కొన్నారు. పాలస్తీనా–ఇజ్రాయెల్ సంక్షోభం, అమెరికా ద్రవ్యోల్బణ పెరుగుదల భయాలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

ఫెడరల్ బ్యాంక్ క్యూ2 రికార్డ్

నికర లాభం రూ. 994 కోట్లు



ముంబై: ప్రయివేట్ రంగ సంస్థ ఫెడరల్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్ (క్యూ2)లో నికర లాభం 36 శాతం జంప్‌చేసి రూ. 994 కోట్లను తాకింది. ఒక త్రైమాసికానికి బ్యాంక్ చరిత్రలోనే ఇది అత్యధికంకాగా.. స్టాండెలోన్ లాభం సైతం 36 శాతం అధికంగా రూ. 954 కోట్లకు చేరింది. ప్రొవిజన్లు భారీగా తగ్గడం ఇందుకు సహకరించింది. నికర వడ్డీ ఆదాయం 17 శాతం ఎగసి రూ. 2,056 కోట్లను తాకింది. అడ్వాన్సులు 20 శాతం మెరుగుపడటంతో నికర వడ్డీ మార్జిన్లు స్వల్పంగా బలపడి 3.16 శాతానికి చేరాయి. ఇతర ఆదాయం రూ. 610 కోట్ల నుంచి రూ. 730 కోట్లకు వృద్ధి చూపింది.

ఎన్‌పీఏలు తగ్గాయ్

ప్రస్తుత సమీక్షా కాలంలో ఫెడరల్ బ్యాంక్ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.46 శాతం నుంచి 2.26 శాతానికి తగ్గాయి. గత 8–9 ఏళ్లలో అత్యుత్తమ రుణ నాణ్యత నమోదైనట్లు బ్యాంక్ సీఈవో, ఎండీ శ్యామ్ శ్రీనివాసన్ పేర్కొన్నారు. స్లిప్పేజీలు రూ. 375 కోట్ల నుంచి రూ. 365 కోట్లకు తగ్గిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇటీవల పెట్టుబడులను సమీకరించిన నేపథ్యంలో బ్యాంక్ కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 15.5 శాతానికి చేరింది.

ఫలితాల నేపథ్యంలో ఫెడరల్ బ్యాంక్ షేరు 0.7% నీరసించి రూ. 148.5 వద్ద ముగిసింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ జోరు

- క్యూ2 నికర లాభం రూ. 16,811 కోట్లు
- నికర వడ్డీ ఆదాయం రూ. 27,385 కోట్లు



ముంబై: మార్టిగేజ్ దిగ్గజం, మాతృ సంస్థ.. హెచ్‌డీఎఫ్‌సీ విలీనం తదుపరి ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర పనితీరు చూపింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్ (క్యూ2)లో రూ. 16,811 కోట్ల నికర లాభం ఆర్జించింది. స్టాండెలోన్ నికర లాభం రూ. 15,976 కోట్లకు చేరింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో విలీన సంస్థ నికర లాభం రూ. 11,162 కోట్లుగా మదింపు వేసింది. ఇక గత క్యూ2 స్టాండెలోన్ లాభం రూ. 10,606 కోట్లుగా లెక్కకట్టింది.

మార్జిన్లు డీలా

గతంలో 4 శాతానికిపైగా నికర వడ్డీ మార్జిన్లు సాధిస్తూ వచ్చిన నంబర్ వన్ ప్రైవేట్ రంగ బ్యాంక్.. హెచ్‌డీఎఫ్‌సీ ప్రస్తుత సమీక్షా కాలంలో 3.4 శాతం మార్జిన్లు ప్రకటించింది. ఇందుకు విలీనం తదుపరి బ్యాలన్స్‌షీట్‌లో తక్కువ ఈల్డ్స్ ఆర్జించే సెక్యూర్డ్ ఆస్తులు(రుణాలు) పెరగడం ప్రభావం చూపింది. అంతేకాకుండా విలీనానికి మార్కెట్ రుణ సమీకరణ వ్యయాలు సైతం పెరిగాయి. అయితే నికర వడ్డీ మార్జిన్లు పుంజుకోనున్నట్లు బ్యాంక్ సీఎఫ్‌వో శ్రీనివాసన్ వైద్యనాథన్ పేర్కొన్నారు. అధిక ఈల్డ్స్ అందించే ఆస్తులు పెరగడం, చౌకగా సమీకరించిన డిపాజిట్లతో మార్కెట్ రుణాలను రీప్లేస్ చేసిన తదుపరి మార్జిన్లు మెరుగుపడనున్నట్లు వివరించారు.

30 శాతం అప్

ఈ ఏడాది క్యూ2లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 30 శాతం జంప్‌చేసి రూ. 27,385 కోట్లను తాకింది. గతేడాది క్యూ2లో రూ. 21,021 కోట్ల వడ్డీ ఆదాయాన్ని సాధించాయి. ఇక ఇతర ఆదాయం రూ. 7,596 కోట్ల నుంచి రూ. 10,708 కోట్లకు జంప్ చేసింది. అటు డిపాజిట్లు, ఇటు అడ్వాన్సులు(రుణాలు).. రూ. లక్ష కోట్ల చొప్పున నమోదయ్యాయి. డిపాజిట్లు 5.3 శాతం, అడ్వాన్సులు 4.9 శాతం చొప్పున వృద్ధి చూపాయి. స్థూల మొండిబకాయిలు 1.41 శాతం నుంచి 1.34 శాతానికి తగ్గాయి. మొత్తం ప్రొవిజన్లు రూ. 3,240 కోట్ల నుంచి రూ. 2,903 కోట్లకు వెనకడుగు వేశాయి. ఎడ్యుకేషన్ రుణాలందించే క్రెడిలా విక్రయాన్ని పూర్తి చేయవలసి ఉన్నట్లు వైద్యనాథన్ పేర్కొన్నారు. ప్రస్తుతం హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ లిస్టింగ్ ప్రణాళికలేవీ లేవని స్పష్టం చేశారు. నికరంగా 16,000 మంది ఉద్యోగులను తీసుకోవడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 1.98 లక్షలకు చేరినట్లు వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు బీఎస్‌ఈలో 0.5 శాతం క్షీణించి రూ. 1,530 వద్ద ముగిసింది.

కేశ సంరక్షణకు లీ 'నేచురల్ కేర్'



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీలో ఉన్న లీ హెల్త్ డొమెయిన్.. జుట్టు, చర్మం, గోర్ల సహజ పునరుజ్జీవనం కోసం నేచురల్ కేర్ పేరుతో హెయిర్ ఆయిల్, షాంపూ, సాఫ్ట్ జెల్ క్యాప్సూల్స్‌తో కూడిన కిట్‌ను విడుదల చేసింది. మందార, ఉల్లి, కలబంద, భృంగరాజ్, ఉసిరి, అరుదైన ఔషధాలు, కొల్లాజెన్, స్పిరులినా వంటి అధిక శక్తివంతమైన బయోప్రొటీన్ సమ్మేళనాలతో వీటిని అభివృద్ధి చేశారు. నేచురల్ కేర్ కిట్ చుండ్రు, జుట్టు రాలడాన్ని నియంత్రిస్తుందని, కమిలిన చర్మాన్ని పునరుజ్జీవింపజేస్తుందని, పెళుసైన గోళ్లను మెరుగుపరచడంలో సాయపడుతుందని కంపెనీ డైరెక్టర్ ఆళ్ల లీలా రాణి తెలిపారు. లీ హెల్త్ తయారీ న్యూట్రాస్యూటికల్ ఉత్పత్తులు విదేశాల్లోనూ వినియోగదార్ల ఆదరణను అందుకున్నాయని ఆమె చెప్పారు.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

భారత నౌకాదళంలో 224 ఎస్ఎస్‌సీ ఆఫీసర్ పోస్టులు

భారత నౌకాదళం.. షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) ఆఫీసర్ పోస్టుల భర్తీకి అవివాహిత పురుషులు, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. కేరళ రాష్ట్రం ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏ)లో.. జూన్ 2024లో ప్రారంభమయ్యే కోర్సుకు ఎంపికైన అభ్యర్థులు సంబంధిత శాఖలు/కేడర్ /స్పెషలైజేషన్లలో శిక్షణ పొందుతారు.

» మొత్తం పోస్టుల సంఖ్య: 224
» పోస్టుల వివరాలు: జనరల్ సర్వీస్/హైడ్రో కేడర్-40,ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్-08, నావల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్-18, పైలట్-20, లాజిస్టిక్స్-20, ఎడ్యుకేషన్ -18, ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్)-30, ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్)-50,నావల్ కన్‌స్ట్రక్టర్-20.
» అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత సబ్జెక్టులో బీటెక్/బీఈ, బీఎస్సీ, బీకాం, బీఎస్సీ(ఐటీ), పీజీ డిప్లొమా, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ(ఐటీ), కమర్షియల్ పైలెట్ లైసెన్స్ ఉత్తీర్ణతతోపాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలు ఉండాలి.
» ప్రారంభ వేతనం: నెలకు రూ.56,100తో పాటు ఇతర అలవెన్సులు చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: డిగ్రీ, పీజీలో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షలు, మెడికల్ స్టాండర్డ్స్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 29.10.2023
» వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in

డా.వైఎస్సార్ యూహెచ్‌ఎస్, విజయవాడలో బీఎస్సీ పారామెడికల్ ప్రవేశాలు

విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి కాంపిటెంట్ అథారిటీ కోటా కింద బీఎస్సీ పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» కోర్సుల వివరాలు: బీఎస్సీ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, బీఎస్సీ న్యూరో ఫిజియాలజీ టెక్నాలజీ, బీఎస్సీ ఆప్టోమెట్రిక్ టెక్నాలజీ, బీఎస్సీ రీనల్ డయాలసిస్ టెక్నాలజీ, బీఎస్సీ పెర్ఫ్యూజన్ టెక్నాలజీ, బీఎస్సీ కార్డియాక్ కేర్ టెక్నాలజీ అండ్ కార్డియో వాస్క్యులర్ టెక్నాలజీ, బీఎస్సీ అనెస్తీషియాలజీ టెక్నాలజీ అండ్ ఆపరేషన్ టెక్నాలజీ, బీఎస్సీ ఇమేజింగ్ టెక్నాలజీ, బీఎస్సీ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నాలజీ, బీఎస్సీ రెస్పిరేటరీ థెరపీ టెక్నాలజీ.
» వ్యవధి: నాలుగేళ్ల డిగ్రీ కోర్సు.
» అర్హత: ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ) లేదా ఇంటర్ ఒకేషనల్ బ్రిడ్జ్ కోర్సు /సార్వత్రిక విద్యలో ఇంటర్(ఫిజికల్ సైన్సెస్/బయోలాజికల్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 31.12.2023 నాటికి 17 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: ఇంటర్ మార్కులు, రిజర్వేషన్ రూల్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 19.10.2023
» వెబ్‌సైట్: drysruhs.edu.in

డా.వైఎస్సార్ యూహెచ్‌ఎస్, విజయవాడలో బీపీటీ ప్రవేశాలు

విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి కాంపిటెంట్ అథారిటీ కోటా కింద బీపీటీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» కోర్సు వ్యవధి: నాలుగున్నరేళ్లు, ఆరు నెలల ఇంటర్న్‌షిప్.
» అర్హత: ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ) లేదా ఇంటర్ ఒకేషనల్ బ్రిడ్జ్ కోర్సు /సార్వత్రిక విద్యలో ఇంటర్(ఫిజికల్ సైన్సెస్/బయోలాజికల్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 31.12.2023 నాటికి 17 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: ఇంటర్ మార్కులు, రిజర్వేషన్ రూల్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 19.10.2023
» వెబ్‌సైట్: drysruhs.edu.in

నిమ్స్ హైదరాబాద్‌లో సర్టిఫికేట్ కోర్సులో ప్రవేశాలు


హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, నెఫ్రాలజీ డిపార్ట్‌మెంట్.. 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్ ప్రోగ్రామ్ సర్టిఫికేట్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం సీట్ల సంఖ్య: 04;
» కోర్సు వ్యవధి: ఏడాది.
» అర్హత: బీఎస్సీ(నర్సింగ్/సైకాలజీ/లైఫ్ సైన్సెస్/డయాలసిస్ టెక్నాలజీ), ఎంబీబీఎస్, ఎండీ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 31.12.2023 నాటికి 20 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: ప్రవేశ పరీక్ష ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.10.2023
» వెబ్‌సైట్: www.nims.edu.in

మేటి ఐఐఎంలకు.. క్యాట్ దారి

» నవంబర్ 26న క్యాట్-2023
» దాదాపు 2.5 లక్షల మంది దరఖాస్తు
» క్యాట్‌కు ఏటేటా పెరుగుతున్న పోటీ
» కీలకంగా మలి దశ ఎంపిక ప్రక్రియ

కామన్ అడ్మిషన్ టెస్ట్.. క్యాట్‌గా సుపరిచితం! దేశంలోని ప్రతిష్టాత్మక మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) క్యాంపస్‌లలో.. ఎంబీఏ, ఇతర పీజీ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! ఇందులో సాధించిన స్కోర్ ఆధారంగానే ఐఐఎంలు మలిదశ ఎంపిక ప్రక్రియ నిర్వహించి అడ్మిషన్స్ కల్పిస్తాయి. నవంబర్ 26న పరీక్ష జరుగనుంది. ఈ నేపథ్యంలో.. క్యాట్ పరీక్ష విధానం, ఇందులో బెస్ట్ స్కోర్‌కు మార్గాలపై ప్రత్యేక కథనం..



ఎంబీఏ స్పెషల్

క్యాట్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇప్పటికే తమ ప్రిపరేషన్‌ను దాదాపు పూర్తి చేసుకుని ఉంటారు. పరీక్ష తేదీ సమీపిస్తున్న వేళ.. అందుబాటులో ఉన్న ఈ కొద్ది రోజుల వ్యవధిలో తమ ప్రిపరేషన్ శైలిని మార్చుకోవాలి. ప్రస్తుత సమయంలో ప్రధానంగా రివిజన్, ప్రాక్టీస్‌పై దృష్టిపెట్టాలి అంటున్నారు నిపుణులు.

సొంత నోట్స్

క్యాట్ తుది దశ ప్రిపరేషన్‌లో భాగంగా.. అభ్యర్థులు ఇప్పటికే ఆయా టాపిక్స్‌కు సంబంధించి తాము రూపొందించుకున్న సొంత నోట్స్‌పై దృష్టి పెట్టాలి. షార్ట్ నోట్స్‌లో రాసుకున్న ముఖ్యమైన ఫార్ములాలు, కాన్సెప్ట్‌లను తరచూ రివిజన్ చేసుకోవడం ద్వారా.. ఆయా అంశాలకు సంబంధించి ఎలాంటి ప్రశ్నలు వచ్చినా సమాధానం సాధించే సంసిద్ధత లభిస్తుంది.

గత ప్రశ్న పత్రాల సాధన

ప్రస్తుత సమయంలో మంచి స్కోర్‌కు మార్గం.. గత ప్రశ్న పత్రాల సాధన. కనీసం గత నాలుగేళ్ల ప్రీవియస్ కొశ్చన్ పేపర్స్‌ను అభ్యర్థులు సొంతంగా ప్రాక్టీస్ చేయాలి. వాటిని మూల్యాంకన చేసుకొని తమకు క్లిష్టంగా భావించిన అంశాలను గుర్తించాలి. ఇలాంటి వాటి ప్రిపరేషన్‌కు కొంత ఎక్కువ సమయం కేటాయించాలి.

మాక్ టెస్ట్‌లు

అభ్యర్థులకు కలిసొచ్చే మరో సాధనం.. మాక్ టెస్ట్‌లకు హాజరు కావడం. సెక్షన్‌ల వారీగా మాక్ టెస్ట్‌లకు హాజరయ్యే విధానాన్ని అనుసరించాలి. ఇలా సెక్షన్ వారీగా, మొత్తం పేపర్ వారీగా మాక్ టెస్ట్‌లకు హాజరయ్యాక.. తమ అవగాహన స్థాయిపై స్పష్టత తెచ్చుకోవాలి. ఈ మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌ల వ్యూహాన్ని పరీక్షకు వారం రోజుల ముందే పూర్తి చేసే విధంగా సమయ పాలన పాటించాలి.

విభాగాల వారీగా ఫోకస్

- వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్: ఈ విభాగంలో రీడింగ్ కాంప్రహెన్షన్‌కు సంబంధించిన అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. వెర్బల్ ఎబిలిటీకి సంబంధించి యాంటానిమ్స్, సినానిమ్స్, బేసిక్ గ్రామర్ అంశాలను మరోసారి తిరగేయాలి.
- డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్:ఇందులో ఇప్పటికే తాము ప్రిపరేషన్ పూర్తి చేసిన అంశాలకు సంబంధించిన టేబుల్స్, గ్రాఫ్స్, చార్ట్స్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను మరోసారి ప్రాక్టీస్ చేయాలి. లాజికల్ రీజనింగ్‌లో క్యూబ్స్, క్లాక్స్, నంబర్ సిరీస్, లెటర్ సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాల పునశ్చరణ ఎంతో కీలకం.
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్: ఈ విభాగానికి సంబంధించి పర్సంటేజెస్, రేషియోస్, డిస్టెన్స్-టైం వంటి అంశాలపై పట్టు సాధించాలి. మ్యాథమెటిక్స్‌కు సంబంధించి అల్‌జీబ్రా, మోడ్రన్ మ్యాథ్స్, జామెట్రీ అంశాలపై తాము రాసుకున్న షార్ట్ నోట్స్ ఆధారంగా పునశ్చరణకు సమయం కేటాయించాలి.

పరీక్షకు వారం రోజుల ముందు

అభ్యర్థులు పరీక్ష తేదీ సమీపిస్తున్న కొద్దీ తమ వ్యూహాన్ని మార్చుకోవాలి. పరీక్షకు వారం రోజుల ముందు నుంచి పూర్తిగా పునశ్చరణకే సమయం కేటాయించాలి. ఏవైనా క్లిష్టమైన అంశాలుంటే.. వాటికి సంబంధించిన కాన్సెప్ట్‌లు, ఫార్ములాలను షార్ట్ నోట్స్ ఆధారంగా అవగాహన పెంచుకోవాలి. ఈ సమయంలో కూడా అభ్యర్థులు తమ వ్యక్తిగత సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రతిరోజు ఒక మాక్ టెస్ట్ రాసేందుకు సమయం కేటాయించుకోవచ్చు.

వేగం, కచ్చితత్వం

పరీక్షలో విజయానికి వేగం, కచ్చితత్వం చాలా ముఖ్యమని గుర్తించాలి. హార్డ్ వర్క్ కంటే స్మార్ట్ వర్క్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. రివిజన్ సమయంలో ఎదురయ్యే పొరపాట్లను సరిదిద్దుకునేందుకు ప్రయత్నించాలి. టెస్ట్‌లను వేగంగా పూర్తి చేసి.. మిగిలిన సమయాన్ని రివిజన్‌కు లేదా మరో మాక్ టెస్ట్‌కు హాజరయ్యేందుకు కేటాయించాలి.

షార్ట్ కట్ మెథడ్స్

క్యాట్ అభ్యర్థులు షార్ట్ కట్ మెథడ్స్‌ను అనుసరించడం మేలు చేస్తుంది. ముఖ్యంగా అంచెల వారీగా సమాధానాలు సాధించాల్సిన ఆవశ్యకత ఉన్న క్వాంటిటేటివ్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్ విభాగాల్లో షార్ట్ కట్ మెథడ్స్‌ను అనుసరించాలి. మెమొరీ కోసం పాయింటర్ అప్రోచ్, విజువలైజేషన్ టెక్నిక్స్ వంటి వాటిని ఫాలో కావాలి.

పరీక్ష రోజు.. పకడ్బందీగా

నిర్ణయాత్మకమైన పరీక్ష రోజున అభ్యర్థులు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. ముందుగా సులువైన ప్రశ్నలు, ఆ తర్వాత ఓ మోస్తరు క్లిష్టత ప్రశ్నలు, చివరగా అత్యంత క్లిష్టమైన ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. పరీక్ష హాల్లో.. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో ప్రశ్న పత్రం విండో ఓపెన్ కాగానే.. మొత్తం ప్రశ్న పత్రాన్ని చదవడానికి కనీసం పది నిమిషాలు కేటాయించాలి. ఫలితంగా తమకు సులభమైన, క్లిష్టమైన ప్రశ్నలు, విభాగాల గురించి అవగాహన లభిస్తుంది. దాని ఆధారంగా సమాధానాలు ఎక్కడి నుంచి మొదలు పెట్టొచ్చు అనే విషయంపైనా స్పష్టత లభిస్తుంది. అలాకాకుండా ఎగ్జామ్ విండో ఓపెన్ కాగానే సమాధానాలు ఇచ్చేందుకు ఉపక్రమిస్తే.. మొదట్లోనే ఏవైనా క్లిష్టమైన ప్రశ్నలు ఎదురైతే... ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉంది.

సెక్షనల్ కటాఫ్స్ పొందేలా

క్యాట్ పరీక్షలో స్కోర్ ఆధారంగా ఐఐఎంలు నిర్వహించే మలి దశ ఎంపిక ప్రక్రియలో సెక్షనల్ కటాఫ్స్ నిబంధన అమలవుతోంది. కాబట్టి అభ్యర్థులు ప్రతి సెక్షన్‌లోనూ కనీస కటాఫ్ పర్సంటైల్ పొందేలా కృషి చేయాలి. ఇందుకోసం సెక్షన్ వారీ మోడల్ టెస్ట్‌లను ఆయుధంగా చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఆయా సెక్షన్‌లలో పట్టు లభించడమే కాకుండా.. ఓవరాల్ కటాఫ్ మెరుగుపరచుకునేందుకు వీలవుతుంది.

ఐఐఎం-బెంగళూరు.. మారిన విధానం

- ఐఐఎం-బెంగళూరు ఈ ఏడాది ప్రవేశ ప్రక్రియలో కొన్ని మార్పులు చేసింది.
- మలిదశ ఎంపిక ప్రక్రియకు అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేసే క్రమంలో ఈ ఏడాది క్యాట్ స్కోర్‌కు 55 శాతం; పదో తరగతి మార్కులకు 10శాతం ; ఇంటర్మీడియెట్ మార్కులకు 10 శాతం; డిగ్రీ మార్కులకు 10 శాతం; పని అనుభవానికి పది శాతం; జండర్ డైవర్సిటీకి 5 శాతం చొప్పున వెయిటేజీ ఇవ్వనున్నట్లు ఐఐఎం-బెంగళూరు వర్గాలు ప్రకటించాయి.
- వర్క్ ఎక్స్‌పీరియన్స్ వెయిటేజీ కోణంలో కనీసం మూడేళ్ల పని అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోనున్నారు.
- ఎంపిక ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది విజేతల జాబితాను రూపొందించే క్రమంలోనూ ఈ ఏడాది ఐఐఎం-బెంగళూరు మార్పులు చేసింది. పర్సనల్ ఇంటర్వ్యూ వెయిటేజీని 35 శాతం నుంచి 40 శాతానికి పెంచింది.
- మొత్తంగా తుది జాబితా రూపకల్పనలో.. క్యాట్ స్కోర్‌కు 25 శాతం; పదో తరగతి నుంచి డిగ్రీ వరకు మార్కులకు అయిదు శాతం చొప్పున; పని అనుభవానికి 10 శాతం; రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌కు 10 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకు 40 శాతం వెయిటేజీ ఇవ్వనుంది.

క్యాట్ స్కోర్‌కు గరిష్టంగా 40 శాతం

తుది విజేతల జాబితా రూపకల్పనలో ఆయా ఐఐఎంలు క్యాట్ స్కోర్‌కు కనిష్టంగా 30 శాతం, గరిష్టంగా 40శాతం వెయిటేజీ కేటాయిస్తున్నాయి. క్యాట్ స్కోర్‌లో అధిక శాతం వెయిటేజీ సొంతం చేసుకోవాలన్నా.. వెయిటేజీ గణనలో తమ దరఖాస్తును పరిగణనలోకి తీసుకోవాలన్నా.. అభ్యర్థులు సదరు ఐఐఎంలు పేర్కొన్న విధంగా క్యాట్‌లో సెక్షనల్ కటాఫ్‌లు, మొత్తం కటాఫ్‌ల పరంగా కనీస కటాఫ్ మార్కులు పొందాల్సిన ఆవశ్యకత నెలకొంది.

క్యాట్-2023.. ఎగ్జామ్ డే టిప్స్

- నవంబర్ 26న ఐఐఎం-క్యాట్-2023
- ప్రస్తుత సమయంలో పూర్తిగా రివిజన్‌కే కేటాయించడం ఉపయుక్తం.
- సెక్షన్ వారీగా ప్రతి రోజు ప్రాబ్లమ్స్ ప్రాక్టీస్‌కు సమయం కేటాయించాలి.
- షార్ట్ నోట్స్, షార్ట్ కట్ మెథడ్స్‌తో రివిజన్‌ను వేగవంతం చేసుకునే అవకాశం.
- పరీక్ష హాల్లో.. ప్రశ్న పత్రం పరిశీలనకు సమయం కేటాయించడం ఆవశ్యకం.
- ఈజీ టు డిఫికల్ట్ విధానంలో సమాధానాలు ఇచ్చేందుకు ఉపక్రమించాలి.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించండి

- విద్యార్థులకు గవర్నర్ తమిళిసై పిలుపు
- హైదరాబాద్ ఐఐటీలో వర్క్‌షాప్ ప్రారంభం



సంగారెడ్డి అర్బన్: విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని గవర్నర్ తమిళిసై పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్ ఐఐటీలో బీవీఆర్ మోహన్‌రెడ్డి స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫౌండేషన్ వీక్ సెలబ్రేషన్‌లో భాగంగా 3 రోజుల వర్క్‌షాప్‌ను గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తమిళిసై మాట్లాడుతూ ఇలాంటి ఆసక్తికరమైన కార్యక్రమాలను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు పొందడమే కాక ఇతరులకు ఉద్యోగాలు కల్పించేస్థాయికి ఎదగాలన్నారు. ప్రస్తుత తరం విద్యార్థులు చాలా ప్రతిభావంతులైన, వినూత్నమైన ఆలోచనలు, సాంకేతికతను కలిగి ఉన్నారని, ఇది గొప్ప శుభపరిణామమన్నారు. ప్రతిభావంతులను ప్రోత్సహించడంలో బీవీఆర్ మోహన్‌రెడ్డి స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ కీలకపాత్ర పోషిస్తోందని అభినందించారు. కార్యక్రమంలో సైంట్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఐఐటీ–హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎం.ఎల్ల, భారతదేశంలోని ప్రముఖ సాంకేతిక సంస్థల నుంచి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలు మార్గాల్లో దసరా ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: దసరా సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నర్సాపూర్–వికారాబాద్ (07453/07454) స్పెషల్ ట్రైన్ ఈనెల 18న సాయంత్రం 6 గంటలకు నర్సాపూర్ నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు వికారాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 19వ తేదీ సాయంత్రం 5.15 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 5.10 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది. సికింద్రాబాద్–తిరుపతి (07489/07490) ప్రత్యేక రైలు ఈనెల 21న రాత్రి సికింద్రాబాద్ నుంచి 10.05 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 22వ తేదీ సాయంత్రం 4.35 గంటలకు తిరుపతి నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 4.50 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. గోరఖ్‌పూర్–మహబూబ్‌నగర్ (05303/05304) స్పెషల్ ట్రైన్ ఈనెల 21 నుంచి నవంబర్ 25 వరకు ప్రతి శనివారం ఉదయం 8.30 గంటలకు గోరఖ్‌పూర్ నుంచి బయల్దేరి ఆదివారం రాత్రి 7.30 గంటలకు మహబూబ్‌నగర్‌కు చేరుకుంటుంది. అలాగే తిరుగు ప్రయాణంలో ఈనెల 23 నుంచి నవంబర్ 27 వరకు ప్రతి సోమవారం సాయంత్రం 6 గంటలకు మహబూబ్‌నగర్ నుంచి బయల్దేరి బుధవారం ఉదయం 9 గంటలకు గోరఖ్‌పూర్‌కు చేరుకుంటుంది.

జేబీఎస్ నుంచి విజయవాడకు బస్సులు

సాక్షి, హైదరాబాద్: దసరాకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి విజయవాడకు బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు ఈ బస్సులు రాకపోకలు సాగిస్తాయని వెల్లడించారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ఆర్టీసీ ఈ సదుపాయం కల్పించిందన్నారు. ప్రస్తుతం బీహెచ్ఈఎల్, మియాపూర్ వైపు నుంచి వెళ్లే 24 బస్సులు ఇప్పటి వరకు ఎంజీబీఎస్ నుంచి బయల్దేరుతున్నాయి. ఇక నుంచి ఈ బస్సులను ఎంజీబీఎస్ నుంచి కాకుండా జేబీఎస్ నుంచి నడుపుతారు. ఈ బస్సులు కేపీహెచ్‌బీ, బాలానగర్, బోయిన్‌పల్లి, జేబీఎస్, సంగీత్ (పుష్పక్ పాయింట్), తార్నాక (పుష్పక్ పాయింట్), హబ్సిగూడ (పుష్పక్), ఉప్పల్ (పుష్పక్), ఎల్బీనగర్ మీదుగా విజయవాడకు వెళ్తాయి.

పాఠాలే కాదు.. జీవితపాఠాలూ నేర్వాలి


ఇంజనీరింగ్ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంచే కార్యక్రమాలు చేపట్టాలి

- సామాజిక అంశాలపై చర్చా వేదికలు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలి
- వర్సిటీలకు ఏఐసీటీఈ మార్గదర్శకాలు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ విద్యార్థులకు మొదటి సంవత్సరంలోనే ఆత్మస్థైర్యం కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) విశ్వవిద్యాలయాలకు సూచించింది. విద్యార్థుల్లో ఆత్మన్యూనతా భావం తొలగించి మానసికంగా దృఢంగాఉండేలా చూడాలని పేర్కొంది. తొలిదశలో నిర్వహించే అవగాహన కార్యక్రమం (ఇండక్షన్ ప్రోగ్రామ్) నుంచే ఇది మొదలవ్వాలని తెలిపింది. ఉన్నత విద్యాసంస్థల్లో ఆత్మహత్యలు పెరుగుతున్న నేపథ్యంలో వివిధ అధ్యయనాలపై ఏఐసీటీఈ దృష్టి పెట్టింది. ఇంటర్ వరకూ ఎక్కువగా బట్టీ విధానంలో చదివే విద్యార్థులు ఇంజనీరింగ్‌లోని భిన్నమైన విద్యా విధానం వల్ల సొంత అవగాహన పద్ధతులపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారని ఏఐసీటీఈ భావించింది. ఈ సమస్యను అధిగమించడానికి వీలుగా ఇంజనీరింగ్ విద్యకు ముందుగా విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయాలని జాతీయ విద్యావిధానం–2020లో సూచనలు చేసింది. ఇప్పటికే ఇంజనీరింగ్ తరగతులు మొదలైనందున వచ్చే ఏడాది నుంచి విశ్వవిద్యాలయాలు దీనిపై దృష్టి పెట్టే వీలుందని అధికారులు చెబుతున్నారు.

ఇవీ సూచనలు..

- కేవలం పుస్తకాలకే కాకుండా సామాజికంగా ఎదురయ్యే సవాళ్లపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. తరగతి పాఠాలకే పరిమితం చేయకుండా సామాజిక అంశాలపై చర్చా వేదికలు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలి. ప్రతి యూనివర్సిటీలోనూ దీనికోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి.
- విద్యార్థులు ఇంజనీరింగ్‌లో చేరాక ఇంటర్ వరకూ ఉన్న వాతావరణం నుంచి ఇంజనీరింగ్ అనే కొత్త ప్రపంచం అర్థమయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఏ విద్యార్థి ఏ ప్రాంతం నుంచి వచ్చాడు? అతని సామర్థ్యం ఏమిటి? అందరిలో కలుస్తున్నాడా? వంటి అంశాలను అధ్యాపకులు గమనించాలి. తరగతి గదిలో అందరి మధ్య సఖ్యత పెరిగి స్నేహపూర్వక వాతావరణం నెలకొన్న తర్వాతే బోధన చేపట్టాలి.
- ఇంజనీరింగ్‌లోని వివిధ బ్రాంచీలకు చెందిన విద్యార్థుల మధ్య సమన్వయం నెలకొనేందుకు కాలేజీలు ప్రయత్నించాలి. దీనికోసం సృజనాత్మకత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపకల్పనకు వర్సిటీలు కృషి చేయాలి.
- అకడమిక్ నాలెడ్జ్‌తోపాటు అనుభవపూర్వకంగా విద్యను నేర్చుకోవడం వల్ల విద్యార్థి మానసిక వికాసం పెరుగుతుందని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అభిప్రాయపడింది. దీన్ని కాలేజీలు విధిగా అనుసరించాలి.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.